

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 ఈరోజు సంచికతో సాక్షి కేలండర్ (*on Demand) వెల: ₹ 8.00 సంపుటి: 16 సంచిక: 106

SUNDAY Special ఆదివారం 31-12-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రిచా పోరాటం వృథా

ఆస్ట్రేలియాతో జరిగిన రెండో వన్డేలోనూ భారత మహిళల జట్టు ఓడిపోయింది. భారత బ్యాటర్ రిచా ఘోష్ (117 బంతుల్లో 96 ; 13 ఫోర్లు) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది.

- వివరాలు స్పోర్ట్స్‌లో



లెస్ హిట్.. మోర్ ఫట్

ఈ ఏడాది మొత్తంగా 306 సినిమాలు విడుదలయ్యాయి. వాటిలో విజయాలు ఎప్పటిలానే వేళ్ల మీద లెక్క పెట్టొచ్చు. అపజయాలు మాత్రం లెక్కలేనన్ని. మొత్తంగా లెస్ హిట్.. మోర్ ఫట్‌గా సాగిన సినిమాపై కథనం..

- వివరాలు సినిమాలో



రాముడే బీజేపీ ఎన్నికల అభ్యర్థి!

అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని బీజేపీ రాజకీయమయం చేస్తోందని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



అప్పగింతకు ఒప్పందమేది?: పాక్

ముంబై దాడుల సూత్రధారి హఫీజ్ అప్పగింతకు వీలు కల్పించే ద్వైపాక్షిక ఒప్పందమేదీ భారత్‌తో లేదని పాక్ పేర్కొంది.

వివరాలు 6లో ▸



ఇమ్రాన్‌కు భారీ షాక్

పాక్ జాతీయ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి మాజీ అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్ దాఖలు చేసిన నామినేషన్‌ను ఆ దేశ ఈసీ తిరస్కరించింది.

వివరాలు 6లో ▸



పుతిన్‌ను ఆపాల్సిందే

ఉక్రెయిన్‌ను సర్వనాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్న పుతిన్‌ను అడ్డుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు.

వివరాలు 6లో ▸

పింఛన్ రూ.3,000

ఎక్కువ పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ

ఎక్కువ మందికి పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం కూడా ఏపీనే..

పెన్షన్ రూ.3 వేలకు పెంపు సందర్భంగా లబ్ధిదారులకు సీఎం వైఎస్ జగన్ లేఖ

- ప్రజలందరి ఆశీస్సులతోనే ఇదంతా చేయగలుగుతున్నాను.. ఒక్కో అవ్వా తాతకు మీ జగన్ నాలుగున్నరేళ్లలో రూ.1.47 లక్షల పెన్షన్
- చంద్రబాబు పాలన ఐదేళ్లలో ఇచ్చింది రూ.58 వేలే.. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా పింఛను మంజూరు కావాలంటే నరకమే
- మన ప్రభుత్వంలో ఇప్పటిదాకా 28.35 లక్షల మందికి కొత్తగా పెన్షన్
- గతంలో పెన్షన్ తీసుకోవడానికి ప్రతి నెలా పడిగాపులు పడే పరిస్థితి
- ఇప్పుడు ఆదివారమైనా, సెలవైనా ఒకటో తేదీనే వలంటీర్ ద్వారా మీ ఇంటికే పెన్షన్
- మీ ఆశీస్సులు, మీ మద్దతే నా బలం
- ఇంకా మంచి చేసే అవకాశం రావాలని మనసారా కోరుకుంటున్నా



సాక్షి, అమరావతి: అవ్వాతాతలకు దేశంలో రూ.3,000 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్ అని, ప్రజలందరి ఆశీస్సులతోనే ఇదంతా చేయగలుగుతున్నానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నుంచి మొదలయ్యే పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వం అవ్వాతాతల పెన్షన్ మొత్తాన్ని రూ.3,000కు పెంచుతున్న సందర్భంగా ఆయన రాష్ట్రంలో దాదాపు 66 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులకు లేఖలు రాశారు. ఒకటవ తేదీన వలంటీర్లు లబ్ధిదారులకు పెరిగిన పెన్షన్ డబ్బులు అందజేస్తూ, వారికి ముఖ్యమంత్రి రాసిన లేఖ ప్రతులను అందజేయనున్నారు. ఇప్పటికే ఆ లేఖల ముద్రణ పూర్తయి, జిల్లాల వారీగా వాటిని చేర్చే ప్రక్రియను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పూర్తి చేసింది. దేశంలో ఎక్కువ మందికి పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వం కూడా

మిగతా 2వ పేజీలో ▶

డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీ

నోటిఫికేషన్ విడుదల చేసిన ఏపీపీఎస్సీ

జనవరి 24 నుంచి ఫిబ్రవరి 13 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

ఏ సబ్జెక్టులో ఎన్ని పోస్టులు



సబ్జెక్టు	పోస్టులు
బోటనీ	19
కెమిస్ట్రీ	26
కామర్స్	35
కంప్యూటర్ అప్లికేషన్స్	26
కంప్యూటర్ సైన్స్	31
ఎకనామిక్స్	16
హిస్టరీ	19
మ్యాథమెటిక్స్	17
ఫిజిక్స్	11
పొలిటికల్ సైన్స్	21
జువాలజీ	19

మొత్తం పోస్టులు 240

సాక్షి, అమరావతి: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే గ్రూప్–2, గ్రూప్–1, పాలిటెక్నిక్, జూనియర్ లెక్చరర్ పోస్టులకు భర్తీకి చర్యలు తీసుకున్న ఏపీపీఎస్సీ.. తాజాగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల భర్తీకి శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 11 సబ్జెక్టుల్లో 240 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ప్రకటించింది. సబ్జెక్టుల వారీగా పోస్టులు, విద్యార్హతలు, వేతనం, పరీక్ష విధానం తదితర వివరాలతో కూడిన పూర్తి సమాచారాన్ని సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో జనవరి 24 నుంచి

మిగతా 3వ పేజీలో ▶

ఫ్యాక్ట్‌చెక్

సిగ్గు.. సిగ్గు.. నవ్విపోతారు!

- కర్నూలులోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో రామోజీ 'షో'
- దుప్పట్లు లేక పిల్లలు వణికి పోతున్నారని కట్టు కథ
- ఈనాడు ఫొటోలోనే దుప్పట్లు కప్పుకున్న 30 మంది పిల్లలు
- తల కింద దుప్పట్లు పెట్టుకొని నిద్రించిన ముగ్గురు పిల్లలను చలికి వణుకుతున్నట్లుగా చూపుతూ తప్పుడు రాతలు
- ఈనెల 6నే అక్కడి విద్యార్థులు అందరికీ దుప్పట్లు పంపిణీ

- వివరాలు 5లో

రైతుకు కాదు.. రామోజీకే విపత్తు

- ఆర్బీకేల ద్వారా ధ్రువీకరించిన సాగు ఉత్పాదకాల పంపిణీ
- దేశంలో ఎక్కడా లేనివిధంగా నియోజకవర్గ స్థాయిలో అగ్రి ల్యాబ్స్
- గతంలో ఏటా 10 వేల శాంపిల్స్ కూడా పరీక్షించలేని పరిస్థితి
- ఇప్పుడు ఏటా 50వేల శాంపిల్స్ పరీక్షించి నాణ్యత నిర్ధారణ
- ఏటా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల తనిఖీ.. నాసిరకంగా ఉంటే తయారీదారులపై చర్యలు

- వివరాలు 10లో

ఇంటింటా రామజ్యోతి..



శనివారం అయోధ్యలో చేపట్టిన రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

- జనవరి 22న అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా వెలిగించండి
- దేశ ప్రజలకు మోదీ పిలుపు
- ప్రపంచమంతా ఎదురు చూసింది ఈ రోజు కోసమే... గుడారంలో గడిపిన రామునికి 'పక్కా ఇల్లు'
- అయోధ్య ర్యాలీలో ప్రధాని వ్యాఖ్యలు
- విమానాశ్రయం, రైల్వే జంక్షన్ ప్రారంభం
- రూ.15,700 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన

6లో

అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ఠను దీపావళి పర్వదినంగా ప్రధాని మోదీ అభివర్ణించారు. జనవరి 22న ఇంటింటా శ్రీరామజ్యోతి వెలిగించాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆ రోజు కోసం ప్రపంచమంతా ఏళ్ల తరబడి ఎదురు చూసిందన్నారు. ఏళ్ల తరబడి గుడారంలో గడిపిన రామునికి ఎట్టకేలకు 'పక్కా ఇల్లు' సాకారమైందన్నారు. అయోధ్యలో ఆయన శనివారం పర్యటించారు. నూతన విమానాశ్రయంతో పాటు ఆధునికీకరించిన రైల్వే జంక్షన్‌ను ప్రారంభించారు. రూ.15,700 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. దేశం ప్రగతి పథంలో పరుగులు తీయాలని ఆకాంక్షించారు. జనవరి 22న అయోధ్యకు పోటెత్తొద్దని, ఎక్కడివారక్కడే ఈ వేడుకలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.



అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

'సామాజిక' జైత్రయాత్ర

- నంద్యాల, గుంటూరు జిల్లా తాడికొండ, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఉత్సాహంగా సాగిన సామాజిక సాధికార యాత్రలు
- సభలకు పోటెత్తిన బడుగు, బలహీనవర్గాలు

2లో

- జై జగన్.. జైజై జగన్ నినాదాలతో దద్దరిల్లిన సభా ప్రాంగణాలు
- సీఎం జగన్‌తోనే సామాజిక సాధికారత సాధ్యమైందన్న నేతలు
- పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే ఎన్నికల్లో పేదల పక్షపాతి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంట నిలవాలని పిలుపు

ఇదండీ జగత్



సామాన్యులకు

సౌకర్యవంతంగా..

దేశంలో తొలిసారిగా అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రూపకల్పన

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దేశంలో తొలిసారిగా భారతీయ రైల్వే తక్కువ ఖర్చుతో అత్యాధునిక సౌకర్యవంతమైన ప్రయాణం కోసం సూపర్‌ఫాస్ట్ ప్యాసింజర్ రైళ్లలో కొత్త కేటగిరీగా అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను అందుబాటులోకి తీసుకు వచ్చింది. మొదటి ప్రయత్నంలో రెండు కొత్త రైళ్లు ప్రవేశపెట్టింది. ఈ రైళ్లను నిత్యం రద్దీగా ఉండే మార్గాలు అయోధ్య ధామ్ జంక్షన్–దర్భంగా, మల్దా టౌన్–బెంగళూరు మధ్య నడపనుంది. శనివారం సాయంత్రం అయోధ్యలో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. జనవరి 7వ తేదీ నుంచి ఈ రైళ్లు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి.

ఆధునిక సౌకర్యాలు...

సాధారణ ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నాన్–ఏసీ స్లీపర్ కమ్ అన్ రిజర్వ్‌డ్ క్లాస్ సర్వీస్‌తో సిద్ధంచేశారు. ఈ రైళ్లను తక్కువ ఖర్చుతో, ఎక్కువ దూరాలకు సేవలందించేలా రూపొందించారు. వినూత్నమైన పుష్–పుల్ విధానంతో



ఎక్స్‌ప్రెస్ రైలులో సౌకర్యవంతమైన సిట్టింగ్ సదుపాయం

కుదుపులు లేని ప్రయాణం, వేగం, సామర్థ్యం, భద్రత, సౌకర్యం, తక్కువ ఖర్చుతో ప్రయాణం ఈ రైళ్ల ప్రత్యేకతలు. ఆకర్షణీయమైన డిజైన్ సీట్లు, మెరుగైన లగేజీ ర్యాక్, మొబైల్ హోల్డర్‌తో చార్జింగ్ పాయింట్, ఎల్‌ఈడీ లైట్లు, సీసీ టీవీ, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం వంటి సౌకర్యాలు ఈ రైళ్లలో అందుబాటులో ఉన్నాయి.



అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

ఏపీ మీదుగా అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్

అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఒకటి మాల్దా టౌన్ నుంచి బెంగళూరు వరకు నడపుతున్నారు. ఈ రైలు ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళుతుంది. ఈ రైలు రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తుని, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. మాల్దా టౌన్–బెంగళూరు రైలు (13434) ఉదయం 8.50 గంటలకు మాల్దా టౌన్‌లో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారు జామున 3 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (13433) జనవరి 9 నుంచి ప్రతి మంగళవారం మధ్యాహ్నం 1.50 గంటలకు బెంగళూరులో బయలుదేరి, మరుసటిరోజు ఉదయం 11 గంటలకు మల్దా టౌన్ చేరుకుంటుంది.

క్యాండిడేట్స్ కావాలి తమ్ముళ్లూ!

అభ్యర్థుల కోసం టీడీపీ అధినేత చంద్రబాబు పాట్లు

- ఎన్నికలు సమీపిస్తున్నా అనేక చోట్ల క్యాండిడేట్స్ కరువు
- ఇప్పటికీ చాలా నియోజక వర్గాల్లో ఇన్‌ఛార్జిలు లేరు
- ఎన్‌ఆర్‌ఐలు, బయట వ్యక్తుల కోసం వెతుకులాట
- అకౌంట్‌లో డబ్బు ముందే చూపించాలని షరతు
- ఎమ్మెల్యేకి 25 కోట్లు, ఎంపీకి 50 కోట్లు కండిషన్.. కోటరీ నేతలను పురమాయించిన బాబు
- గెలిచే అవకాశాలు లేకపోయినా ఖర్చుపెట్టాలా..
- ముఖం చాటేస్తున్న నాయకులు

10లో



గెలిపిస్తే కుప్పాన్ని అభివృద్ధి చేస్తా..

10లో

- కుప్పం రోడ్‌షోలో టీడీపీ అధినేత చంద్రబాబు
- ముగిసిన మూడు రోజుల పర్యటన



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ధైర్యంగా పిల్లల్ని చదివిస్తున్నాం

మాది సాధారణ పేద కుటుంబం. మా ఆయన కామేశ్ పెయింటింగ్ వేస్తుంటారు. నేను ఇంటిదగ్గర టైలరింగ్ చేస్తుంటాను. మాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరినీ పెద్ద చదువులు చదివించాలనేది మా కోరిక. మేమిద్దరం ఎంతగా కష్టపడినా అరకొర ఆదాయమే వస్తోంది. అది కుటుంబ పోషణకే సరిపోవట్లేదు. ఇక గొప్పగా చదివించేందుకు అయ్యే ఖర్చు మేం పెట్టగలమో లేదో అని భయం వేసేది. మా లాంటి మధ్య తరగతి కుటుంబాలకు ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి వరంలా మారింది. మా పెద్ద బ్బాయి నవీన్ ప్రైవేటు స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. వాడికి మూడేళ్లుగా అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేల వంతున నా ఖాతాలో జమ కావడంతో మా బిడ్డల చదువుకు ఇబ్బంది తొలగింది. శ్రీకాకుళం



జిల్లా నరసన్నపేటలోని జగనన్న కాలనీ లే అవుట్‌లో మాకు ఇంటి స్థలం ఇచ్చారు. ప్రభుత్వ సహకారంతో అందులో ఇల్లు నిర్మించుకున్నాం. నాకు జగనన్న చేదోడు పథకం కింద ఏటా రూ.పది వేలు అందుతోంది. ఇప్పుడు ఎంతో ఆనందంగా ఉంది.

– అగడపోలు దీప, కొత్తవీధి, నరసన్నపేట
(ఎం.రవి, విలేకరి, నరసన్నపేట)

పాకలో ఉండేవాళ్లం.. ఇప్పుడు పక్కా ఇంట్లో

నా భర్త పోశియ్యకు ముగ్గురు అన్నదమ్ములు. ఉమ్మడిగా మాది కాకినాడ జిల్లా కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో ఉన్న రెండు సెంట్ల స్థలంలో వేసుకున్న తాటాకు ఇంట్లో(పాక)నే అందరితో కలసి ఉండేవాళ్లం. మాకు 2005లో వివాహమైంది. అప్పటి నుంచి ఆ పాకలోనే కాపురం చేశాం. ఈ పాక స్థలాన్నే ఐదు వాటాలుగా పంచుకోవాల్సి ఉంది. భవిష్యత్తులో ఎలా బతకాలో అని నిత్యం భయపడుతూ ఉండేవాళ్లం. సొంత ఇంటి కోసం గతంలో ఎన్నోసార్లు నాయకుల చుట్టూ తిరిగినా స్థలం గానీ, ఇల్లుగానీ మంజూరు కాలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటి స్థలం కోసం సచివాలయంలో వినతి పత్రం అందించాం. ఎవరికి ఏ విధమైన లంచాలు ఇవ్వకుండానే ఇంటి స్థలం మంజూరు చేశారు. ఎవరి చుట్టూ తిరగాల్సిన పని లేకుండానే రూ.1.80 లక్షల బిల్లులు దశల వారీగా మంజూరు చేశారు. ఇన్నాళ్లకు సొంతింటి కలను సాకారం చేసుకున్నాం. మాకు ఇద్దరు అబ్బాయిలు. ఓ అబ్బాయి లక్ష్మి వెంకటరమణ ఏడో తరగతి చదువుతున్నాడు. నాలుగేళ్ల నుంచి అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు చొప్పున ఇప్పటి వరకూ రూ.60 వేలు నా ఖాతాలో జమ కావడంతో చదివించుకోడానికి ఇబ్బంది లేకుండా పోయింది.



– నాగిరెడ్డి ప్రభావతి, కాపవరం
(జీవీవీ సత్యనారాయణ, విలేకరి, కొవ్వూరు)

రెండు కుటుంబాలను పోషించగలుగుతున్నా

బతుకు తెరువు కోసం 20 ఏళ్ల క్రితం విశాఖపట్నం రైల్వే కాలనీ నుంచి మధురవాడకు కుటుంబంతో వచ్చాం. విధి వక్రీకరించడంతో నా భర్త సింహాచలం 2013లో కార్‌షెడ్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. నాకు గౌరి అపర్ణ, నూకాలమ్మ అనే ఇద్దరు ఆడపిల్లలు. వారి కోసం ఎంత కష్టం అయినా బతకాలనుకున్నాను. విధిలేని పరిస్థితుల్లో కొన్నాళ్లు హౌస్ కీపింగ్, మరి కొన్నాళ్లు వంట పని చేసి కుటుంబాన్ని నెట్టుకొచ్చేదాన్ని. ఎన్ని ఇబ్బందులు పడినా కుటుంబాన్ని సక్రమంగా పోషించుకోలేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఎంతటి అత్యవసరమైనా, పనికి సెలవు పెట్టడానికి అవకాశం ఉండేది కాదు. కొన్నిసార్లు చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సున్నా వడ్డీ కింద రూ.లక్ష, వైఎస్సార్ ఆసరా కింద మూడు దఫాలుగా రూ.30 వేలు వచ్చింది. ఆ మొత్తంతో బండి కొనుక్కుని మా వాంబే కాలనీలోనే పండ్ల విక్రయం మొదలుపెట్టాను. రోజుకు మూడు నుంచి నాలుగు వందల వరకు మిగులుతుంది. నేను సొంతంగా నా కాళ్ల మీద నేను నిలబడి వ్యాపారం చేసుకుంటున్నా. నాకు పెన్షన్ రూ.2,750 వస్తోంది. రేపు రూ.3 వేలు



అందుకుంటానని సంతోషంగా ఉంది. గత ప్రభుత్వంలో మూడుసార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసినా రాలేదు. ఇప్పుడు ఇంటి స్థలం వచ్చింది. ఇంటి నిర్మాణ ప్రయత్నాల్లో ఉన్నాను. మాకున్న ఆస్తి ఇదే. పెద్ద పాపకు పెళ్లి చేశాను. చిన్న పాప, నేను అద్దె ఇంట్లో ఉంటున్నాము. కొన్నేళ్ల క్రితం మా నాన్న అనారోగ్యంతో మృతి చెందారు. మా అన్నయ్య కూడా మృతి చెందాడు. దీంతో అమ్మ, దివ్యాంగుడైన తమ్ముడు పోషణ భారం కూడా నా మీదే పడింది. రెండు కుటుంబాలను నా పండ్ల బండి వ్యాపారం తోనే పోషిస్తున్నాను.

– చుక్క పార్వతి, మధురవాడ, వాంబేకాలనీ
(కె.టి.రామునాయుడు, విలేకరి, మధురవాడ)

ఈ యాప్‌లలో పెట్టుబడి వద్దు

నకిలీ ఫారెక్స్ ట్రేడింగ్ యాప్‌ల వివరాలు వెల్లడించిన ఆర్బీఐ

సాక్షి, హైదరాబాద్: ఆర్బీఐ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ఫారెక్స్ ట్రేడింగ్ పేరిట ప్రకటనలు గుప్పిస్తున్న పలు నకిలీ యాప్‌ల వివరాలను ఆర్బీఐ వెల్లడించింది. ఆర్బీఐ వెల్లడించిన అనుమతి లేని ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌ల జాబితాలో అల్పరి ఇన్వెస్ట్–ఇన్వెస్ట్‌మెంట్స్, ఐక్యూ ఫారెక్స్–ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్, ఓలింప్ ట్రేడ్–ట్రేడింగ్ ఆన్‌లైన్‌లు ఉన్నాయి. అనుమతులు లేని యాప్‌లతో పెట్టుబడి పెట్టి మోసపోవద్దని ఆర్బీఐ హెచ్చరించింది. ఆర్బీఐ అనుమతి లేని అలాంటి సంస్థల వివరాలు తెలిస్తే వెంటనే సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లోగానీ, 1930 టోల్‌ఫ్రీ నంబర్‌లోగానీ తెలియజేయాలని కేంద్ర హోంశాఖ అధికారులు సూచించారు.

పింఛన్ రూ.3,000

▶ మొదటి పేజీ తరువాయి

మన ప్రభుత్వమేనని, మనందరి ప్రభుత్వమే ఇవన్నీ చేయగలుగుతోందని చెప్పడానికి సంతోషిస్తున్నట్టు సీఎం జగన్ ఆ లేఖలో తెలిపారు. దేవుడి దయతో, మీ అందరికి ఇంకా ఎంతో మంచి చేసే అవకాశం రావాలని మనసారా కోరుకుంటున్నట్టు కూడా పేర్కొన్నారు. ఆ లేఖ సారాంశం ఇలా ఉంది.

ప్రియమైన అవ్వాతాతలకు..

మీకు, మీ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

ఈ రోజు 2024 జనవరి 1 నుంచి.. ఇచ్చిన మాట ప్రకారం.. ఇక మీ చేతికి అందే పెన్షన్ రూ.3000 అవుతుంది.

నా సుదీర్ఘ ప్రజా సంకల్ప పాదయాత్రలో నోరు తెరిచి అడగలేని ఎంతో మంది అవ్వాతాతలను, దురదృష్టవశాత్తు భర్తను కోల్పోయి జీవితాన్ని భారంగా నెట్టుకొస్తున్న వితంతువులను.. కష్టాలు, కన్నీరు తుడిచే వారు లేక దుఃఖంలో ఉన్న దివ్యాంగుల కన్నీటి



వ్యథలను నేను స్వయంగా చూశాను. మీ మనవడిగా, మీ బిడ్డగా, మీ సోదరుడిగా ఆ మాటకు కట్టుబడి.. మేనిఫెస్టోలో చెప్పింది చెప్పినట్టు తూ.చా. తప్పక పెన్షన్‌లను పెంచుకుంటూ మీ అందరి ఆశీర్వాదంతో, దేవుడి దయతో అందిస్తున్నందుకు సంతోషిస్తున్నాను. ఈ పెన్షన్ పెంపుతో మేనిఫెస్టోలో ఇచ్చిన నూరు శాతం హామీలు అమలు చేశామని చెప్పడానికి గర్వపడుతున్నాను.

చంద్రబాబు ప్రభుత్వంలో ఎన్నికలకు ముందు వరకు పింఛన్ కేవలం రూ.1,000 ఉండేది. ఆ ఐదేళ్లలో ఒక్కో అవ్వాతాతల కుటుంబానికి ఇచ్చిన పెన్షన్ రూ.58 వేలు. అదే మీ జగన్ తన నాలుగున్నర ఏళ్ల పాలనలో ఇచ్చిన పెన్షన్ ఏకంగా రూ.1.47 లక్షలు. దివ్యాంగులకు ఇచ్చిన పెన్షన్ ఏకంగా రూ.1.67 లక్షలు. రాష్ట్రంలో మనందరి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు అర్హులైన మరో 28.35 లక్షల మందికి.. కొత్తగా పెన్షన్‌లు మంజూరు చేశాం. ప్రతి నెలా పెన్షన్లు అందుకుంటున్న వారి సంఖ్య దాదాపు 66 లక్షలని చెప్పడానికీ సంతోషిస్తున్నాను.

గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్నప్పటికీ, పెన్షన్ మంజూరు కావాలంటే నరకమే. పెన్షన్ మంజూరు కోసం జన్మభూమి కమిటీలకు లంచాలు, పెన్షన్ తీసుకోవడానికీ లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితులు. కానీ, ఇప్పుడు ప్రతినెలా ఒకటో తేదీన.. అది ఆదివారమైనా, మరే ఇతర సెలవు రోజైనా సరే సూర్యోదయంతోనే మీ ఇంటి తలుపు తట్టి గుడ్ మార్నింగ్ చెపుతూ మన వలంటీర్లు మీకు పెన్షన్ అందిస్తున్నారు. పెన్షన్ కోసం పడిగాపులు పడి, ఎక్కడో ఉన్న కార్యాలయం చుట్టూ తిరిగిన గత ప్రభుత్వ విధానాలకు.. మనందరి ప్రభుత్వానికి మధ్య ఉన్న ప్రధానమైన తేడా.. మనది మనసున్న ప్రభుత్వం. మనది పేదలు, మహిళలు, రైతుల పక్షపాత ప్రభుత్వం.

దేశంలోనే రూ.3,000 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏదైనా ఉందంటే అది మన రాష్ట్రమని, ప్రజలందరి మన ప్రభుత్వమే ఇది చేయగలుగుతోందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. దేశంలో ఎక్కువ మందికి పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వం కూడా మన ప్రభుత్వమే. మీ ఆశీస్సులతోనే ఇదంతా చేయగలిగాను.

మీ ఆశీస్సులు, మీ మద్దతే నా బలం. ఆ బలం వల్లే కొత్త సంవత్సరంలో అడుగు పెడుతున్న ఈ సందర్భంలో ఇలాంటి మంచి ప్రయత్నాలను కొనసాగించగలిగాను. మీకు, మీ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడు మంచి జరగాలని.. ఆ దేవుడి దయ ఉండాలని కోరుకుంటున్నాను. దేవుడి దయతో, మీ అందరికి ఇంకా ఎంతో మంచి చేసే అవకాశం రావాలని మనసారా కోరుకుంటూ.. మరోసారి మీకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ప్రేమతో
మీ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఏజెన్సీ ముఖద్వారంలో 'సామాజిక' జైత్రయాత్ర



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- నర్సీపట్నంలో ఉత్సాహంగా సామాజిక సాధికార బస్సు యాత్ర
- బహిరంగ సభకు పోటెత్తిన బడుగు, బలహీనవర్గాలు
- జై జగన్.. జైజై జగన్ అంటూ దద్దరిల్లిన నినాదాలు
- సీఎం జగన్ పాలనలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికార పదవులు
- ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలి
- పిలుపునిచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలు



అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సాధికార యాత్రలో పాల్గొన్న అశేష జనవాహినిలో ఓ భాగం

సాక్షి, అనకాపల్లి: ఏజెన్సీ ముఖద్వారమైన అనకాపల్లి జిల్లా నర్సీపట్నం శనివారం 'జై జగన్..జైజై జగన్' నినాదాలతో దద్దరిల్లింది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఆద్యంతం ఉత్సాహం, ఉత్తేజంతో సాగింది. దీనికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు భారీ ఎత్తున పోటెత్తారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికార పదవులు లభించాయని కొనియాడారు. ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు.

దళితులకు అడుగడుగునా మేలు..

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న సంక్షేమం కొనసాగాలంటే మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. చంద్రబాబు ఏరు దాటాక తెప్ప తగలేసే రకమని మండిపడ్డారు. సీఎం జగన్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారని కొనియాడారు. జనవరి 1 నుంచి వితంతు, వృద్ధాప్య పెన్షన్లను రూ.3 వేలకు పెంచుతున్నారని చెప్పారు. రెండు వేళ్లు చూపించే టీడీపీ నేతలకు.. ఇక వృద్ధులు, వితంతువులు మూడు వేళ్లు చూపాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దళితులకు అడుగడుగునా మేలు జరుగుతోందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. ఈసారి తనను రాజ్యసభకు పంపుతున్నందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ప్రజల సంక్షేమం కోసం రూ.2.40 లక్షల కోట్లు ఖర్చు చేసిన ముఖ్యమంత్రి దేశంలో జగన్ ఒక్కరేనని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రశంసించారు.

వైద్య విప్లవం తీసుకొచ్చారు..

సీఎం జగన్ రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసి వైద్య విప్లవాన్ని తీసుకొచ్చారని అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి కొనియాడారు. అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచారని ప్రశంసించారు. మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ మాట్లాడుతూ.. సీఎం సహకారంతో రూ.2,700 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. అయ్యన్నపాత్రుడు సైకోలా తయారై బూతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. దేశంలో సామాజిక సాధికారతకు సీఎం జగన్ నిజమైన అర్థం చెప్పారని కొనియాడారు. చంద్రబాబు తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడైనా ఎస్సీ, ఎస్టీలకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారా..? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, నవరత్న పథకాల అమలు వైస్ చైర్మన్ ఎ.నారాయణమూర్తి, పార్టీ నేత చింతకాయల సన్యాసిపాత్రుడు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష పాల్గొన్నారు.

వెల్లివిరిసిన సామాజిక చైతన్యం

- ఘనంగా నంద్యాలలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- భారీగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక సాధికారత సాధ్యం
- పేదలకు, పెత్తందార్లకు మధ్యే వచ్చే ఎన్నికలు
- మనమంతా పేదల పక్షపాతి జగనన్న వెంటే నిలుద్దాం
- పిలుపునిచ్చిన నేతలు



నంద్యాల సామాజిక సాధికార సభకు తరలివచ్చిన అశేష జన సందోహంలో ఓ భాగం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

సాక్షి, నంద్యాల: సామాజిక సాధికారత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే వచ్చే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా పేదల పక్షపాతి అయిన వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నవనందుల సాక్షిగా శనివారం నంద్యాల పట్టణంలో సామాజిక సాధికార చైతన్యం వెల్లివెరిసింది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు భారీ ఎత్తున బడుగు, బలహీనవర్గాల ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ ఆకట్టుకుంది.

మైనారిటీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

చంద్రబాబు మైనార్టీల ద్రోహి అని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా మండిపడ్డారు. చంద్రబాబు మైనారిటీలపై దేశద్రోహం కేసులు పెడితే, సీఎం వైఎస్ జగన్ వచ్చాక ఆ కేసులను తొలగించారని గుర్తు చేశారు. అంతేకాకుండా మైనారిటీ వ్యక్తిని డిప్యూటీ సీఎం పదవిలో కూర్చోబెట్టి సీఎం జగన్ గౌరవించారని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి సామాజిక సాధికారిత నినాదంగానే ఉందని, ఒక్క సీఎం జగన్ మాత్రమే దీన్ని విధానంగా మార్చారని ప్రశంసించారు. మనల్ని చేయిపట్టుకుని ముందుకు నడిపిస్తున్న జగన్ వెంటే మనమంతా నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

14 ఏళ్లలో ఏం చేశావో చెప్పే ధైర్యముందా బాబూ?

ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను చంద్రబాబు విస్మరిస్తే.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన చరిత్ర సీఎం జగన్‌దని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. 14 ఏళ్లు సీఎంగా చేశానని చెప్పుకునే చంద్రబాబు తాను అధికారంలో ఉన్నప్పుడు పేదలకు ఏం చేశారో చెప్పగలరా అని నిలదీశారు. ఎస్సీలను తన రాజకీయ లబ్ధి కోసం వాడుకుని చంద్రబాబు వదిలేశారని మండిపడ్డారు. సీఎం జగన్ ఎస్సీలకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చి గౌరవించారని గుర్తు చేశారు. ఆయన అమలు చేస్తున్న ప్రతి పథకం పేదవాడిని ఉన్నతస్థాయికి తీసుకెళ్తోందన్నారు. పేదల పక్షాన నిలుస్తున్న సీఎంకు మనమంతా అండగా నిలవాలని కోరారు.

బడుగు, బలహీనవరాలంటే చంద్రబాబుకు చిన్నచూపు

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలంటే చంద్రబాబుకు ఇప్పటికీ చిన్నచూపేనని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల నాయకులను సున్నాలతో పోలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్ పాలనలోనే బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి సాధ్యమని చెప్పారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే బీసీలను కరివేపాకులా వాడుకుని వదిలేస్తారన్నారు. తండ్రి అరెస్టయి జైలులో ఉంటే ఢిల్లీకి పారిపోయిన పిరికి పంద లోకేశ్.. సీఎంను పట్టుకుని సైకో అంటూ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పక్క పార్టీ నాయకుడిని సీఎంగా చూడాలనుకున్న వ్యక్తి ఈ దేశంలో ఒక్క పవన్ కళ్యాణ్ మాత్రమేనని ఎద్దేవా చేశారు. ఈ సభలో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, ముస్లిం మైనారిటీ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

తాడి'కొండంత' సంబరం

- వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రకు జైకొట్టిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- బీసీలను సీఎం జగన్ బ్యాక్‌బోన్ కులాలుగా మార్చారన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రతో గుంటూరు జిల్లా తాడికొండలో శనివారం సంబరం నెలకొంది. బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలు భారీ ఎత్తున హాజరై జైకొట్టారు. బీసీలను సీఎం జగన్ బ్యాక్‌బోన్ కులాలుగా మార్చారని నేతలు కొనియాడారు. సామాజిక సాధికారతను ప్రభుత్వ విధానంగా అమలు చేశారని ప్రశంసించారు. బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాధికార పదవులు కట్టబెట్టి వారి ఉన్నతికి కృషి చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

సామాజిక న్యాయం అమలు చేసిన సీఎం జగన్ ఒక్కరే..

సామాజిక సాధికారతకు సీఎం వైఎస్ జగన్ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ కొనియాడారు. వైఎస్ కుటుంబం కోసం తన ఎమ్మెల్యే పదవిని సైతం త్యాగం చేసిన మేకతోటి సుచరితను తాడికొండలో గెలిపించాలని ప్రజలను కోరారు. భారతదేశ చరిత్రలో సామాజిక న్యాయాన్ని అమలు చేసిన ఏకైక సీఎం జగన్ మాత్రమేనన్నారు. దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? బీసీల తోకలు కట్ చేస్తానని చంద్రబాబు అవమానించారని గుర్తు చేశారు. మంత్రి ఆదిమూలపు సురేశ్ మాట్లాడుతూ గతంలో సామాజిక న్యాయం అనేది నినాదంగా ఉండేదని.. దాన్ని ప్రభుత్వ విధానంగా మార్చివేసిన ఘనత జగనన్నకు దక్కిందన్నారు. బడుగులకు మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులుగా అవకాశం కల్పించారని కొనియాడారు. బీసీలు, ఎస్సీల్లో చిచ్చుపెడుతున్న చంద్రబాబు మాయలో పడొద్దని ప్రజలను కోరారు.

దళిత మహిళకు హోం మంత్రి పదవిని ఇచ్చారు..

మాజీ హోంమంత్రి మేకతోటి సుచరిత మాట్లాడుతూ దళిత మహిళగా హోం మంత్రి పదవిని ఊహించుకోలేదని, దాన్ని నిజం చేసి చూపించిన వ్యక్తి వైఎస్ జగన్ అని కొనియాడారు. జగనన్న రాత్రికి రాత్రే తనను ఒక స్టార్‌ను చేశారన్నారు. రాష్ట్రంలో తొలి దళిత హోం మంత్రి ఎవరంటే తన



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

పేరే ఉంటుందని సంతోషం వ్యక్తం చేశారు. తాడికొండ మాజీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో సమ సమానత్వం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే చూస్తున్నామని తెలిపారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందాలి.. పేదరికం ఉండకూడదనుకుంటే సీఎం వైఎస్ జగన్‌ను గెలిపించుకోవాలన్నారు. బాపట్ల ఎంపీ నందిగం సురేశ్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రతి పేదవాడి సంక్షేమం కోసమే కృషి చేస్తున్నారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు మంచి జరిగిందంటే అది ఆయన పుణ్యమేనన్నారు. గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ తాడికొండను గెలిపించి జగన్‌కు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తోంది జగన్ మాత్రమేనన్నారు. 50 వేల మంది పేదలకు రాజధానిలో ఇళ్ల స్థలాలు ఇస్తుంటే చంద్రబాబు కోర్టుకు వెళ్లి అడ్డుపడ్డారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు కిలారు రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్, నంబూరు శంకరరావు, తాడికొండ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.



తాడికొండ సామాజిక సాధికార సభలో పాల్గొన్న అశేష జనవాహినిలో ఓ భాగం

క్లుప్తంగా...

'కౌశల్ 2023' రాష్ట్ర స్థాయి విజేత దంగేరు జెడ్పీహెచ్



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర స్థాయి కౌశల్ 2023 కాంపిటీషన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా దంగేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానం కైవశం చేసుకున్నారు. శనివారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో దంగేరు జెడ్పీహెచ్‌కు చెందిన విద్యార్థులు మల్లిపూడి శ్రీగణేష్, జే.నిఖిల్, శీలం వినీతలు అన్ని రంగాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. విజేతలను ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఎస్సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి సత్కరించారు. విద్యార్థులకు రూ.15,000 నగదు పురస్కారంతోపాటు ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు.

ఆ చట్టంతో న్యాయవాదులకు నష్టం జరగదు

- సీఎం కార్యదర్శి ధనుంజయ రెడ్డి హామీ
- ఆందోళన విరమించిన న్యాయవాదులు



ధనుంజయ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదుల సంఘాల అధ్యక్షులు

విశాఖ లీగల్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన భూ సంరక్షణ చట్టం -2022కు సంబంధించి న్యాయవాదులకు ఏ విధమైన నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయ రెడ్డి హామీ ఇచ్చారని న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు తెలిపారు. అమరావతిలో 13 జిల్లాల న్యాయవాదుల ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రి కార్యదర్శిని కలిసి ఈ చట్టం అమలు వల్ల న్యాయవాదుల ఇబ్బందులను వివరించారు. అనంతరం పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగు చర్యలు తీసుకుంటారని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించినట్లు రాంబాబు తెలిపారు.

శ్రీముఖలింగేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

- యునెస్కో హెరిటేజ్ జాబితాలో పొందుపరచాలి
- న్యూఢిల్లీలో శ్రీకాకుళానికి చెందిన అర్చకుడి నిరసన దీక్ష

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీకాకుళం జిల్లాలో దక్షిణ కాశీగా పేరుగాంచిన పుణ్యక్షేత్రం శ్రీముఖలింగేశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ఆలయ ప్రధాన అర్చకులు నాయుడు గారి రాజశేఖర్ డిమాండ్ చేశారు. గత ఇరవై ఏళ్లుగా ఆలయ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి నిధులు కేటాయించట్లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏదాది క్రితం రూ.20 కోట్లు నిధులు కేటాయించినప్పటికీ ఆ నిధులు విడుదలకాకపోవడంతో మళ్లీ వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు. ఇప్పటికైనా ఈ ఆలయాన్ని కేంద్ర ప్రభుత్వ పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్నందున వెంటనే ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ఆయన నిరసన దీక్ష చేశారు. ఐదేళ్లుగా ప్రధాని కార్యాలయంలో, కేంద్ర పర్యటక మంత్రిని స్వయంగా కలిసి పలుమార్లు ఆలయ సమగ్ర అభివృద్ధి కోసం వినతి పత్రాలు ఇచ్చినా సానుకూలంగా స్పందించడం, తర్వాత మరిచిపోవడం వల్ల ఎలాంటి ఫలితంలేదన్నారు. శుక్రవారం ప్రధాని కార్యాలయంలో, ఏఎస్ఐ డైరెక్టర్‌లో అధికారులను కలిసి ఆలయ అభివృద్ధికి కీలక ఫైల్స్ అందించామన్నారు. శ్రీముఖలింగం క్షేత్రం ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చేందుకు అన్ని అర్హతలున్నాయని, యునెస్కో హెరిటేజ్ జాబితాలో పొందుపరిచే వరకూ కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని రాజశేఖర్ డిమాండ్ చేశారు.

డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీ..

▶ మొదటి పేజీ తరువాయి

అందుబాటులో ఉంటుందని పేర్కొంది. పోస్టులకు సంబంధించి అభ్యర్థులు ఆబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లు పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఇందులో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (పేపర్-1) 150 మార్కులకు డిగ్రీ స్థాయిలో ఉంటుంది. పేపర్-2 సంబంధిత సబ్జెక్టు పోస్టు గ్రాడ్యుయేషన్ స్థాయిలో 150 ప్రశ్నలు 300 మార్కులకు ఉంటుంది. తప్పు సమాధానానికి మైనస్ మార్కులు ఉంటాయని కమిషన్ పేర్కొంది. అభ్యర్థులు జనవరి 24 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షల సబ్జెక్టు సిలబస్ https://psc.ap.gov.inలో చూడవచ్చు.



పశ్చిమగోదావరి జిల్లా రామన్నగూడెంలో జరిగిన ఖోఖో పోటీల్లో విజేత మహిళల జట్టు



కాకినాడ జిల్లా లింగంపర్తి గ్రామంలో ఖోఖో ఆడుతున్న యువతులు



శ్రీకాకుళం జిల్లా కణుగులవలసలో కబడ్డీ ఆడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

రసవత్తరం..రెట్టించిన ఉత్సాహం

- పోటాపోటీగా 'ఆడుదాం ఆంధ్ర'
- ఐదోరోజు క్రీడల్లో చురుగ్గా పాల్గొన్న క్రీడాకారులు
- ఆదివారం సెలవు అయినప్పటికీ కొన్నిచోట్ల రీ షెడ్యూల్

సాక్షి, నెట్‌వర్క్/అమరావతి: 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు రాష్ట్రవ్యాప్తంగా రసవత్తరంగా జరుగుతున్నాయి. యువకులు రెట్టించిన ఉత్సాహంతో పోటీల్లో పాల్గొంటున్నారు. దీంతో రాష్ట్రానికి సంక్రాంతి ముందే వచ్చిందా అన్నట్లు ఉత్సాహంగా ఉంది. యువత బ్యాటు, బంతి పట్టుకుని మైదానాల వైపు పరుగులు పెడుతున్నారు. ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించడంతో క్రీడా రంగం పట్ల ఎక్కువ ఆసక్తి ఉన్న వారంతా మ్యాచ్‌లు తిలకించేందుకు మైదానాలకు క్యూ కడుతున్నారు.ఐదో రోజు శనివారం 6,386 గ్రామ వార్డు సచివాలయాల్లో షెడ్యూల్ ప్రకారం పోటీలు నిర్వహించాల్సి ఉండగా 6373 సచివాలయాల్లో పోటీలు జరిగాయి.



ప్రకాశం జిల్లా పెద్దదోర్నాలలో ఖోఖో పోటీల్లో పాల్గొన్న బాలికలు

3,23,781 మంది ప్రేక్షకులు ఆటల పోటీలను తిలకించారు. మొత్తంగా 15 వేల గ్రామ వార్డు సచివాలయాలకుగానూ 14,690 చోట్ల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. అనంతపురం విశాఖపట్నం అనకాపల్లి ప్రకాశం శ్రీ సత్యసాయి జిల్లాల్లో అన్ని గ్రామ వార్డు సచివాలయాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం 'ఆడుదాం ఆంధ్ర' కు సెలవు అయినప్పటికీ కొన్నిచోట్ల రీ షెడ్యూల్ మ్యాచ్‌లు పూర్తి చేయనున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

తిరుపతి జిల్లాలో క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు. కబడ్డీ, క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు. జిల్లాలోని గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరం, పెనుమూరు మండలాల్లో బ్యాడ్మింటన్ పోటీలు ముగిసాయి. నగరి, పుంగనూరు, కుప్పం, చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో క్రీడలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ క్రీడలను మండల అధికారులు, మండల ప్రజాప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు. చిత్తూరు జిల్లాలోని 283 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 467 మైదానాల్లో క్రీడాపోటీలు జరిగాయి. జిల్లాలో 791 మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో 10,151 మంది క్రీడాకారులు క్రీడల్లో పాల్గొనగా, 33,639 మంది ప్రేక్షకులు పోటీలను వీక్షించారు. 719 మంది ప్రజాప్రతినిధులు పోటీలను ప్రారంభించారు. తిరుపతి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడలను నిర్వహించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో పోటీలు చురుగ్గా జరుగుతున్నాయి. కాకినాడ జిల్లా రాజా కళాశాల మైదానంలో జరుగుతున్న క్రీడలను శాప్ ఎండి ధ్యాన్‌చంద్ పరిశీలించారు.

కడపలో మైదానాల వైపు క్యూ..

మెగా క్రీడా టోర్నమెంట్‌లో భాగంగా కడపలో క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో క్రీడాంశాల్లో నిర్వహించిన గ్రామ/వార్డు సచివాలయ పోటీల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో నిర్వహించిన పోటీలను స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి బ్యాడ్మింటన్ అంతర్జాతీయ అంపైర్ ఎస్.జిలానీబాషా ప్రారంభించారు. వివిధ మండలాల్లో పోటీలను ఎంపీడీఓలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఫిజికల్ డైరెక్టర్లు పర్యవేక్షించారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఉత్సాహపూరిత వాతావరణంలో క్రీడలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని 535 సచివాలయాల పరిధిలో శనివారం 864 మ్యాచ్‌లు నిర్వహించగా 10 వేల మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడలను తిలకించడానికి ప్రేక్షకులు ఆసక్తి చూపించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో దాదాపు 25 వేల మంది వరకు క్రీడలను తిలకించినట్టు జిల్లా చీఫ్ కోచ్ డి.దుర్గారావు చెప్పారు.

ఎంఎస్ఎంఈల కోసం ఎఫ్ఎఫ్‌సీలు

పైడి భీమవరం, పెద్దాపురం, అచ్యుతాపురంలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఎంఎస్ఎంఈలు తక్కువ పెట్టుబడితో వేగంగా ఉత్పత్తి ప్రారంభించే విధంగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్(ఎఫ్ఎఫ్‌సీ)లను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ప్రతి పారిశ్రామిక పార్కులో ఎంఎస్ఎంఈల కోసం ఈ ఎఫ్ఎఫ్‌సీలను ఏపీఐఐసీ ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా రూ.8.43 కోట్లతో కాకినాడ జిల్లా పెద్దాపురం పారిశ్రామికవాడలో, రూ.6.39 కోట్లతో శ్రీకాకుళం జిల్లా పైడి భీమవరంలో, రూ.5.99 కోట్లతో అనకాపల్లి ఏపీ సెజ్‌లో ఎఫ్ఎఫ్‌సీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. తొలి దశలో మొత్తం 7 ఎఫ్ఎఫ్‌సీలను అభివృద్ధి చేయాలని ఏపీఐఐసీ నిర్దేశించుకోగా.. మూడు ఎఫ్ఎఫ్‌సీల నిర్మాణానికి టెండర్లను పిలిచింది. టెండర్లు దక్కించుకున్న సంస్థ 9 నెలల్లో నిర్మాణ పనులను పూర్తి చేయాలన్న నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం విధించింది. ఎంఎస్ఎంఈలు స్థలం కొనుగోలు చేసిన తర్వాత వ్యాపారాలు ప్రారంభించడానికి వర్కింగ్ క్యాపిటల్ కోసం ఇబ్బందులు పడుతుండటంతో.. ఉమ్మడి సౌకర్యాలతో కూడిన భవనాలను నిర్మించి వాటిని లీజుకు ఇవ్వడం ద్వారా వెంటనే ఉత్పత్తిని ప్రారంభించే విధంగా ప్రభుత్వం ఎఫ్ఎఫ్‌సీలకు శ్రీకారం చుట్టింది. కనీసం 3 నుంచి 5 ఎకరాల విస్తీర్ణంలో బహుళ అంతస్తుల భవనాలను నిర్మించి అక్కడే ఉమ్మడి సౌకర్యాలతో రెడీ టు వర్క్ విధానంలో ఈ ఎఫ్ఎఫ్‌సీలను అభివృద్ధి చేయనున్నారు. దీని వల్ల ఎంఎస్ఎంఈలు స్థలం కొనుగోలు వంటి వాటికి అధిక మొత్తం ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు. తక్కువ మొత్తంతోనే వ్యాపారాలను ప్రారంభించుకునే వెసులుబాటు కలుగుతుంది.

ఏపీలో ఎంఎస్ఎంఈ ఉద్యోగాలు ▸ భారీగా పెరిగాయి

- కేంద్ర మంత్రి భానుప్రతాప్ సింగ్ వెల్లడి
- 2021-22లో 12.29 లక్షల మందికి ఉపాధి కల్పన
- 2022-23లో 27.27 లక్షల మందికి ఉపాధి కల్పన
- రాష్ట్రంలో మొత్తం 6.99 లక్షల ఎంఎస్ఎంఈలు
- వైఎస్ జగన్ పాలనలోనే కొత్తగా 5.06 లక్షల ఎంఎస్ఎంఈల ఏర్పాటు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్ తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఎంఎస్ఎంఈల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల కల్పన ఏటేటా భారీగా పెరుగుతోందని కేంద్ర ఎంఎస్ఎంఈల శాఖ సహాయ మంత్రి భానుప్రతాప్‌సింగ్‌వర్మ ఇటీవల రాజ్యసభలో వెల్లడించారు. 2021-22వ ఆర్థిక సంవత్సరంలో ఏపీలో ఎంఎస్ఎంఈల ద్వారా 12,29,335 మందికి ఉద్యోగాలను కల్పించగా.. 2022-23లో ఏకంగా 27,27,273 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు కేంద్ర మంత్రి భానుప్రతాప్‌సింగ్ తెలిపారు. ఎంఎస్ఎంఈల ద్వారా అత్యధిక ఉద్యోగాల కల్పనలో దేశంలోనే ఏపీ 7వ స్థానంలో నిలిచిందని ఆయన వెల్లడించారు. వైఎస్ జగన్ పాలనలోని ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో కొత్తగా 5.06 లక్షల ఎంఎస్ఎంఈలు ఏర్పాటయ్యాయి. గత చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రంలో 1,93,530 ఎంఎస్ఎంఈలు మాత్రమే ఉన్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఈ సంఖ్య 6,99,881కు పెరిగిందని కేంద్ర మంత్రి భానుప్రతాప్‌సింగ్ తెలిపారు. దేశంలో 2021-22లో 6,222 ఎంఎస్ఎంఈలు మూతపడగా.. ఏపీలో 113 మాత్రమే మూతపడ్డాయని చెప్పారు. 2022-23లో దేశంలో 13,290 ఎంఎస్ఎంఈలు మూతపడగా ఏపీలో 261 మాత్రమే మూతపడ్డాయని వివరించారు. కోవిడ్ కష్ట సమయంలో సైతం ఎంఎస్ఎంఈల కార్యకలాపాలు నిలిచిపోకుండా సీఎం జగన్ రీస్టార్ట్ ప్యాకేజీ, వైఎస్సార్ నవోదయం తదితర పథకాలతో చేదోడువాదోడుగా నిలిచారు. అలాగే చంద్రబాబు హయాంలో ఎంఎస్ఎంఈలు, స్పిన్నింగ్ మిల్లులకు ప్రోత్సాహకాలు విడుదల చేయకుండా బకాయి పెట్టిన రూ.1,588 కోట్లను కూడా సీఎం జగన్ చెల్లించారు. మరో రూ. 2,087 కోట్ల ప్రోత్సాహకాలనూ విడుదల చేశారు. సీఎం జగన్ అందిస్తున్న ప్రోత్సాహంతో భారీగా ఎంఎస్ఎంఈలు ఏర్పాటవుతున్నాయి. స్థానికులకు భారీగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నాయి.

2022-23లో ఎంఎస్ఎంఈల ద్వారా అత్యధిక ఉద్యోగాలు కల్పించిన టాప్-10 రాష్ట్రాలు

రాష్ట్రం	ఉద్యోగుల సంఖ్య
మహారాష్ట్ర	48,78,918
తమిళనాడు	46,45,718
ఉత్తరప్రదేశ్	41,76,199
కర్ణాటక	35,39,106
పశ్చిమబెంగాల్	29,27,276
రాజస్తాన్	28,12,280
ఆంధ్రప్రదేశ్	27,27,273
తెలంగాణ	26,73,150
గుజరాత్	24,27,935
బిహార్	21,66,299

ఇంటర్ పరీక్షల నిర్వహణకు కసరత్తు

- రాష్ట్రవ్యాప్తంగా 1,489 పరీక్షా కేంద్రాలు గుర్తింపు
- ప్రతి పరీక్ష గదిలోనూ సీసీ కెమెరాలతో నిఘా
- 'రెగ్యులర్' ఫీజు చెల్లించిన 10 లక్షల మంది విద్యార్థులు
- ముగిసిన నామినల్ రోల్స్ ఎడిట్ అవకాశం
- ఇంకా తప్పులుంటే ప్రిన్సిపల్స్‌దే బాధ్యత



సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు బోర్డు చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. ఆలస్య రుసుంతో సహా ఫీజు చెల్లింపు గడువు ముగిసింది. నామినల్ రోల్స్‌లో తప్పులు సరిదిద్దుకునే గడువు కూడా శనివారంతో పూర్తయ్యింది. బోర్డు పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించేందుకు ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. పేపర్ల మోడరైజేషన్(సెట్టింగ్), పరీక్ష కేంద్రాల ఎంపిక పూర్తి కావడంతో ఇంటర్ బోర్డు అధికారులు పరీక్షల నిర్వహణపై దృష్టి పెట్టారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో 10,07,097 మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. వీరిలో మొదటి ఏడాది 5,29,015 మంది, రెండో ఏడాది 4,75,744 మంది విద్యార్థులున్నారు. గతేడాది పలు సబ్జెక్టులలో ఫెయిలైన 1.48 లక్షల మందిలో దాదాపు 90 వేల మంది వరకు ప్రభుత్వం కల్పించిన 'రీ అడ్మిషన్' అవకాశాన్ని వినియోగించుకున్నారు. మరో 53 వేల మంది పరీక్షలకు ఫీజు చెల్లించారు. కాగా, నామినల్ రోల్స్‌లో విద్యార్థుల పేర్లు, తల్లి/తండ్రి పేర్లు, పుట్టిన తేదీ, కులం తదితరాల్లో ఏమైనా తప్పులుంటే సరిదిద్దుకునే అవకాశాన్ని ఇంటర్ బోర్డు కల్పించింది. శనివారంతో ఈ గడువు కూడా ముగిసింది. ఇంకా తప్పులు సరిదిద్దకుండా నిర్లక్ష్యం వహించిన కాలేజీల ప్రిన్సిపల్స్‌ను బాధ్యులను చేసి, వారిపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. విద్యార్థుల సంఖ్యపై స్పష్టత రావడంతో ఇంటర్ బోర్డు పరీక్షల నిర్వహణ అధికారులు.. పరీక్షా కేంద్రాలపై దృష్టి పెట్టారు. గతంలో ప్రాంతీయ పరిశీలన అధికారులు(ఆర్ఐఓ) తమ రీజియన్ పరిధిలో పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసేవారు. ఈ విద్యా సంవత్సరం ఈ బాధ్యతను ఇంటర్మీడియట్ విద్యామండలి పర్యవేక్షిస్తోంది. అనుమతుల కోసం వచ్చిన వాటిలో అన్ని అర్హతలున్న 1,489 జూనియర్ కాలేజీలను కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎంపిక చేసింది. రీజనల్ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు ఆయా కేంద్రాలను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి, నివేదిక సమర్పిస్తారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ సీసీ కెమెరాలతో నిఘా, తగినంతగా తాగునీటి వనరులు, టాయిలెట్లు తదితరాలను తప్పనిసరి చేశారు.

జాతీయ స్కూల్ గేమ్స్‌లో ఏపీకి పతకాలు

- షూటింగ్‌లో బాలికల బృందానికి బంగారు పతకం
- బాలుర బాక్సింగ్‌లో ఒక రజత, ఐదు కాంస్య పతకాలు



షూటింగ్‌లో బంగారు పతకం సాధించిన బాలికల బృందం

సాక్షి, అమరావతి: ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న 67వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ తన విజయ పరంపర కొనసాగిస్తోంది. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరుగుతున్న నేషనల్ స్కూల్ గేమ్స్ షూటింగ్ పోటీల్లో బాలికల బృందం బంగారు పతకం సాధించింది. షూటర్లు తమన్న్య సిరంగి (412.9), గొంటు లక్ష్మీ సమన్విత (410.4), ఆహాన రాణీ (406.6) బృందం 1229.9 పాయింట్లు సాధించి బంగారు పతకం కైవసం చేసుకున్నారు.

బాక్సింగ్‌లో ఆరు పతకాలు

శుక్రవారం మహారాష్ట్రలోని అకోలాలో జరిగిన బాలుర బాక్సింగ్ అండర్-14, 17, 19 విభాగాల్లో ఏపీ విద్యార్థులు ఆరు పతకాలు సాధించారు. బోండా లక్ష్మణ్ (ఎస్వీఎల్ఎన్ఎస్ విద్యాపీఠ్ జూనియర్ కాలేజీ) రజతం, దాసరి ప్రవీణ్ కుమార్ (జీవీఎంసీ హైస్కూల్, మాధవధార) కాంస్యం, జన్ని వసంతరావు (శ్రీ బాలాజీ జూనియర్ కళాశాల, భీమసింగి) కాంస్యం, ఆకుల అశోక్ కుమార్ (సోఫియా జూనియర్ కళాశాల, జ్ఞానపురం) కాంస్యం, ఆయుష్ (ఎంవీపీ జూనియర్ కళాశాల, గాజువాక) కాంస్యం, దొంతల దేవస్వరూప్ (జీఎస్‌పురం, విజయనగరం జిల్లా) కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా విజేతలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్, సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు అభినందించినట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఏపీ కార్యదర్శి భానుమూర్తిరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

ముస్లింలపై అపోహలన్నీ కల్పితాలే

- భారత మాజీ ఎన్నికల ప్రధాన అధికారి ఖురేషి
- 'జనాభా సంఖ్య-అపోహలు-భారత రాజకీయాలు' పుస్తకావిష్కరణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఖురేషి

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం ముస్లింల జనాభా విపరీతంగా పెరిగిపోతోందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని భారత మాజీ ప్రధాన ఎన్నికల అధికారి ఎస్‌వై ఖురేషి అన్నారు.ఖురేషి రచించిన ఆంగ్ల పుస్తకం తెలుగు అనువాదం 'జనాభా సంఖ్య-అపోహలు-భారత రాజకీయాలు' పుస్తకాన్ని శనివారం సాయంత్రం 34వ విజయవాడ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు ఎక్కువమంది పిల్లలను కంటారని, ఎక్కువ పెళ్లిళ్లు చేసుకుంటారంటూ రాజకీయ ప్రయోజనాల కోసం గోరంతలు కొండంతలు చేసి చూపుతున్నారని అభిప్రాయపడ్డారు. జనాభాలో మహిళల సంఖ్య పురుషుల కన్నా తక్కువగా ఉన్నప్పుడు ఒకరు ఎక్కువ మందిని పెళ్లిచేసుకోవడం సాధ్యమే కాదన్నారు. ముస్లింలలో కుటుంబ నియంత్రణ నిషేధమనే మాట కూడా నిజం కాదని, భార్యాపిల్లలను పోషించే ఆర్థిక సామర్థ్యం లేనప్పుడు పెళ్లి చేసుకోవద్దని కూడా ఖురాన్ చెప్పిందని, కుటుంబ నియంత్రణను మహ్మద్ ప్రవక్త సమర్థించారని వివరించారు. ఇరాన్, బంగ్లాదేశ్, మలేషియాలాంటి పూర్తి ముస్లిం దేశాలలో కుటుంబ నియంత్రణ సమర్థంగా అమలవుతుందని ఉదహరించారు. కుటుంబ నియంత్రణ జనాభా నియంత్రణ విషయంలో మతాల ప్రభావం కన్నా, అక్షరాస్యత, ఆర్థిక స్థితి, స్థానిక సంస్కృతుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని శాస్త్రీయ అధ్యయనంలో నిరూపితమైందని స్పష్టం చేశారు. మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ దేశంలో అన్ని సామాజికవర్గాలకంటే ముస్లిం ఆర్థిక పరిస్థితి చాలా తక్కువగా ఉందని సచార్ కమిటీ తదితర అధికారిక అధ్యయనాలలో వెల్లడయ్యిందన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రామాలయం పేరుతో మత రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నో శాస్త్రీయ అధ్యయనాలు వాస్తవాలను తెలుపుతున్నా మైనారిటీల పట్ల ప్రభుత్వాల వైఖరి మారడం లేదన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి పాలకమండలి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, శాసనమండలి మాజీ సభ్యుడు జెల్లి విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి ట్రిబ్యునల్ ఏర్పాటుకు కసరత్తు

- రెండు రాష్ట్రాలకు జలాల పంపిణీకి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ
- దీనిపై కేంద్ర న్యాయశాఖ అభిప్రాయాన్ని కోరిన కేంద్ర జల్‌శక్తి శాఖ

సాక్షి, అమరావతి: గోదావరి నదీ జల వివాదాల ట్రిబ్యునల్ ఏర్పాటుకు కేంద్రం కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి రాష్ట్ర పరిధిలో గోదావరిలో నీటి లభ్యతను తేల్చి.. జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడానికి అంతరాష్ట్ర నదీ జల వివాదాల (ఐఎస్ఆర్ డబ్ల్యూడీ) చట్టం-1956లో సెక్షన్-3 ప్రకారం ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని నవంబర్ 6న కేంద్ర జల్‌శక్తి శాఖకు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. దీనిపై కేంద్ర న్యాయశాఖ అభిప్రాయాన్ని కేంద్ర జల్‌శక్తి శాఖ కోరింది. న్యాయశాఖ అభిప్రాయం ఆధారంగా కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటుపై కేంద్ర జల్‌శక్తి నిర్ణయం తీసుకుంటుందని అధికార వర్గాలు వెల్లడించాయి. గోదావరి ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన



జలాలను ఇప్పటిదాకా రెండు రాష్ట్రాలకు కేటాయించలేదు. నీటి వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య అవగాహన ఒప్పందం కూడా కుదరలేదు. కానీ.. జీడబ్ల్యూడీటీ అవార్డు, విభజన చట్టాన్ని తుంగలో తొక్కి తెలంగాణ సర్కార్ 714.13 టీఎంసీలు వినియోగించుకోవడానికి అక్రమంగా ఏడు ప్రాజెక్టులను నిర్మిస్తోందని.. దీని వల్ల రాష్ట్ర హక్కులకు విఘాతం కలుగుతుందని అనేకసార్లు కేంద్ర జల్‌శక్తి శాఖ దృష్టికి ఏపీ ప్రభుత్వం తీసుకెళ్లింది. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ 2020, అక్టోబర్ 6న నిర్వహించిన అపెక్స్ కౌన్సిల్ రెండో సమావేశంలో ఇదే అంశాన్ని సీఎం వైఎస్ జగన్ ఎత్తిచూపారు. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడానికి ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కొత్త ట్రిబ్యునల్ కోసం ప్రతిపాదన పంపితే న్యాయసలహా తీసుకుని నిర్ణయం తీసుకుంటామని కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అప్పట్లో హామీ ఇచ్చారు.

వీపీహెచ్ఏ పోస్టుల భర్తీకి నేడు రాత పరీక్ష

పరీక్షల నిర్వహణకు పగడ్బందీ ఏర్పాట్లు

ఉదయం 8 గంటలకే రిపోర్టింగ్ చేయాలి

ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

సాక్షి, అమరావతి: గ్రామ పశుసంవర్ధక సహాయక (వీపీహెచ్ఏ) పోస్టుల భర్తీకోసం ఆదివారం నిర్వహిస్తున్న రాత పరీక్షకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. సచివాలయాలకు అనుబంధంగా ఉన్న ఆర్బీకేల్లో జిల్లాల వారీగా ఖాళీగా ఉన్న 1,896 పోస్టుల భర్తీకి గత నెల 20వ తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక్కో పోస్టుకు సగటున 10 మంది చొప్పున 19,323 మంది దరఖాస్తు చేశారు. అభ్యర్థులకు ఈ నెల 27వ తేదీ నుంచి హాల్‌టికెట్లు జారీ చేస్తారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష కోసం 19 జిల్లాల్లో 80 కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్న ఈ రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 8 గంటలకల్లా ఎగ్జామ్ సెంటర్స్‌లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా హాలులోకి అనుమతించరు. రెండు విభాగాల్లో 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. రాత పరీక్షలో అర్హత సాధించిన వారిని మెరిట్ ప్రాతిపదికన జిల్లాల వారీగా జాబితా విడుదల చేస్తారు. కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన జిల్లా ఎంపిక కమిటీల ఆధ్వర్యంలో రిజర్వేషన్ల దామాషా ప్రకారం తుది జాబితాను రూపొందించి నియామక పత్రాలు జారీ చేస్తారు.

రసాభాసగా కాపు సదస్సు

- జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ప్రసంగాన్ని అడ్డుకున్న టీడీపీ నేతలు
- టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వాగ్వాదం

పాత గుంటూరు: తెలగ, బలిజ, కాపు జేఏసీ, కాపు రాజకీయ చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కాపు రాజకీయ భవిష్యత్తు కార్యాచరణపై చైతన్య సదస్సు రసాభాసగా మారింది. గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన సదస్సుకు అధ్యక్షత వహించిన జేఏసీ కన్వీనర్ దాసరి రాము మాట్లాడుతూ 76 సంవత్సరాలుగా రాష్ట్ర అభివృద్ధికి కాపులు కృషి చేస్తున్నా.. వారిని రాజ్యాధికారానికి దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాపులకు జనాభా దామాషా ప్రకారం గుంటూరు పార్లమెంటులో అత్యధిక ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, బీజేపీ నాయకులు చందు సాంబశివరావుతోపాటు ఉమ్మడి జిల్లాల కాపు సంఘాల నాయకులు పాల్గొన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మైక్ తీసుకోగానే మీడియాని కవరేజ్ ఆపాలని కోరారు. పార్టీ పరమైన అంశాలు మాట్లాడవద్దని కాపు నాయకులు చెప్పినప్పటికీ పట్టించుకోకుండా వెంకటేశ్వరరావు రాష్ట్రంలో 116 కాపు సంఘాలు ఉంటే ఐక్యత ఎలా వస్తుందని, ఎవరు ఒకరి మాట వినరని, మన నాయకుడు పవన్‌కళ్యాణ్ వెంట ఉండాలని కోరడంతో టీడీపీ నేత దేగల ప్రభాకర్‌రావు, కార్యకర్తలు అడ్డు చెప్పారు. దీంతో ఇరుపార్టీల కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. మాజీ మంత్రి శనక్కాయల అరుణ, కాపు రాజకీయ చైతన్య వేదిక నాయకులు పాల్గొన్నారు.



అడుగుడి... మీకియ్యబడును!
వెదకుడి... మీకు దొరకును!!
తట్టుడి... మీకు తీయబడును!!
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** బ.చవితి ఉ.10.11 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** మఖ పూర్తి (24 గంటలు). **వర్జ్యం:** సా.6.01 నుండి 7.45 వరకు. **దుర్ముహూర్తం:** సా.4.08 నుండి 4.56 వరకు. **అమృతఘడియలు:** తె.4.36 నుండి 6.22 వరకు (తెల్లవారితే సోమవారం).

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం : 5.28
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నితీశ్ కుమార్ (బిహార్ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

పాత స్నేహమే ఇద్దరి మధ్య కొత్తగా గాఢం అవుతోందంటే, ఆ ఇద్దరిలో ఒకరికి మునుపు వేరెవరితోనో ఉన్న గాఢమైన స్నేహం ఎక్కడో పెళుసు బారిందనే!

మనుషులు ఊరికే స్నేహాన్ని వెతుక్కుంటూ పోతారా గౌతమ బుద్ధుడు ఇల్లొదిలి వెళ్లినట్లు? లేదంటే, ఊరికే స్నేహాన్ని వెతుక్కుంటూ వస్తారా ఇంట్లో అందర్నీ కాదనుకుని వచ్చేసినట్లు? వెనుక ఏదో ఉంటుంది. ఎవరో ఉంటారు.

లలన్‌జీ, లాలూజీల మధ్య పాత స్నేహమే మళ్లీ కొత్తగా వికసించి, విప్పారడాన్ని నేను గమనించాను కానీ అనుమానించలేదు. ఎందుకు అనుమానించాలి?! లలన్‌జీ నా పార్టీకి జాతీయ అధ్యక్షుడు. లాలూజీ నేను సీఎం కావడానికి తన పార్టీ చేత మద్దతు ఇప్పించిన వారు.

కానీ ఇప్పుడనిపిస్తోంది! నాయకుడికి తనవాళ్లపై నమ్మకం ఎంతుండాలో అనుమానమూ అంతుండాలి. లాలూజీ తన కొడుకుని సీఎంని చేయడానికి లలన్‌జీతో కొత్తగా స్నేహం చెయ్యడం తప్పు కాదు.



లలన్‌జీ నన్ను సీఎంగా తప్పించడానికి లాలూజీతో రహస్యంగా స్నేహం చెయ్యడం తప్పు. అంతకన్నా తప్పు... ఇంట్లో మనిషే కదా అని లలన్‌జీని నేను అనుమానించక పోవటం!

ఆర్జేడీకి 75 మంది ఎమ్మెల్యేలు ఉన్నా కూడా 45 మంది మాత్రమే ఎమ్మెల్యేలు ఉన్న జేడీయూకి సీఎం పోస్ట్ ఇచ్చారు కనుక లాలూజీ నాకు వ్యతిరేకంగా లలన్‌జీతో చేయి కలపడం రాజకీయమే తప్ప ద్రోహం కాదు.

జేడీయూకి ఉన్న 45 మంది ఎమ్మెల్యేల నుంచి 10–12 మంది ఎమ్మెల్యేలను ఆర్జేడీలోకి లీల్చి, లాలూజీ కొడుకుని సీఎం చేయడానికి లలన్‌జీ లాలూజీ చేయి అందుకోవటం ద్రోహమే తప్ప రాజకీయం కాదు.

"నితీశ్‌జీ! 18 ఏళ్లుగా మీరు సీఎంగా ఉంటున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి 74 ఏళ్లు. ఆ పై ఏడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికల నాటికి 75 వచ్చేస్తాయి మీకు. ఇకనైనా మీరు మీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్‌ని సీఎంని చేసి, మీరు తేజస్వీ యాదవ్‌కి డిప్యూటీ సీఎంగా ఉంటే బాగుంటుందని మన వాళ్లంతా అభిప్రాయ పడుతున్నారు..." అని లలన్‌జీ అన్నప్పుడే నేను ఆయన్ని అనుమానించాల్సింది!

తేజస్వీయాదవ్‌కి సీఎం సీటును అప్పగించడానికి నాకేం అభ్యంతరం లేదు. కానీ పద్దెనిమిదేళ్లుగా నేను సీఎంగా ఉంటూ రావడం అన్నది లలన్‌జీకి ఎందుకు అభ్యంతరం అయినట్లు?!

"ఎందుకిలా మారిపోయారు లలన్‌జీ!" అని ఆవేదనగా అడిగాను.

రఫీ మార్గ్‌లోని విఠల్‌భాయ్ హౌస్‌లో ఉన్న కాన్‌స్టిట్యూషన్ క్లబ్ లో కూర్చొని ఉన్నాం... నేను, లలన్ సింగ్. పట్నా ఫ్లయిట్‌కి మాకింకా సమయం ఉంది.

రాత్రి 11.30 వరకు ఉంటుంది కాన్‌స్టిట్యూషన్ క్లబ్. మీటింగ్‌లు, ప్రెస్ కాన్ఫరెన్స్‌లు, కార్యవర్గ సమావేశాలు, ఈవెంట్‌లు జరుగుతుంటాయి అక్కడ.

అంతక్రితమే క్లబ్‌లో జేడీయూ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఆ సమావేశంలోనే లాలూజీతో తన తాజా స్నేహపు గాఢతకు పరిహారంగా లలన్‌జీ తన పార్టీ జాతీయ అధ్యక్ష పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది.

"బాగానే ఉన్నాం కదా లలన్‌జీ! లాలూజీతో కలిసి ఎందుకలా ప్లాన్ చేశారు? ఎందుకు మనిద్దరం కూర్చున్న కొమ్మను నేనున్న వైపు నరకబోయారు?!" అని అడిగాను.

ఆయనేం మాట్లాడలేదు! పట్నా ఫ్లయిట్‌లో మాట్లాడలేదు. పట్నాలో దిగాకా మాట్లాడలేదు. నేను ఇంటికి చేరుకున్నాక ఆయన్నుంచి ఫోన్ వచ్చింది!

"దేశానికి మీరొక కొత్త ముఖం అవాలని ఆశిస్తున్నట్లే, బిహార్‌కి కూడా మీరొక కొత్త ముఖం ఇస్తే బాగుంటుందని నేను ఆశపడ్డాను నితీశ్‌జీ. కొత్త సంవత్సరం అంటే లోపలికి కొత్త ముఖం రావటం మాత్రమే కాదు. అంతకంటే ముందు పాత ముఖం బయటికి పోవడం కూడా..." అన్నారు లలన్ సింగ్!!

ఆ పేరే ప్రభంజనం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

ఆ పేరే ఇప్పుడొక సూపర్ బ్రాండ్. జగనన్న అనే నాలుగక్షరాలు ప్రభంజనానికి పర్యాయపదంగా మారిన వైనాన్ని మనం ఆంధ్రప్రదేశ్‌లో చూడవచ్చు. గనిలో వనిలో కార్ఖానాలో... అన్నట్టుగా ప్రతి జీవనరంగంలోనూ ఈ ప్రభంజనపు వికాసాన్ని మనం కాంచవచ్చు. ఊరూవాడ, పాలమూ పుట్ర, బడీగుడి, ఆస్పత్రీ ఆఫీసూ... ఇలా ప్రతిచోటా మారాకు తొడుగుతున్న మార్పులను మనం గమనించవచ్చు.

ఈ మార్పులు నిస్సహాయులను నిటారుగా నిలబెడుతున్నాయి. పేదవర్గాల భుజాలకు హక్కుల అమ్ములపొదులను తొడిగి సాయుధం చేస్తున్నాయి. రాజ్యాంగాన్ని కబ్జా చేసి తమను దగా చేసిన పెత్తందార్లపై యుద్ధానికి పేద వర్గాలను సమాయత్తపరిచేవిగా ఉన్నాయి. నాటి విప్లవకారులు పాడుకున్న పాటొకటి గుర్తుకొస్తున్నది. ''విప్పపూల చెట్ల సిగల దాచిన విల్లమ్ములు నీకిస్త తమ్ముడా, నీకిస్తా తమ్ముడా... రాయలసీమ రాళ్లలోని రతనాలను మాలలల్లి నీకిస్త తమ్ముడా, నీకిస్తా తమ్ముడా.'' ఈ స్ఫూర్తిని ఇప్పుడు మనం ఆంధ్రప్రదేశ్‌లో రాజ్య ప్రాయోజిత సాధికార రథయాత్రల్లో వీక్షించవచ్చు.

''వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనే నేను''... అంటూ ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నేటికి నాలుగు సంవత్సరాల ఏడు మాసాలు గడిచాయి. ముఖ్యమంత్రి హోదాలో వందలాది సభల్లో ఆయన పాల్గొన్నారు. జనం సమక్షంలోనే సంక్షేమ కార్యక్రమాలకు నిధులు విడుదల చేస్తున్నారు. వేలాదిమంది సహాయార్థులను విడివిడిగా కలిసి వారి బాధలు విన్నారు. వారి కన్నీళ్లు తుడిచారు. ఇంతగా నిరంతరం జనంలో తిరుగాడినప్పటికీ ఆయన జనాకర్షణ చెక్కుచెదరలేదు. పైగా పెరిగింది. ఆయన జనంతో మమేకమయ్యే వీడియో ఫుటేజీలు సోషల్ మీడియాలో విస్తారంగా దొరుకుతాయి. సెల్ఫీలకోసం ఎగబడేవారు, లాఠీల నెదిరించి బ్యారికేడ్లు దూకేవాళ్లు, 'జగనన్నా' అంటూ ఎలుగెత్తేవాళ్లు, కిలోమీటర్ల పొడవునా రోడ్ల పక్కన, మిద్దెల మీద నిలబడి కేరింతలు కొట్టేవాళ్లు ఇప్పుడింకా పెరిగారు. వేలాదిమంది పాల్గొన్న సభల్లో జనతరంగ విన్యాసాలు, మెక్సికన్ వేవ్స్ ఇంకా కనిపిస్తున్నాయి.

సాధారణంగా ఐదేళ్లు అధికారంలో ఉన్న తర్వాత ప్రభుత్వాల మీద అంతో ఇంతో అసంతృప్తి కనిపిస్తుంది. కానీ ఇక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉన్నది. మరోసారి టిక్కెట్ దొరకదని ఖాయంగా తెలిసినవాళ్లలో, సొంత పనులు చక్క బెట్టుకోవడం కుదరని నాయకుల్లో అసంతృప్తి కనిపిస్తున్నది కానీ, జనబాహుళ్యంలో మాత్రం పాజిటివ్ వైబ్రేషన్స్ ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి. ఈ పిడికెడుమంది అసంతృప్తిపై వైడ్ యాంగిల్ వేసి చూపెడుతున్న యెల్లో మీడియా లక్షలాదిమంది సంతృప్తిపై సిరా మరకలు రుద్ది దాచేసే ప్రయత్నం చేస్తున్నది.

ప్రజాదరణ రేటింగ్ విషయంలో జాతీయ సంస్థల సర్వేల్లో జగన్‌మోహన్‌రెడ్డి దరిదాపుల్లో కూడా మన 'ఫార్టీ ఫైవ్ ఇయర్స్ ఇండస్ట్రీ' లేరు. 'ఇండియా టుడే' వారు గత జనవరిలో చేసిన సర్వేలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదరణ 56 శాతంగా ఉంటే, ఈ డిసెంబర్‌లో 58 శాతానికి పెరిగింది. తాజా సర్వేల్లో మన విజనరీ లీడర్‌కు 36 శాతం, క్వశ్చన్ మార్క్ లీడర్‌కు 7 శాతం జనాదరణ ఉన్నట్టు తేలింది. క్షేత్రస్థాయిలో పర్యటించి జనం గుండెచప్పుళ్లు వింటే ఈ తేడా ఇంకా ఎక్కువగా తెలుస్తుంది.

371 కోట్ల రూపాయల ధనాన్ని సర్కారు ఖజానా నుంచి సొంతానికి దారి మళ్లించిన స్కిల్ కుంభకోణం కేసులో చంద్రబాబు యాభై రెండు రోజులు జైల్లో గడిపారు. ఈ జైలు జీవితం వల్ల రాష్ట్రంలో సానుభూతి గంగ ఉప్పొంగి ప్రవహిస్తుందని తెలుగుదేశం, యెల్లో మీడియాలు బోలెడు ఆశలు పెట్టుకున్నాయి. 'టైమ్స్ నౌ' వాళ్లు ఆయన జైల్లో ఉన్న సమయంలోనే సర్వే చేసి రాష్ట్రంలోని 25 లోక్‌సభ సీట్లకు గాను వైసీపీ 24 నుంచి 25 గెలుచుకుంటుందని తేల్చేశారు. టీడీపీకి సున్నా నుంచి వస్తేగిస్తే ఒక సీటు రావచ్చని చెప్పారు. ఎన్నికల భాషలో దాన్నే 'ఊడ్చేయడం' అంటారు. ఇదీ వాస్తవ రాజకీయ పరిస్థితి.

కేవలం తెలుగుదేశం – జనసేన కలిసి పోరాడినంత మాత్రాన వైసీపీని ఓడించడానికి బలం చాలదు. సమస్త రాజకీయ శక్తుల ఓట్లు చీలకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పడేలా చూడాలి. 50 శాతానికి పైగా ఉన్న వైసీపీ ఓట్లలో సాధ్యమైనంత మేరకు కోత పెట్టాలి. ఇప్పుడు బాబు కూటమి ఆ ప్రయత్నాల్లో తల మునకలై ఉన్నది. వీళ్లవెంతటి వికృతమైన, జుగుప్సాకరమైన ఆలోచనలో పరిశీలించండి. తెలుగుదేశం – జనసేన కూటమికి బీజేపీ తోడవ్వాలి. మరోపక్క కాంగ్రెస్ – కమ్యూనిస్టులు కలిసి వీరి సలహాల మేరకు అవగాహనతో పని చేయాలి. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కర్ణాటక, గుజరాత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక సహకారం అందించిన సంగతి బహిరంగ రహస్యమే. అందువల్ల రాహుల్‌తో ఏర్పడిన సత్సంబంధాలను ప్రస్తుత అవసరాలకు బాబు వినియోగించుకుంటున్నారని సమాచారం. 22 మంది ఏపీ కాంగ్రెస్ నాయకులను ఢిల్లీకి పిలిపించుకొని కాంగ్రెస్ పెద్దలు సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ పదేళ్లలో ఢిల్లీ పెద్దలు ఏపీ కాంగ్రెస్ మీద ఈ మాత్రం శ్రద్ధ పెట్టడం ఇదే ప్రథమం.

సాధారణంగా ఐదేళ్లు అధికారంలో ఉన్న తర్వాత ప్రభుత్వాల మీద అంతో ఇంతో అసంతృప్తి కనిపిస్తుంది. కానీ ఇక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉన్నది. మరో సారి టిక్కెట్ దొరకదని ఖాయంగా తెలిసిన వాళ్లలో, సొంత పనులు చక్క బెట్టుకోవడం కుదరని నాయకుల్లో అసంతృప్తి కనిపిస్తున్నది కానీ, జనబాహుళ్యంలో మాత్రం పాజిటివ్ వైబ్రేషన్స్ ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి. ఈ పిడికెడుమంది అసంతృప్తిపై వైడ్ యాంగిల్ వేసి చూపెడుతున్న యెల్లో మీడియా లక్షలాదిమంది సంతృప్తిపై సిరా మరకలు రుద్ది దాచేసే ప్రయత్నం చేస్తున్నది.

ప్రజాదరణ రేటింగ్ విషయంలో జాతీయ సంస్థల సర్వేల్లో జగన్‌మోహన్‌రెడ్డి దరిదాపుల్లో కూడా మన 'ఫార్టీ ఫైవ్ ఇయర్స్ ఇండస్ట్రీ' లేరు. 'ఇండియా టుడే' వారు గత జనవరిలో చేసిన సర్వేలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదరణ 56 శాతంగా ఉంటే, ఈ డిసెంబర్‌లో 58 శాతానికి పెరిగింది. తాజా సర్వేల్లో మన విజనరీ లీడర్‌కు 36 శాతం, క్వశ్చన్ మార్క్ లీడర్‌కు 7 శాతం జనాదరణ ఉన్నట్టు తేలింది. క్షేత్రస్థాయిలో పర్యటించి జనం గుండెచప్పుళ్లు వింటే ఈ తేడా ఇంకా ఎక్కువగా తెలుస్తుంది.

ఏపీలో గెలవడం గురించి కంటే ఓట్ల శాతం పెంచుకోవడంపై దృష్టి పెట్టాలని ఈ సమావేశంలో రాహుల్ రాష్ట్ర కాంగ్రెస్ నేతలను ఆదేశించారట! ఈ సందేశాన్ని చంద్రబాబు రాజకీయ భాషలోకి తర్జుమా చేస్తే వైసీపీ ఓట్లను చీల్చడం మీద దృష్టి పెట్టాలి. సీనియర్ మోస్ట్ నాయకుడైన చంద్రబాబు రాజకీయ ఆలోచనలు ఈ విషయంతో పట్టాలు తప్పినట్టు మనకు బోధపడుతున్నది. ఎందుకంటే రెండు మూడు బలమైన ప్రతిపక్షాలున్నప్పుడు ప్రభుత్వ నెగెటివ్ ఓటు చీలుతుంది. ఆ చీలికను నివారించడం కోసం ప్రతిపక్షాలు ప్రయత్నిస్తాయి. కానీ ప్రభుత్వ పాజిటివ్ ఓటు ఎట్టి పరిస్థితుల్లో చీలదు. అలా చీలిన దాఖలాలూ లేవు. కాంగ్రెస్ ద్వారా పాజిటివ్ ఓటును చీల్చాలనే బాబు ఆలోచన ఆయన నిస్పృహకు నిదర్శనంగానే భావించాలి.

ఢిల్లీ సమావేశంలో రాహుల్‌గాంధీ మరో సూచన కూడా చేశారు. పార్టీలోకి ఎవరు చేరుతానన్నా ఆహ్వానించాలనీ, అలా ఆహ్వానించకపోతే నష్టపోతామనీ హితవు చెప్పారట! ఏపీ ప్రజల దృష్టిలో రాష్ట్ర విభజన పాపాన్ని మూటగట్టుకొని ఒక్క శాతం ఓటు కూడా లేని దుస్థితికి చేరుకున్న పార్టీలో చేరడానికి పరుగు పరుగున వస్తున్న వారెవరో? ఎక్కడా టిక్కెట్ దొరక్క ఏదో ఒక బీ–ఫామ్ కోసం ఎవరైనా వస్తే రావచ్చు. ఇంకేదైనా తెర వెనుక వ్యూహంలో భాగంగా మరెవరైనా రావచ్చు. వారు చూపగలిగే ప్రభావం శూన్యం.

ఇక బీజేపీ కూడా తమ పొత్తులో భాగస్వామి కావాలన్న కోర్కె టీడీపీ – జనసేనలదే తప్ప బీజేపీది కాదు. పొత్తు కుదిరిపోయిందన్న ప్రచారం వెనుక తెలుగుదేశం పార్టీ హస్తమున్నదని బీజేపీ వర్గాలు అనుమానిస్తున్నాయి. రాష్ట్ర బీజేపీలోని ఒక వర్గం పొత్తుకు అనుకూలంగా పనిచేస్తున్న మాట వాస్తవమే. వారు అధిష్ఠానానికి ఈ మేరకు పిటిషన్లు పెడుతున్న మాట కూడా నిజమే! అయితే చంద్రబాబు నమ్మదగిన వ్యక్తి కాదని బీజేపీ జాతీయ నాయకుల నిశ్చితాభిప్రాయం. పొత్తును వారు ఇంత వరకూ ఆమోదించలేదు. కానీ చంద్రబాబు పార్టీ మాత్రం పొత్తు కుదిరిపోయిందన్న కథనాన్ని తయారుచేసింది. యెల్లో మీడియా విశ్వసనీయత అడుగంటిన నేపథ్యంలో ఈ కథనాన్ని నడపడానికి ఇంకో తటస్థ ఛానల్‌ను ఆ పార్టీ ఎంచుకున్నదని బీజేపీ వారి పరిశీలనలో తేలింది.

స్కోరింగ్‌ల మీద, బ్రేకింగ్‌ల మీద న్యూస్ ఛానెళ్లకు సహజంగా ఉండే ఆసక్తిని అవకాశంగా తీసుకుని, ఇది పక్కా సమాచారమని నమ్మబలికి, ఓ ప్రముఖ ఛానల్‌లో టీడీపీ కథనం ప్రసారమయ్యేట్లు వ్యూహాన్ని రచించారు. దీని వెనకో పిట్ట కథ ఉన్నది. మొన్న బెంగళూరు ఎయిర్‌పోర్టులో కర్ణాటక కాంగ్రెస్ స్ట్రాంగ్ మ్యాన్ డీకే శివకుమార్, చంద్రబాబు తారసపడ్డారు. పక్కనున్న సెక్యూరిటీ, వ్యక్తిగత సిబ్బందికి దూరంగా వెళ్లి ఇద్దరే చాలాసేపు మాట్లాడుకున్నారు. బాబు గ్రహచారం బాగాలేక ఈ వార్త, ఫోటో మీడియాలో ప్రముఖంగా వచ్చేసింది. దాంతో బాబుకు ముచ్చెమటలు పట్టాయట! దీన్ని పూర్వపక్షం చేయడం కోసం బీజేపీతో పొత్తు కహానీని సిద్ధంచేసి ఒక తటస్థ ఛానెల్‌పైకి గురిపెట్టి విసిరారు. ఈ కథనం ప్రకారం ఏపీ బీజేపీ కార్యకర్తల అభిప్రాయ సేకరణలో టీడీపీతో పొత్తు వుండాలనే అంశానికి మద్దతు లభించిందట! దీనిపై రాష్ట్ర నాయకత్వం ఒక రిపోర్టు తయారుచేసి జాతీయ నాయకత్వానికి పంపించిందట! ఇందులో బీజేపీకి పది నుంచి పన్నెండు, జనసేనకు 20 సీట్లు ఇవ్వాలని ప్రతిపాదించారట! కన్నపు దొంగలు ఇక్కడే దొరికిపోయారు. నిజంగానే బీజేపీ వాళ్లు లేఖ రాస్తే జనసేనకు, తమకూ కలిపి ముచ్చెంగా 30 సీట్లే అడుగుతారా! కనీసం 70 సీట్లు అడిగేవారు. జనసేనకు 20 సీట్లే అని చెబుతున్న టీడీపీ వైఖరికి తగినట్టుగానే 'బీజేపీ లేఖ' ఉండటం ఆసక్తికరం.

బీజేపీ కూడా తమ పొత్తులో భాగస్వామి కావాలన్న కోర్కె టీడీపీ – జనసేనలదే తప్ప బీజేపీది కాదు. పొత్తు కుదిరి పోయిందన్న ప్రచారం వెనుక తెలుగుదేశం పార్టీ హస్తమున్నదని బీజేపీ వర్గాలు అనుమానిస్తున్నాయి. రాష్ట్ర బీజేపీలోని ఒక వర్గం పొత్తుకు అనుకూలంగా పని చేస్తున్న మాట వాస్తవమే. వారు అధిష్ఠానానికి ఈ మేరకు పిటిషన్లు పెడుతున్న మాట కూడా నిజమే! అయితే చంద్రబాబు నమ్మదగిన వ్యక్తి కాదని బీజేపీ జాతీయ నాయకుల నిశ్చితాభిప్రాయం. పొత్తును వారు ఇంత వరకూ ఆమోదించలేదు. కానీ చంద్రబాబు పార్టీ మాత్రం పొత్తు కుదిరిపోయిందన్న కథనాన్ని తయారుచేసింది. యెల్లో మీడియా విశ్వసనీయత అడుగంటిన నేపథ్యంలో ఈ కథనాన్ని నడపడానికి ఇంకో తటస్థ ఛానల్‌ను ఆ పార్టీ ఎంచుకున్నదని బీజేపీ వారి పరిశీలనలో తేలింది.

స్కోరింగ్‌ల మీద, బ్రేకింగ్‌ల మీద న్యూస్ ఛానెళ్లకు సహజంగా ఉండే ఆసక్తిని అవకాశంగా తీసుకుని, ఇది పక్కా సమాచారమని నమ్మబలికి, ఓ ప్రముఖ ఛానల్‌లో టీడీపీ కథనం ప్రసారమయ్యేట్లు వ్యూహాన్ని రచించారు. దీని వెనకో పిట్ట కథ ఉన్నది. మొన్న బెంగళూరు ఎయిర్ పోర్టులో కర్ణాటక కాంగ్రెస్ స్ట్రాంగ్ మ్యాన్ డీకే శివకుమార్, చంద్రబాబు నాయుడు తారసపడ్డారు. పక్కనున్న సెక్యూరిటీ, వ్యక్తిగత సిబ్బందికి దూరంగా వెళ్లి ఇద్దరే చాలాసేపు మాట్లాడుకున్నారు. చంద్రబాబు గ్రహచారం బాగాలేక ఈ వార్త, ఫోటో మీడియాలో ప్రముఖంగా వచ్చేసింది. దాంతో బాబుకు ముచ్చెమటలు పట్టాయట! దీన్ని పూర్వపక్షం చేయడం కోసం బీజేపీతో పొత్తు కహానీని సిద్ధంచేసి ఒక తటస్థ ఛానెల్‌పైకి గురిపెట్టి విసిరారు.

ఎన్నికల్లో గెలుపు కోసం తెలుగుదేశం పార్టీ ఇన్ని ఆపసోపాలు పడటానికీ, అగచాట్ల పాలవడానికీ కారణం క్షేత్రస్థాయి వాస్తవికత. నాలుగేళ్లలోనే ప్రజాజీవనంలో వైఎస్ జగన్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొని రాగలిగింది. ఒకప్పుడు వ్యవసాయంలో చిన్న కమతాలు లాభదాయకం కాదనే వాదన ఉండేది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చిన్న కమతాల రైతులు లాభాలు పండిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని దేవీందర్‌శర్మ జాతీయ పత్రిక 'ట్రిబ్యూన్'లో ఒక ప్రత్యేక వ్యాసాన్ని రాశారు. రైతు భరోసా కేంద్రాలపై జాతీయ స్థాయిలో ప్రశంసలు కురుస్తున్నాయి. పరిపాలనలో సంపూర్ణ వికేంద్రీకరణ, పారదర్శకత సాధించడంలో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నది. బలహీనవర్గాలకూ, మహిళలకూ అధికార హోదాలను కట్టబెట్టడంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్నది.

దేశంలో అత్యంత ఖరీదైన ప్రైవేట్ స్కూళ్లలో అందజేస్తున్న విద్యను ఏపీ ప్రభుత్వం ఉచితంగా పేద బిడ్డలకు అందజేయగలుగుతున్నది. ప్రజారోగ్య వ్యవస్థ ప్రతి ఇంటినీ పరామర్శిస్తున్నది. రైతులకు వారి భూములపై సంపూర్ణ యాజమాన్య హక్కుకు గ్యారంటీ కల్పిస్తూ దేశంలోనే తొలి అడుగును ఆంధ్రప్రదేశ్ వేసింది. మద్య నియంత్రణను అమలులోకి తెచ్చి బెల్టు షాపుల తాట తీసింది. నడివయసు దాటిన మహిళలకు చేయూతనిచ్చి వారి ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసింది. లక్ష ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగు నీరిచ్చి మరో నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరపరిచింది.

వైఎస్ జగన్ పరిపాలనలో బలహీనవర్గాల ప్రజలు, మహిళలు వెనుకబాటుతనాన్ని ఛేదించుకొని ముందడుగు వేస్తున్నారు. ఇది గిట్టని పెత్తందారీ వర్గాలు ఏకం కావడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగానే చంద్రబాబు చేస్తున్న రాజకీయ అవకాశవాద ప్రయోగాలను చూడాలి. ఇక పేదల ప్రభుత్వం మీద యెల్లో మీడియా విష వాయువులను ప్రయోగిస్తున్నది. కష్టజీవులందరూ పేదల ప్రభుత్వం వెనుక మరింత బలంగా సంఘటితం కావడమే ఈ విష ప్రచారాలకు విరుగుడు.

ప్రతి ఉదయం ఒక కొత్త రోజును ఆవిష్కరిస్తుంది. రేపటి ఉదయం మరో కొత్త సంవత్సరాన్ని ఆవిష్కరించబోతున్నది. సామాజిక – ఆర్థిక న్యాయ సాధనలో నాలుగేళ్లుగా పడుతున్న అడుగులకు కొత్త సంవత్సరం మరింత ఉత్తేజాన్నివ్వాలని కోరుకుందాం. పెత్తందారీ శక్తుల అవకాశవాద రాజకీయాలను చిత్తుచేస్తూ పేదల ప్రభుత్వానికి మరో అఖండ విజయం ఈ కొత్త సంవత్సరం ప్రసాదించాలని కాలచక్రాన్ని ముందుకు నడిపే ఉదయార్కుడైన సూర్యభగవానుని ప్రార్థిద్దాం. సప్తాశ్వ రథమారూఢం... ప్రచండం కశ్యపాత్మజం... శ్వేతపద్మధరం దేవం... తం సూర్యం ప్రణమామ్యహమ్!

vardhelli1959@gmail.com

వెలుగులు చిమ్మిన నందులు

'కళలు ఉన్నంతకాలం
నా గుండెను వేదిక చేస్తా
కళాకారుణ్ణి బతికిస్తా...'

ఇది ఏపీ సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కళాకారులకు ఇచ్చిన భరోసా. డిసెంబర్ 23 నుంచి 29 వరకు గుంటూరు నగరంలో రాష్ట్ర ప్రభుత్వ 2022 వ సంవత్సర 'నంది' నాటకోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండీ వందల సంఖ్యలో కళాకారులు ఏడురోజులూ ఉత్సాహంగా వీటిలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ 'చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ' ఆధ్వర్యంలో స్వర్గీయ బలిజేపల్లి లక్ష్మీకాంతం కళాప్రాంగణం (శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరం – ఎ.సి.) ఇందుకు వేదికైంది. ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణ మురళి పర్యవేక్షణలో విజయ కుమార్ రెడ్డి, శేషశాయి ఇత్యాది ఉన్నతాధికారులు, సిబ్బంది చేసిన ఏర్పాట్ల పట్ల కళాకారులు సంతుష్టి వ్యక్తం చేశారు. కళాకారులకు, అతిథులకు, ప్రదర్శనలకు చేసిన ఏర్పాట్లు తదితర అంశాల్లో ఈ ఉత్సవాలకూ గతంలో జరిగిన ఉత్సవాలకూ హస్తిమశకాంతరం ఉందనీ, ఇంత ఘనంగా, ఎంతో పారదర్శకంగా... మరీ ముఖ్యంగా టైమ్ ప్రకారం – గతంలో ఎన్నడూ జరగలేదని పలువురు కళాకారులు అన్నారు. ఆర్టిస్టులకు, అతిథులకు స్టార్ హోటళ్లలో బస ఏర్పాటుచేశారు. అల్పాహార, భోజన సదుపాయం పట్ల కూడా అందరూ ఆనందం వ్యక్తం చేయడం విశేషం.

రెండు మూడు తరగతులు చదువుతున్న బుడతల నుండి... జీవితాన్ని కాచి వడపోసిన... డెబ్బైలు దాటిన సీనియర్ మోస్ట్ కళాకారుల వరకూ పాల్గొనడం ఈ ఉత్సవాల ప్రత్యేకత. కరోనా మహమ్మారి కారణంగా వాయిదా పడిన '2022 నంది నాటక ఉత్సవా'లను ఇప్పుడు నిర్వహించారు.

వివిధ విభాగాలకు సంబంధించి 115 ఎంట్రీలు రాగా ప్రాథమిక పరిశీలన అనంతరం– పద్య నాటకాలు 10 (ప్రదర్శన పారితోషికం రూ. 50 వేలు), సాంఘిక నాటకాలు 6 (రూ. 40 వేలు); సాంఘిక నాటికలు 12 (రూ. 25 వేలు); బాలల విభాగంలో 5 (రూ. 25 వేలు); కాలేజీ, యూనివర్శిటీ విద్యార్థుల విభాగంలో 5 (రూ. 25 వేలు) మొత్తం 38 నాటక, నాటికలను ప్రదర్శించారు. మొత్తం 72 బహుమతుల కోసం దాదాపు పన్నెండొందల మంది కళాకారులు హోరాహోరీ తలపడ్డారు.

పద్య నాటక విభాగంలో మాధవవర్మ – విజయవాడ (ప్రథమ రూ. 80 వేలు, బంగారు నంది), శ్రీకాంత కృష్ణమాచార్య – విశాఖ (ద్వితీయ రూ. 60



వేలు, రజిత నంది); వసంతరాజీయం – హైదరాబాద్ (తృతీయ రూ. 40 వేలు, కాంస్య నంది) విజేతలుగా నిలిచాయి.

అలాగే.. సాంఘిక నాటకాల విభాగంలో ఇంద్రప్రస్థం – గుంటూరు (రూ 70 వేల నగదు, బంగారు నంది), ఇంపోస్టర్స్ – హైదరాబాద్ (రూ. 50 వేల నగదు, రజత నంది); కలనేత – హైదరాబాద్ (రూ. 30 వేల నగదు, కాంస్య నంది); సాంఘిక నాటికల విభాగంలో అస్తికలు – పెదకాకాని (రూ. 40 వేల నగదు, బంగారు నంది), కమనీయం – గుంటూరు (రూ. 30 వేల నగదు, రజత నంది), చీకటిపువ్వు – కరీంనగర్ (రూ. 20 వేల నగదు, కాంస్య నంది); బాలల విభాగంలో ప్రపంచతంత్రం – విజయవాడ (రూ. 40 వేల నగదు, బంగారు నంది), బాధ్యత – రాప్తాడు (రూ. 30 వేల నగదు, రజత నంది), మూడు ప్రశ్నలు – విజయవాడ (రూ. 20 వేల నగదు, రజత నంది); యువజన విభాగంలో ఇంకానా..? – విజయవాడ (రూ. 40 వేల నగదు, బంగారు నంది), కపిరాజు – గుంటూరు (రూ. 30 వేల నగదు, రజత నంది), ఉద్ధంసింగ్ – తిరుపతి (రూ. 20 వేల నగదు, కాంస్య నంది) బహుమతులను గెలుచుకున్నాయి.

నాటకరంగంపై రచనల్లో 'రాయలసీమ నాటక రంగ వికాసం' (రచయిత డా. మూల మల్లికార్జునరెడ్డి) ఉత్తమ రచనగా ఎంపికైంది. 'ఎన్టీఆర్ స్మారక రంగస్థల పురస్కారా'న్ని డా. మీగడ రామలింగస్వామి – విశాఖకు (రూ. 1.5 లక్షల నగదు, ప్రత్యేక జ్ఞాపిక), 'వైఎస్సార్ స్మారక రంగస్థల అవార్డ్'ను యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్–కాకినాడ (రూ. 5 లక్షల నగదు, ప్రత్యేక జ్ఞాపిక)ను అందించారు. దర్శకత్వం, రచన సహా పలు అంశాల్లో వ్యక్తిగత అవార్డులు, నగదు బహుమతులు అందజేశారు.

వ్యక్తిగత బహుమతుల నగదు మొత్తాన్ని ఐదురెట్లు పెంచుతున్నట్లు చైర్మన్ పోసాని ప్రకటించడంతో కళాకారుల ఆనందానికి అవధుల్లేవు. మైక్, లైటింగ్ సిస్టం అద్భుతంగా పనిచేయడం ఉత్సవాల విజయానికి దోహదపడింది.

పక్కా ప్రణాళికతో... ఎప్పటికప్పుడు ప్రాక్టికల్ సమీక్షలతో మొత్తం కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేశారంటూ పోసాని టీమును ఆర్టిస్టులు, అతిథులు మనఃపూర్వకంగా అభినందించడం ఈసారి 'నంది' పండగ హైలైట్.

– జి.వి. రంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్

ఇది లీపు సంవత్సరం!

క్రీ.పూ. 45వ సంవత్సరం నుండి జనవరి 1వ తేదీని నూతన సంవత్సర మొదటి దినంగా ఆచరించాలని జూలియస్ సీజర్ ఆదేశించాడు. పూర్వం నుండి సూర్యమాన (సోలార్), చాంద్రమాన (లూనార్) క్యాలెండర్లు ప్రాచుర్యంలో ఉన్నాయి. జూలియన్ క్యాలండర్ సూర్యమాన పద్ధతిలో రూపొందించడం జరిగింది. జూలియస్ సీజర్ పేరును బట్టి జూలియన్ క్యాలండర్ అన్నారు. 1582లో గ్రెగరీ ఆదేశాల మేరకు జూలియన్ క్యాలెండర్‌ను అలోసియస్ లివియస్ సవరించి అందరికి ఆమోదయోగ్యంగా ఉండే క్యాలెండర్‌ను రూపొందించాడు. ఈ క్యాలండర్‌లో 365 రోజులు, 12 నెలలు, 52 వారాలు, లీపు సంవత్సరంలో ఒక అదనపు రోజు ఉండేటట్లు రూపొందించారు. దీనిని గ్రెగరీ ప్రవేశపెట్టడం వల్ల దీనికి 'గ్రెగోరియన్ క్యాలండర్' అని అంటారు. దీని ప్రకారం ఇప్పుడు ప్రపంచమంతా జనవరి 1వ తేదీని మొదటి నెల మొదటి రోజుగా ఆచరిస్తున్నారు.

సాధారణంగా సంవత్సరానికి 365 రోజులుంటాయి. లీపు సంవత్సరంలో 366 రోజులు ఉంటాయి. ఫిబ్రవరి మాసంలో 28కి బదులు 29 రోజులు వస్తాయి. భూమి సూర్యుని చుట్టూ పరిభ్రమించడానికి 365 రోజుల 6 గంటల సమయం పడుతుంది. అదనంగా ఉండే ఈ ఆరు గంటలను నాలుగు సంవత్సరాలకు గణించగా వచ్చిన 24 గంటలను ఒక రోజుగా పరిగణిస్తున్నారు. ఆ రోజును ఫిబ్రవరికి కలిపి దానిని లీపు సంవత్సరం అంటున్నారు. ఆ విధంగా 2024వ సంవత్సరం లీపు సంవత్సరం అయ్యింది. హిందూ క్యాలండర్ సోలార్, లూనార్ (సూర్య మాన, చాంద్రమాన) పద్ధతుల్లో రూపొందించడం జరిగింది.

సంవత్సరంలోని పన్నెండు నెలలకు ఆ పేర్లు ఎలా వచ్చాయో తెలుసుకొందాం. రోమన్ల దేవుడు జానస్ నుండి జనవరి, వారి పండుగ ఫెబ్రువా నుండి ఫిబ్రవరి, రోమన్లు గ్రీకులు పూజించే మార్స్ నుండి మార్చి, అందానికి దేవతయైన అఫ్రొడైట్ నుండి ఏప్రిల్, ఇటలీ దేవత మైయా నుండి మే, గ్రీకుల దేవత జూన్ నుండి జూన్, జూలియస్ సీజర్ పేరున జూలై, అగస్టీన్ పేరుతో ఆగస్టు వచ్చిందని చరిత్ర కారులు వివరించారు. జూలియస్ సీజర్, అగస్టీన్‌లకు సమాన ప్రాధాన్యం ఇవ్వడానికి జూలై, ఆగస్టు నెలలకు 31 రోజులుగా నిర్ణయించారు.

ప్రాచీన కాలంలో రోమీయులు మార్చి 1వ తేదీని సంవత్సరం మొదటి నెల మొదటి రోజుగా భావించేవారు. లాటిన్ భాషలో సెప్టెంబర్ అంటే ఏడు, అక్టోబర్ అంటే ఎనిమిది, నవంబర్ అనగా తొమ్మిది, డిసెంబర్ అనగా పది అని అర్థాలున్నాయి. కానీ, పై నాలుగు నెలలను ఆగస్టు తర్వాత తొమ్మిది, పది, పదకొండు, పన్నెండు నెలలకు ఈ పేర్లు పెట్టడం జరిగింది. ఈ విధంగా పన్నెండు నెలలకు పేర్లు పెట్టడం జరిగింది. ప్రతి రోజూ మొదటి సూర్య కిరణాలు మధ్య పసిఫిక్ మహా సముద్రంలోని 'కెరోలినా' అనే దీవిపై ప్రసరిస్తాయి. కానీ అక్కడ మనుష్యులు ఎవరూ ఉండరు అనేది కొసమెరుపు.

సాక్షి పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– పులుకూరి లాబాను ప్రభుదాసు, కావలి

కాపులను చంద్రబాబు దగ్గర తాకట్టు పెట్టడానికి పవన్ ఎవరు?

- ఏనాడైనా పవన్ కళ్యాణ్ కాపులకు మేలు చేశాడా?
- కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



సాక్షి, అమరావతి: కాపు కులాన్ని చంద్రబాబు దగ్గర తాకట్టు పెట్టడానికి పవన్‌కళ్యాణ్ ఎవరని రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ప్రశ్నించారు. కాపు కులాన్ని ఏనాడైనా పవన్ అభిప్రాయం అడిగారా? అంటూ నిలదీశారు. కాపులను కట్టగట్టి అమ్మేయాలని పవన్ చూస్తున్నారని ధ్వజమెత్తారు. కాపులను అమ్మేసే పవన్ కళ్యాణ్ కావాలా? కాపులను గౌరవించి కాపు కాస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కావాలా? అనే విషయాన్ని కాపులంతా విజ్ఞతతో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. కాపులను అణచి వేసేందుకు బాబు కుట్ర చేస్తుంటే అందులో పవన్ భాగస్వామ్యుడని ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాపులకు పవన్ ఏం న్యాయం చేశారని ప్రశ్నించారు. ప్రశ్నించేందుకే పార్టీ పెట్టినట్లు చెబుతున్న పవన్.. నాడు వంగవీటి రంగాను హత్య చేసిన టీడీపీకి ఊడిగం చేయడం సిగ్గుచేటన్నారు. ముద్రగడ పద్మనాభం ఆత్మగౌరవాన్ని రోడ్డుకీడ్చినా కనీసం ప్రశ్నించలేదని దుయ్యబట్టారు. ఖమ్మంలో మంత్రి అంబటి రాంబాబుపై ఒక సామాజికవర్గం దాడి చేస్తే.. పవన్ కనీసం ఖండించలేదని విమర్శించారు. గతంలో వైఎస్సార్ మాత్రమే కాపులకు పెద్దపీట వేయగా, కాపులను చంద్రబాబు ఎక్కడికక్కడ అణిచివేసి, జైల్లో పెట్టించారని గుర్తు చేశారు. ఇటీవలే నారా లోకేశ్ ఒక మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్ సీఎం చంద్రబాబు మాత్రమే అన్నారని, కానీ పవన్ కనీసం దాన్ని కూడా ప్రశ్నించలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే కాపులకు పదవులు దక్కడంతో పాటు, ఆర్థిక పరిపుష్టత కలిగిందని అడపా శేషు వివరించారు.

రామోజీకి 'పచ్చ' పైత్యం ముదిరిపోయింది. తన బాబు.. చంద్రబాబును ప్రతిపక్ష నేతగా చూడలేక దిగులు పెరిగిపోయింది. ఇప్పటికిప్పుడే ఆయన్ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టాలనే ఆత్రం మిన్నంటింది. ఏదో విధంగా జనాన్ని ఏమార్చాలనే కుట్ర, కుతంత్రం ప్రతి కథనంలోనూ కనిపిస్తోంది. జనానికి సీఎం వైఎస్ జగన్ దగ్గరవ్వడం జీర్ణించుకోలేక నిత్యం అబద్ధాలు అచ్చేయడం పరిపాటిగా మారింది. గురువారం 'ఈనాడు' పత్రిక బ్యానర్ కథనంలో ఇచ్చిన ఫొటోను కాస్త పరిశీలిస్తే రామోజీ డొల్లతనం ఇట్టే తెలిసిపోతోంది. ఆ ఫొటోలో పదుల సంఖ్యలో ఉన్న విద్యార్థులందరూ చక్కగా దుప్పట్లు కప్పుకోవడం కనిపిస్తోంది. కొందరైతే అదనంగా తల కింద మరో దుప్పటి పెట్టుకోవడం కూడా కనిపించింది. కేవలం ముగ్గురు విద్యార్థులు దుప్పటి కప్పుకోలేదు. ఆ ముగ్గురికి కూడా దుప్పట్లు ఉన్నాయి. వారు కప్పుకోక పోవడం ప్రభుత్వం తప్పా రామోజీ? ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో ప్రగతి మీకు మాత్రమే ఎందుకు కనిపించడం లేదు? చంద్రబాబు ఇచ్చిన దుప్పట్లో దూరుకున్న మీకెలా కనిపిస్తుందిలే..!

సిగ్గు.. సిగ్గు.. నవ్విపోతారు..!

కర్నూలులోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో రామోజీ 'షో'

మాకు 6వ తేదీనే దుప్పట్లు ఇచ్చారు




ఈ నెల 6వ తేదీనే మాకు కొత్త దుప్పట్లు అందించారు. పాతవి కొందరు పడేశారు. మరికొందరు వాటిని అలాగే ఉంచుకున్నారు. రాత్రి పడుకునే సమయంలో మాకు ఇచ్చిన దుప్పట్లను తల కింద పెట్టుకొని పడుకున్నాం. చలి పెట్టినప్పుడు కప్పుకుందాం అనుకున్నాం. మా ఫొటోలు ఎవరు తీశారో.. ఎప్పుడు తీశారో మాకు తెలియదు. చలి వేస్తే.. దుప్పట్లు పెట్టుకుని కూడా కప్పుకోకుండా ఎందుకుంటాం?
– మనోజ్‌నాయక్, అభినాయక్, హర్షవర్ధన్ నాయక్, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల, డాక్టర్స్ కాలనీ, కర్నూలు

అందరికీ దుప్పట్లు పంపిణీ

ప్రస్తుతం డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థులకు అవసరమైన దుప్పట్లు ఈనెల 5న మాకు వచ్చాయి. ఆ మరుసటి రోజు.. అంటే 6వ తేదీన విద్యార్థులకు అందించాం. ఇంకా పది దుప్పట్లు మిగిలాయి. ఇది అద్దె భవనం. 'నాడు–నేడు' ఫేజ్–2 కింద ఈ పాఠశాలకు సొంత భవన నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కూడా చూశాం.
– ఎస్.శ్రీనివాసకుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి

- దుప్పట్లు లేక పిల్లలు వణికిపోతున్నారని కట్టు కథ
- ఈనాడు ఫొటోలోనే దుప్పట్లు కప్పుకున్న 30 మంది పిల్లలు
- ముగ్గురు పిల్లలను చూపుతూ తప్పుడు రాతలు
- ఈ నెల 6నే అక్కడి విద్యార్థులు అందరికీ దుప్పట్లు పంపిణీ
- వాస్తవానికి ముసుగేసి ప్రభుత్వంపై నిందలు, అబద్ధాలు





తమకు అందిన దుప్పట్లను చూపిస్తున్న గిరిజన విద్యార్థులు

కర్నూలు (అర్బన్): ప్రజలు ఏమైనా అనుకుంటారన్న ఇంగిత జ్ఞానం ఇసుమంతైనా లేకుండా నిత్యం తప్పుడు కథనాలతో 'ఈనాడు' అబద్ధాలు వండి వారుస్తోంది. కట్టు కథలు అల్లి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో పచ్చ పత్రిక పరువు పోగొట్టుకుంటోంది. ఈ నెల 30న ఈనాడు మొదటి పేజీలో 'మనసు లేని మామ' శీర్షికతో ప్రచురించిన కథనంలో కర్నూలు డాక్టర్స్ కాలనీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయలేదని, దీంతో విద్యార్థులు గజగజ వణికిపోతున్నారని రాశారు. వాస్తవానికి ఈ పాఠశాలలో అలాంటి పరిస్థితి లేదు. డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో మొత్తం 90 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ నెల 5న ప్రభుత్వం ఈ పాఠశాలకు వంద దుప్పట్లు సరఫరా చేసింది. వీటిని ఈ నెల 6నే విద్యార్థులకు అందించి, వారికి దుప్పట్లు అందినట్లు సంతకాలను కూడా (అక్విటెన్స్) రిజిస్టర్‌లో నమోదు చేశారు. కనీసం ఈ విషయాలేవీ తెలుసుకోకుండానే 'ఈనాడు' దుర్మార్గంగా ప్రభుత్వంపై అభాండాలు వేస్తూ ప్రజల మనసుల్లో విషం నింపే యత్నం చేసింది. ఈనాడు తీరు పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి వాస్తవం కనిపిస్తుంటే ఇంత పచ్చిగా అబద్ధాలు ఎలా రాస్తారని ఆశ్చర్యపోయారు. అర్ధరాత్రి పూట హాస్టల్ ఫొటోలు తీస్తుండటం.. ఇలా తప్పుడు రాతలు రాయడం ఏం జర్నలిజం అని హాస్టల్ పరిసర ప్రాంతాల ప్రజలు విస్తుపోతున్నారు.

నాడు–నేడు కనిపించలేదా రామోజీ?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, జూనియర్ కాలేజీల రూపురేఖలు మార్చేందుకు నడుం బిగించడం తెలిసిందే. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ఆయా విద్యా సంస్థల్లో సకల వసతులు కల్పిస్తోంది. మొదటి దశలో 15,715 పాఠశాలల్లో పనులు చేపట్టి, పూర్తి చేసింది. రెండవ దశలో 22,217 పాఠశాలల్లో పనులు ప్రారంభించింది. చాలా వాటిలో పనులు పూర్తయ్యాయి. మరి కొన్నింటిలో చివరి దశలో కొనసాగుతున్నాయి. మిగతా స్కూళ్లను మూడో దశలో అభివృద్ధి చేస్తోంది. ఈ విషయం రాష్ట్రంలో ఏ ఊరికి వెళ్లి చూసినా కళ్లెదుట స్పష్టంగా కనిపిస్తుంది.. ఒక్క రామోజీకి తప్ప. నాడు–నేడు కింద పనులు జరిగిన పాఠశాలలను వ్యూహాత్మకంగా ఎందుకని ప్రభుత్వంపై నిందలు వేసేందుకే ఈనాడు ప్రయత్నిస్తోంది. ఇప్పుడు చలి కాలం వచ్చిందని సెప్టెంబర్‌లో దుప్పట్లు లేవంటూ అవాస్తవాలు వల్లె వేసింది.

జయహో బీసీ పేరుతో టీడీపీ కొత్త డ్రామా

- ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్



భవానీపురం(విజయవాడ పశ్చిమ): బీసీలను మరో సారి మోసం చేసేందుకు జయహో బీసీ పేరుతో టీడీపీ కొత్త డ్రామాకు తెరతీసిందని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ విమర్శించారు. టీడీపీ జరపబోయేది జయహో బీసీ సభ కాదు.. బీసీ నయవంచన సభ అని మండిపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో బీసీ సంక్షేమ భవన్‌లోని ఆయన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు బీసీలకు రక్షణ చట్టం, ప్రత్యేక మేనిఫెస్టో అంటూ టీడీపీ చెబుతున్న మాయమాటలను నమ్మేస్థితిలో బీసీలు లేరన్నారు. బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నారని విమర్శించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కుప్పంలో లక్షకుపైగా ఉన్న బీసీలు, చేతి వృత్తులవారు పనుల కోసం నిత్యం బెంగళూరు వెళుతుంటే కనీసం వారికి ఉపాధి చూపలేని వ్యక్తి ఇప్పుడు రాష్ట్రంలోని బీసీలను ఉద్ధరిస్తానంటే ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. గతంలో మంత్రిగా పని చేసిన లోకేశ్ మంగళగిరిలో అత్యధికంగా ఉండే బీసీలకు ఏం చేశారని నిలదీశారు. బీసీలకు సామాజిక న్యాయం చేస్తున్న సీఎం జగన్‌ను బీసీలు ఎప్పుడో గుండెల్లో పెట్టుకున్నారని చెప్పారు. బీసీల గురించి ఏనాడూ మాట్లాడని పవన్‌తో టీడీపీ పొత్తుపై బీసీలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు.

రైతులకు మోదీ ప్రభుత్వం అండ

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



గన్నవరం: రైతులకు ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. కృష్ణాజిల్లా, గన్నవరంలో శనివారం జరిగిన కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి దృష్ట్యా కేంద్రం అనేక రాయితీలు, నగదు ప్రోత్సాహం అందజేస్తోందన్నారు. తుపానులతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాజకుమార్ చాహర్ మాట్లాడుతూ బీజేపీ కిసాన్ మోర్చా రైతులకు ఎల్లవేళలా అండగా నిలుస్తోందని తెలిపారు. అనంతరం చిగురుపాటి కుమారస్వామి నేతృత్వంలో రాష్ట్ర కమిటీ పలు తీర్మానాలు చేసింది.

డిమాండ్ల పరిష్కారంపై చర్యలు

- మినిమం టైం స్కేలు అమలు అంశం సీఎం దృష్టికి తీసుకెళ్తాం
- పారిశుద్ధ్య కార్మికుల సమ్మె ప్రభావం ప్రజలపై పడనీయం
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్




సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికుల కొన్ని డిమాండ్ల పరిష్కారంపై ఇప్పటికే ప్రభుత్వం ప్రారంభించామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమ్మెతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. పారిశుద్ధ్య కార్మికులు సమ్మె విరమించి విధులకు హాజరు కావాలని కోరారు. చెత్త తరలింపు, మంచినీటి సరఫరా, కరెంట్ విషయంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. శనివారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. 3,182 మంది పారిశుద్ధ్య కార్మికులు, 100కు పైగా పారిశుద్ధ్యేతర కార్మికులు, టెక్నికల్ వింగ్ వారిని, అదనపు సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. మొత్తంగా 3500 మందిని తీసుకొన్నామని, అలాగే వాహనాలను కూడా తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేశామన్నారు. 123 మున్సిపాలిటీల్లో 41మున్సిపాలిటీల్లో పైబడి సమ్మె ప్రభావం లేదన్నారు. కొన్ని మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికులు మాత్రమే సమ్మెలో ఉన్నారని తెలిపారు. కార్మికుల డిమాండ్లపై రెండుసార్లు చర్చించామని, పీహెచ్ వర్కర్లకు రూ.12వేలు ఉన్న జీతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 21 వేలకు పెంచారని గుర్తు చేశారు. చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఇదే ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని, కోణంలో భాగంగానే నాన్ పీహెచ్ కార్మికుల వాహనాలను అడ్డుకుంటున్నారన్నారు. ఉద్దేశపూర్వకంగా వాహనాలను అడ్డుకుంటున్నట్లు తెలిసిందని, వారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

సీఐటీయూ తప్ప, మిగతా కార్మికులు విధులకు..

ఒక్క సీఐటీయూ కార్మికులు తప్ప, మిగతా కార్మికులు విధుల్లోకి వస్తున్నారని సురేష్ తెలిపారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా సమ్మెను విరమించమని సీఐటీయూకు విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. ఇక మినిమం టైం స్కేలు అమలు అంశం సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల వారే పారిశుద్ధ్య కార్మికులుగా ఎక్కువమంది ఉంటారని భావించి అధికారంలోకి రాగానే వారి జీతాలు గణనీయంగా పెంచామన్నారు. ఇంత పెద్ద మొత్తంలో పారిశుద్ధ్య కార్మికులకు ఎక్కడా జీతాలు లేవన్నారు. ప్రభుత్వం ఆలోచనా విధానాలను కార్మిక సంఘాల నాయకులు కూడా అర్థం చేసుకోవాలని కోరారు. చెత్తను ఇంటి నుంచి నేరుగా డంపింగ్ యార్డ్ వరకు తీసుకెళ్లేందుకు ఒక కొత్త ప్రక్రియను తీసుకొస్తున్నామన్నారు. 'క్లీన్ ఆంధ్రప్రదేశ్' అనేది నినాదంగా కాకుండా విధానంగా మార్చి క్లాప్ వెహికల్స్ తీసుకొచ్చామని, డ్రైవర్లను, ట్రాక్టర్లను అప్పగించామని తెలిపారు. ఆ వాహనాల డ్రైవర్లు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉన్నారని, కాంట్రాక్టర్లు, డ్రైవర్ల మధ్య ఉన్న జీతభత్యాల విషయం ప్రభుత్వం దృష్టికి తెచ్చారని త్వరలో ఆ సమస్య కూడా పరిష్కరిస్తామని చెప్పారు.

పెరిగిన తలసరి ఆదాయం



- జాతీయ సగటును మించి పెరిగిన రాష్ట్ర తలసరి ఆదాయం
- మూడేళ్లుగా కొనసాగుతున్న పెరుగుదల
- ఆదాయపు పన్ను చెల్లించేవారి సంఖ్య పెరిగింది
- ఇటీవల లోక్‌సభలో వెల్లడించిన కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి

దేశ సగటును మించి..

జాతీయ సగటు తలసరి ఆదాయాన్ని మించి రాష్ట్ర తలసరి ఆదాయం నమోదైంది. 2022–23లో జాతీయ సగటు తలసరి ఆదాయంలో పెరుగుదల రూ. 23,476 ఉండగా.. అదే ఏపీలో రూ. 26,931కు పెరిగింది. దీంతో దేశ, రాష్ట్ర తలసరి ఆదాయం మధ్య వ్యత్యాసం 2022–23లో రూ. 47,518గా నమోదైంది. కోవిడ్ సమయంలో కూడా రాష్ట్ర తలసరి ఆదాయం పెరగడానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలే అని నిపుణులు చెబుతున్నారు. ప్రజలకు డబ్బులిస్తే ఆర్థిక రంగానికి మేలు జరుగుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా నగదు బదిలీ చేసింది. టీడీపీ హయాంలో 2018–19లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 1,54,031తో దేశంలో 17వ స్థానంలో ఉన్న రాష్ట్రం.. 2022–23 నాటికి రూ. 2,19,518తో 9వ స్థానంలో నిలిచింది.

సాక్షి, అమరావతి: గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం పెరుగుతోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం జాతీయ సగటు తలసరి ఆదాయాన్ని మించి పెరిగింది. 2022–23లో జాతీయ తలసరి ఆదాయం కన్నా రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 47,518 ఎక్కువగా నమోదైంది. 2022–23లో జాతీయ సగటు తలసరి ఆదాయం రూ. 1,72,000 ఉండగా రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 2,19,518కు చేరింది. అలాగే గత మూడేళ్లుగా ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరుగుతూనే ఉంది. రాష్ట్రంలో గత మూడు సంవత్సరాల్లో ఆదాయపు పన్ను చెల్లించే వారి సంఖ్య 1.65 లక్షలకు పెరిగినట్లు ఇటీవల లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడించారు. 2020–21లో ఆదాయపు పన్ను చెల్లించిన వారి సంఖ్య 19.79 లక్షల ఉండగా 2022–23లో ఆదాయపు పన్ను చెల్లించిన వారి సంఖ్య 21.65 లక్షలకు పెరిగినట్లు పంకజ్ చౌదరి తెలిపారు. పన్ను రిటర్నులతో పాటు ఐటీ రిటర్న్ దాఖలు చేస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. పైగా కూడా ఆదాయపు పన్ను చెల్లించిన వారు 2020–21లో 12.55 లక్షల మంది ఐటీ రిటర్న్ దాఖలు చేస్తే, వారి సంఖ్య 2022–23లో 13.04 లక్షలకు పెరిగినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

భారీగా పెరిగిన ఐటీ రిటర్న్‌లు

దేశంలో ఆదాయపు పన్ను చెల్లించే వారి సంఖ్య గత మూడు సంవత్సరాల్లో భారీగా పెరిగినట్లు కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. దేశం మొత్తం మీద 2020–21లో 6.72 కోట్ల మంది ఆదాయపు పన్ను చెల్లించగా 2022–23లో ఆ సంఖ్య 7.40 కోట్లకు పెరిగినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఆదాయపు పన్ను చెల్లించని వారు కూడా ఐటీ రిటర్న్ దాఖలు చేయడం దేశవ్యాప్తంగా పెరుగుతోందని ఆయన తెలిపారు. 2020–21లో ఆదాయపు పన్ను చెల్లించని వారు 4.84 కోట్ల మంది ఐటీ రిటర్న్ దాఖలు చేస్తే 2022–23లో ఆ సంఖ్య 6.16 కోట్లకు పెరిగినట్లు కేంద్ర మంత్రి వివరించారు.



గత మూడేళ్లలో రాష్ట్రంలో ఆదాయపు పన్ను చెల్లించిన వారి సంఖ్య ఇలా (రూపాయల్లో)

సంవత్సరం	పన్ను చెల్లించినవారు
2020-21	19,79,366
2021-22	19,84,319
2022-23	21,65,161

ముందస్తు బెయిల్ ఎలా పడితే అలా ఇవ్వడానికి వీల్లేదు

సెక్షన్ 438 కింద హైకోర్టుకున్న అధికారం అసాధారణమైంది

- ముందస్తు బెయిల్ మంజూరు చేయడమంటే దర్యాప్తులో జోక్యం చేసుకోవడమే
- అలా చేస్తే నిందితుడు దర్యాప్తు నుంచి తప్పించుకోవడంలో విజయం సాధించినట్లే
- 65 ఏళ్ల వృద్ధుడి ముందస్తు బెయిల్ విషయంలో హైకోర్టు కీలక తీర్పు
- ఈ తీర్పుతో దృష్టంతా చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పైనే



సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్ రోడ్డు భూ కుంభకోణంపై సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు వెలువరించాల్సిన వేళ హైకోర్టు అసలు ముందస్తు బెయిల్ ఎప్పుడు ఇవ్వాలన్న దానిపై కీలక తీర్పు వెలువరించింది. ముందస్తు బెయిల్ ఎలా పడితే అలా ఇవ్వడానికి వీల్లేదని స్పష్టం చేసింది. సీఆర్‌పీసీ సెక్షన్ 438 కింద ముందస్తు బెయిల్ విషయంలో హైకోర్టుకున్న అధికారం అసాధారణమైనదని తేల్చి చెప్పింది. ఆ అధికారాన్ని చాలా తక్కువ సందర్భాల్లో మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. 'ముందస్తు బెయిల్ మంజూరు అధికారాన్ని అసాధారణ కేసుల్లో మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది. ముందస్తు బెయిల్ మంజూరు చేయడం అన్నది కొంతవరకు దర్యాప్తు విషయంలో జోక్యం చేసుకోవడమే అవుతుంది. ముందస్తు బెయిల్ మంజూరు అధికారాన్ని ఉపయోగించే విషయంలో న్యాయస్థానాలు ఆచితూచి వ్యవహరించాల్సి ఉంటుంది. దర్యాప్తు దశలో ముందస్తు బెయిల్ మంజూరు చేయడం అంటే.. నిందితుడిని విచారించడం, అవసరమైన సాక్ష్యాలను సేకరించడం, దాచిపెట్టిన వాస్తవాలను వెలికితీయడం వంటి విషయాల్లో దర్యాప్తు సంస్థకు ఆటంకం కలిగించడమే. ఇంటరాగేషన్ దశలో నిందితుడు, అనుమానిత వ్యక్తికి ముందస్తు బెయిల్ ద్వారా రక్షణ లభిస్తే, అతను దర్యాప్తు అధికారుల విచారణ నుంచి తప్పించుకోవడంలో విజయవంతమైనట్టే. ముందస్తు బెయిల్‌ను రొటీన్ విధానంలో మంజూరు చేయడానికి వీల్లేదన్నది ఇప్పటికే రూఢీ అయిన న్యాయ సూత్రం. ముందస్తు బెయిల్ వంటి అసాధారణ ప్రత్యామ్నాయాన్ని ఉపయోగించాల్సిన అసాధారణ పరిస్థితులు ఉన్నాయని సంతృప్తి చెందినప్పుడు మాత్రమే న్యాయస్థానాలు ఆ దిశగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది' అని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది. 65 ఏళ్ల వృద్ధుడికి ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఇటీవల కీలక తీర్పు వెలువరించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇన్నర్ రింగ్ రోడ్డు పేరుతో భారీ భూ కుంభకోణానికి పాల్పడిన చంద్రబాబు ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్న హైకోర్టు ఎలా స్పందిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది. చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వచ్చే వారం నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

వరకట్న వేధింపుల కేసులో..

ఓ మహిళ ఫిర్యాదు మేరకు ఆమె భర్త చంద్రశేఖర్ తోపాటు అతని తండ్రి రామయ్య (65), మరికొందరిపై నెల్లూరు దిశ పోలీసులు వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. ఈ కేసులో చంద్రశేఖర్‌కు కింది కోర్టు ముందస్తు బెయిల్, అతని తండ్రి రామయ్యకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. కాగా.. బెయిల్‌పై విడుదలయ్యే సమయంలో చంద్రశేఖర్, అతని తండ్రి రామయ్య నకిలీ సాల్వెన్సీ సర్టిఫికెట్లు సమర్పించారంటూ చంద్రశేఖర్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ బెయిల్ రద్దు చేయాలంటూ కింది కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన కింది కోర్టు చంద్రశేఖర్ బెయిల్‌ను రద్దు చేసింది. దీంతో పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. అంతకు ముందు నకిలీ సాల్వెన్సీ సర్టిఫికెట్లు సమర్పించిన ఆరోపణలపై నెల్లూరు జిల్లా జడ్జి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నెల్లూరు చిన్నబజార్ పోలీసులు చంద్రశేఖర్, రామయ్యలపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంలో తనను ప్రతివాదిగా చేర్చుకుని వాదనలు వినాలంటూ చంద్రశేఖర్ సతీమణి ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. చంద్రశేఖర్, అతని తండ్రి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే.. కింది కోర్టు చంద్రశేఖర్‌కు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన హైకోర్టులో తన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోగా.. అతని తండ్రి రామయ్య వ్యాజ్యాన్ని మాత్రం కొనసాగించారు.

ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

చంద్రశేఖర్ భార్య దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు విచారణ జరిపారు. ప్రధాన నిందితుడుగా ఉన్న చంద్రశేఖర్‌కు కింది కోర్టు ఇప్పటికే పూర్తిస్థాయి బెయిల్ మంజూరు చేసిందని, అందువల్ల అతని తండ్రి రామయ్యకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరఫు న్యాయవాది కోర్టును కోరారు. అంతేకాక.. సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించే సమయంలో వరకట్న వేధింపు కేసులో రామయ్య జైలులో ఉన్నారని, అందువల్ల ఆయన నకిలీ సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించే అవకాశం ఎంతమాత్రం లేదన్నారు. నకిలీ సాల్వెన్సీ సర్టిఫికెట్ల సమర్పణకు అతన్ని బాధ్యుడిగా చేయడం తగదన్నారు. దర్యాప్తు కొనసాగుతోందని, అందువల్ల ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని అటు పోలీసులు, ఇటు చంద్రశేఖర్ భార్య కోర్టును కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు పిటిషనర్ రామయ్య వాదనను తోసిపుచ్చారు. నేరం తీవ్రతను పరిగణనలోకి తీసుకుని ప్రాథమిక ఆధారాలున్నాయని రామయ్య ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ.. ముందస్తు బెయిల్ ఎలాంటి సందర్భాల్లో ఇవ్వాలో న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టంగా పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్–3కు లైటప్



బీఎఫ్–3 లైటప్ కార్యక్రమంలో సీఎండీ భట్, డైరెక్టర్ బాగ్చీ, ఇతర ఉన్నతాధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్–3కు శనివారం స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ లైటప్ చేశారు. 23 నెలలుగా ముడి పదార్థాలు లేకపోవడంతో ఈ ఫర్నేస్ నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇటీవల యాజమాన్యం జిందాల్‌తో ఎంవోయూ కుదుర్చుకున్న నేపథ్యంలో బ్లాస్ట్‌ఫర్నేస్–3 పునఃప్రారంభానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈనెల 19న కోక్ వేయడం ద్వారా పనులు మొదలుపెట్టారు. సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఇన్‌చార్జ్ ఏ.కె.బాగ్చీ సమక్షంలో ఫర్నేస్‌లో లైటప్ పనులు శనివారం ప్రారంభించారు. అనంతరం అధికారులతో ఉత్పత్తి ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. బ్లాస్ట్‌ఫర్నేస్–1కి గోదావరి, బ్లాస్ట్‌ఫర్నేస్–2కు కృష్ణ, బ్లాస్ట్‌ఫర్నేస్–3కు 'అన్నపూర్ణ' పేరును ఆయన ప్రకటించారు.

పట్రాపల్లెలో అరుదైన ఆలయం గుర్తింపు



వీరనాగమ్మ దేవాలయం

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా, ఒంటిమిట్ట మండలంలోని చింతరాజుపల్లె పంచాయతీలోగల పట్రాపల్లెలో అరుదైన వీరనాగమ్మ దేవాలయాన్ని గుర్తించినట్లు రచయిత, చరిత్ర, శాసన పరిశోధకుడు బొమ్మిశెట్టి రమేష్ శనివారం తెలిపారు. వివరాలను మైసూరు ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి తెలపగా, ఈ ఆలయం 18వ శతాబ్దం నాటిదని స్పష్టం చేశారన్నారు. దేవాలయం వెనుక భాగంలో ద్వార పాలకుల శిల్పాలు, సింహం ప్రతిమ ఉన్నట్లు గుర్తించామన్నారు. దేవాలయంలో ఎడమవైపు వీరనాగమ్మ విగ్రహం, కుడివైపు వీర బ్రహ్మచారి విగ్రహం ఉన్నాయని చెప్పారు. వీర నాగమ్మ ఆలయాలు పెద్దగా కనిపించవని, అరుదైన పురాతన ఆలయమైన దీని చరిత్ర గురించి వివరాలను వెలికితీస్తున్నట్లు తెలిపారు.



శనివారం అయోధ్యలో నూతన విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ. ఫొటోలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌; కేంద్ర మంత్రి సింధియా తదితరులు



రోడ్ షోలో మోదీపై అభిమానుల పూల వర్షం



అమృత్ భారత్ రైల్లో ప్రయాణికులతో మోదీ మాటామంతి



అయోధ్య ధామ్ రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మోదీ

జనవరి 22న... ఇంటింటా రామజ్యోతి

దేశ ప్రజలకు మోదీ పిలుపు ● ప్రపంచమంతా ఎదురు చూసింది ఈ రోజు కోసమే
రామాలయ ప్రాణప్రతిష్ఠ అందరికీ దీపావళే ● గుడారంలో గడిపిన రామునికి 'పక్కా ఇల్లు'
అయోధ్య ర్యాలీలో ప్రధాని వ్యాఖ్యలు ● విమానాశ్రయం, రైల్వే జంక్షన్ ప్రారంభం
● రూ.15,700 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన

అయోధ్య: అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవం దేశ ప్రజలందరికీ దీపావళి వంటిదని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జనవరి 22న దేశమంతటా ఇంటింటా శ్రీరామజ్యోతి వెలిగించాలని పిలుపునిచ్చారు. నిత్యం రామనామ స్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటున్న అయోధ్యలో ఆయన శనివారం పర్యటించారు. పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో రోజంతా బిజీబిజీగా గడిపారు. అయోధ్యలో నూతనంగా నిర్మించిన మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించాక అక్కడ భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. జనవరి 22న భవ్య రామాలయ ప్రారంభాన్ని, శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ''ఆధ్యాత్మిక నగరి అయోధ్యలో రామాలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమమంటే అందరికీ దీపావళి పండుగే. దీనికి గుర్తుగా ఆ రాత్రి ఇంటింటా శ్రీరామ జ్యోతిని వెలిగించండి. అయోధ్యలో రామ్‌లల్లా (బాల రాముడు) ఇంతకాలం తాత్కాలిక టెంట్ కింద గడపాల్సి వచ్చింది. ఇప్పుడు దేశంలోని నాలుగు కోట్ల మంది పేదలతో పాటు రామ్‌లల్లాకు కూడా పక్కా ఇల్లు వచ్చేసింది'' అని అన్నారు. రామమందిర ప్రారంభోత్సవాన్ని చరిత్రాత్మక ఘట్టంగా మోదీ అభివర్ణించారు. ''ఈ రోజు కోసం యావత్ ప్రపంచం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసింది. కనుక అయోధ్య వాసుల్లో ఇంతటి ఉత్సాహం సహజం. భరత గడ్డపై అణువణువునూ ప్రాణంగా ప్రేమిస్తా. ప్రతి భారతీయుడూ పుట్టిన నేలను ఆరాధిస్తాడు. నేనూ మీలో ఒకడినే'' అన్నారు.

ఆ రోజు రాకండి


ఆహ్వానితులు మినహా మిగతా వారు 22న అయోధ్యకు రావద్దని మోదీ విజ్ఞప్తి చేశారు. ''రామాలయ ప్రాణప్రతిష్ఠ క్రతువును ప్రత్యక్షంగా తిలకించేందుకు జనవరి 22వ తేదీనే అయోధ్యకు పోటెత్తాలని అసంఖ్యాకులు భావిస్తున్నట్టు తెలిసింది. దయచేసి ఆ రోజున మాత్రం అయోధ్యకు రాకండి. చేతులు జోడించి వేడుకుంటున్నా. ఎందుకంటే అందరికీ అదే రోజున దర్శనభాగ్యం సాధ్యపడదు. ఆ రోజు చాలామంది విశిష్ట అతిథులు విచ్చేస్తున్నారు. కనుక యావత్ ప్రజానీకం జనవరి 23 నుంచి జీవితాంతం అయోధ్య రామున్ని దర్శించుకోవచ్చు'' అని సూచించారు.

వికాస్.. విరాసత్

అత్యంత స్వచ్ఛమైన నగరంగా అయోధ్యను తీర్చిదిద్దుదామంటూ ప్రతిజ్ఞ చేద్దామని మోదీ పిలుపునిచ్చారు. ''ఇది అయోధ్యవాసుల బాధ్యత. జనవరి 14 నుంచి 22వ తేదీ దాక దేశంలోని అన్ని ఆలయాలు, ఆధ్యాత్మిక స్థలాల్లో స్వచ్ఛత కార్యాక్రమాలు చేపడదాం. దేశం కోసం కొత్త తీర్మానాలు, మనం కోసం కొత్త బాధ్యతలను తలకెత్తుకుందాం. ఏ దేశమైనా ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే వారసత్వాన్ని పరిరక్షించుకోవాల్సిందే. వికాస్ (అభివృద్ధి)తో పాటు విరాసత్ (వారసత్వం) కూడా ముఖ్యమే. అవి రెండూ పట్టాలుగా 21వ శతాబ్దంలో దేశాభివృద్ధిని పరుగులు పెట్టిద్దాం'' అని పిలుపునిచ్చారు. ఆ రెండింటి ఉమ్మడి అభివృద్ధి బలమే భారత్‌ను ముందుకు నడుపుతుందన్నారు. సభలో ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మెగా రోడ్ షో

శనివారం ఉదయం 11 గంటలకు అయోధ్య ఎయిర్పోర్టుకు చేరుకున్నాక మోదీ అక్కడి నుంచి రోడ్ షోలో పాల్గొన్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి రైల్వే స్టేషన్ దాకా దాదాపు 15 కిలోమీటర్ల పొడవునా రోడ్‌షో సాగింది. దారి పొడవునా ప్రధానికి అయోధ్యవాసులు, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు ఘన స్వాగతం పలికారు. ఆయనపై పూలవర్షం కురిపించారు. రోడ్‌షో మధ్య మధ్యలో ఏర్పాటుచేసిన 40 కళావేదికల వద్ద పలు రాష్ట్రాల కళాకారులు నృత్య, కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రయాగ్‌రాజ్ నుంచి వచ్చిన కళాకారులు రాముని జీవితంతో ముడిపడి ఉన్న 'దేధియా' నృత్యంతో ఆకట్టుకున్నారు. అనంతరం మోదీ మార్గమధ్యంలో అతి పెద్ద వీణతో అలంకృతమైన లతా మంగేష్కర్ చౌక్ వద్ద కాసేపు గడిపారు.



అయోధ్యలో లతా మంగేష్కర్ చౌక్ వద్ద మోదీ

వాల్మీకి మహర్షి ఎయిర్‌పోర్ట్ ప్రారంభం

అయోధ్యలో ఆధునిక హంగులతో సిద్ధమైన విమానాశ్రయాన్ని మోదీ ప్రారంభించారు. రామాయణ కర్త పేరిట దీనికి మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేశారు. అయోధ్యకు 15 కిలోమీటర్ల దూరంలో అత్యాధునిక సౌకర్యాలతో రూ.1,450 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ విమానాశ్రయాన్ని శనివారం ఉదయం మోదీ లాంఛనంగా ప్రారంభించారు. వాల్మీకి విరచిత రామాయణం మనకు గొప్ప జ్ఞానపథమని ఈ సందర్భంగా అన్నారు. ''అది మనల్ని శ్రీరామ ప్రభువు చెంతకు చేరుస్తుంది. ఆధునిక భారత దేశంలో అయోధ్య ధామంలోని వాల్మీకి విమానాశ్రయం మనల్ని దివ్య (మహోన్నత), భవ్య (అద్భుత), నవ్య (ఆధునిక) రామ మందిరానికి చేరుస్తుంది. అప్పట్లో ఇదే రోజున అండమాన్ దీవికి బ్రిటిష్ చెర నుంచి సుభాష్ చంద్రబోస్ విముక్తి కల్పించారు. అక్కడ జాతీయ జెండా ఎగరేశారు. మనల్నిది ఆజాదీ కీ అమృత్ కాల్‌లోకి తీసుకెళ్తుంది'' అన్నారు.

విమానాశ్రయ విశేషాలు..

- అయోధ్య నగర చరిత్ర, విశిష్టత, ఆధ్యాత్మిక వాతావరణం ప్రతిబింబించేలా విమానాశ్రయ నిర్మాణం సాగింది. టెర్మినల్ భవనానికి శ్రీరామ మందిరాన్ని తలపించేలా తుదిరూపునిచ్చారు. ప్రధాన ద్వారంపై ఆలయ తోరణాల డిజైన్ వేశారు. రాముడి జీవితాన్ని కళ్లకు కట్టే కళాఖండాలు, చిత్రాలు, కుడ్యచిత్రాలకు విమానాశ్రయంలో చోటు కల్పించారు.
- బస్సు పార్కింగ్‌తోపాటు దివ్యాంగులకు అనుకూలమైన సౌకర్యాలు కల్పించారు.
- ఎల్ఈడీ లైటింగ్, వాననీటి నిర్వహణ, సౌర విద్యుత్ ప్లాంట్, మురుగు శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేశారు.
- చుట్టూతా పరుచుకున్న పచ్చదనం నిర్వహణకు వాడిన నీటిని రీ సైకిల్ చేసి ఉపయోగించనున్నారు.
- విమానాశ్రయ నిర్మాణం కేవలం 20 నెలల్లో పూర్తయిందని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సంజీవ్ కుమార్ చెప్పారు.
- ఈ ఎయిర్‌స్ట్రిప్ గతంలో కేవలం 178 ఎకరాల్లో ఉండేది. దీన్ని రూ.350 కోట్లతో అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దారు. ఇందుకు యూపీ ప్రభుత్వం 821 ఎకరాలు కేటాయించింది.
- ఏటా 10,000 మంది ప్రయాణికుల రాకపోకలను వీలుగా విమానాశ్రయాన్ని విశాలంగా నిర్మించారు. టెర్మినల్ భవనాన్ని 6,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో కట్టారు.
- 2.2 కిలోమీటర్ల పొడవైన రన్‌వే ఉండటంతో ఎయిర్‌బస్–321 రకం విమానాల ల్యాండింగ్, టేకాఫ్ చాలా సులువు. రెండు లింక్ 'టాక్సీవే'లు ఉండటంతో ఒకేసారి ఎనిమిది విమానాలను పార్క్ చేసుకోవచ్చు.
- భవిష్యత్తులో విమానాశ్రయ రెండో దశ విస్తరణ మొదలవనుంది. టెర్మినల్‌ను 50 వేల చదరపు మీటర్లకు విస్తరిస్తారు.
- ఏటా ఏకంగా 60 లక్షల మంది రాకపోకలకు వీలుగా విస్తరణ ప్రతిపాదనలు సిద్ధంచేశారు.
- రన్‌వేను 3.7 కిలోమీటర్లకు విస్తరించి అదనంగా 18 విమానాల పార్కింగ్‌కు చోటు కల్పించాలని భావిస్తున్నారు.

అయోధ్య ధామ్ జంక్షన్ రైల్వేస్టేషన్‌కు పచ్చజెండా

అయోధ్య పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ దాదాపు రూ.241 కోట్లతో పునరుద్ధరించిన అయోధ్య ధామ్ జంక్షన్ రైల్వే స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయోధ్య రైల్వేస్టేషన్ నుంచి రెండు అమృత్ భారత్ రైళ్లను, ఆరు వందే భారత్ రైలు సేవలను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడారు. ' మూడు కొత్త సేవలైన వందే భారత్, నమో భారత్, అమృత్ భారత్‌ల 'త్రిశక్తి'తో భారత రైల్వే నూతన అభివృద్ధి శకంలోకి దూసుకెళ్లగలదు'' అని మోదీ వ్యాఖ్యానించారు. మూడంతస్తుల నూతన అయోధ్య రైల్వేస్టేషన్‌లో సరికొత్త సౌకర్యాలను కల్పించారు. లిఫ్టులు, కదిలే మెట్లు, ఫుడ్ ప్లాజాలు, వాణిజ్య, వ్యాపార సముదాయలు, పూజా సామగ్రి దుకాణాలు, చైల్డ్ కేర్, వెయిటింగ్ హాళ్లతో స్టేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వారి సర్టిఫికెట్‌నూ ఈ రైల్వేస్టేషన్ సాధించింది. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే అమృత్ భారత్ రైలుకు తొలి రోజు విశేష స్పందన లభించింది. బుకింగ్ ప్రారంభించిన నిమిషాల వ్యవధిలోనే టికెట్లు మొత్తం అమ్ముడయ్యాయి.

పుతిన్‌ను ఎలాగైనా ఆపాల్సిందే: బైడెన్



వాషింగ్టన్: ఉక్రెయిన్‌ను సర్వనాశనం చేసేందుకే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కంకణం కట్టుకున్నారంటూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దుయ్యబట్టారు. ''ఆయన యుద్ధోన్మాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోవాల్సిందే. ఉక్రెయిన్‌పై రష్యా తాజాగా క్షిపణుల వర్షం కురిపించిన వైనం ఈ ఆవశ్యకతను మరోసారి గుర్తు చేసింది'' అన్నారు. తమ దేశంపైకి రష్యా ఏకంగా 110 క్షిపణులను ప్రయోగించిందని, ఈ దాడిలో 31 మంది అమాయకులు బలవగా వందలాది మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ గురువారం ప్రకటించడం తెలిసిందే. 2022లో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇదే అతి పెద్ద దాడి అని ఉక్రెయిన్ వర్గాలంటున్నాయి. ఈ నేపథ్యంలో పుతిన్‌ను అడ్డుకునేందుకు ఉక్రెయిన్‌కు మరింత సాయం అందిద్దామని అమెరికా చట్ట సభ కాంగ్రెస్‌కు బైడెన్ పిలుపునిచ్చారు.

నేరగాళ్ల అప్పగింతకు ఒప్పందమేదీ?: పాక్



ఇస్లామాబాద్: నేరగాళ్ల అప్పగింతకు భారత్‌తో తమకు ద్వైపాక్షిక ఒప్పందమేమీ లేదని పాకిస్తాన్ పేర్కొంది. ముంబై దాడుల సూత్రధారి, లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌ను అప్పగించాల్సిందిగా పాక్‌ను భారత్ కోరడం తెలిసిందే. ఇందుకవసరమైన అన్ని పత్రాలను కూడా పాక్‌కు ఇప్పటికే అందజేసినట్టు విదేశాంగ అధికార ప్రతినిధి అరిందం బాగ్చి వెల్లడించారు. సయీద్‌ను అప్పగించాలంటూ భారత్ నుంచి అభ్యర్థన అందిందని పాక్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ముంతాజ్ జహ్రా బలోచ్ ధ్రువీకరించారు. అయితే హఫీజ్ అప్పగింతకు వీలు కల్పించే ద్వైపాక్షిక ఒప్పందమేదీ ఇరు దేశాల మధ్య లేదన్నారు.

ఇమ్రాన్‌కు భారీ షాక్

నామినేషన్ పత్రాల తిరస్కరణ



లాహోర్: పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్‌కు ఆ దేశ ఎన్నికల సంఘం భారీ షాకిచ్చింది. ఫిబ్రవరి 8న జరగనున్న జాతీయ అసెంబ్లీ ఎన్నికల్లో పంజాబ్ ప్రావిన్స్‌లోని లాహోర్, మియాంవాలీ స్థానాల నుంచి ఆయన దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను తిరస్కరించింది. తోషాఖానా కేసులో ఆయన దోషిగా తేలడంతో పాటు సాంకేతిక కారణాలు కూడా తిరస్కరణకు దారి తీసినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీకి ఆయనకు దారులు మూసుకుపోతున్నట్టు కన్పిస్తోంది. ఇమ్రాన్ పలు కేసులను ఎదుర్కొంటున్నారు.

ఉజ్వల లబ్ధిదారు ఇంట్లో

టీ తాగిన మోదీ



అయోధ్య: 'ఉజ్వల పథకం' 10 కోట్లవ లబ్ధిదారు మీరా మంఝీతో మోదీ అన్న మాటలివి! అయోధ్య రైల్వేస్టేషన్ ప్రారంభించాక విమానాశ్రయానికి వెళ్తూ మార్గ మధ్యంలో లతా మంగేష్కర్ చౌక్ కూడలి సమీపంలో ఆయన హఠాత్తుగా ఆగారు. సమీప వీధిలోని మీరా ఇంటికెళ్లి వారందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. స్వయానా ప్రధాని తన ఇంటికి రావడంతో ఉబ్బి తబ్బిబ్బైన మీరా బహుశా ఆ కంగారులో ఆయనకు కలిపిచ్చిన టీలో కాస్తంత చక్కెర ఎక్కువేశారు. ఆ చాయ్ తాగుతూ తీపి ఎక్కువైందని మోదీ సరదాగా స్పందించారు. ఉజ్వల పథకం 10 కోట్లవ లబ్ధిదారు కావడంతో ఆమె కుటుంబాన్ని కలిసేందుకు మోదీ ప్రత్యేకంగా వారింటికి వెళ్లారు. ''ఉజ్వలతో ఉచితంగా గ్యాస్ కనెక్షన్ వచ్చింది. కేంద్ర గృహ నిర్మాణ పథకంతో ఉచితంగా ఇల్లూ వచ్చింది'' అంటూ మీరా ఆనందం వెలిబుచ్చారు. ఆమె కుటుంబ యోగక్షేమాలను మోదీ అడిగి తెల్సుకున్నారు. మీరా కుమారుడికి ఆటోగ్రాఫ్ ఇచ్చి వందేమాతరం అని రాసిచ్చారు. అక్కడి చిన్నారులతో సెల్ఫీ దిగారు. ''పాత ప్రభుత్వాలు ఐదు దశాబ్దాల్లో కేవలం 14 కోట్ల గ్యాస్ కనెక్షన్లిస్తే మేం పదేళ్లలో ఏకంగా 18 కోట్ల కనెక్షన్లు అందించాం. వాటిలో పది కోట్లు ఉచిత కనెక్షన్లే'' అని మోదీ అన్నారు.

> ''భాయ్ చక్కగా ఉందిగానీ కాస్తంత తియ్యగా ఉంది''

న్యూ ఇయర్ దశకం

2024లో ఆసక్తి రేపనున్న పది అంశాలు



మరో సంవత్సరం కనుమరుగవనుంది. మంచీ చెడుల మిశ్రమంగా ఎన్నెన్నో అనుభూతులు మిగిల్చి కాలగర్భంలో కలిసిపోనుంది. సరికొత్త ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రపంచమంతా సిద్ధమవుతోంది. 2024లో జరగనున్న ఆసక్తికర ఘటనలు, మిగల్చనున్న ఓ పది మైలురాళ్లను ఓసారి చూస్తే... – సాక్షి, నేషనల్ డెస్క్

1 నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ

ఈ దశాబ్దంలోనే భారత్ కచ్చితంగా ప్రపంచంలో నాలుగో ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందన్నది అందరూ చెబుతున్న మాటే. అది 2026లో, లేదంటే 2027లో జరగవచ్చని ఇప్పటి దాకా అంచనా వేస్తూ వచ్చారు. కానీ అన్నీ కుదిరితే 2024 చివరికల్లా జర్మనీని వెనక్కు నెట్టి మనం నాలుగో స్థానానికి చేరడం కష్టమేమీ కాదన్నది ఆర్థికవేత్తల అభిప్రాయం. 2024 తొలి అర్ధభాగం చివరికి జర్మనీ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 4.4 లక్షల కోట్ల డాలర్లకు చేరవచ్చని అంచనా. అప్పటికి భారత ఆర్థిక వ్యవస్థ 4 లక్షల కోట్ల డాలర్ల మార్కును సులువుగా దాటేయనుంది. మన వృద్ధి రేటు, జర్మనీ మాంద్యం ఇప్పట్లాగే కొనసాగితే సంవత్సరాంతానికల్లా మనది పైచేయి కావచ్చు.

2 దూసుకుపోనున్న యూపీ

ఉత్తరప్రదేశ్ కొన్నేళ్లుగా వృద్ధి బాటన పరుగులు పెడుతోంది. ఆ లెక్కన ఈ ఏడాది అది కర్ణాటకను పక్కకు నెట్టి దేశంలో నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశముంది. 2023–24కు కర్ణాటక జీఎస్‌డీపీ అంచనా రూ.25 లక్షల కోట్లు కాగా యూపీ రూ.24.4 లక్షల కోట్లుగా ఉంది. అయితే 20 శాతం వృద్ధి రేటుతో దూసుకుపోతున్న యూపీ సంవత్సరాంతానికల్లా కర్ణాటకను దాటేసేలా కన్పిస్తోంది.

3 బీజేపీ 'సంకీర్ణ ధర్మ' బాట

2024 అక్టోబర్లో మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు బీజేపీకి అగ్నిపరీక్షగా నిలవనున్నాయి. ఆ రాష్ట్రాల్లో ఏ ఒక్క పార్టీకీ సొంతంగా మెజారిటీ వచ్చే పరిస్థితి లేదు. కనుక ఆ రాష్ట్రాల్లో బీజేపీ విధిగా సంకీర్ణ ధర్మాన్ని పాటించాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. ప్రస్తుత పరిస్థితులే కొనసాగే పక్షంలో వాటిలో రెండు రాష్ట్రాలు ఇండియా కూటమి ఖాతాలో పడ్డా ఆశ్చర్యం లేదంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ మూడు రాష్ట్రాల్లో ప్రత్యర్థి పక్షాలకు గట్టి పోటీ ఇవ్వాలంటే మిత్రులతో పొత్తులపై ముందస్తుగానే స్పష్టతకు వచ్చి సమైక్యంగా బరిలో దిగడం బీజేపీకి తప్పనిసరి కానుంది.

4 'సుదీర్ఘ సీఎం'గా నవీన్

అత్యధిక కాలం పాటు పదవిలో ఉన్న ముఖ్యమంత్రిగా పవన్‌కుమార్ చామ్లింగ్ నెలకొల్పిన రికార్డును ఒడిశా సీఎం నవీన్ 2024లో అధిగమించేలా ఉన్నారు. ఎందుకంటే మే లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన వరుసగా ఆరోసారి గెలవడం లాంఛనమేనని భావిస్తున్నారు. చామ్లింగ్ 1994 డిసెంబర్ నుంచి 2019 మే దాకా 24 ఏళ్లకు పైగా సిక్కిం సీఎంగా చేశారు. నవీన్ 2000 మార్చి నుంచి ఒడిశా సీఎంగా కొనసాగుతున్నారు.

5 మెగా మార్కెట్ క్యాప్

భారత మార్కెట్ క్యాపిటలైజేషన్ 2024లో 5 లక్షల కోట్ల డాలర్లను దాటేయనుంది. 2023లో మన మార్కెట్ క్యాప్ ఏకంగా 26 శాతం వృద్ధి రేటుతో పరుగులు తీసి 4.2 లక్షల కోట్ల డాలర్లకు చేరింది! ఇది పాశ్చాత్య ఆర్థికవేత్తలనూ ఆశ్చర్యపరిచింది. కొత్త ఏడాదిలో హీనపక్షం 20 శాతం వృద్ధి రేటునే తీసుకున్నా తేలిగ్గా 5 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటడం లాంఛనమే. సెన్సెక్స్ కూడా ఈ ఏడాది ఆల్‌టైం రికార్డులు సృష్టిస్తూ దూసుకెళ్లడం తెలిసిందే. 2024లోనూ ఇదే ధోరణి కొనసాగడం ఖాయమేనని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

6 20 కోట్ల మంది పేదలు

ఆర్థిక వృద్ధికి సమాంతరంగా దేశంలో పేదలూ పెరుగుతున్నారు. ప్రపంచంలోకెల్లా అత్యధిక సంఖ్యలో పేదలున్న దేశం మనమేనన్నది తెలిసిందే. 2024లో ఈ సంఖ్య 20 కోట్లను మించనుంది. ఇది బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీల మొత్తం జనాభా కంటే ఎక్కువ! ప్రపంచ బ్యాంకు నిర్వచనం ప్రకారం భారత్‌లో 14 కోట్ల మంది పేదలున్నారు. నీతీఆయోగ్ లెక్కలను బట్టి ఆ సంఖ్య ఇప్పటికే 21 కోట్లు దాటింది.

7 వ్యవసాయోత్పత్తుల రికార్డు

భారత ఆహార, ఉద్యానోత్పత్తుల పరిమాణం 2024లో 70 కోట్ల టన్నులు దాటనుంది. అందుకు అనుగుణంగా ఆహారోత్పత్తుల ఎగుమతి కూడా ఇతోధికంగా పెరుగుతుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. 2021లో కేంద్రం రద్దు చేసిన వివాదాస్పద సాగు చట్టాల భవితవ్యం 2024లో తేలిపోవచ్చంటున్నారు.

8 8. కశ్మీర్‌పై చర్చలకు డిమాండ్లు

కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు పాకిస్థాన్‌తో చర్చలను పునఃప్రారంభించాలని స్థానికంగా డిమాండ్లు ఊపందుకునేలా ఉన్నాయి. ముఖ్యంగా నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, పీడీపీ నాయకురాలు మెహబూబా ముఫ్తీ ఈ మేరకు గళమెత్తే అవకాశాలు పుష్కలంగా కన్పిస్తున్నాయి. అలాగే సుప్రీంకోర్టు తాజా తీర్పు నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ తక్షణం రాష్ట్ర హోదా పునరుద్ధరించడంతో పాటు సెప్టెంబర్ కల్లా అసెంబ్లీకి ఎన్నికలూ జరపాల్సి ఉంది.

9 విదేశీ వాణిజ్యం పైపైకి...

భారత విదేశీ వాణిజ్యం 2024లో 2 లక్షల కోట్ల డాలర్లను తాకవచ్చు. 2023లో యుద్ధాలు తదితర అంతర్జాతీయ పరిణామాలు ప్రపంచ ఎగుమతులు, దిగుమతుల మార్కెట్‌ను విపరీతంగా ప్రభావితం చేశాయి. అంతటి ప్రతికూల పరిస్థితుల్లోనూ మన విదేశీ వాణిజ్యం కళకళలాడింది. మొత్తం జీడీపీలో 40 శాతంగా నిలిచింది.

10 బీజేపీ వర్సెస్ 'ఇండియా'

విపక్షాలకు, ముఖ్యంగా ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు జీవన్మరణ సమస్యగా చెప్పదగ్గ కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు 2024 వేదిక కానుంది. హ్యాట్రిక్ విజయం కోసం బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి ఉరకలేస్తోంది. పదేళ్లుగా కేంద్రంలో అధికారానికి దూరంగా ఉండటమే గాక అసెంబ్లీ ఎన్నికల్లో వరుస ఓటముల పాలవుతున్న కాంగ్రెస్ ఇంకా కాలూ చేయీ కూడదీసుకునే దశలోనే ఉంది.

పైలట్ నోట జై శ్రీరాం

ప్రయాణికుల హనుమాన్ చాలీసా పఠనం

న్యూఢిల్లీ: అయోధ్యలో శనివారం మొదలైన ఎయిర్‌పోర్ట్‌కు ఢిల్లీ నుంచి తొలి విమానం బయల్దేరి వెళ్లింది. ఇండిగో విమానయాన సంస్థ తమ తొలి ఢిల్లీ–అయోధ్య విమానాన్ని శనివారం మధ్యాహ్నం ప్రారంభించింది. ఈ విమానంలోకి అడుగుపెడుతున్న ప్రయాణికులకు పైలట్ అశుతోష్ శేఖర్ .. 'జై శ్రీరామ్' అంటూ స్వాగతం పలికారు. 'అయోధ్యకు బయల్దేరుతున్న తొలి విమానానికి సారథ్యం వహించే బాధ్యతలు నాకు అప్పగించడం నిజంగా నా అదృష్టం. మీ ప్రయాణం సాఫీగా, ఆనందంగా సాగాలని కోరుకుంటున్నాము. జై శ్రీరామ్' అని ఆయన విమానంలో అనౌన్స్ చేశారు. తమ తమ సీట్లలో కూర్చున్న ప్రయాణికులు ప్రయాణ సమయంలో హనుమాన్ చాలీసాను పఠించారు. సంబంధిత వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతోంది.

పునర్వైభవ తార్కాణం: అమిత్ షా

అహ్మదాబాద్: దేశ అమృత కాలపు ఆరంభంలోనే అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠాపన జరగనుండటం యాదృచ్ఛికమేమీ కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం అభిప్రాయపడ్డారు. రానున్న పాతికేళ్లలో ప్రపంచంలో భారత్ అగ్ర స్థానానికి చేరి పునర్వైభవం సాధించనుందనేందుకు ఇది తార్కాణమన్నారు. వందల ఏళ్ల ఎదురు చూపులు ఫలించాయి. దేశవాసుల ప్రార్థనలు, సాధు సంతుల తపస్సులు, అసంఖ్యాత భక్తుల ప్రయత్నాలు ఫలించాయి. అడ్డంకులన్నీ తొలగాయి. శ్రీరాముడు తన జన్మస్థానంలో ఎట్టకేలకు వైభవంగా కొలువు దీరనున్నాడు'' అని అన్నారు. అయోధ్య మాత్రమే గాక కాశీలో నాడు ఔరంగజేబ్ ధ్వంసం చేసిన విశ్వనాథ్ కారిడార్‌ను కూడా మోదీ ప్రభుత్వం బ్రహ్మాండంగా పునర్నిర్మించిందని గుర్తు చేశారు.

రాముడే బీజేపీ ఎన్నికల అభ్యర్థి!: రౌత్

ముంబై: అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవాన్ని బీజేపీ పూర్తిగా రాజకీయమయం చేస్తోందని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఆరోపించారు. ఆలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానంపై రౌత్ స్పందించారు. '' శ్రీరాముని పేరును బీజేపీ తన రాజకీయాలకు విపరీతంగా వాడేసుకుంది. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్నీ బీజేపీ ఎంతో రాజకీయ చేసింది. తమ ఎన్నికల అభ్యర్థి శ్రీరామచంద్రుడే అని బీజేపీ ప్రకటించడం ఒక్కటే మిగిలిపోయింది. జనవరి 22న జరిగేది బీజేపీ కార్యక్రమం. ఆ రోజు జరిగేది ఎలా చూసినా జాతీయ కార్యక్రమం కాబోదు. రాజకీయాలతో బీజేపీ రాముడిని కిడ్నాప్ చేసింది'' అని వ్యాఖ్యానించారు. మరి శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే ఆ కార్యక్రమానికి వెళ్తారా అని మీడియా ప్రశ్నించగా ''అవును. కానీ బీజేపీ ఆధ్వర్యంలో జరిగే తతంగం అంతా ముగిశాక అసలు కార్యక్రమంలో ఉద్ధవ్ పాల్గొంటారు'' అని బదులిచ్చారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం, 31, డిసెంబర్, 2023



ఉద్యోగం ప్లీజ్

బెంగళూరులో ప్రభుత్వ కేపీటీసీఎల్ ఆఫీసు ముందు విద్యార్థి సంఘాల ధర్నా. సంస్థలోని ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు

న్యూస్‌రీల్

హుస్కూరులో చిరుత ప్రత్యక్షం



సీసీ కెమెరాలో రికార్డయిన చిరుత సంచారం

బొమ్మనహళ్లి: రాష్ట్రంలో అనేక చోట్ల చిరుత సంచారం ఎక్కువవుతోంది. తాజాగా బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ తాలూకా పరిధి ఎలక్ట్రానిక్ సిటీకి సమీపంలో ఉన్న హుస్కురు, గట్టహళ్లి గ్రామాల మధ్య శుక్రవారం చిరుత కనిపించింది. హుస్కూరుకు చెందిన చంద్రు అనే వ్యక్తి బైక్‌పై వెళుతుండగా రోడ్డు మధ్యలో చిరుత వెళ్లడం కనిపించింది. దీంతో భయంతో కొద్ది దూరం వెనక్కు వెళ్లాడు. బైక్ వెలుతురు రావడంతో చిరుత వేగంగా పరుగులు పెట్టింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు చిరుత కోసం గాలిస్తున్నారు. సమీపంలోని ఇళ్లల్లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా చిరుత సంచారం బయటపడింది. దీంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

బెంగళూరు నుంచి అయోధ్యకు విమాన సేవలు

దొడ్డబళ్లాపురం: వచ్చే జనవరి 17 నుంచి ఎయిర్ ఇండియా సంస్థ బెంగళూరు నుంచి అయోధ్యకు విమాన సర్వీసులు అందించనుంది. జనవరి 17న ఉదయం 8.05కి బెంగళూరు నుండి అయోధ్యకు మొదటి విమానం ఎగరనుంది 10.35కి అయోధ్య చేరుకోనుంది. మళ్లీ అయోధ్య నుండి 3.40కి బయలుదేరి సాయంత్రం 6.10కి బెంగళూరు చేరుకోనుంది. అయోధ్యలో రామమందిరం ప్రారంభించబడ్డాక అయోధ్యకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని సంస్థ అధికారులు చెప్పారు.

అటవీ సిబ్బంది సస్పెండ్

దొడ్డబళ్లాపురం: హాసన్ తాలూకా నందగొండనహళ్లిలో 12 ఎకరాల అటవీ ప్రదేశంలో పెరిగిన చెట్లను నరికివేసిన సంఘటనలో మొత్తం 5 మంది అటవీశాఖ అధికారులను సస్పెండ్ చేశారు. ఈ నెల 16న కొందరు చెట్లను నరికివేసినట్లు బేలూరు తహసీల్దార్ మమతకు తెలిసింది. ఎంపీ ప్రతాప్ సింహ అండతో చెట్లు కొట్టేశారని ఆరోపణలు వచ్చాయి. ఎంపీ తమ్ముడు విక్రం సింహ అల్లం పంట సాగు కోసం నందగొండనహళ్లిలో జయమ్మ అనే మహిళకు చెందిన మూడు ఎకరాల పొలాన్ని గుత్తకు తీసుకున్నాడు. తరువాత పక్కనే 12 ఎకరాల గోమాళ భూమిలో ఉన్న చెట్లను నరికివేయించాడని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. దీంతో ప్రభుత్వం స్పందించిన ఇందులో నిర్లక్ష్యం వహించారని అసిస్టెంట్ ఫారెస్ట్ ఆఫీసర్ మోహన్ కుమార్‌తో సహా ఐదుమంది అటవీ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేసింది.

పైపులు పగిలి రోడ్లు అధ్వాన్నం



గుంతలు, రొచ్చుగా బాగేపల్లి రోడ్లు

బాగేపల్లి: బాగేపల్లి అటు ఆంధ్రప్రదేశ్, ఇటు కర్ణాటకలను కలిపే ప్రముఖ స్థలంలో ఉంటుంది, కానీ కనీస వసతుల కల్పనలో వెనుకబడిపోయింది. పట్టణంలోని గోళూరు రోడ్డులో పురసభ పరిధిలో తాగునీటి పైప్‌లైన్ పగిలి నీరు రోడ్లపై పారుతోంది. సుమారు 20 రోజుల నుంచి నీరు మొత్తం రోడ్లపైకి వస్తోంది. బురద, గుంతలు తేలి ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల మీద వెళ్లడానికి వీలు కావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు అనేక సార్లు ఫిర్యాదులు చేసినా పురసభ అధికారులు ఇటు వైపు వచ్చి చూసింది లేదని వాపోయారు. పైపులను, రోడ్లను ఎప్పటికి బాగుచేస్తారని ప్రశ్నించారు.

నకిలీ పోలీస్‌కు సంకెళ్లు

మైసూరు: క్రైం బ్రాంచ్ పోలీస్ అని చెప్పుకుంటూ డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని జిల్లాలోని పిరియాపట్టణ తాలూకా బైలుకొప్ప పోలీసులు అరెస్టు చేశారు. కేఆర్ నగర తాలూకాలోని మదువనహళ్ళికి చెందిన దివ్యరాజ్ అనే వ్యక్తి పోలీసనని ప్రజలను భయపెడుతూ డబ్బులు గుంజుతున్నాడు. కొప్ప గ్రామంలో ఉన్న ఆయుర్వేదిక్ స్పా యజమానికి పుష్పకుమార్‌ను కూడా ఇలాగే చెప్పి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. అతడు అనుమానంతో బైలుకొప్ప పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దివ్యరాజ్‌ను అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

ఐటీ నగరిపై డ్రగ్స్ క్రీనీడ

- చాపకింద నీరులా విక్రయాలు, వాడకం
- విద్యావంతులే అధికం
- 2023లో రూ.102 కోట్ల డ్రగ్స్ స్వాధీనం
- కొత్త ఏడాదిలో అయినా కట్టడి అయ్యేనా?





బెంగళూరులో విచ్చలవిడిగా గంజాయి రవాణా జరుగుతోంది. సీజ్‌చేసిన గంజాయి ఇది

బనశంకరి: డ్రగ్స్ అనేది మత్తు అందించి జీవితాలను నిర్వీర్యం చేస్తుంది. అలాంటి విష వలయంలో యువత చిక్కుకుంది. భారత సిలికాన్ రాజధానిలో మాదక ద్రవ్యాలు విక్రయాలు, సేవనం ఏటేటా పెరుగుతోందే తప్ప తగ్గడం లేదనేది వెలుగులోకి వచ్చింది. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం ఎన్‌డీపీఎస్ చట్టం కింద 2023లో అత్యధిక డ్రగ్స్ కేసులు నమోదైన నగరంగా దేశంలో పేరుకెక్కింది.

క్వింటాళ్ల కొద్దీ పట్టుకున్నా

ఈ నేపథ్యంలో డ్రగ్స్ రహిత బెంగళూరు చేసే లక్ష్యంతో గంజాయి, సహా ఐదు టన్నులకు పైగా మొత్తంలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ విక్రేతలు, ఉపయోగించేవారితో కలిపి 4,383 మందిని అరెస్ట్ చేశారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ రూ.100 కోట్లుగా అంచనా. కానీ ఖాకీల కళ్లు గప్పి వందలాది కోట్ల విలువచేసే డ్రగ్స్ దందా చాపకింద నీరులా సాగిపోతోందన్నది సత్యం. ఆ డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో పెకలించడం సాధ్యం కాలేదు. ఈ కేసుల్లో పట్టుబడిన వారిపైకి 80 శాతం మంది డ్రగ్స్‌కు బానిసైనవారు ఉన్నారు. వీరంతా కాలేజీ విద్యార్థులు, ఐటీ, కార్పొరేట్ ఉద్యోగులు, వ్యాపారులు, సంపన్నులు ఉండడం



డ్రగ్స్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

గమనార్హం. క్షణకాలం మత్తు కోసం జీవితాన్ని గలీజు చేసుకుంటున్నారని పోలీస్ అధికారులు తెలిపారు.

విదేశీయుల హస్తం

రాజధానిలో గుడుంబా, గంజాయి విక్రయం నుంచి పంచతారా హోటల్స్‌లో నిర్వహించే హైఎండ్‌పార్టీల వరకు కొకైన్ వంటి సింథటిక్ డ్రగ్స్ విస్తరించాయి. పోలీసులు గుర్తించకుండా డార్క్‌వెబ్‌లో ఆర్డర్ ఇచ్చి కొరియర్ల ద్వారా తెప్పించుకోవడం పెరిగింది. ఐటీ నగరిలో ఎండీఎంఏ, ఎక్స్‌టసీ పిల్స్, ఎల్ఎస్‌డీ పట్టీలు, కొకైన్‌తో పాటు ఇతర శక్తిమంతమైన డ్రగ్స్ దందాలో విదేశీయులు నిమగ్నమయ్యారు. 98 మంది విదేశీయులను అరెస్ట్‌చేశారు. వీరిలో నైజీరియా, ఆఫ్రికా ఖండవాసులు అధికం. టూర్, వ్యాపారం, చదువుల వీసాతో వచ్చి ధనార్జన కోసం డ్రగ్స్ దందాలోకి దిగడం పరిపాటిగా మారింది. ఢిల్లీ, ముంబై, గోవా ఇతర నగరాల్లోని డ్రగ్స్ ముఠాలతో కలిసిపోతున్నారు.

నిరంతర పోరాటం: సీపీ

డ్రగ్స్ గురించి తెలిస్తే కంట్రోల్‌రూమ్ 1908 నంబరుకు సమాచారం ఇచ్చి ప్రజలు సహకరించాలని పోలీసులు తెలిపారు. డ్రగ్స్‌పై నిరంతరం పోరాటం చేస్తున్నామని, న్యూ ఇయర్ పార్టీల్లో డ్రగ్స్ సరఫరా చేయడానికి సిద్ధమైన అనేకమంది పెడ్లర్లను ఇప్పటికే అరెస్ట్‌చేశామని పోలీస్ కమిషనర్ బీ.దయానంద్ తెలిపారు.

3,433 కేసులు నమోదు

- 2023లో నగరంలో డ్రగ్స్ కేసులు -3,433
- పట్టుబడిన వ్యక్తులు- 4,285, వీరిలో విదేశీయులు 98 మంది
- సీజ్ చేసిన డ్రగ్స్- 5,334 కిలోలు
- స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ రూ.102 కోట్లు

ముగ్గురు బీటెక్ విద్యార్థుల జలసమాధి



బరపోలె నదిలో మృతదేహాల కోసం గాలింపు,



మృతి చెందిన ముగ్గురు విద్యార్థులు (ఫైల్)

- ఈతకు వెళ్లి నదిలో మునక
- కొడగు జిల్లాలో దుర్ఘటన

మైసూరు: ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులు జారి నీటిలో పడి మృతి చెందిన విషాద సంఘటన కొడగు జిల్లా పొన్నంపేట్ దగ్గర బరపోలె వద్దనున్న బరపోలె నదిలో శనివారం చోటుచేసుకుంది. పొన్నంపేటలోని సిఐటి కళాశాలకు చెందిన 2వ ఏడాది బీటెక్ విద్యార్థులు ఎంపి ఆకాశ్ బిద్దప్ప, య.సుదేష్ అయ్యప్ప, కే.జీ.రశిక్ కుశాలప్ప మృతులు. వీరందరి వయసు 20 నుంచి 21 ఏళ్లలోపు ఉంటుంది. అందరూ కొడగు జిల్లవాసులని సమాచారం.

నదిలో ఈతకు వెళ్లి..

వారాంతం సెలవు కావడంతో కాలేజీ నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలోనున్న బరపోలె నదిని చూడడానికి వెళ్లారు. హోటల్లో మధ్యాహ్నం భోజనం చేసుకుని నదిలో ఈతకు వెళ్లారు. అయితే వారికి ఈత రాకపోవడంతో పాటు నదిలో లోతైన చోటకు వెళ్లినప్పుడు నీటిలో మునిగిపోయారు. ఎవరూ కాపాడేవారు లేకపోవడంతో ప్రాణాలు కోల్పోయారు. వారితో పాటు వెళ్లిన మరో విద్యార్థి క్షేమంగా బయటపడినట్లు తెలిసింది. పొన్నంపేట్ పోలీసులు, కాలేజీ సిబ్బంది వచ్చి మృతదేహాలను వెలికితీశారు. తల్లిదండ్రులు చేరుకుని కుమారుల మృతదేహాలను చూసి పెద్ద పెట్టున రోదించారు. నూతన ఏడాదికి ముందు జరిగిన ఘోర సంఘటనతో కాలేజీలో విషాద వాతావరణం నెలకొంది.

సముద్రంలో మునిగి ఇద్దరు మృతి

మంగళూరు సమీపంలోని ఉళ్లాల వద్ద సముద్రంలో ఈతకెళ్లి ఇద్దరు యువకులు మృతి చెందారు. ఒకరి మృతదేహం ఆచూకీ లభించగా, మరో మృతదేహం కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. చిక్కమగళూరుకు చెందిన ముగ్గురు బషీర్ (23), సల్మాన్ (19), సైఫ్ అలీ (27)లు కలిసి ఉళ్లాల దర్గాకు వెళ్లారు. దర్శించుకొని ప్రార్థనలు చేసి దగ్గర్లోని బీచ్‌లో ఈతకెళ్లారు. పెద్ద అలలు రావడంతో ముగ్గురు సముద్రంలో మునిగిపోయారు. అక్కడి ఈతగాళ్లు సైఫ్ అలీని రక్షించగా మరో ఇద్దరు సముద్రంలో మునిగిపోయారు. సల్మాన్ మృతదేహం ఒక్కటే దొరికింది.

నదిలోకి దూకి ఆత్మహత్య

ఉత్తర కన్నడ జిల్లా కారవారలో కాళి నది వంతెనపై నుంచి దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కరావళి సేఫ్‌గార్డు సిబ్బంది పడవలు వేసుకుని నదిలో గాలిరచగా, శుక్రవారం సాయంత్రం ఆశ్వేవాడ వద్ద మృతదేహం బయటపడింది. మృతుడు కారవారకు చెందిన ఆదిత్య నాయక్ (32)గా గుర్తించారు.





అందమైన కేక్‌లు

మండ్య: కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం పలకడానికి వినూత్నమైన కేక్‌లు మండ్య నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. ప్రతి ఏడాది మాదిరిగానే చాముండేశ్వరి నగరలో బేక్ పాయింట్‌లో కేక్ మేళా ప్రజలను ఆకర్షిస్తోంది. వివిధ రూపాల్లో నోరూరించే కేక్‌లను సిద్ధం చేశారు.





చీరల స్టాల్స్ వద్ద సందర్శకులు

అలరించే సిల్కు మేళా

బనశంకరి: న్యూ ఇయర్ సందర్భంగా సిల్క్ ఇండియా పేరుతో నిర్వహిస్తున్న పట్టుచీరల ప్రదర్శన వనితలను ఆకట్టుకుంటోంది. జేపీ నగర ఫస్ట్ ఫేజ్‌లో సింధూర్ కన్వెన్షన్ సెంటర్‌లో పట్టు మేళా జరుగుతోంది. ఒడిశా, సంబల్‌పురి ఇక్కత్‌చీరలు, బిహార్ ఆర్గానిక్ టస్సర్‌చీరలు, అసోం మూగా, ఐరి పట్టుచీరలు, కర్ణాటక క్రేప్ సిల్క్, అరణి, కాంచీపురం, ధర్మవరం, ఉప్పాడ, గద్వాల్, మంగళగిరి, పోచంపల్లి పట్టు, నూలు, ప్రింటెడ్ చీరలు ఇక్కడ లభ్యమవుతున్నాయి. ఉత్తరాదిన పేరుపొందిన చీరలు, వస్త్రాల స్టాళ్లు, గృహాలంకరణ సామగ్రి విక్రయాలు జరుగుతున్నాయి. ఈ ప్రదర్శన నేడు ఆదివారం సాయంత్రంతో ముగుస్తుంది.

ఉపాధ్యాయ ఓటర్ల ప్రకటన

శివాజీనగర: పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గాల తుది ఓటర్ల జాబితాను శనివారం ప్రకటించారు. ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 1,50,184 మంది ఓటర్లు ఉండగా, కర్ణాటక నైరుతీ పట్టభద్రుల స్థానంలో 74,218 మంది ఉన్నారు. బెంగళూరు పట్టభద్రుల నియోజకవర్గంలో 1,00,100 మంది ఓటర్లు ఉన్నారు. ఆగ్నేయ ఉపాధ్యాయుల నియోజకవర్గంలో 23,565 మంది ఓటర్లు ఉండగా, కర్ణాటక నైరుతీ ఉ. నియోజకవర్గంలో 19,837 ఓటర్లు ఉన్నారు. దక్షిణ ఉ. నియోజకవర్గంలో 18,475 మంది ఓటర్లు ఉన్నారు. బెంగళూరు ఉపాధ్యాయుల స్థానంలో 16,063 మంది ఓటర్లు ఉన్నారు. త్వరలో పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ పోస్టులకు ఎన్నికలు జరగనున్నాయి.

సంకాంత్రికల్లా పదవుల పంపిణీ

- కార్యకర్తలకు తగిన స్థానం: డీసీఎం

శివాజీనగర: బోర్డు, కార్పొరేషన్ పదవుల పంపిణీలో ఎమ్మెల్యేలతో సమానంగా కార్యకర్తలకూ స్థానం కల్పిస్తామని డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్ అన్నారు. శనివారం సదాశివనగరలో నివాసం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన, కార్యకర్తలకు తగిన చోటు ఇస్తాం, దీనిపై నాయకులు కూర్చొని చర్చిస్తాం. పదవుల నియామక జాబితా ఒక స్థాయికి వచ్చింది. సంక్రాంతి పండుగ నాటికి నియామకాలు చేసే అవకాశముందని తెలిపారు.

త్వరలో ప్రజల వద్దకు మనం

కాగా, ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు మనమే వారి వద్దకు వెళ్లాలని నేతలకు, అధికారులకు సూచించారు. అందుకోసం తలుపుల వద్దకు వచ్చింది ప్రభుత్వం, సేవకు ఉండాలి సహకారం అనే కార్యక్రమాన్ని చేపట్టాం. వచ్చే నెలలో బెంగళూరులోని 28 నియోజకవర్గాల్లో ప్రజల వద్దకు వెళ్లి విన్నపాలను స్వీకరిస్తామని డీకే చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు కసరత్తుపై జనవరి 10న పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఏఐసీసీ నాయకులతో భేటీ జరుపుతామని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును కలవడంపై స్పందిస్తూ నేనేమీ ఆంధ్రకు వెళ్లి ఆయనను కలవలేదు. బెంగళూరుకు వచ్చి వెళుతున్నపుడు విమానాశ్రయంలో కనిపిస్తే ఆయన ఆరోగ్యం ఎలా ఉందని అడిగాను అంతే అని తెలిపారు.

33వ అంతస్తు నుంచి పడి టెక్కీ మృతి



మృతుడు శర్మ (ఫైల్)

కృష్ణరాజపురం: స్నేహితులతో కలిసి విందు చేసుకుంటున్న సమయంలో టెక్కీ సిగరెట్ తాగడానికి బాల్కనీలోకి వచ్చి అదుపు తప్పి కింద పడి మరణించిన ఘటన నగరంలోని కృష్ణరాజపురంలోని కోడిగెనహళ్ళిలో చోటుచేసుకుంది. వివరాలు.. శుక్రవారం రాత్రి దీపాంశు శర్మ (32), ఓ యువకుడు, ఇద్దరు యువతులు కలిసి ఓ అపార్టుమెంటులో 33వ అంతస్తులో పార్టీ చేసుకుంటున్నారు. మద్యంతో పాటు గంజాయిని కూడా తాగి మజా చేసుకున్నారు. మధ్యలో దీపాంశు శర్మ సిగరెట్ తాగాలని ఫ్లాటులోని బాల్కనీలోకి వచ్చాడు. సిగరెట్ తాగుతూ మత్తులో అక్కడి నుంచి తూలి ఒక్కసారిగా కిందకు పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వాడు. ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ ఐటీ ఉద్యోగం చేసేవాడు. పార్టీ ఉందని స్నేహితుల ఫ్లాటుకు వచ్చి ప్రమాదం బారిన పడ్డారు. కృష్ణరాజపురం పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

బీబీఎంపీలో ఉప విభాగాల పెంపు



బెంగళూరు నగరంలో పాత వలయాల మ్యాపు

- 30 నుంచి 75కు జంప్

వలయం	విభాగం	ఉప విభాగాలు
బొమ్మనహళ్లి	03	09
దాసరహళ్లి	02	04
తూర్పు వలయ	06	13
మహదేవపుర	02	09
ఆర్ఆర్ నగర	03	07
దక్షిణ వలయ	06	14
యలహంక	02	06
పశ్చిమ వలయ	06	13

విభజన తరువాత విభాగం, అందులోని ఉప విభాగాల సంఖ్య ఇలా ఉంటుంది

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె 30 ఉప విభాగాలను 75 ఉప విభాగాలుగా రాష్ట్ర ప్రభుత్వం విభజించింది. గత బీజేపీ ప్రభుత్వం 198 వార్డులు గల పాలికె ను 225 వార్డులుగా పునర్విభజన చేయాలని ఆదేశించింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉప విభాగాలను ఇబ్బడిముబ్బడిగా పెంచేసింది. ప్రతి ఉప విభాగంలో రెండు నుంచి నాలుగు వార్డులు ఉంటాయి. ఇకనుంచి 75 విభాగాలుగా పనిచేయాలని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ ఆదేశించారు. పరిపాలన సులువుగా ఉండేందుకు ఇలా చేసినట్లు అధికారులు తెలిపారు.

డొక్కు బస్సుల్ని నడపొద్దు

- ఆర్టీసీకి హైకోర్టు ఆదేశం

శివాజీనగర: నిర్ధారించిన కిలోమీటర్ల సంచారం పూర్తి చేసి షెడ్‌కు చేరే బస్సులను ఇక ఉపయోగించరాదని కేఎస్ ఆర్టీసీని హైకోర్టు ఆదేశించింది. ఆర్టీసీ మెకానికల్ విభాగం, ఆర్టీఓలు ఫిట్‌నెస్ ధృవపత్రం ఇచ్చిన బస్సులను మాత్రమే నడపాలని ఆదేశించింది. కండీషన్ లేని బస్సు ఢీకొని ఇద్దరు విద్యార్థులు మరణించిన కేసులో డ్రైవర్‌ను దోషిగా తీర్మానించి శిక్ష విధించిన స్థానిక కోర్టు తీర్పును హైకోర్టు జడ్జి జస్టిస్ రామచంద్ర డీ.హుద్దార్ ధర్మాసనం ఎత్తిచూపింది. ఆర్టీసీ డొక్కు బస్సుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వేసిన వ్యాజ్యాన్ని విచారించారు. అధీకృత ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందిన బస్సులు మాత్రమే రోడ్లపై తిరగడానికి అనుమతించాలి. ప్రతి బస్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి బాగా ఉంటేనే ఆర్‌టీఓ ఫిట్‌నెస్ ధృవపత్రం ఇవ్వాలని జడ్జి ఆదేశించారు.

మనది సార్వభౌమ భాష

యశవంతపుర: బహు భాషల మధ్య కన్నడ భాషను మరిచిపోవద్దని, కన్నడనే మన సార్వభౌమ భాషగా ఉండాలి. కన్నడిగులు ఇతరులను గౌరవించాలని విశ్రాంత లోకాయుక్త జస్టిస్ ఎన్.సంతోష్ హెగ్డే తెలిపారు. బెంగళూరు టౌన్‌హాల్‌లో జయకర్ణాటక ఆధ్వర్యంలో కువెంపు జయంతి, కర్ణాటక సువర్ణ మహోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. మొదట మనిషిగా ఉండాలని కవులు చెప్పారు. కన్నడిగునిగా మరణించాలన్నారు. కన్నడ శ్రీమంతుల భాషన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయంపై అందరూ పోరాటం చేయాలన్నారు. అవినీతి అనేది సమాజానికీ శాపంగా మారిందని, అవినీతిపరులను గొప్పగా చూపించే పరిస్థితి ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు.

మంగళూరు- గోవా వందేభారత్ రైలు షురూ

యశవంతపుర: మంగళూరు నుంచి గోవాకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం నుంచి సర్వీసులు మొదలయ్యాయి. మంగళూరు- మడగాంవ్‌ల మధ్య సంచరించే ఈ రైలుకు ప్రధాని నరేంద్రమోదీ అయోధ్యలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆ వెంటనే మంగళూరు నుంచి గోవాకు రైలు బయల్దేరింది. స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ రైల్లో ప్రయాణించారు. రెండు ఊళ్ల మధ్య 320 కిలోమీటర్ల దూరం ఉంది, మంగళూరు సెంట్రల్, ఉడుపి, కారవారలో స్టాప్‌లు ఉంటాయి. మడగాంవ్‌కు 4:35 గంటల్లో చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు. ఇందులో సాధారణ సీట్లు ఉంటాయి, స్లీపర్ కోచ్‌లు ఉండవు.



శనివారం మైసూరులో హనుమోత్సవం ఊరేగింపు

రాచనగరిలో హనుమ ఘోష

మైసూరు: వారసత్వ నగరిలో శనివారం హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా హనుమోత్సవం ఘనంగా సాగింది. హనుమాన్ జయోత్సవం సమితి ఆధ్వర్యంలో కోటె ఆంజనేయ స్వామి ఆలయం ముందు ఊరేగింపును ప్రారంభించారు. తెల్లవారుజామునే హోమాలు, పూజల్ని నిర్వహించారు. హనుమాన్ విగ్రహానికి తులసి పత్రాలు, మైసూరు మల్లెలు, కజ్జాయలు, అలసంద వడలను దండలుగా వేసి నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యేలు జీటీ దేవేగౌడ, టిఎస్. శ్రీవత్స, కే.హరీష్‌గౌడ, మాజీ మేయర్ శివకుమార్‌లు హనుమోత్సవానికి నాంది పలికారు. వ్యాన్‌పై ఆంజనేయస్వామి, ఓం రూపాలను ప్రతిష్టించి మైసూరు నగరంలో ఊరేగింపు సాగించారు. డీజే, డోలు వాయిద్యాల ఘోష మధ్య భక్తులు చిందులేస్తూ సందడి చేశారు.

క్లుప్తంగా

కేపీసీసీ లేబర్ సెల్‌కు ఎంపిక



ఆదేశ పత్రాన్ని అందుకుంటున్న ఎర్రిస్వామి

బళ్లారి టౌన్: కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(కేపీసీసీ) లేబర్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా కొళగల్లుకు చెందిన ఉప్పర ఎర్రిస్వామిని నియమించారు. శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో కేపీసీసీ లేబర్ సెల్ అధ్యక్షుడు కే.పుట్టేగౌడ ఈ ఆదేశ పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఎర్రిస్వామి మాట్లాడుతూ తన అధికారావధిలో జిల్లాతో పాటు రాష్ట్రంలోని కార్మికులందరికీ ప్రభుత్వం నుంచి లభించే పథకాల అందజేతకు కృషి చేస్తానన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు బలి

రాయచూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు బలైన ఘటన మాన్విలో చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి మాన్వి తాలూకా హిరేహళ్ల వంతెనపై ద్విచక్రవాహనం పైనుంచి కిందపడి యువకుడు గాయపడ్డాడు. అతనిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఆస్పత్రిలో మరణించినట్లు మాన్వి సీఐ హిరేమట్ తెలిపారు. కాగా మృతుడి పేరు, ఊరు వివరాలు తెలియరాలేదు.

పీఈటీకి వీడ్కోలు



ఖాదర్ రహమతుల్లాను అభినందిస్తున్న దృశ్యం

సిరుగుప్ప: నగరంలోని విజయమేరి పాఠశాల సభాంగణంలో శనివారం వ్యాయామ విద్యాధికారి ఖాదర్ రహంతుల్లా పదవీ విరమణ, అభినందన కార్యక్రమాన్ని తాలూకా విద్యాశాఖాధికారి గురుప్ప చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణకు పేరుగాంచిన ఖాదర్ రహంతుల్లా క్రీడా రంగానికి ఎనలేని సేవలందించారన్నారు. వ్యాయామ విద్యలో జిల్లాకు మంచి కీర్తిని తెచ్చిన ఆయన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్షేత్ర సమన్వయ అధికారి తిమ్మనగౌడ పాటిల్, జిల్లా, తాలూకా స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాల లబ్ధి పొందాలి

రాయచూరు రూరల్: ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని యువ నేత నర్సింహులు పేర్కొన్నారు. ఆయన శనివారం రిమ్స్ ఆస్పత్రిలో మున్నూరు కాపు సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. వ్యాధుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించి వారికి ఉచితంగా పరీక్షలు, చికిత్సలు చేశారు. నగరసభ మాజీ ఉపాధ్యక్షుడు దొడ్డ మల్లేష్ వర్ధంతి సందర్భంగా రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

వేడుకగా పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: యాదగిరి జిల్లా మోతకపల్లిలో వెలసిన బలభీమసేన ఆంజనేయ ఆలయంలో ఘనంగా ఉత్సవాలు జరిగాయి. శనివారం ఆలయంలో విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. భక్తులు స్వామివారిని సేవించి రథోత్సవం జరిపారు. రాష్ట్ర వైద్య విద్యా శాఖ మంత్రి శరణ ప్రకాష్ పాటిల్, బీజేపీ నేత శివకుమార్ పాటిల్ తేల్కూరు బలభీమసేన ఆంజనేయ స్వామి దర్శనం పొందారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుక



ప్రతాప్‌రెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

బళ్లారి అర్బన్: బుడా మాజీ అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంలోని గాంధీనగర్‌లో ఆయన పుట్టిన రోజు వేడుకలను అభిమానులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న నిస్వార్థంతో తన వంతుగా సమాజ సేవ చేస్తున్న నారా ప్రతాప్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కే.సీ.కొండయ్య, న్యాయవాది హనుమంతరెడ్డి, ప్రముఖులు నిష్టిరుద్రప్ప, హలకుంది శివన్న, ఆప్ నాయకుడు మంజునాథ్ పాల్గొన్నారు.

ఐదుగురి మరణాల వెనుక..?



చుట్టుపక్కల ఇళ్లకు తాళం వేసిన దృశ్యం



ఐదుగురు ఒకేసారి ఎలా చనిపోయారు?

- చిత్రదుర్గలో రిటైర్డు అధికారి కుటుంబం మృతి కేసు
- మిస్టరీగా మారిన సంఘటన
- ఛేదించేందుకు పోలీసుల యత్నం
- ఇంటి చుట్టుపక్కల భయం భయం

సాక్షి, బళ్లారి: నెల కాదు, రెండు నెలలు కాదు ఏకంగా నాలుగేళ్లకుపైగా తమ ఇంటి పక్కనే ఉన్న ఇంట్లో, కాలనీలో ఐదుగురు మృతి చెంది అస్థిపంజరాలుగా మారిపోవడంతో చుట్టుపక్కల ఇళ్లు, కాలనీల వాసులు తమ ఇళ్లకు తాళాలు వేసుకుని పరుగులు తీశారు. చిత్రదుర్గ నగరంలో నాలుగేళ్ల క్రితం నుంచి ఇంటికి తాళం వేసి పాడుపడిన రిటైర్డ్ ఇంజనీర్ జగన్నాథ్‌రెడ్డి (80) కుటుంబం మొత్తం అస్థిపంజరాలుగా మారిన విషయం శుక్రవారం వెలుగు చూడటంతో చిత్రదుర్గ ఒక్కసారిగా ఉలిక్కిపడగా, చుట్టుపక్కల ఉన్నవారు భయభ్రాంతులకు లోనయ్యారు. నాలుగేళ్ల నుంచి తమ ఇళ్లపక్కనే ఉన్నవారు బయటకు వచ్చింది లేదు, వారి ఇంటికి కూడా ఎవరూ బంధుమిత్రులు రాలేదు. ఇల్లు అధ్వానంగా మారినా బాగోగులు పట్టించుకోలేదు. చివరకు అందులో మృతులు మాత్రమే జీవిస్తున్నారని తెలుసుకుని చుట్టుపక్కల ఇళ్లవారికి గుండెల్లో గుబులు ఏర్పడింది.

ఏం జరిగింది?

పాడుబడిన ఇంట్లో ఐదు అస్థిపంజరాల లభ్యతపై శనివారం పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. పీడబ్ల్యూడీ శాఖలో సహాయక కార్యనిర్వాహక ఇంజినీర్‌గా పని చేసి, పదవీ విరమణ పొందిన తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి జగన్నాథ్‌రెడ్డి, ఆయన భార్య ప్రేమ, కుమార్తె త్రివేణి, కుమారులు కృష్ణారెడ్డి, నరేంద్రరెడ్డిలు అదే ఇంట్లో ఉండేవారు, వారు ఎప్పుడు చనిపోయారో కానీ అస్థిపంజరాలుగా మారిపోయారు. ఏం జరిగిందన్నది ఇప్పుడు మిస్టరీగా మారింది.



జగన్నాథ్‌రెడ్డి కుటుంబం నివసించిన ఇల్లు ఇదే

ఇంట్లో ఆక్సిజన్ సిలిండర్, కుక్క అస్థిపంజరం

- చిత్రదుర్గ జేఎంఐటీ మెడికల్ క్యాంపస్ మార్చురీలో అస్థిపంజరాలను ఉంచి పరీక్షలు చేస్తున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. స్థానిక బరంగి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి చుట్టుపక్కల వారిని విచారణ చేస్తూ, బంధువుల నుంచి విషయాలు రాబడుతున్నారు.
- జగన్నాథ్‌రెడ్డి ఇంట్లో చక్రాల కుర్చీ, ఆక్సిజన్ సిలిండర్ కూడా అందుబాటులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆక్సిజన్ సిలిండర్ ఎందుకు ఉన్నది అనేది కొత్త అనుమానాలకు తావిస్తోంది.
- ఆ ఇంట్లో ఒక కుక్క అస్థిపంజరం కూడా కనిపించింది.
- ఒక గదిలో నాలుగు అస్థిపంజరాలు, మరో గదిలో ఒక అస్థిపంజరం కనిపించాయి. ఏవైనా మూఢ నమ్మకాలను విశ్వసించి సామూహిక ఆత్మహత్యలు చేసుకుని ఉంటారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.
- లేక ఆస్తి, ఇతరత్రా గొడవల వల్ల విషప్రయోగం జరిపి హత్య చేసి ఉంటారా? అనే అనుమానాలు ఉన్నాయి.
- వారి మరణాలపై చిత్రదుర్గలో పలు రకాలుగా వదంతులు వ్యాప్తి చెందాయి. జిల్లా



ఎస్పీ ధర్మేంద్ర కుమార్ మీనా ఆధ్వర్యంలో ముమ్మరంగా దర్యాప్తుతో పాటు పోస్టుమార్టం నిర్వహించి, డీఎన్ఏ పరీక్షలు చేసే అవకాశం కనిపిస్తోంది.

అసమానతలు పోవాలి: సీఎం

శివాజీనగర: సమాజంలో వెనుకబడినవారికి ఆర్థిక–సామాజిక సమానత్వం లభించినపుడు మాత్రమే స్వాతంత్ర్యానికి సార్థకత వస్తుందని సీఎం సిద్దరామయ్య అన్నారు. శనివారం నగరంలో రవీంద్ర కళాక్షేత్రలో జరిగిన నిడుమామిడి శ్రీ పీఠారోహణ దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. మనిషి స్వార్థంతో సమాజంలో అసమానత నెలకొంది. ఆర్థిక, సామాజిక అసమానత్వాన్ని తొలగించకపోతే దేశానికి స్వాతంత్ర్యం లభించినా కూడా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సమ సమాజం నిర్మాణం కావడానికి అసమానతలు తొలగడమే పరిష్కారమన్నారు. కార్యక్రమంలో వీరభద్ర చన్నమల్ల దేశికేంద్ర స్వామి, సారంగధర దేశికేంద్ర స్వామి, పలువురు మంత్రులు పాల్గొన్నారు.

సీఎం సిద్దుపై కుమార విసుర్లు

శివాజీనగర: ఇండియా సమాఖ్య పార్టీలు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ప్రధానిని చేయాలని చెబుతున్నాయి. అయితే ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని చెప్పటం ద్వారా దళిత వర్గానికి అన్యాయం చేసేందుకు సిద్ధమయ్యారని జేడీఎస్ నేత, మాజీ ముఖ్యమంత్రి హెచ్.డీ. కుమారస్వామి ఆరోపించారు. ఒక కన్నడిగుడు ప్రధాని కావాలని సీఎం చెప్పడం లేదు, ఇదెక్కడి చోద్యమని ఎద్దేవా చేశారు. శనివారం బెంగళూరులో జేడీఎస్ ఆఫీసులో ఆయన మాట్లాడుతూ ఖర్గే తరఫున సిద్దరామయ్య మాట్లాడకున్నా ఫర్వాలేదు, వ్యతిరేకంగా మాట్లాడవద్దు అన్నారు. కాగా కరువు బాధిత రైతులకు రూ.2 వేల ఆర్థిక సాయం సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. బెంగళూరు ఫుట్‌పాత్‌లో ట్యాంకర్లను నిలిపి తాగునీరు ఇస్తున్నారు. ఇదేనా బ్రాండ్ బెంగళూరు అని దుయ్యబట్టారు. పంటలు ఎండిపోతున్నా నారాయణపుర జలాశయం నుంచి నీటిని వదలడం లేదని ఆరోపించారు.

కన్నడమే మన మతం



చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

తుమకూరు: అనేక మంది కవులు మన కన్నడ భాష ఉన్నతమైన భాష అని కొనియాడారు, కువెంపు సాహిత్యంలో కన్నడలో సౌందర్యాన్ని సంస్కృతిని అద్భుతంగా వర్ణించారని సీనియర్ కన్నడ కవి ఈఎల్ఎన్ ముకుందరాజ్ అన్నారు. విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన కన్నడ హబ్బని ఆయన ప్రారంభించారు. కళ, సంస్కృతీ సంప్రదాయాలు పురాతన కాలం నుంచి వస్తున్నాయని, అలాంటి వాటిని మన ముందు తరాలవారికి అందేలా చేయాల్సిన బాధ్యత మనపైన ఉందని అన్నారు. కన్నడ భాష మన మతమని కువెంపు వర్ణించారని, కన్నడం అంత గొప్పదని చెప్పారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

బళ్లారిఅర్బన్: మనం ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని కేఆర్‌పీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.ఎస్ దివాకర్ పేర్కొన్నారు. ఆయన శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో జిల్లాధ్యక్షుడు దమ్మూరు శేఖర్, రాష్ట్ర పార్టీ నాయకులు గోనాల్ రాజశేఖరగౌడ, ధరప్ప నాయక్, సునీల్‌కుమార్‌రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్న సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో కేఆర్‌పీపీ మహిళా మోర్చా పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



అవార్డు అందుకుంటున్న బాబూరావ్

రాయచూరు రూరల్: రాయచూరు ఏపీఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు, రైల్వే బోర్డు సలహా సమితి సభ్యుడు బాబూరావ్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో చంద్రయాన్ డీఆర్‌డీఏ అధికారి, శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ప్రభాకర్, అంతర్జాతీయ మానవ హక్కుల సంచాలకుడు రాబర్ట్ డొనాల్డ్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి శివరాజ్ పాటిల్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించారు.



శనివారం మంగళూరు వద్ద జరిగిన కంబళ పోటీలు



కోలారు వార్తలు...

విద్యార్థులకు టీ షర్టుల పంపిణీ



టీ షర్టులను పంపిణీ చేస్తున్న దృశ్యం

కోలారు: తాలూకాలోని వేమగల్ పాఠశాలలో శనివారం ఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా టీషర్టులను పంపిణీ చేశారు. అనంతరం ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై చిన్నచూపు తగదన్నారు. పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ భవిష్యత్ ఏర్పరచుకోవాలన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయ గౌరయర బళగ అధ్యక్షుడు ఎస్ నారాయణస్వామి, గౌరవ అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసన్, ఉపాధ్యక్షుడు వీరణ్ణగౌడ, సహకార్యదర్శి గోవిందు, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఆర్.ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక స్థలాల్లో ఆంక్షలు జారీ

కోలారు: కొత్త సంవత్సరం సందర్భంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో మతపరమైన మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉన్నందున జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో 31వ తేదీ సాయంత్రం 6 నుంచి ఉదయం 8 గంటల వరకు పర్యాటకుల రాకపోకలపై ఆంక్షలు విధిస్తూ జిల్లాధికారి అక్రంబాషా ఉత్తర్వులు జారీ చేశారు. ఏటా కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని జిల్లాలోని పర్యాటక ప్రాంతాలైన తేరహళ్లి కొండ, వక్కలేరి మార్కండేశ్వర కొండ, ముళబాగిలు ఆవనికొండ, అంజనాద్రి కొండ. సూర్యమల్లేశ్వర బెట్ట, సీతబెట్ట తదితర చోట్ల స్థానికులకు తప్ప పర్యాటకుల రాకపోకలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కేజీఎఫ్: కేజీఎఫ్ జిల్లాలోని ఉరిగాంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దోపిడీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. ఈనెల 23న జరిగిన ఇంటి దొంగతనం కేసు విచారణ జరిపిన సీఐ మార్కొండయ్య తమ సిబ్బందితో నిందితుడు ప్రభును అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.2.70 లక్షల విలువ చేసే 45 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

జగనన్నను మళ్లీ అధికారంలోకి తేవాలి



మాట్లాడుతున్న సునీల్ పోసింరెడ్డి



పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ కార్యకర్తలు

- సంక్షేమాన్ని కొనసాగించాలి
- వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ కాఫీ కనెక్ట్‌లో పిలుపు

బనశంకరి: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం– బెంగళూరు ఆధ్వర్యంలో శనివారం మారతహళ్లిలోని ఐకాన్ సూట్స్ బై భగినిలో కాఫీ కనెక్ట్ పేరిట భేటీ జరిగింది.బెంగళూరు ఐటీ వింగ్ అధ్యక్షుడు సునీల్ పోసింరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. మారతహళ్లిలో మొదలుపెట్టి బెంగళూరులో వివిధ ప్రాంతాల్లో ఐటీ వింగ్ ఈ కార్యక్రమాన్ని బృహత్తర స్థాయిలో తీసుకెళ్లాలని సూచించారు. చంద్రబాబు లాగా మనం అబద్ధాలతో ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. మన నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మంచి పనులను అంకెలతో నిరూపించగమని తెలిపారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలోకి తీసుకురావాలని, ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించాలని అన్నారు.

వెబ్‌సైట్ ప్రారంభం

ఈ సందర్భంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఆ వైబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవడం ద్వారా లక్ష మంది ఐటీ ఆర్మీని తయారుచేసి మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేద్దామని సునీల్ పోసింరెడ్డి తెలిపారు.

టూరిస్టులతో కాఫీనాడు కిటకిట

- న్యూ ఇయర్‌కు రాక

యశవంతపుర: కొత్త ఏడాది వేడుకలకు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు రావడంతో చిక్కమగళూరు జిల్లాలోని హోం స్టేలు, రిసార్ట్, హోటల్స్ ఫుల్ అయ్యాయి. కాఫీనాడులో ఎక్కడ చూసినా పర్యటకుల సందడే కనపడుతుంది. బెంగళూరుతో సహా రాష్ట్రం నలుమూల నుంచి ముళ్లయ్యనగిరికి వచ్చారు. ఇక్కడ చుట్టుపక్కల ఉన్న హోంస్టేలు, హోటళ్లు రద్దీగా ఉన్నాయి. ఈ చలికాలంలో పచ్చని పర్వతాలు, పొగమంచుతో కూడిన చిక్కమగళూరు అందాల మధ్య న్యూ ఇయర్ జరుపుకోవడం మధురానుభూతి అని పలువురు సంతోషం వ్యక్తం చేశారు. అనేకమంది నెల రోజుముందుగానే రూంలు బుక్ చేసుకున్నారు. 14 వందల హోంస్టేలు, 2 వందల రిసార్ట్‌లలో ఒక్కటి కూడా ఖాళీ లేవంటే రద్దీ ఎలా ఉందో తెలుస్తుంది. అప్పుడే రిసార్టుల్లో కొత్త ఏడాది ఉత్సవాలు ఆరంభమయ్యాయి. డిసెంబర్‌లో 11 లక్షల మంది పర్యాటకులు జిల్లాను సందర్శించారు.



శాఖాపరమైన కేసులు మాఫీ

యశవంతపుర: బీఎంటీసీ డ్రైవర్, కండక్టర్లపై నమోదైన శాఖపరమైన కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు బీఎంటీసీ ఒక ప్రకటనలో తెలిపింది. బీఎంటీసీలో చిన్నపాటి తప్పులకు మండలి కేసులను నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులతో డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విధుల నుంచి తొలగించడం, జరిమానా, ఇంక్రిమెంట్లు కట్ చేయడం వంటి వాటిని చేస్తున్నారు. ఇలాంటి చిన్నపాటి కేసులను వెనక్కి తీసుకుంటున్నట్లు బీఎంటీసీ తెలిపింది.

కువెంపు సేవలు అమోఘం

సిరుగుప్ప: నగరంలోని చాగి నరసమ్మ, నరసయ్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 50వ కన్నడ రాజోత్సవం సిరి సంభ్రమ ముగింపు, రాష్ట్ర కవి విశ్వమానవ కువెంపు జయంతి సందర్భంగా కువెంపు చిత్రపటానికి ఉపాధ్యాయులు అంజినప్ప పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కన్నడ భాషాభివృద్ధి కోసం కువెంపు చేసిన సేవలు అమోఘమన్నారు.

మైనార్టీల మెప్పు కోసం రైతుల మెడకు ఉరి

శివాజీనగర: రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నా ఎలాంటి పరిహారం ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల మెప్పు కోసం వారి అభివృద్ధికి రూ. 1000 కోట్లు కేటాయించి రైతుల మెడకు ఉరి తాడు బిగిస్తున్నారని ప్రతిపక్ష నాయకుడు ఆర్ అశోక్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ట్వీట్ చేసిన ఆయన కరువుతో రైతులు అల్లాడిపోతుంటే వారికి రూ. 2 వేల పరిహారం ఇచ్చేందుకు కూడా వెనుకా ముందు చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మైనారీల అభివృద్ధికి నిధులు విడుదల చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య శుక్రవారం అల్పసంఖ్యాకుల సంక్షేమ శాఖ ప్రగతి పరిశీలనా సమయంలో అల్పసంఖ్యాకుల కాలనీల అభివృద్ధికి రూ. వెయ్యి కోట్ల కార్యచరణ పథకం రూపొందించాలని ఆదేశించిన విషయంపై ట్విటర్‌లో ప్రతిపక్షనేత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకెంతమంది రైతులు ఆత్మహత్య చేసుకోవాలని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ముస్లిం అభివృద్ధే కాంగ్రెస్ అజెండా అయిందని ట్విటర్‌లో మండిపడ్డారు.

కరవే అధ్యక్షుడి అరెస్టు ఖండిస్తూ ధర్నా

మాలూరు: బెంగళూరులో కరవే రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ, కార్యకర్తల అరెస్టును ఖండిస్తూ శనివారం కరవే కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కరవే తాలూకా అధ్యక్షుడు ఎంఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దుకాణాలపై కన్నడ నామఫలకాలను ఏర్పాటు చేయాలని ఆందోళన చేస్తున్న కరవే కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం తగదన్నారు. వారిని వెంటనే విడిచిపెట్టకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లతాబాయి మాడిక్, ఎంఎల్ సంతోష్, రఘుపతి, డి.రవి, ఎంసీ రవికుమార్, ఎంవీ చేతన్ పాల్గొన్నారు.

కేజీఎఫ్‌లో...

కేజీఎఫ్: బెంగళూరులో కరవే రాష్ట్ర అధ్యక్షుడు టీఏ నారాయణగౌడ, కార్యకర్తల అరెస్టును ఖండిస్తూ శనివారం కరవే కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కరవే తాలూకా అధ్యక్షుడు వీఎస్ ప్రకాష్ మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న కరవే కార్యకర్తలను అకారణంగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం అన్యాయమన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నాగవేణికి వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో కరవే జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మునిరాజు, తాలూకా అధ్యక్షుడు ఎస్.నంజుండప్ప, మురళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

ఆరోగ్యమే మహాభాగ్యం

కోలారు: ఆరోగ్యమే మహాభాగ్యం, ప్రజలు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జేడీఎస్ నాయకుడు సీఎంఆర్ శ్రీనాథ్ తెలిపారు. శనివారం తాలూకాలోని క్యాలనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీఎంఆర్ శ్రీనాథ్ ఫౌండేషన్, ఆర్ ఎల్ జాలప్ప ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మనిషి రోగాలు రాక ముందే జాగ్రత్త పడాలన్నారు. ఎల్లప్పుడు ఆరోగ్యంగా ఉండడం ద్వారా ఉత్తమ జీవితం గడపాలన్నారు. శిబిరంలో 500 మందికి పైగా ఆరోగ్య పరీక్షలను చేయించుకున్నారు. ఈ సందర్భంగా భారత్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కేఎస్ గణేష్, జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు బణకనహళ్లి నటరాజ్, క్యాలనూరు జీపీ అధ్యక్షుడు రమేష్, జాలప్ప ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.



రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

2న రక్తదాన శిబిరం

మాలూరు: ది విక్రం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జనవరి 2న ఉచిత రక్తదాన, కంటి పరీక్ష శిబిరం, అంగన్‌వాడీ కేంద్రాలకు బీరువాలు, పిల్లలకు విద్యా పరికరాల పంపిణీ చేస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు లింగాపుర కిట్టణ్ణ తెలిపారు. ఆయన శనివారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఆరేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన తమ కుమారుడి వర్ధంతి సందర్భంగా ప్రతి యేటా సేవా కార్యక్రమాలను, రక్తదాన, ఆరోగ్య పరీక్షా శిబిరాలను నిర్వహణతో పాటు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ట్రస్టు గౌరవ అధ్యక్షుడు గోవర్ధనరెడ్డి, ఉపాధ్యక్షుడు ఓబుళరెడ్డి, ప్రధాన కార్యదర్శి మంజునాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లింగాపుర కిట్టణ్ణ

క్లుప్తంగా

కవి కువెంపును ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న కన్నడ ఉపన్యాసకురాలు శైలజా

గౌరిబిదనూరు: సమసమాజ నిర్మాణానికి, సమాజంలో మూఢాచారాలను తొలగించడానికి కవి కువెంపు శ్రమించారని, వారి రచనలలోని ఆదర్శాలను నేటి విద్యార్థులు అలవరచుకోవాలని పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ కేపీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం నేషనల్ కళాశాలలో కన్నడ సాహిత్య పరిషత్తు సహకారంతో జరిగిన కువెంపు జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశ్వ మానవునిగా వెలుగొందాలని, మూఢాచారాలకు బలికారాదని కువెంపు తన రచనల్లో తెలియజేశారని అన్నారు. ప్రిన్సిపాల్ గాయత్రి, కన్నడ ప్రాధ్యాపకురాలు డా ఎబి శైలజా కువెంపు జీవితంలో వారి ధ్యేయాలను గురించి తెలిపారు. కార్యక్రమంలో గాయకులు చంద్రశేఖర్, ఉప ప్రిన్సిపాల్ బి నేత్ర, ఎస్ ముగళీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన జైన శిల్పాలు లభ్యం

మైసూరు: మైసూరు తాలూకా వరుణ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్న సమయంలో 11వ శతాబ్దానికి చెందిన రెండు జైన శిల్పాలు బయటపడ్డాయి. శిథిలావస్థలో ఉన్న ఉన్న వాటిని పురావస్తు శాఖ కార్యాలయానికి తరలించారు. చరిత్ర నిపుణుడు డాక్టర్ రంగరాజ, డాక్టర్ శశిధర్, ప్రసన్నకుమార్ తదితరులు ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. గంగలు, హొయ్సలలు కాలంలో వరుణ, వాజమంగళ, వరకొడు దొడ్డ జైన కేంద్రాలుగా ఉన్నాయని గుర్తు చేశారు.

చిన్నారుల కోసం కూసిన మనె కేంద్రాలు



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి

తుమకూరు: నరేగా పథకంలో మహిళా కూలీలతో పాటు వచ్చే చిన్నారుల కోసం కూసిన మనె పథకాన్ని తీసుకువచ్చామని హోం మంత్రి, తుమకూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పరమేశ్వర్ అన్నారు. శనివారం ఆయన తుమకూరు తాలూకా దేవలాపుర గ్రామ పంచాయతీలోని కాడుసిద్దయ్యనపాళ్య గ్రామంలో కూసిన మనె కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ...తల్లులతో వచ్చే పిల్లలను కూసిన మనె కేంద్రంలో వదిలి పెడితే అక్కడ సిబ్బంది వారిని జాగ్రత్తగా చూసుకుంటారని, ఆ సమయంలో మహిళలు తమ పనులు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం తుమకూరు జిల్లాలో 175 గ్రామ పంచాయతీల పరిధిలో కూసిన మనె నిర్మాణాలు చేస్తామన్నారు.

అండర్ డ్రైనేజీ పనుల్లో జాప్యం, ఎమ్మెల్యే ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి: పట్టణంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. తొమ్మిది నెలల ముందు ప్రారంభమైన ఈ పనులు ఇప్పటి వరకు కూడా పూర్తి కాలేదు. విషయం తెలుసుకున్న బాగేపల్లి ఎమ్మెల్యే సుబ్బారెడ్డి శనివారం నగరసభ అధికారులతో సమీక్షించి పనుల జాప్యంపై మండిపడ్డారు. ఎందుకు ఆలస్యమవుతోందని కాంట్రాక్టర్‌పై కూడా అసహనం వ్యక్తం చేశారు. మరో 15 రోజుల్లోపు పనులు పూర్తి చేయాలని సూచించారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి సచిన్ తదితరులు

గౌరిబిదనూరు: వినియోగదారులు మోసాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని, ఒకవేళ మోసపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రధాన సివిల్ జడ్జి సచిన్ తెలిపారు. శనివారం సామర్థ్య సౌధలో ఏర్పాటు చేసిన జాతీయ వినియోగదారుల దినాచరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. వినియోగదారుల్లో చైతన్యం కలిగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాది రామచంద్ర జాతీయ వినియోగదారుల రక్షణ చట్టం పట్ల, పౌర సరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్ జైప్రకాశ్ వినియోగదారుల దినాచరణ ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కార్యదర్శి దయానంద, ఏపీపీ ఫయాజ్ పటేల్, న్యాయవాదులు పాల్గొన్నారు.

హాట్‌స్పాట్స్‌లో సందడే సందడి



కొత్త ఏడాది తొలి క్షణాల్లో హోరెత్తిపోయే ఎంజీ రోడ్డు ఇదే



సంబరాలు మిన్నంటే చర్చి స్ట్రీట్ ప్రాంతం

- కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చ్‌స్ట్రీట్‌లలో మిరమిట్లు గొలిపే వెలుగులు

బనశంకరి: న్యూ ఇయర్ – 2024కు కౌంట్‌డౌన్‌కు కేవలం ఒకరోజు మాత్రమే మిగిలి ఉంది. 2023కు గుడ్‌బై చెప్పి 2024 నూతన ఏడాదికి స్వాగతం పలకడానికి నగరవాసులు ఎదురుచూస్తున్నారు. న్యూ ఇయర్ పార్టీ ప్రియులు ఎంతగానో ఇష్టపడే సిలికాన్ సిటీ, పబ్ క్యాపిటల్‌గా పేరుపొందిన బెంగళూరు నగరం సైతం న్యూ ఇయర్ సంబరాలకు నిలయం. దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చే ప్రజలు బెంగళూరులో ఘనంగా న్యూ ఇయర్‌ను స్వాగతం పలుకుతారు. అందులో సిలికాన్‌సిటీలోని కొన్ని ప్రాంతాలు న్యూ ఇయర్ సంబరాలు ఎంతో ఫేమస్‌గా నిలిచాయి.

ఎంజీ.రోడ్డు, బ్రిగేడ్‌రోడ్డు, చర్చ్‌స్ట్రీట్

బెంగళూరు నగరంలో న్యూ ఇయర్ సంబరాలకు ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన ఎంజీరోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చ్‌స్ట్రీట్‌లో ప్రత్యేక బ్రాండ్లు కలిగిన దుకాణాలు, షాపింగ్‌మాల్స్, రెస్టారెంట్లు, పబ్‌లు, కలిగిన ఈ రెండు రోడ్లలో న్యూ ఇయర్ వేడుకలకు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటాయి. 31న ఎంజీ.రోడ్డు, బ్రిగేడ్‌రోడ్లు రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణ, మ్యూజిక్‌తో ప్రజలు కిక్కిరిసిపోయేలా తరలిరానుండటంతో హాట్‌స్పాట్‌గా ప్రసిద్ధి చెందింది.

ఇందిరానగర, కోరమంగల

ఎంజీ.రోడ్డు, బ్రిగేడ్‌రోడ్డు అనంతరం ఇందిరానగర, కోరమంగల ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇక్కడ అనేక రెస్టారెంట్లు, పబ్స్, మాల్స్ కలిగిన ఈ స్థలాల్లో స్థానిక మార్కెట్లను సైతం చూడవచ్చు. ఫ్యామిలీలతో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించాలనుకునే చాలామంది ఇందిరానగర, కోరమంగలను ఎంపిక చేసుకుంటారు.

యుబీసిటీ

యుబీ సిటీ టవర్ లేదా యుబీ సిటీ బెంగళూరు ఎత్తైన విలాసవంతమైన మాల్. ప్రపంచంలోనే పేరుపొందిన ప్రీమియం బ్రాండ్లతో కూడిన అధికారిక దుకాణాలు కలిగిన యుబీసిటీ హైఫై పార్టీ ప్రియులకు నచ్చిన స్థలం. ప్రతిసారి న్యూ ఇయర్ సమయంలో యుబీసిటీలో విలాసవంతమైన రూఫ్‌టాప్ పార్టీ, డీజే మ్యూజిక్ ఏర్పాటు చేస్తారు. బెంగళూరు నైట్‌లైఫ్ పార్టీని ఎంజాయ్ చేయడానికి అనేక మంది తరలివస్తారు.

ఎలక్ట్రానిక్‌సిటీ, వైట్‌ఫీల్డ్

అనేక సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఉద్యోగులకు నిలయంగా



మారిన ఎలక్ట్రానిక్ సిటీ, వైట్‌ఫీల్డ్ సైతం న్యూ ఇయర్ పార్టీ విషయంలో వెనుకబడలేదు. ఆధునికశైలిలో అనేక పబ్‌లు, రెస్టారెంట్లు, కెఫె, రెస్కోబార్లతో కూడిన ఈ ప్రాంతాల్లో న్యూ ఇయర్ సంబరాలు జోరుగా నిర్వహిస్తారు. 31 తేదీ రాత్రి పార్టీ ప్రియులను ఆకట్టుకునే ప్రముఖ స్థలాలు ఈ ఏరియాల్లో ఉన్నాయి. ఇప్పటికే సందడి ప్రారంభమైంది.

గెలిచేవారికే టికెట్లు ఇవ్వండి

బనశంకరి: రానున్న బీబీఎంపీ, జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికల్లో పార్టీ నిష్ఠావంత కార్యకర్తలకు టికెట్లు ఇవ్వాలని బెంగళూరు దక్షిణ జిల్లా బీజేపీ శాఖ అధ్యక్షుడు ఎస్ఆర్.రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం జయనగర 7వ బ్లాక్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో బీజేపీ పదాధికారుల ప్రత్యేక సమావేశంలో బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీవై.విజయేంద్ర, ఎస్ఆర్.రమేశ్ పాల్గొని మాట్లాడారు. గత నాలుగేళ్లలో బెంగళూరు దక్షిణ జిల్లాలో రాష్ట్ర జిల్లా శాఖలపైకి సంఘటనాత్మకంగా మొదటి స్థానంలో ఉంది. గత నాలుగేళ్లలో పార్టీ అన్ని కార్యకలాపాలు, కార్యవర్గ సమావేశాలు విజయవంతం కావడానికి సహకరించిన జిల్లా పదాధికారులకు, మండల పదాధికారులకు, మోర్చా పదాధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. రానున్న బీబీఎంపీ, జిల్లా, తాలూకాపంచాయతీ ఎన్నికల్లో దక్షిణ జిల్లా 82 వార్డుల్లో 9 జిల్లా పంచాయతీలు, 34 తాలూకా పంచాయతీల్లో 75 శాతం స్థానాలను పార్టీ నిష్ఠావంత యువ కార్యకర్తలకు ఇవ్వాలని, మూడుసార్లు గెలుపొందిన పాలికె సభ్యులు, జిల్లాపంచాయతీ సభ్యులకు టికెట్ ఇవ్వకుండా గెలుపు అర్హత కలిగిన కొత్తవారికి అవకాశం కల్పించాలని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీవై.విజయేంద్రను డిమాండ్ చేశారు. బీవై. విజయేంద్ర మాట్లాడుతూ... ఎస్ఆర్.రమేశ్ విజ్ఞప్తి మేరకు గెలిచేవారికే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డిజిటల్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి రాజేశ్ జీ, ఎమ్మెల్సీ గోపినాథ్‌రెడ్డి, రాజణ్ణ, సంఘటనా ప్రధాన కార్యదర్శి దశరథ్ పాల్గొన్నారు.



సాధన డైరీని విడుదల చేస్తున్న బీవై.విజయేంద్ర, ఎస్ఆర్.రమేశ్, గోపినాథ్ రెడ్డి తదితరులు

గౌరవ డాక్టరేట్ ప్రదానం



చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం తాలూకా సత్యసాయి గ్రామం ముద్దేనహళ్లిలో డాక్టర్ గంగూబాయి హానగల్ ప్రదర్శక కళల విశ్వవిద్యాలయం- మైసూరు ఆధ్వర్యంలో సద్గురు మధుసూదన్‌సాయికి గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఎమ్మెల్యే టీబీ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఉచిత మెడికల్ కాలేజీని నిర్వహించడం మధుసూదన్ సాయి వంటివారికే సాధ్యమవుతుందని కొనియాడారు. వీసీలు నాగేశ్, బి ఎస్ నరసింహమూర్తి, మహదేవ్, శ్రీకంఠమూర్తి వేణుగోపాల్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ఆరు నెలల జైలు, జరిమానా

యశవంతపుర: రోడ్డు దాటుతున్న వ్యక్తిని వాహనంతో ఢీకొట్టి పరారీలో ఉన్న నిందితుడిని ఉప్పారపేట పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా కోర్టు నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష విధించింది. 2016 మార్చి 14న రాత్రి కేజీ రోడ్డు మైసూరు బ్యాంకు జంక్షన్‌లో ఓ అనే వృద్ధుడు అవెన్యూ రోడ్డును దాటుతుండగా బైక్‌తో ఢీకొట్టారు. దీంతో వృద్ధుడికి రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. నిందితుడు వాహనంతో పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి కేసును విచారణ చేసిన సంచార కోర్టు ఆరు నెలల జైలుశిక్షతో పాటు వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

పాత కేసుల్లో ఐదుగురు అరెస్ట్

ప్రమాదానికి సంబంధించిన కేసులో కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న ఐదుగురిని బ్యాటరాయనపుర పోలీసులు అరెస్ట్ చేశారు. 2014 నుంచి 2017 వరకు జరిగిన ప్రమాదాలకు సంబంధించి పాత కేసుల్లో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న ఐదుగురిని బ్యాటరాయనపుర పోలీసులు అరెస్ట్ చేశారు.

డ్రైవర్‌కు జైలుశిక్ష

యశవంతపుర: వాటర్ ట్యాంకర్‌తో పాదచారులను ఢీకొట్టి వారి మరణానికి కారకుడైన డ్రైవర్‌కు బెంగళూరు రెండో సంచార కోర్టు ఐదు వేలు జరిమానాతో పాటు ఏడాది జైలుశిక్ష విధించింది. గాంధీనగర ఐదో మెయిన్‌రోడ్డులో 2010 జూలై 19న నీటి ట్యాంకర్‌ను అజాగ్రత్తగా నడపడంతో రోడ్డుపై నడుచుకుని వెళ్తున్న సంజయ్ కుమార్ (11), శివలీల (47) గాయపడి ఆస్పత్రిలో మృతి చెందారు. గాయపడిన సరస్వతమ్మ (45), పార్థబ (12), అభిలాష్ (12)లు ప్రమాదం నుంచి బయటపడ్డారు. కేసు నమోదు చేసుకున్న ఉప్పారపేట ట్రాఫిక్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసును విచారించిన బెంగళూరు 2వ ఎంఎంటీసీ సంచార కోర్టు నిందితుడు నవీన్‌కుమార్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు ఐదు వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.

కన్నడ పోరాట నాయకులను విడుదల చేయాలి

యశవంతపుర: అరెస్ట్ చేసిన కన్నడ పోరాట నాయకులను తక్షణం విడుదల చేయాలని కన్నడపర పోరాట నాయకుడు వాటాల్ నాగరాజ్ డిమాండ్ చేశారు. కన్నడ కోసం పోరాటం చేస్తున్న రక్షణ వేదిక అధ్యక్షుడు నారాయణగౌడ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. శనివారం బెంగళూరులో విలేకర్లతో మాట్లాడుతూ కన్నడ నామఫలకాలను తప్పనిసరి చేయాలి. కన్నడ పోరాటదారులను విడుదల చేయాలని సీఎం సిద్ధరామయ్యను డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకుంటే బెంగళూరును బంద్ చేస్తామని హెచ్చరించారు.

1న గుండె వైద్య చికిత్స యూనిట్ ప్రారంభం



మాట్లాడుతున్న ఆసుపత్రి ప్రముఖులు గోవిందరెడ్డి

చిక్కబళ్లాపురం: సత్యసాయి గ్రామం ముద్దేనహళ్లిలో సత్యసాయి సరళ మెమోరియల్ ఆసుపత్రిలో జనవరి 1వ తేది గుండె జబ్బుల చికిత్స యూనిట్‌ను పర్యాటక శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ ప్రారంభిస్తారని ఆస్పత్రి ప్రముఖులు గోవిందరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ...దేశంలో అసమానత తొలగించడానికి ఇలాంటి చర్యలకు శ్రీ సద్గురు మధుసూదన్‌సాయి ముందుకువచ్చారని, పేదలు ఉచితంగా ఆరోగ్య సేవలు పొందడానికి ఈ ఆస్పత్రి సిద్ధంగా ఉందన్నారు. జనవరి 1వ తేది 9 గంటలకు తొలి హార్ట్ ఆపరేషన్‌ను నిర్వహిస్తారని అన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో సత్యసాయి సరళ మెమోరియల్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రఘుపతి, వైద్యులు సతీష్‌బాబు ఆనంద్ అగర్వాల్ సి ఎస్ హిరేమఠ, నవీన్ పూజ తదితరులు పాల్గొన్నారు.

సాహస సింహ విష్ణువర్ధన్ అభిమానుల రక్తదానం

మైసూరు: కన్నడ దివంగత నటుడు డాక్టర్. విష్ణువర్ధన్ స్మారకం నిర్మాణానికి బెంగళూరులో స్థలం ఇవ్వాలని ఓ దాతను కోరామని విష్ణువర్ధన్ అల్లుడు, నటుడు అనిరుద్ జత్కర్ అన్నారు. సాహససింహ విష్ణువర్ధన్ 14వ వర్ధంతి సందర్భంగా శనివారం మైసూరు తాలూకా ఉద్దూరు గేట్ వద్ద ఉన్న విష్ణు స్మారకంలో జీవధార రక్తనిధి కేంద్రం సహకారంతో అభిమానులు ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వం ఒకసారి స్థలం ఇచ్చిందని, బెంగళూరులో స్మారకం ఏర్పాటుకు ఓ దాతను స్థలం ఇవ్వాలని కోరామన్నారు.

బీమా చెక్కు వితరణ

యశవంతపుర: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఎంటీసీ డ్రైవర్ మల్లికార్జున భార్య రుద్రమ్మ హిరేమఠకు యూనియన్ బ్యాంక్‌చే రూ.50 లక్షల బీమా పరిహారాన్ని మంత్రి రామలింగారెడ్డి అందించారు. రుద్రమ్మకు బీఎంటీసీ సంస్థలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీఎంటీసీ అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నెలమంగలలో రికవరీ ప్రాపర్టి పరేడ్

దొడ్డబళ్లాపురం: నెలమంగల పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు రికవరీ ప్రాపర్టి పరేడ్ నిర్వహించారు. ఇందుకు సంబంధించి జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండి వివరాలందించారు. మాదనాయకనహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో దోపిడీ, చోరీల కేసుల్లో నిందితుల నుండి రూ.3 లక్షల విలువైన 12 ఖరీదైన మొబైళ్లు, నగదు, మారణాయుధాలు, స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. నెలమంగల గ్రామీణ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తూ, రహదారులపై తిరుగుతూ ఒంటరిగా వెళ్లే పాదచారులు, వాహనదారులను అడ్డగించి కత్తితో బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసి రూ.4 లక్షల విలువైన సరుకు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసిన పోలీసులను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ పురుషోత్తమ్, డీవైఎస్పీ నాగరాజు నెలమంగల పోలీస్ సబ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలందిస్తున్న ఎస్పీ మల్లికార్జున

హోసూరు వార్తలు..

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

హోసూరు: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన బాగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...బాగలూరు సమీపంలోని చూడాపురం గ్రామానికి చెందిన గౌరమ్మ (40) కొద్ది రోజులుగా అనారోగ్యంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతోంది. రోగం నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. బాగలూరు పోలీసులు కేసు విచాణ చేస్తున్నారు.

లారీలో కుళ్లిన మృతదేహం

శివమొగ్గ: శివమొగ్గ నగరంలోని వీరభద్ర సినిమా థియేటర్ వద్ద నిలిపి ఉన్న లారీలో కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు పాదచారుల దుర్మరణం

హోసూరు: హోసూరు, సూళగిరి ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు పాదచారులు మృతి చెందారు. వివరాలు.. అసోం రాష్ట్రానికి చెందిన దిల్ బహదూర్ (24) హోసూరు పారిశ్రామికవాడ మూకొండపల్లిలో నివాసముంటూ అదే ప్రాంతంలోని ప్రైవేట్ పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం హోసూరు- బెంగళూరు హైవేలో ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద నడిచి వెళుతుండగా ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో మరణించాడు.

సూళగిరి సమీపంలోని మరుదాండపల్లి గ్రామానికి చెందిన కూలికార్మికుడు బాబు (47) శుక్రవారం సాయంత్రం సూళగిరి- క్రిష్ణగిరి హైవేలో నడిచి వెళ్తుంటే ఓ బైకిస్టు ఢీకొట్టాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. రెండు ఘటనల్లోనూ పోలీసులు కేసులు నమోదు చేశారు.

నీటితొట్టిలో మహిళ శవం

హోసూరు - బాగలూరు రోడ్డులోని ఓ నీటి తొట్టెలో కుళ్లిన స్థితిలో మహిళ శవం బయటపడింది. దుర్వాసన రావడంతో స్థానికులు హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి విచారించగా బాగలూరు రోడ్డులోని హనుమంత్‌నగర్‌కు చెందిన కణ్మణి భార్య పార్వతి (35) అని, మూడేళ్ల కిందట మతిస్థిమితం కోల్పోయిందని తేలింది. ఆమే వచ్చి నీటి తొట్టిలో పడిపోయిందా, లేక మరేదైనా జరిగిందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

వార్డు ఉప ఎన్నికలో జేడీఎస్ విజయం

దొడ్డబళ్లాపురం: కనకపుర మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో జేడీఎస్ విజయ కేతనం ఎగురవేసింది. డీకే బ్రదర్స్ ఇలాఖాలో జేడీఎస్ చిన్న విజయం సాధించినా అది పెద్ద విజయంగానే భావిస్తున్నారు జేడీఎస్ నేతలు. గత గురువారం జరిగిన ఉప ఎన్నికలో జేడీఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన లోకేశ్ 569 ఓట్లు సాధించి విజయం సాధించారు. గత మున్సిపాలిటీ ఎన్నికల్లో 5వ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థి క్రిష్ణప్ప గెలిచి మున్సిపాలిటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అయితే క్రిష్ణప్ప రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఉప ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన చామరాజ్ 519 ఓట్లు పొందారు. బీజేపీ అభ్యర్థికి కేవలం 18 ఓట్లు మాత్రమే వచ్చాయి.

వరిసాగుపై రైతులకు శిక్షణ

కెలమంగలం: తళి యూనియన్‌లోని వణ్ణాతిపట్టి గ్రామంలో వ్యవసాయ విస్తరణ శాఖ, ఆత్మా పథకం ద్వారా వరిసాగుపై రైతులకు ఒక్క రోజు శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి తళి వ్యవసాయ శాఖ ఉపడైరక్టర్ మురుగేషన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అధికారులు లక్ష్మణకుమార్, జయం, శ్రీనాథ్ తదితరులు పాల్గొని రైతులకు శిక్షణ ఇచ్చారు. వరిసాగులో రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని, వ్యవసాయ శాఖాధికారుల సూచనలతో కొద్దిపాటి మెలకువలు పాటించి ఎక్కువ దిగుబడులను పొందాలని, రైతులు పొలాల్లో ప్రత్యేకంగా షెడ్లు, కుంటలు ఏర్పాటు చేసి పశువులు, కోళ్లు, చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చునని, దీని కోసం ప్రభుత్వం ద్వారా ప్రత్యేక రాయితీలు కల్పిస్తుందని, ఈ సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న రైతులకు ఉచితంగా ఎరువులు, మందులు అందజేశారు. ఈ శిబిరంలో వణ్ణాతిపట్టి, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 40 మందికి పైగా రైతులు శిక్షణ పొందారు.



రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారి

డీఎంకే కార్యకర్తల సమావేశం

హోసూరు: జనవరి 7వ తేదీ జరిగే భూత్‌కమిటీ ఏజెంట్ల సమావేశ నిర్వహణపై శనివారం తళి రోడ్డులోని చెన్నీస్‌మహాల్లో డీఎంకే పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పట్టణ కార్యదర్శి, మేయర్ ఎస్.ఏ సత్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో డీఎంకే పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, 7వ తేదీ జరిగే బూత్ కమిటీ ఏజెంట్ల సమావేశంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో డీఎంకే పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థిని భారీ ఓట్ల మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎంకే నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చెన్నవీరభద్రస్వామికి విశేష పూజలు





కెలమంగలం: డెంకణీకోట తాలూకా బ్లళ్లపల్లి పంచాయతీ ఉబ్బరాయనపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చెన్నవీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. గ్రామంలో పశువులకు గాలికుంటువ్యాధి సోకడంతో బసవేశ్వరస్వామి, చెన్నవీరభద్రస్వామికి పూజలు నిర్వహిస్తే వ్యాధి నశిస్తుందని ఆ ప్రాంత ప్రజల ప్రగాఢ నమ్మకం. అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం తళి సమీపంలోని శివనపల్లి గ్రామంలో వెలసిన ప్రసిద్ధి పొందిన చెన్నవీరభద్రస్వామి ఉత్సవమూర్తిని గ్రామానికి తీసుకొచ్చారు. ఆలయ అర్చకులు వీరగళ్ల వేషాధారణతో వీరకుణితలు వేస్తూ గ్రామానికి చేరుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున విశేష పూజలు నిర్వహించారు. గ్రామంలోని బసవేశ్వరస్వామి, గ్రామదేవత మారియమ్మ, చెన్నవీరభద్రస్వామి ఉత్సవమూర్తులను ఊరేగిస్తూ అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆలయాల్లో తీర్థ ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

వన్యమృగాల దాడుల నివారణపై సమీక్ష

హోసూరు: అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న వన్యమృగాల దాడుల నివారణపై శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో కలెక్టర్ శరయు అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో దట్టమైన అటవీ ప్రాంతాలు ఉండడంతో పెద్ద ఎత్తున వేటగాళ్లు నాటుతుపాకులతో వన్యమృగాలను వేటాడుతూ పట్టుబడుతున్నారు. ఈ దాడులను నివారించడంపై అటవీశాఖాధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ... హైకోర్టు తీర్పు మేరకు అటవీశాఖాధికారులు అటవీ ప్రాంతాల్లో ముమ్మర గస్తీలు చేపట్టాలని, నాటు తుపాకులు, పేలుడు పదార్థాలతో వన్యమృగాల కోసం వేటాడుతున్న వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారిణి కార్తికేయిని, అధికారులు పాల్గొన్నారు.



అటవీశాఖాధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

మంత్రి మధు బంగారప్పపై బీజేపీ ధ్వజం

శివాజీనగర: మధు బంగారప్ప విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఆ శాఖను అధోగతికి తీస్తున్నారని బీజేపీ ధ్వజమెత్తింది. ఈ మేరకు అధికారిక సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసిన బీజేపీ, చెక్‌బౌన్స్ కేసులో కోర్టులో జరిమానా వేయించుకున్న ఘనుడు విద్యాశాఖ మంత్రి అని ఎద్దేవా చేసింది. దాదాపుగా విద్యా సంవత్సరం ముగింపు అవుతుండగా పిల్లలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూ, సాక్స్‌లు ఇప్పటికీ అందలేదు. వారానికి ఒకరోజు బిసిఊట లభిస్తే అదే గొప్ప, స్వామి సిద్దరామయ్య గారు, ఇటువంటి విద్యా మంత్రి రాష్ట్రానికి అవసరమా? క్రమశిక్షణ లేని విద్యామంత్రిచే రాజీనామా చేయించి రాష్ట్ర విద్యాశాఖకు పట్టిన గ్రహణానికి విముక్తి కల్పించాలని డిమాండ్ చేసింది.

విద్యార్థుల చేత ఆ పనులకు చెక్

దొడ్డబళ్లాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేత మరుగుదొడ్లు కడిగించే అమానుష చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఇటీవల ఇలాంటి ఒక సంఘటన జరిగి రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడంతో ప్రభుత్వం ఇరకాటంలో పడింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి పరిస్థితుల్లో కూడా విద్యార్థుల చేత మరుగుదొడ్లు కడిగించడం, వారిచేత పనులు చేయించడం లాంటివి చేయరాదని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి ఒక చట్టాన్ని కూడా ప్రభుత్వం చేయనుంది. ఈ ఆదేశాలు తక్షణం నుండే అమలయ్యేలా సూచించడం జరిగింది. ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేత పనులు చేయిస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ కమిషనర్ బీబీ కావేరి తెలిపారు.

రూ. 150 కోట్ల విలువైన కబ్జా భూమి స్వాధీనం

యశవంతపుర: కబ్జాకు గురైన రూ. 150 కోట్ల విలువైన భూమిని బెంగళూరు అభివృద్ధి ప్రాధికార స్వాధీనం చేసుకుంది. హెచ్‌బీఆర్ లేఔట్ ఫస్ట్ స్టేజ్, కాచరకనహళ్లి గ్రామం సర్వేనంబర్ 181, 182, 183ను 1985లో బీడీఏ భూమిగా గుర్తించింది. ఈ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని భవనాలు, షెడ్లు నిర్మించుకున్నారు. శనివారం ఉదయం రెండు వందల మంది అధికారులు, వంద మంది కార్మికులు, టాస్క్ ఫోర్సు సిబ్బంది అక్కడికి చేరుకుని 2.20 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ 3 అనుబంధ విభాగాలకు సహాధ్యక్షులు


సిద్ధారెడ్డి


దేవేంద్రరెడ్డి


వెంకటేశ్వర్లు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన అనుబంధ విభాగాలను మరింత విస్తృతం చేసింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మూడు అనుబంధ విభాగాలకు సహాధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం సహాధ్యక్షుడిగా అన్నమయ్య జిల్లాకు చెందిన బసిరెడ్డి సిద్ధారెడ్డి, పంచాయతీరాజ్ విభాగం సహాధ్యక్షుడిగా వైఎస్సార్ జిల్లాకు చెందిన గుర్రంపాటి దేవేంద్రరెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ విభాగం సహాధ్యక్షుడిగా పల్నాడు జిల్లాకు చెందిన డాక్టర్ కట్టి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు.

సీఎం జగన్ ప్రభుత్వమే మళ్లీ రావాలని..

ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు బసవరాజు బృందం పాదయాత్ర


చౌడేపల్లెలో బసవరాజు బృందానికి స్వాగతం పలుకుతున్న ఎంపీపీ తదితరులు

చౌడేపల్లె(చిత్తూరు జిల్లా): పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే మళ్లీ రావాలని ప్రజలను చైతన్య పరుస్తూ గుంటూరుకు చెందిన ఏపీ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కట్టిపోగు బసవరాజు ఆధ్వర్యాన చేపట్టిన పాదయాత్ర శనివారం చిత్తూరు జిల్లా చౌడేపల్లికి చేరుకుంది. వారికి చౌడేపల్లిలో ఎంపీపీ రామమూర్తి, వైఎస్సార్ సీపీ నేతలు స్వాగతం పలికారు. బసవరాజు ఆధ్వర్యంలో డేవిడ్, విజయ్, రాజేష్, శ్రీనాథ్ కలిసి నవంబరు 17వ తేదీన ఇడుపులపాయలో పాదయాత్ర ప్రారంభించారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్ర రూట్ మ్యాప్ ఆధారంగా తాము పాదయాత్ర చేస్తూ సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజలను కోరుతున్నట్లు బసవరాజు తెలిపారు. మొత్తం 40 రోజుల్లో 752 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తయిందని చెప్పారు.

పొత్తు పేరుతో జనసేనను హీనంగా చూస్తున్నారు


టీడీపీ గిద్దలూరు ఇన్‌చార్జిపై జనసేన ఇన్‌చార్జి సాయిబాబు ఆగ్రహం



గిద్దలూరు రూరల్: పొత్తు పేరుతో జనసేన పార్టీని టీడీపీ హీనంగా చూస్తోందని జనసేన పార్టీ ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. గిద్దలూరులోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అహంకార ధోరణితో కేవలం గంట వ్యవధిలో మాత్రమే కార్యక్రమాలకు పిలుస్తున్నారని తెలిపారు. ప్రజల్లో వారి ప్రాబల్యం చాటుకునేందుకు తాము వెళ్లేలోపే కార్యక్రమాలు ముగించేస్తున్నారన్నారు. టీడీపీ కేవలం వారి ఉనికిని చాటుకునేందుకు మాత్రమే కార్యక్రమాలు నిర్వహిస్తోందని, తమకు ఎటువంటి విలువ ఇవ్వకుండా హీనంగా చూస్తోందని ధ్వజమెత్తారు. అలాంటప్పుడు పొత్తు ఎందుకని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఏ పార్టీలో ఉండేది కాలమే నిర్ణయిస్తుంది

ఆళ్ల రామకృష్ణారెడ్డి



తాడేపల్లి రూరల్: తాను ఏ పార్టీలో ఉంటాననేది కాలమే నిర్ణయిస్తుందని ఇటీవల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆయన శనివారం మంగళగిరిలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ లోకేశ్ లాంటి వ్యక్తులపై పోటీచేసి గెలిచిన తాను అనుకున్న స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయానన్నారు. తాను వైఎస్ కుటుంబానికి చెందిన వ్యక్తినని, వైఎస్సార్‌సీపీకి, ప్రభుత్వానికి తాను ఎంతో సేవ చేశానని చెప్పారు. తాను పార్టీని వీడినంత మాత్రాన వైఎస్సార్ కుటుంబాన్ని వదులుకోనని, వైఎస్ షర్మిల వెంట నడుస్తానని, ఆమె ఏ నిర్ణయం తీసుకున్నా ఆమె వెంటే ఉంటానని పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో గత 50 ఏళ్లలో జరగని అభివృద్ధిని నాలుగేళ్లలో చేసి చూపించానని, లోకేశ్‌పై పోటీ చేయాలంటే ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. మంగళగిరి నియోజకవర్గానికి నిధులు కేటాయించడంలో ప్రభుత్వం అలసత్వం వహించిందని పేర్కొన్నారు. తనకు టికెట్ ఇవ్వలేదని పార్టీని వీడలేదన్నారు. ఎంతోమంది నాయకులు తనకు ఫోన్ చేసి ఆయా పార్టీల్లోకి రావాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీని వీడినంత మాత్రాన గతంలో వేసిన కేసులపై తన పోరాటం ఆగదని చెప్పారు. తాను ఎందుకు రాజీనామా చేశానో సీఎం వైఎస్ జగన్‌కు తెలుసని, ఇప్పటికీ అందరితోనూ టచ్‌లోనే ఉన్నానని తెలిపారు.

రైతుకు కాదు.. రామోజీకే విపత్తు

ఆర్బీకేల ద్వారా ధ్రువీకరించిన సాగు ఉత్పాదకాల పంపిణీ

- దేశంలో ఎక్కడా లేనివిధంగా నియోజకవర్గ స్థాయిలో అగ్రి ల్యాబ్స్
- గతంలో ఏటా కనీసం 10 వేల శాంపిల్స్ కూడా పరీక్షించలేని పరిస్థితి
- ఇప్పుడు ఏటా 50 వేల శాంపిల్స్ పరీక్షించి నాణ్యత నిర్ధారణ
- ఏటా విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల దుకాణాల తనిఖీ
- నాసిరకంగా ఉంటే తయారీదారులపై క్రిమినల్ చర్యలు
- వాతావరణ ప్రభావంతో తెగుళ్లు, చీడపీడలు

సాక్షి, అమరావతి: వాతావరణ ప్రభావంతో ఏదైనా పంటకు తెగులు సోకినా.. పురుగు వచ్చినా దానికి కూడా రాష్ట్ర ప్రభుత్వమే కారణం అన్నట్టుగా ఉంది ఈనాడు రామోజీరావు రాతలు చదువుతుంటే. సర్టిఫై చేసిన సాగు ఉత్పాదకాలను ఆర్బీకేల ద్వారా గ్రామస్థాయిలో రైతుల ముంగిట అందిస్తూ అన్నదాతలకు అన్నివిధాలుగా అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టను దిగజార్చడమే లక్ష్యంగా నిత్యం రోత రాతలు రాస్తూ రామోజీ పైశాచికానందం పొందుతున్నారు. నకిలీ సాగు ఉత్పాదకాల బారినపడి రాష్ట్రంలో ఏ ఒక్క రైతు నష్టపోకూడదన్న సంకల్పంతో.. పంపిణీ చేసే ముందు వాటి నాణ్యతను పరీక్షించాలన్న లక్ష్యంతో నియోజకవర్గ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్‌ను తీసుకొచ్చింది. ఈ ల్యాబ్‌ల్లో పరీక్షించిన తర్వాతే మార్కెట్‌లోకి తీసుకొచ్చేలా ఏర్పాటు చేసింది. ఆర్బీకేల ద్వారా సర్టిఫై చేసిన ఉత్పాదకాలను మాత్రమే గ్రామస్థాయిలో రైతులకు పంపిణీ చేస్తోంది. ఈ కారణంగానే నాలుగున్నరేళ్లలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వల్ల తాము పంట నష్టపోయామని ఒక్కరంటే ఒక్క రైతు కూడా ఫిర్యాదు చేసిన దాఖలాలు లేవు. ఇవేమీ పట్టని ఈనాడు వాస్తవాలకు ముసుగేసి.. 'విత్తనం నుంచే విపత్తు' అంటూ అడ్డగోలుగా అబద్ధాలతో కథనాన్ని అచ్చేసింది. ఈ కథనంలో పేర్కొన్న అంశాలపై వాస్తవాలు ఇవీ..

ఏటా 50 వేల శాంపిల్స్ పరీక్షిస్తున్నా ఏడుపే

రాష్ట్రంలో ఏటా సగటున 1.25 లక్షల లాట్స్ విత్తనాలు, 2.80 లక్షల బ్యాచ్‌ల పురుగు మందులు, 20 వేల బ్యాచ్‌ల ఎరువులు మార్కెట్‌కు వస్తుంటాయి. గతంలో వీటి నాణ్యతను పరీక్షించేందుకు రాష్ట్ర స్థాయిలో 11 లేబొరేటరీలు మాత్రమే అందుబాటులో ఉండేవి. పెస్టిసైడ్స్ కోసం 5, ఎరువులు, విత్తన పరీక్షల కోసం 3 చొప్పున ఉండేవి. మార్కెట్‌లోకి వచ్చే ఎరువుల్లో 25–30 శాతం, విత్తనాల్లో 3–4 శాతం, పురుగు మందుల్లో ఒక శాతానికి మించి శాంపిళ్లను పరీక్షించే వారుకాదు. దీంతో మార్కెట్‌లో నకిలీలు రాజ్యమేలేవి. ఫలితంగా ఏటా రూ.వేల కోట్ల విలువైన పెట్టుబడిని రైతులు నష్టపోయేవారు. ఈ పరిస్థితికి చెక్ పెట్టాలనే లక్ష్యంతోనే రూ.213 కోట్లతో దేశంలో మరెక్కడా లేనివిధంగా జిల్లా స్థాయిలో 10, నియోజకవర్గ స్థాయిలో 127 ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్‌ను జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లా స్థాయిలో మరో 20 ల్యాబ్స్ నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ ల్యాబ్‌లలో చట్టపరంగా సేకరించిన నమూనాలతో పాటు రైతువారీ వ్యాపార సంబంధమైన విత్తనాలు, ఎరువుల నమూనాలు పరీక్షిస్తున్నారు. గతంలో ఏటా అన్నిరకాల శాంపిల్స్ కలిపి 10 వేలు పరీక్షించడమే కష్టంగా ఉండేది. కానీ.. నేడు అగ్రి ల్యాబ్స్ రాకతో ఏటా సగటున 50వేల శాంపిల్స్‌ను పరీక్షిస్తున్నారు. ఫలితంగా ఎక్కడా నకిలీ విత్తనం, ఎరువు, పురుగు మందుల బారినపడి నష్టపోయామన్న మాటే విన్పించలేదు.



దిగుబడులకు ఢోకా లేదు

ఆహార ధాన్యాల ఉత్పత్తి 2014–19 మధ్యలో సగటున 153.95 లక్షల టన్నులుగా నమోదైతే.. 2019–23 మధ్య 165.40 లక్షల టన్నులుగా నమోదైంది. అంటే 11.45 లక్షల టన్నుల మేర పెరిగింది. ఇక ఉద్యాన పంటల విషయానికి వస్తే టీడీపీ హయాంలో 2018–19లో 17.40 లక్షల హెక్టార్లలో సాగవగా, 305 లక్షల టన్నుల దిగుబడులొచ్చాయి. కాగా ప్రస్తుతం 18.03 లక్షల హెక్టార్లకు విస్తరించగా.. 368.83 లక్షల టన్నుల దిగుబడులు నమోదయ్యాయి. అంటే ఏకంగా 63 లక్షల టన్నులకు పైగా ఉద్యాన పంటల దిగుబడులు పెరిగాయి. నిజంగా నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రాజ్యమేలితే ఈ స్థాయిలో దిగుబడులు పెరుగుతాయా అన్నది ఒక్కసారి రామోజీ ఆలోచన చేయాలి.

ఆర్బీకేల ద్వారా పురుగుల మందుల విక్రయం

2020–21 నుంచి 2021–22 వరకు ఆర్బీకేల ద్వారా రూ.14.01 కోట్ల విలువ చేసే 1,36,443 లీటర్ల పురుగు మందులను 1,50,822 మంది రైతులకు ప్రభుత్వం అందించింది. 2023–24లో రైతులకు అవసరమైన, నాణ్యత పరీక్షించబడిన పురుగు మందులను ఆర్బీకేల ద్వారా రైతులకు సరఫరా చేసేందుకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ అవసరమైన చర్యలు తీసుకుంది. సీజన్లో మందులు దొరకవనే భయంతో రైతులు విత్తనం వేసేప్పుడే అధిక సంఖ్యలో తీసుకుని నిల్వ చేసుకుంటుంటారు. కాగా.. పురుగుల మందుల వినియోగం పెరగడానికి పలు కారణాలు దోహదం చేస్తుంటాయి. 2022–23 సీజన్‌లో అధిక వర్షపాతం వలన గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలలో రైతులు పప్పుధాన్యాల పంటల నుండి వాణిజ్య పంటలైన మొక్కజొన్న, పత్తి, మిరప పంటల వైపు మళ్లారు. రాయలసీమ జిల్లాలలో నూనెగింజల పంటల నుండి పండ్ల తోటలు, పత్తి పంటల సాగు వైపు మొగ్గు చూపారు. మిరపలో వచ్చిన నల్లతామర, పత్తి, మొక్కజొన్నలలో పురుగులు, తెగుళ్ల ఉధృతికి అడ్డుకట్ట వేసేందుకు గతం కంటే కాస్త ఎక్కువగానే పురుగు మందులను వినియోగించారు. అయితే.. ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు తగిన మోతాదులో మాత్రమే వినియోగించాలని ఆర్బీకేల ద్వారా విస్తృత ప్రచారం చేస్తూనే ఉన్నారు.

ఏటా విస్తృత తనిఖీలు.. నాణ్యత లోపిస్తే క్రిమినల్ కేసులు

రాష్ట్రవ్యాప్తంగా ఏటా పురుగు మందులు, ఎరువుల దుకాణాలలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నిర్వహించిన తనిఖీల్లో పురుగు మందుల చట్టం 1968 నిబంధనల ప్రకారం సక్రమంగా లేని రూ.5.21 కోట్ల విలువైన 37,998 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను నిలిపివేశారు. రూ.కోటి విలువైన 17,073 లీటర్ల పురుగు మందులను స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఇంకోవైపు ర్యాండమ్ తనిఖీల్లో భాగంగా ఈ ఏడాది 10,500 పురుగుల మందుల నమూనాలు సేకరించి ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్ ద్వారా పరీక్షించాలని లక్ష్యంగా నిర్దేశించారు. డిసెంబర్ నాటికి 8,159 నమూనాలు సేకరించి పరీక్షించగా, కేవలం 55 నమూనాలు మాత్రమే నాసిరకంగా ఉన్నట్టుగా గుర్తించి సంబంధిత కంపెనీలు, డీలర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తయారీదారుల అభ్యర్థన మేరకు 19 నమూనాల పునర్విశ్లేషణ కోసం పంపించారు. మిగిలిన నాసిరకం పురుగు మందుల ఉత్పత్తిదారులపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశారు. నాణ్యత నిర్ధారణ నిమిత్తం నమూనాలను సేకరించి సంబంధిత పరీక్షా కేంద్రాలకు పంపించటం జరిగింది. ఈ విధంగా అగ్రిల్యాబ్స్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 23,714 పురుగులమందుల నమూనాలను పరీక్షించగా, 175 శాంపిల్స్ నాసిరకంగా ఉన్నట్టుగా గుర్తించారు. తయారీదారులు, సరఫరాదారుల అభ్యర్థన మేరకు 82 నమూనాలను కోర్టు ద్వారా పునర్విశ్లేషణ కోసం పంపించారు. ఇప్పటికే 31 నాసిరకం ఉత్పత్తిదారులపై చట్టపరమైన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేశారు. మిగిలిన 73 నాసిరకమైన నమూనాలకు సంబంధించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. పురుగు మందుల చట్టం నియమ నిబంధనల మేరకు కాల పరిమితికి లోబడి నాసిరకం పురుగుల మందుల ఉత్పత్తిదారులపై తగిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే కేవలం 5 వేల నమూనాలు మాత్రమే తీశారంటూ ఈనాడు అర్థరహితమైన ఆరోపణలు చేసింది.

క్యాండిడేట్స్ కావాలి తమ్ముళ్లూ...!

ఎన్నికలు సమీపిస్తున్నా అనేక చోట్ల టీడీపీకి అభ్యర్థుల కరువు

సాక్షి, అమరావతి : ఒకవైపు ఎన్నికలు ముంచుకొచ్చేస్తున్నాయి... ఎల్లో మీడియాలో ఎన్ని అబద్ధాలు అచ్చేస్తున్నా అసలు పరిస్థితి తెలిసిన తెలుగుదేశం నేతలకు వెన్నులో వణుకు పుడుతోంది. ఎన్నికల బరిలో నిలిపేందుకు అభ్యర్థులు దొరక్క టీడీపీ అధినేత నారా చంద్రబాబు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికీ చాలాచోట్ల తెలుగుదేశం పార్టీకి అభ్యర్థులు లేరు. చంద్రబాబుపై అపనమ్మకం, టీడీపీ పైకి లేవడం కష్టమని గుర్తించిన టీడీపీ ముఖ్య నేతలు స్తబ్దుగా ఉంటున్నారు. గెలవాలంటే మనం భారీగా ఖర్చు పెట్టాలని చంద్రబాబు చెబుతుండడంతో మాజీలు జంకుతున్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటుకి రూ.25 కోట్లు, ఎంపీ సీటు అయితే రూ.50 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని చంద్రబాబు తన సమీప నేతలతో స్పష్టంగా చెబుతున్నట్లు తెలిసింది. చంద్రబాబు డబ్బు వ్యూహం, క్షేత్ర స్థాయిలో పార్టీ పరిస్థితుల్ని చూసి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఎన్ఆర్ఐలు, బాగా డబ్బున్న వాళ్లతో మాట్లాడి అభ్యర్థులుగా ఖరారు చేయాలని చంద్రబాబు తన కోటరీలోని నేతలను పురమాయించినట్లు తెలిసింది. చాలా మందితో సంప్రదిస్తున్నామని, ఎవరూ ముందుకు రావడంలేదని నేతలు వాపోతున్నారు. అమెరికా వెళ్లి క్యాంపెయిన్ చేసి వచ్చినా పార్టీ పరిస్థితిలో ఎలాంటి మార్పూ లేదని వారు పేర్కొంటున్నారు.

సిట్టింగ్ ఎంపీ స్థానాల్లోనూ గందరగోళం

టీడీపీ సిట్టింగ్ ఎంపీ స్థానాలైన గుంటూరు, విజయవాడలో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఇద్దరు సిట్టింగ్‌లు గల్లా జయదేవ్, కేశినేని నాని మళ్లీ పోటీ చేసేది లేదని తేల్చేశారు. గల్లా జయదేవ్ అయితే తాను ఎంపీననే విషయాన్నే మరచిపోయినట్లు కనిపిస్తోంది. ఆయన స్థానంలో ఎవరిని ఎంపీగా పోటీ చేయించాలనే దానిపై చంద్రబాబు ఎంత కసరత్తు చేసినా దారి కనిపించడం లేదని టీడీపీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కొందరు సీనియర్లను పిలిచి గుంటూరు ఎంపీ సీటు ఇస్తానని చెప్పినా చేతులెత్తేసినట్లు సమాచారం. దీంతో ఎవరైనా పారిశ్రామికవేత్తను రంగంలోకి దించాలనే యోచనలో చంద్రబాబు అన్వేషణ కొనసాగిస్తున్నారు. ఈ స్థానానికి రూ.50 కోట్లు పెట్టాలని చంద్రబాబు చెబుతుండడంతో ఎవరూ ముందుకు రాని పరిస్థితి నెలకొంది. విజయవాడ ఎంపీ కేశినేని నాని ఈసారి పోటీ చేసేందుకు ఆసక్తి చూపకపోవడంతో ఆయనకు వ్యతిరేకంగా ఉన్న ఆయన సోదరుడు కేశినేని శివనాథ్‌ను రేసులోకి తీసుకువచ్చారు. చంద్రబాబు, లోకేశ్ చెబుతున్న ఎన్నికల ఖర్చు గురించి విని ఆయన కూడా భయపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి శివనాథ్‌కి ఎంపీ సీటు ఇస్తామని చెబుతున్నా ఆయన కంటె ఎక్కువ ఖర్చు పెట్టే భ్యర్థి దొరుకుతారా అని చంద్రబాబు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

గుడివాడలో ఎన్ఆర్ఐ

విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి ఇప్పటికీ టీడీపీ అభ్యర్థి ఎవరనే దానిపై స్పష్టత లేదు. ఆ పార్టీ సిట్టింగ్ స్థానమైన విజయవాడ తూర్పులో గద్దె రామ్మోహన్ కూడా రూ.50 కోట్ల ఖర్చు గురించి భయపడుతుండడంతో మరో అభ్యర్థి కోసం లోకేశ్ చూస్తున్నారనే ప్రచారం ఆ పార్టీలోనే జరుగుతోంది. కృష్ణా జిల్లా గుడివాడ సీటును ఇదే తరహాలో బేరం పెట్టి పార్టీలో మొదటి నుంచి ఉన్న రావి వెంకటేశ్వరరావును పక్కన పెట్టి ఎన్ఆర్ఐ వెనిగళ్ల రాముకి ఖరారు చేశారు. రాము బాగా ఖర్చు చేయడానికి ముందుకు రావడంతో ఆయన్ను ఇన్‌చార్జిగా ప్రకటించారని నేతలు చర్చించుకుంటున్నారు. గన్నవరంలోనూ వైఎస్సార్‌సీపీ వదిలించుకున్న యార్లగడ్డ వెంకట్రావుతో బేరం కుదుర్చుకున్నారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో బీజేపీ నుంచి వెళ్లిన కన్నా లక్ష్మీనారాయణను తీసుకువచ్చి ఇన్‌ఛార్జిగా ఇచ్చారు. నెల్లూరు జిల్లాలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలను వైఎస్సాఆర్‌సీపీ కాదనుకుంటే టీడీపీ చేర్చుకుంది. ఇలా చాలాచోట్ల వైఎస్సార్‌సీపీ వదిలించుకున్న వారు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలే టీడీపీకి దిక్కవుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఆ పార్టీ అభ్యర్థుల కోసం ఇబ్బందులు పడుతోంది. పోలవరం, కొవ్వూరు, నర్సాపురం, గోపాలపురం వంటి చోట్ల టీడీపీ అభ్యర్థుల కోసం వెతుకులాడుతోంది. ఏలూరు ఎంపీ స్థానంలో ఎవరిని బరిలో నిలపాలనేది టీడీపీకి కష్టంగా మారింది. తూర్పుగోదావరిలోనూ పలుచోట్ల సరైన నేతలు లేక పక్క పార్టీల నేతల వైపు చూస్తున్నారు.

కుప్పంలో ఈదలేక...

చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులో సైతం టీడీపీ పరిస్థితి ఆశాజనకంగా లేదు. స్వయంగా చంద్రబాబే కుప్పంలో ఎదురీదుతున్నారు. కుప్పంలో గెలవడం అనుమానంగా మారడంతో చంద్రబాబు ఈసారి రెండవ స్థానంలో పోటీ చేయడానికి కసరత్తు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఆయన తనయుడు లోకేష్ గత ఎన్నికల్లో మంగళగిరిలో ఓడిపోయి అభాసుపాలైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన అక్కడి నుంచే పోటీ చేస్తానని చెబుతున్నా సురక్షితమైన సీటు కోసం అన్వేషణ కొనసాగిస్తూనే ఉన్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మైలవరంలో ఓటమి ఖాయమనే భయంతో వేరే సీటు కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇలా ప్రతిచోటా తెలుగుదేశం పార్టీలో అయోమయం నెలకొంది.

టీడీపీ 'పాట' పాడిన పవన్‌కళ్యాణ్!

ఏపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందంటూ ప్రధాని మోదీకి ఫిర్యాదు



సాక్షి, అమరావతి: పేదలకు ఇళ్లస్థలాలు, ఇళ్ల నిర్మాణం విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేయడమే కాకుండా, ప్రజాధనాన్ని పూర్తిగా దోపిడీ చేసినట్లుగా కనిపిస్తోందంటూ పవన్‌కళ్యాణ్ ప్రధాని మోదీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ లేఖ రాశారు. పేదలకు సొంతిల్లు పేరుతో కేవలం స్థలాలను సేకరించడం కోసం వైసీపీ ప్రభుత్వం రూ.35,141 కోట్ల నిధులను వెచ్చించిందని, ఇందుకు సంబంధించి నిధులు పక్కదారి పట్టాయని పేర్కొన్నారు. ఈ మొత్తం పథకంలో ఉన్న అన్ని విషయాలను గమనించి ఈ పథకం అమలు తీరుపై సీబీఐతోపాటు ఈడీ విచారణ చేపడితే పేదల గృహ నిర్మాణ పథకంలో జరిగిన అవినీతి బయటపడే అవకాశం ఉందంటూ తెలిపారు. కాగా, నాలుగున్నరేళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని పేదల సంక్షేమానికి చేపడుతున్న వివిధ కార్యక్రమాలను అడుగడుగునా అడ్డుకోవడానికే ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒకేసారి రాష్ట్రంలో దాదాపు 31 లక్షల మందికి పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడంతో పాటు, ఈ మూడున్నర ఏళ్ల కాలంలో 22 లక్షల ఇళ్ల నిర్మాణం కార్యక్రమాన్ని చేపట్టిన విషయం విదితమే. గతంలో తెలుగుదేశం పార్టీ అనేక వేదికలపై చేసిన విమర్శలనే తిరిగి కొత్తగా పవన్‌కళ్యాణ్ ప్రధానికి తాను రాసిన లేఖలో పేర్కొనడం గమనార్హం.

గెలిపిస్తే కుప్పాన్ని అభివృద్ధి చేస్తా

కుప్పం రోడ్‌షోలో చంద్రబాబు

సాక్షి, చిత్తూరు/కుప్పం: పుట్టబోయే బిడ్డలకోసమే తాను కష్టపడుతున్నానని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చెప్పారు. మూడు రోజుల కుప్పం పర్యటనలో చివరి రోజైన శనివారం ఆయన కుప్పం, మల్లానూరులో జరిగిన రోడ్‌షో, సభల్లో మాట్లాడారు. బ్రిటీష్ కాలంలో ఉన్న భూమి పన్నును ఎన్టీఆర్ రద్దు చేస్తే ఇప్పుడు సీఎం భయంకరమైన ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తెచ్చి ప్రజల భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుప్పాన్ని రౌడీ రాజ్యం చేశారని, ఇక రోజులు, గంటలు లెక్క పెట్టుకోవాలని హెచ్చరించారు. తనను మళ్లీ గెలిపిస్తే కుప్పాన్ని మరింత అభివృద్ధి చేసి నిజాయితీ నిరూపించుకుంటామన్నారు. వర్క్ ఫ్రం హోం ద్వారా ఇంట్లో కూర్చునే ప్రపంచంలో ఎక్కడైనా పని చేసే అవకాశం యువతకు కల్పిస్తానని తెలిపారు. సెల్‌ఫోన్లు తెచ్చిన ఘనత తమదేనని చెప్పారు. జగన్‌మోహన్ రెడ్డి బాబాయిని హత్య చేసిన వాడిని పక్కన పెట్టుకుని వివేకా కుమార్తె సునీత, అల్లుడు, సీబీఐ ఆఫీసర్ పైనా కేసులు నమోదు చేశారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో తనను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే కురబలకు ప్రత్యేక బడ్జెట్ ఇస్తామని, టీటీడీ బోర్డులో స్థానం కల్పిస్తానని చంద్రబాబు చెప్పారు. గుడుపల్లి మండలం నలగంపల్లి వద్ద కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆ కులస్తులను ఉద్దేశించి మాట్లాడారు.


చంద్రబాబు రోడ్‌షోకి కరువైన జనం

స్పందన కరువు

జైలుకు వెళ్లి వచ్చాక తొలిసారిగా కుప్పం వస్తున్నందున జనం పోటెత్తుతారని భావించిన టీడీపీ శ్రేణులను ఈ పర్యటన పూర్తిగా నిరాశపర్చింది. బాబు సభలు, రోడ్ షోలకు జనస్పందన కనిపించలేదు. బాబు ప్రసంగం కూడా చాలా పేలవంగా సాగింది. గతంలో తాను 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కుప్పానికి ఎలాంటి అభివృద్ధి చేశానో చెప్పలేకపోయారు.

మాపై ఆ పోలీసు కేసు కొట్టేయండి

- అప్పటి వరకు ఆ కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేయండి
- హైకోర్టులో వివేకా అల్లుడు, కుమార్తె పిటిషన్


జమ్మలమడుగు కోర్టుకు కారులో వస్తున్న సీబీఐ అధికారులు

సాక్షి, అమరావతి/జమ్మలమడుగు: పులివెందుల కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు తమపై పులివెందుల పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం తేలేంత వరకు పులివెందుల పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని వారు కోర్టును కోరారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు విషయంలో నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి సునీత, సీబీఐ అధికారి రాంసింగ్ తనను శారీరకంగా, మానసికంగా వేధించారంటూ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు, కృష్ణారెడ్డి ఫిర్యాదుపై విచారణ జరపాలని పులివెందుల పోలీసులను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ నర్రెడ్డి సునీత, సీబీఐ అధికారి రాంసింగ్‌లపై కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ కూడా దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో రాజశేఖర్‌రెడ్డి, సునీతలు హైకోర్టును ఆశ్రయించారు. తమపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరారు. కృష్ణారెడ్డి ఫిర్యాదును పులివెందుల కోర్టు చాలా యాంత్రికంగా పోలీసులకు పంపిందని వారు తమ పిటిషన్‌లో తెలిపారు. సహేతుక కారణాలను రికార్డ్ చేయకుండానే పులివెందుల కోర్టు కృష్ణారెడ్డి ఫిర్యాదును తదుపరి దర్యాప్తు నిమిత్తం పోలీసులకు పంపడం చట్ట విరుద్ధమన్నారు. తమను, దర్యాప్తు అధికారులను వేధించడానికే కృష్ణారెడ్డి తమపై తప్పుడు ఫిర్యాదు ఇచ్చారని తెలిపారు. కాగా, హైకోర్టులో వేసిన క్వాష్ పిటిషన్‌కు సంబంధించిన మెమోను జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తికి సీబీఐ అధికారులు శనివారం సాయంత్రం సమర్పించారు.

చంద్రబాబు ఓటమి ఖాయం

- కుప్పానికి చంద్రబాబు కుచ్చుటోపీ
- హంద్రీ–నీవా పనులు పూర్తి చేసిన ఘనత సీఎం జగన్‌దే..
- ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


విలేకరుల సమావేశంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

రామకుప్పం(చిత్తూరు జిల్లా): ముప్పైఏళ్లుగా కుప్పం శాసనసభ్యునిగా, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు తన నియోజకవర్గ ప్రజలకిచ్చిన వాగ్దానాలన్నింటినీ తుంగలోతొక్కి.. వారికి కుచ్చుటోపీ పెట్టాడని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. బాబు నైజం తెలిసిన కుప్పం ప్రజలు చంద్రబాబును ఈసారి చిత్తుచిత్తుగా ఓడిస్తారని స్పష్టం చేశారు. మండలంలోని ఆకందగానిపల్లి గ్రామంలో శనివారం విలేకరులతో వారు మాట్లాడుతూ.. గుడుపల్లి నుంచి మల్లానూరు పర్యటనలో భాగంగా రెండు రోజులుగా జరుగుతున్న బహిరంగ సభల్లో చంద్రబాబు తన అబద్ధాల చిట్టాను విప్పారని చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషిచేశానని చెప్పుకుంటున్న చంద్రబాబు.. ప్రభుత్వ మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ 4 సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. చంద్రబాబు.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. కుప్పానికి నీళ్లు ఇచ్చిన తర్వాత ఓటు అడగాలన్న సంకల్పంతో సీఎం హంద్రీ–నీవా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. హంద్రీ–నీవా పనులను పూర్తి చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు ఓటమి భయంతోనే రెండు నియోజక వర్గాల్లో పోటీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కుప్పం నియోజక వర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని స్పష్టం చేశారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

స్కాం అనడానికి ఆధారాలున్నాయా పవన్?

ప్రధానికి రాసిన లేఖపై డిప్యూటీ సీఎం కొట్టు స్పందన



తాడేపల్లిగూడెం : ఇళ్ల స్థలాల్లో రూ.35 వేల కోట్ల స్కాం జరిగిందనడానికి ఆధారాలు చూపిస్తావా పవన్‌కళ్యాణ్ అంటూ డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రశ్నించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు .ప్రధాని మోదీకి లేఖ రాసిన పవన్‌ను అవినీతి ఎలా జరిగిందని అడిగితే తింగరిముఖం వేసుకుని చూడాలన్నారు. ఈ విషయంపై సీబీఐ, ఈడీతో విచారణ జరపాలన్న పవన్‌కళ్యాణ్ ఇంటర్‌పోల్‌ను మర్చిపోయాడని ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. జనసేన పార్టీలో తమ నాయకులు నెగ్గుతారో లేదో చూడకుండా.. చంద్రబాబుకు పవన్ ఊడిగం చేస్తున్నాడని మండిపడ్డారు. కాపులు నాకు ఓట్లు వేయలేదు అంటున్నావ్, మరి నీకు ఎవరు ఓట్లు వేశారో చెప్పు అని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో స్కిల్, అమరావతి భూములు, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్‌నెట్.. ఇలా అన్నీ స్కాములేనని ధ్వజమెత్తారు. ఆ స్కాముల్లో నీకు కూడా వాటా ఉందా అని పవన్‌కళ్యాణ్‌ను నిలదీశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా చంద్రబాబు పాడిన పాటనే పవన్ రాగం అందుకుంటున్నాడని మంత్రి మండిపడ్డారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 31-12-2023



కొత్త సంవత్సరమా మనిషిని మేల్కొలుపు

రోడ్డున ప్రమాదం చూస్తే సాయానికి పరిగెత్తి వెళ్లే మనిషిని,
చుట్టూ చెడు జరిగితే మనకెందుకులే అనుకోని మనిషిని,
ఇరుగింట్లో ఆర్తనాదాలకు చలించే మనిషిని, పొరుగింట్లో కష్టానికి హాజరయ్యే మనిషిని,
ద్వేషమే జీవితంగా బతకని మనిషిని, ఒకరు బాగుపడితే సంతోషపడే మనిషిని,
అడుగంటిపోయిన మానవత్వాన్ని జాగృతం చేసుకునే మనిషిని,
మనిషి మీద నమ్మకం నిలిపే మనిషిని, ఓ కొత్త సంవత్సరమా మేల్కొలుపు.

వద్దు.

నమ్మాల్సిన చోట నేరం చేసే మనిషి వద్దు.

భర్తగా ఉంటూ, భార్యగా ఉంటూ, స్నేహితుడిగా ఉంటూ, అత్త మామగా ఉంటూ, బంధువుగా ఉంటూ... వీరిని నమ్మొచ్చు, వీరిని కాకపోతే ఎవరిని నమ్ముతాం... అనుకున్న సందర్భంలో కూడా నేరం చేసి, ప్రాణం తీసి మనిషి మీద నమ్మకమే పోగొట్టిన– 2023లో చాలాసార్లు కనపడిన మనుషి– కొత్త సంవత్సరంలో వద్దు.

'అయ్యో... నా గోడు ఎవరూ వినట్లేదే' అని కన్నపిల్లలతో పాటు నిస్సహాయంగా వెళ్లి చెరువులో దూకే కన్నతల్లి వద్దు. 'నా బాధ అమ్మానాన్నలు వినట్లేదే'నని హాస్టల్ ఫ్యాన్లకు వేళ్లాడే ముక్కుపచ్చలారని పిల్లలూ వద్దు. నలుగురు సంతానం ఉన్నా, మీ దగ్గర ఉంచుకుని నాలుగు మెతుకులు పెట్టండి చాలు అంటున్నా వృద్ధాశ్రమాల్లో తల్లిదండ్రులను పడేసి వారిని బాధించే స్వార్థ సంతానం వద్దు. సాకులు చెప్పే సంతానం వద్దు. ముఖ్యంగా– తల్లిదండ్రుల శాపం అందుకునే సంతానం వద్దు.

జీవితమంటే అనుక్షణం డబ్బు సంపాదనే అనుకునే, ఎంత ఉన్నా సరిపోదనుకునే మనిషి వద్దు. అందుకు ఉద్యోగ బాధ్యతలను కలుషితం చేసే, ప్రజల భవిష్యత్తును బలి పెట్టే మనిషి వద్దు. కల్తీ చేసే మనిషి, విషం లాంటి ఆహారం అమ్మే, కూరనారలను రసాయనం చేసే మనిషి వద్దు. వ్యసనపరులుగా మార్చే ఉత్పత్తులను తయారు చేసే మనిషి వద్దు. అందుకు అనుమతించే ప్రభుత్వ నేతలూ వద్దు.

వైద్యం తెలియని వైద్యుడు వద్దు. దైవభీతి పాపభీతి లేని వైద్యుడు వద్దు. రోగి మీద దయ, సానుభూతి లేని వైద్యుడు వద్దు. రోగుల అశ్రువులను అంతస్తులుగా చేసి ఆస్పత్రులు నిర్మించాలనుకునే వైద్యుడు వద్దు. చదువుల పేరుతో తల్లిదండ్రుల కడుపులో గంజిని కూడా తాగే విద్యావ్యవస్థల యజమాని కూడా వద్దు.

మూర్ఖుడు వద్దు. మూకస్వభావము ఉన్నవాడూ వద్దు. ఎవరో రెచ్చగొడితే రెచ్చిపోయి సాటి మనిషిని ద్వేషించే వాడు వద్దు. బతకగోరని వాడు వద్దు. బతకనివ్వనివాడు వద్దు. అమాయకుల నుంచి లాక్కుని నింగినీ, నేలనూ మింగేసేవాడు వద్దు. ఉద్యోగుల గోడు వినని యజమాని వద్దు. పిలిస్తే పలకని పోలీసు వాడు వద్దు. న్యాయం వైపు నిలవని తీర్పు కూడా వద్దు.

2024 సంవత్సరమా...

ఎన్నో ఆశలను కల్పిస్తూ అడుగిడుతున్న నూతన వత్సరమా...

ఎంత జరిగినా ఏమి జరిగినా 'మానవుడే మహనీయుడు' అని నిరూపించే నిదర్శనాలను ఈ సంవత్సరం చూపు. మనిషిని మేల్కొలుపు. మనిషి తప్ప మరెవరూ ఈ జగతిని శాంతితో, కాంతితో నింపలేరు.

కుడికాలు ముందు పెట్టి రా తల్లీ!

త్రివిధ దళ ప్రతిభావంతుల ప్రథమ అడుగు

రివైండ్ 2023

త్రివిధ దళాలలో మహిళా అధికారులకు సంబంధించి ఈ సంవత్సరంలో ఎన్నో 'ప్రథమం'లు కనిపిస్తాయి. మహిళా సైనికులు ఆర్టిలరీ బ్రాంచిలలోకి అడుగుపెట్టారు. యుద్ధనౌకల కమిషనింగ్ బృందంలో భాగం అయ్యారు. అత్యంత కఠినమైన యుద్ధభూమి సియాచిన్‌లోకి వైద్యసేవల కోసం వెళ్లారు. భారత నావికా దళానికి చెందిన గైడెడ్ క్షిపణి విధ్వంసక నౌక 'ఐఎన్ఎస్' ఇంఫాల్ మహిళా అధికారులు, నావికులతో ప్రత్యేక వసతులతో కూడిన తొలి యుద్ధనౌకగా అవతరించింది, నావికా, వైమానిక దళాలు తమ ఆపరేషన్‌లకు సంబంధించిన ప్రతి విభాగం లోకి మహిళలను అనుమతిస్తున్నాయి. ఇంతకాలం పురుషులు మాత్రమే నాయకత్వ స్థానంలో ఉండే విభాగాలలో ఈ సంవత్సరం మహిళా అధికారులు నాయకత్వ స్థానాల్లోకి వచ్చారు....


పాయల్ చబ్ర


ప్రేరణ దేవస్థలి


సునీతా బీఎస్


షాలిజా ధామి


గీతా రాణా


మనీషా పధి


ఫాతిమా వసిమ్

■ హరియాణాలోని జింద్ జిల్లాకు చెందిన చెందిన **పాయల్ చబ్ర** ఎంబీబీఎస్, ఎంఎస్ చేసింది. అంబాలా కంటోన్మెంట్‌ని ఆర్మీ హాస్పిటల్, లడఖ్‌లోని ఖర్దుంగ్లా ఆర్మీ హాస్పిటల్‌లో పనిచేసింది. ఆ తరువాత లడఖ్‌లోని ఆర్మీ హాస్పిటల్‌లో సర్జన్‌గా పనిచేసింది. ఒకవైపు సర్జన్‌గా పనిచేస్తూనే మరోవైపు పారో కమాండో కావడానికి ఆగ్రాలోని పారాట్రూపర్స్ ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణ పొందింది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తరువాత పారా మిలిటరీ ప్రత్యేక భద్రతా దళంలో చేరిన తొలి మహిళా ఆర్మీ సర్జన్‌గా ప్రత్యేకత సాధించింది.

■ ముంబాయికి చెందిన **ప్రేరణ దేవస్థలీ** సెయింట్ జేవియర్స్ కాలేజీలో సైకాలజీలో గ్రాడ్యుయేషన్ చేసింది. 2009లో భారత నావికా దళంలో చేరింది. పశ్చిమ నౌకాదళానికి చెందిన పెట్రోలింగ్ నౌక 'ఐఎన్ఎస్ త్రిన్కాత్' ఫస్ట్ ఫిమేల్ కమాండింగ్ ఆఫీసర్‌గా చరిత్ర సృష్టించింది. ప్రేరణ సోదరుడు ఇండియన్ నేవీలో పనిచేస్తాడు. అతడి స్ఫూర్తితోనే నావికాదళంలోకి వచ్చింది ప్రేరణ. 'భారత నౌకాదళం అవకాశాల సముద్రం. స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా మనల్ని మనం నిరూపించుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి' అంటుంది ప్రేరణ.

■ ఢిల్లీ కంటోన్మెంట్‌లోని భారత సైన్యానికి చెందిన రక్తమార్పిడి కేంద్రం(ఎఎఫ్‌టీసీ) ఫస్ట్ ఉమెన్ కమాండింగ్ ఆఫీసర్‌గా ప్రత్యేకత చాటుకుంది కల్నల్ సునీతా బీఎస్. రోహ్‌తక్ మెడికల్ కాలేజీలో 'పాథాలజీ'లో పీజీ చేసిన సునీత అరుణాచల్‌ప్రదేశ్‌లో మిలిటరీ ఆస్పత్రిలో కమాండింగ్ ఆఫీసర్‌గా పనిచేసింది.

■ 'ఫ్రంట్‌లైన్ ఐఏఎఫ్ కంబాట్ యూనిట్' కమాండర్ బాధ్యతలు స్వీకరించిన తొలి మహిళ షాలిజా ధామి. 2003లో హెలికాప్టర్ పైలట్ అయింది. 2,800 గంటలకు పైగా విమానాన్ని నడిపిన అనుభవం ఆమె సొంతం. వెస్టర్న్ సెక్టార్‌లోని హెలికాప్టర్ యూనిట్‌లో ఫ్లైట్ కమాండర్‌గా పనిచేసింది. పంజాబ్‌లోని లూధియానా ధామి స్వస్థలం. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ చేసింది. భారత వైమానిక దళంలో శాశ్వత కమిషన్‌ను పొందిన మొదటి మహిళా అధికారిగా నిలిచింది.

■ తూర్పు లడఖ్‌లో భారత్–చైనా సరిహద్దు ప్రాంతంలో ఉన్న 'స్వతంత్ర ఫీల్డ్ వర్క్‌షాప్'కు పురుష అధికారులు మాత్రమే నాయకత్వ స్థానంలో ఉండేవారు. ఈ ఏడాది ఆ అవకాశం గీతా రాణాకు వచ్చింది. స్వతంత్ర ఫీల్డ్ వర్క్‌షాప్‌కు కమాండ్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలి మహిళా అధికారిగా గీతా రాణా ప్రత్యేకత నిలుపుకుంది. ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీర్స్(ఈఎంఈ) ట్రైనింగ్ సెంటర్‌లో ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు నిర్వహించింది గీతా రాణా.

■ స్క్వాడ్రన్ లీడర్ మనిషా పధి మిజోరం గవర్నర్ సహాయకురాలి (ఏడీసీ)గా నియామకం అయింది. మన దేశంలో గవర్నర్‌కు ఎయిడ్–డి–క్యాంప్(ఏడీసీ)గా నియామకం అయినా ఫస్ట్ ఉమన్ ఇండియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఆఫీసర్‌గా చరిత్ర సృష్టించింది. మనిషా స్వస్థలం ఒడిషా రాష్ట్రంలోని బెర్హంపూర్. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో గ్రాడ్యుయేషన్ చేసింది. ఎయిర్ ఫోర్స్ స్టేషన్–బీదర్, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్–పుణె చివరగా భటిండాలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో పనిచేసింది.

■ ప్రపంచంలో అత్యంత ఎత్తయిన యుద్ధక్షేత్రం సియాచిన్ గ్లేసియర్. వైద్యసేవలు అందించడానికి ఈ ప్రమాదకరమైన యుద్ధక్షేత్రంలోకి అడుగు పెట్టిన తొలి మహిళా మెడికల్ ఆఫీసర్ (ఆపరేషనల్ పోస్ట్)గా ప్రత్యేకత చాటుకుంది కెప్టెన్ ఫాతిమా వసిమ్. దీనికిముందు 'సియాచిన్ బ్యాటిల్ స్కూల్'లో ఎన్నో నెలల పాటు కఠోరమైన శిక్షణ తీసుకుంది.

వింటర్ హెల్త్ ప్రాబ్లమ్స్

సెల్యులైటిస్ అంటే?



సెల్యులైటిస్ అనేది ఓ చర్మ వ్యాధి. కొన్ని బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌లతో చర్మంపై పగుళ్లు రావడం, ఎర్రబారడం, కొద్దిపాటి వాపు మంట వంటి లక్షణాలతో బాధించే ఈ వ్యాధి తాలూకు బాధలు చలికాలంలో ఉష్ణోగ్రతలు మరింత తక్కువగా ఉన్నప్పుడు మరింత ఎక్కువవుతాయి. అసలు సెల్యులైటిస్ రావడానికి ఏయే అంశాలు కారణమవుతాయి, లక్షణాలేమిటి, చలికాలంలో ఇది ఎందుకిలా మరింత ఎక్కువగా బాధిస్తుంది వంటి అనేక అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.

చర్మం పగుళ్లబారినట్లుగా కనిపిస్తూ, కొద్దిపాటి వాపు, ఎర్రబారడం వంటి వాటితో వ్యక్తమయ్యే ఈ వ్యాధి స్ట్రెప్టోకాకస్, స్టెఫాలోకాకస్ వంటి బ్యాక్టీరియా కారణంగా వస్తుంది. చర్మంపై ఒకచోట వస్తే మిగతా చోట్లకు పాకుతుంది. అయితే ఇది అంటువ్యాధి కాదు. ఒకరినుంచి మరొకరికి వ్యాపించదు.

ప్రేరేపించే అంశాలు...

స్ట్రెప్టోకాకస్, స్టెఫాలోకాకస్ వంటి బ్యాక్టీరియా వల్ల వచ్చినప్పటికీ... కొన్ని అంశాలు దీన్ని తీవ్రతరం చేస్తాయి. అవి... ● కాళ్లు, చేతుల్లోని రక్తనాళాల్లో ఏమైనా సమస్యలతో రక్తసరఫరాలో తేడాలు ● ఊబకాయం ● కాళ్లవాపులు ● డయాబెటిస్ ● మద్యం తాగే అలవాటు ● పై కారణాలతో పాటు వ్యాధి నిరోధక వ్యవస్థ బలహీనం కావడం.

లక్షణాలు...

ఈ ఆరోగ్య సమస్యలో కనిపించే ఓ కీలకమైన అంశం ఏమిటంటే... సాధారణంగా సెల్యులైటిస్ దేహంలోని ఒకవైపునే కనిపిస్తుండటం విశేషం. ఈ వ్యాధి ఉన్నవారిలో కనిపించే సాధారణ లక్షణాలివి... ● ఈ వ్యాధి సోకిన ప్రాంతంలో చర్మం దురద పెడుతుండటంతో పాటు ఈ దురదలు క్రమంగా పక్కలకు వ్యాపిస్తూ ఉంటాయి. ● వ్యాధిసోకిన చర్మపు ప్రాంతంలో వాపు, ముట్టుకోనివ్వకపోవడం (టెండర్‌నెస్) ● నొప్పి, వేడిగా అనిపించడం ● జ్వరంతో పాటు అది కొందరిలో చలిజ్వరంగా వ్యక్తం కావడం. ● సెల్యులైటిస్ వచ్చిన ప్రాంతాల్లో మచ్చలతో పాటు నీటిపొక్కుల్లా (బ్లిస్టర్స్) రావడం. ● కొందరిలో చర్మంపై గుంటల్లా పడుతూ, చర్మం వదులైన తోలు మాదిరిగా కనిపించడం (స్కిన్ డింప్లింగ్).

చలికాలంలో బాధలు ఎందుకు పెరుగుతాయంటే...

సెల్యులైటిస్ లక్షణాలతో వచ్చే బాధలు చలికాలంలో పెరగడానికి, ఈ సీజన్‌లో చర్మంపై కనిపించే కొన్ని అంశాలు దోహదపడతాయి. ఉదాహరణకు...

చర్మం పొడిబారడం (డ్రైస్కిన్): ఈ సీజన్‌లో తేమ తగ్గడంతో చర్మం బాగా పొడిబారిపోతూ ఉండటం చాలామందికి అనుభవంలో వచ్చే విషయమే.


డా॥ నరేంద్రనాథ్ మేడ
సీనియర్ వాస్క్యులార్ సర్జన్

పైగా చలిగాలులకు వెళ్లినప్పుడు మరింతగా పెరుగుతుంది. ఇలా పొడిబారిన చర్మం బ్యాక్టీరియా చేరడానికి అనువుగా ఉంటుంది. దాంతో సెల్యులైటిస్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అందుకే ఈ సీజన్‌లో మాయిశ్చరైజర్లతో చర్మాన్ని తేమగా ఉంచుకుంటే ఇలా పగుళ్లబారడంతో పాటు సెల్యులైటిస్‌నూ నివారించవచ్చు.

వ్యాధినిరోధక వ్యవస్థ బలహీనపడటం / వ్యాధినిరోధక శక్తి తగ్గడం : చలికాలంలో మామూలుగానే వ్యాధినిరోధక వ్యవస్థ పనితీరు కాస్త మందగించే అవకాశముంది. దీనికి తోడు డయాబెటిస్ ఉండటం, మద్యం అలవాట్ల వంటివి ఉంటే అది వ్యాధి నిరోధక వ్యవస్థను మరింత మందకొడిగా మార్చవచ్చు. ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో సమతులాహారం తీసుకోకపోవడం, ఆహారంలో విటమిన్లు, మినరల్స్ వంటి పోషకాలు తక్కువగా ఉండటం లాంటి అంశాలు పరిస్థితిని మరింత తీవ్రతరం చేసే అవకాశముంది.

సెల్యులైటిస్ నివారణ ఇలా...

● చర్మాన్ని శుభ్రంగా, తేటగా ఉంచుకోవాలి. ● ఘాటైన రసాయనాలతో కూడిన వాసన సబ్బులు కాకుండా, మైల్డ్ సోప్ వాడాలి. ● మిగతా చర్మంతో పోలిస్తే... మేనిపై పొడిగా ఉండే భాగాలైన మోచేతులు, మోకాళ్ల వంటి చోట్ల మాయిశ్చరైజర్ వంటివి రాసి, తేమగా ఉండేలా చూసుకోవడం మంచిది. ● చర్మం పగుళ్ల బారి, తోలు రేగిన ప్రాంతాల్లో వాటిని గిల్లడం, లాగడం చేయకూడదు. ● గోళ్లు, చర్మంతో గోళ్ల ముడిపడే భాగాల్ని శుభ్రంగా ఆరోగ్యకరంగా ఉండేలా చూసుకోవాలి. లేదంటే అక్కడి నుంచి బ్యాక్టీరియా చర్మంపై దాడి చేసే అవకాశాలుంటాయి. ● చలికాలంలో చర్మానికి మంచి రక్షణ కలిగేలా, ఒళ్లంతా కప్పి ఉంచేలాంటి దుస్తులు వాడటం మేలు. చలి గాలులు వేగంగా తాకకుండా ఉండేలా దుస్తులు ఉండాలి. ● తమ వ్యక్తిగత దుస్తులు, సామగ్రిని ఇతరులతో పంచుకోకూడదు. ● ఇల్లు శుభ్రం చేసుకోవడం, తోటపని వంటి మన రోజువారీ కార్యక్రమాల్లో చర్మానికి ఎలాంటి గాయాలు కాకుండా జాగ్రత్తపడాలి. ఎక్కడైనా చర్మం తెగినా, గాయపడ్డా డాక్టర్ సలహా మేరకు తగిన యాంటీబయాటిక్ క్రీమ్స్ వంటివి రాస్తూ, గాయాలు వేగంగా తగ్గేలా జాగ్రత్త తీసుకోవాలి. ● పాదాల ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా బాగా పొడిబారి పగుళ్లకు అవకాశం ఉండే మడమలు, అలాగే వేళ్ల మధ్యభాగాలు తేమతో, ఆరోగ్యంగా ఉంచుకునేలా జాగ్రత్త వహించాలి. ● రోజూ తగినన్ని నీళ్లు తాగాలి. ● వ్యాధినిరోధక వ్యవస్థ చురుగ్గా ఉండేందుకు అన్ని పోషకాలూ, విటమిన్లు, మినరల్స్‌తో కూడిన మంచి ఆరోగ్యకరమైన సమతులాహారం తీసుకుంటూ ఉండాలి. ● డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, తమ జబ్బులను అదుపులో పెట్టుకునేలా క్రమం తప్పకుండా మందులు వాడటం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ● క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

చికిత్స...
సెల్యులైటిస్ తగ్గడానికి డాక్టర్ సూచనల మేరకు తగిన యాంటిబయాటిక్స్ తీసుకోవడం, ఇతరత్రా ఇన్ఫెక్షన్లు రాకుడా జాగ్రత్త వహించడం చేయాలి. పరిస్థితి తీవ్రమైతే హాస్పిటల్ చికిత్స అవసరం

చివరగా... చలికాలంతో కొన్ని సౌకర్యాలున్నప్పటికీ... దాంతోపాటు మరికొన్ని ఆరోగ్యసమస్యలనూ తీవ్రం చేసే సీజన్ అది. అందుకే తగిన జాగ్రత్తలు తీసుకుంటూ చర్మాన్నీ, దేహాన్నీ ఆరోగ్యంగా ఉంచుకుంటే ఈ సీజన్ నిరపాయకరంగా గడిచిపోతుంది.

ఆర్థ్రరైటిస్!!

చలికాలంలో మరింత పెరిగే కీళ్లనొప్పులు!

చలికాలం కీళ్లనొప్పులతో బాధపడేవారికి ఓ పీడకల. కీళ్లలో ఇన్‌ఫ్లమేషన్ వచ్చి నొప్పి కలిగించే 'ఆర్థరైటిస్' సమస్య చలికాలంలో పెచ్చుమీరడానికి కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులు కారణాలవుతాయి. అవేమిటో, చలికాలంలో ఈ కీళ్లనొప్పుల నుంచి ఉపశమనం పొందడం ఎలా... వంటి అనేక విషయాలపై అవగాహన కోసం ఈ కథనం.

చలికాలంలో ఆర్థ్రైటిస్‌తో బాధపడేవారి వెతలు మరింతగా పెరుగుతాయి. అందుకు కారణాలు ఈ కింది విధంగా ఉంటాయి.


చలికాలంలో కీళ్లనొప్పులు పెరిగేదెందుకంటే...

మానవ శరీరంపై వాతావరణం ప్రభావం తప్పక ఉంటుంది. దేహంలో జరిగే చాలా జీవక్రియలు, రోగనిరోధక వ్యవస్థ వాతావరణంలోని తేడాలకు తగ్గట్లుగా మార్పులకు లోనవుతుంటాయి. దాంతో ఆర్థ్రైటిస్ కీళ్లనొప్పులతో బాధపడేవారి కండరాలు మరింతగా బిగుసుకుపోవడం, బాధలు పెరగడం జరుగుతాయి. వయసు పెరుగుతున్నకొద్దీ ఈ బాధలూ పెరుగుతాయి. ఇందుకు దోహదపడే అంశాలివి...

● చలికాలంలో చేయి లేదా కాలి వేళ్లకు రక్తప్రసరణ కాస్త మందగిస్తుంది. ఇలా జరగడాన్ని వైద్య పరిభాషలో 'రెనాడ్స్ ఫినామినా' అంటారు. అప్పటికే ఆర్థ్రైటిస్‌తో బాధపడుతున్న వారిలో ఇది మరింత ఎక్కువ. ఇది మరింత తీవ్రతరం అయినప్పుడు కొందరిలో చేతివేళ్లు, కాలివేళ్లు కుళ్లిపోయే ప్రమాదమూ ఉంటుంది. ఇలా జరగడాన్ని 'గ్యాంగ్రీన్' అంటారు.

● ఆర్థ్రైటిస్ వల్ల లంగ్స్ ప్రభావితం అయినప్పుడు ఐఎల్‌డీ అనే జబ్బు వచ్చి, చలికాలంలో తీవ్రత మరింత పెరిగి బాధితుల్లో దగ్గు, ఆయాసం పెరుగుతాయి.

● మయోసైటిస్ అనే రకం కీళ్లవాతంతో బాధపడేవారిలో ఈ కాలంలో కండరాలకి రక్తప్రసరణ తగ్గడంతో వాటి కదలికలు మరింత తగ్గుతాయి. ఫలితంగా తగినంత వ్యాయామం సమకూరక... వ్యాధి లక్షణాలు పెరిగి, ఇబ్బందికరంగా మారతాయి. అందుకే కీళ్లనొప్పులతో బాధ పడుతుండేవారు చలికాలం వస్తుందంటేనే ఆందోళన చెందుతుంటారు.


డా॥ విజయ ప్రసన్న పరిమి
సీనియర్ కన్సల్టెంట్ రుమటాలజిస్ట్

ఈ కాలంలో కీళ్ల నొప్పులు తగ్గాలంటే...

ఆర్థ్రైటిస్‌తో బాధపడుతున్నవారు కొన్ని చిన్న చిన్న సూచనలు పాటించడం ద్వారా చలికాలంలో పెరిగే తమ బాధలను చాలావరకు అధిగమించడం సాధ్యమే. ● శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవాలి. ఉన్ని దుస్తులు, కాళ్లకు సాక్స్, చేతులకు గ్లౌవ్స్ ధరించాలి. వెచ్చదనం వల్ల నొప్పిని కలిగించే రసాయనాల తొలగింపు ప్రక్రియ, వాటిని బయటకు పంపడం మరింత వేగవంతమవుతుంది. వెచ్చదనం కారణంగా రక్తప్రవాహమూ మెరుగుపడుతుంది. కండరాలు బిగుసుకుపోవడమూ తగ్గుతుంది.

● చలికాలంలో కండరాల కదలికలు ఇబ్బందికరంగా మారడం, నొప్పులు మరింత తీవ్రతరం కావడంతో బాధితులు తమ దేహ కదలికలను బాగా తగ్గిస్తారు. దాంతో తగినంత వ్యాయామం సమకూరకపోవడంతో బాధలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే వీరు తమకు శ్రమ కలగని రీతిలో ఎంతోకొంత వ్యాయామం చేయాలి.

● చలికాలంలో సూర్యరశ్మి తక్కువ. ఫలితంగా ఒంట్లో విటమిన్–డి ఉత్పత్తి కూడా తగ్గుతుంది. ఈ కారణంగా వ్యాధి లక్షణాల పెరిగి, బాధలు మరింత పెచ్చరిల్లుతాయి. అందువల్ల అప్పటికే ఆర్థ్రైటిస్‌తో బాధపడుతున్నవారు డాక్టర్లు నిర్ణయించిన మోతాదులో, వారు సూచించిన కాలానికి విటమిన్–డి సప్లిమెంట్లు తీసుకోవాలి.

● ఈ కాలం వైరస్, బ్యాక్టీరియాల మనుగడకు అనుకూలంగా ఉండటంతో అంటువ్యాధులు పెరిగే ప్రమాదం ఉంటుంది. వాటి వల్ల కీళ్ల వాతాల తీవ్రతా పెరగవచ్చు. కాబట్టి ఆర్థ్రైటిస్ రోగులు చలికాలం రాకముందే డాక్టర్లు సూచించిన వ్యాక్సిన్లు తీసుకోవాలి. పైగా అంటువ్యాధుల వల్ల వయోవృద్ధులకు ముప్పు ఎక్కువగా ఉంటుంది కాబట్టి వారు తప్పనిసరిగా వ్యాక్సిన్లు తీసుకోవాలి. ● చలికాలంలో నీళ్లు, ద్రవాహారాలు తక్కువగా తీసుకుంటూ ఉంటారు. దాంతో ఒంట్లో ద్రవాలు తగ్గి, డీ–హైడ్రేషన్ ముప్పు పెరుగుతుంది. అందుకే ఈ కాలంలో అందరూ తగినన్ని నీళ్లు, ద్రవాహారాలు తీసుకుంటూ ఉండాలి. ● ఆర్థ్రైటిస్ కోసం వాడే మందుల్ని డాక్టర్ సలహా మేరకు క్రమం తప్పకుండా తీసుకుంటూ ఉండాలి.



ఈ జాగ్రత్తల ద్వారా ఆర్థ్రైటిస్ బాధితులు చలికాలంలో ఎదుర్కొనే బాధలను చాలావరకు నివారించుకోవచ్చు.

మెడి టిప్

వింటర్‌లో ముఖం తేటగా ఉండాలంటే...!



చలికాలంలో ముఖం పొడిబారిపోవడమూ, పెదవులు పగలడం, ముఖంపై ముడతలు రావడం చాలా సాధారణం. అందరికీ తెలిసిన చిట్కా వ్యాజలైన్ రాయడంతో పాటు ఈ కాలంలోనూ ముఖం తేటగా, ఆరోగ్యంగా ఉంచేందుకు పాటించాల్సిన చిట్కాలివి...

● చలికాలంలో ఉదయం, సాయంత్రం మంచుకురుస్తున్నా... మధ్యాహ్నపు ఎండ తీక్షణంగా గుచ్చుతున్నట్టుగా ఉంటుంది. ఈ మంచుకూ, మధ్యాహ్నపు ఎండకూ నేరుగా ముఖచర్మం ఎక్స్‌పోజ్ కాకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఈకాలంలో ఉండే మంచు, పొగ కలిసిన కాలుష్యం... స్మాగ్‌లోకి వెళ్లకుండా జాగ్రత్తపడాలి. ● తేలికపాటి వ్యాయామం వల్ల ముఖానికి తగినంత రక్తప్రసరణ జరిగి ముఖం తేటగా మారుతుంది. ● రోజుకి కనీసం ఆరు నుంచి ఎనిమిది గంటల నిద్రతో ముఖం తేటబారుతుంది.

ఆహార పరంగా...

● అన్ని రకాల పోషకాలు అందే సమతులాహారాన్ని రోజూ తీసుకోవాలి. అయితే చలి వాతావరణం కారణంగా నీళ్లు తక్కువగా తాగుతుంటారు. ఇది సరికాదు. రోజూ తప్పనిసరిగా మూడు లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగాలి. ● ఆకుకూరలు, కూరగాయలూ, ములగకాడల వంటి తాజా కూరలను ఎక్కువగా తీసుకోవాలి. ఈ సీజన్‌లో దొరికే పండ్లను తప్పక తీసుకోవాలి. ఇందులోని నీటిమోతాదులూ, పోషకాలూ, యాంటీ ఆక్సిడెంట్స్ చర్మం ఆరోగ్యాన్ని మెరుగుపరచి ముఖాన్ని తేటగా కనిపించేలా చేస్తాయి.

● డ్రైఫ్రూట్స్ పరిమితంగా తీసుకుంటూ ఉండాలి. అందులో జీడిపప్పు వంటి కొవ్వులు ఎక్కువగా ఉండే నట్స్ కంటే బాదం పప్పు వంటి కొవ్వులు తక్కువగా ఉండే నట్స్ ఎక్కువగా తీసుకోవాలి.



హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా తిలక్ వర్మ

దేశవాళీ క్రికెట్ టోర్నీ రంజీ ట్రోఫీలో తొలి రెండు మ్యాచ్‌ల్లో పాల్గొనే హైదరాబాద్ జట్టును ప్రకటించారు. భారత జట్టు సభ్యుడు ఠాకూర్ తిలక్ వర్మ హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. రాహుల్ సింగ్ గహ్లోత్ వైస్ కెప్టెన్‌గా ఉంటాడు. గత రంజీ ట్రోఫీ సీజన్‌లో ఎలైట్ డివిజన్‌లో పోటీ పడ్డ హైదరాబాద్ తమ గ్రూప్‌లో చివరిస్థానంలో నిలవడంతో ఈసారి 'ప్లేట్ డివిజన్'లో పోటీ పడనుంది. ప్లేట్ డివిజన్‌లో హైదరాబాద్‌తోపాటు సిక్కిం, నాగాలాండ్, మేఘాలయ, మిజోరం, అరుణాచల్‌ప్రదేశ్ జట్లున్నాయి. హైదరాబాద్ తమ తొలి మ్యాచ్‌ను జనవరి 5 నుంచి నాగాలాండ్‌తో, రెండో మ్యాచ్‌ను జనవరి 12 నుంచి మేఘాలయతో ఆడుతుంది.

హైదరాబాద్ రంజీ జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), రాహుల్ సింగ్ గహ్లోత్ (వైస్ కెప్టెన్), తన్మయ్ అగర్వాల్, సీవీ మిలింద్, రోహిత్ రాయుడు, టి.రవితేజ, తనయ్ త్యాగరాజన్, చందన్ సహని, కార్తికేయ కక్, నితేశ్ కన్నల, సాయిప్రజ్ఞయ్ రెడ్డి, సాకేత్ సాయిరామ్, అభిరత్ రెడ్డి, సాగర్ చౌరాసియా, ఇ.సంకేత్. స్టాండ్‌బైస్: రాహుల్ బుద్ధి, జావీద్ అలీ, యశ్ గుప్తా, రిషబ్ బస్లాస్, టీపీ అనిరుధ్. గణేశ్. డీబీ రవితేజ (హెడ్ కోచ్), పవన్ కుమార్ (అసిస్టెంట్ కోచ్), రొనాల్డ్ రోడ్రిగ్స్ (ఫీల్డింగ్ కోచ్), రియాజ్ ఖురేషి (టీమ్ మేనేజర్), సుభాశ్ పాత్రో (స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్), సంతోష్ (ఫిజియో), కృష్ణా రెడ్డి (వీడియో ఎనలిస్ట్), సాజిద్ హుస్సేన్ (మసాజర్).

సవిత సారథ్యంలో...

పారిస్ ఒలింపిక్స్ మహిళల హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ బరిలోకి భారత్



బెంగళూరు: స్వదేశంలో జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు జరిగే పారిస్ ఒలింపిక్స్ మహిళల హాకీ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 18 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు గోల్‌కీపర్ సవిత పూనియా నాయకత్వం వహిస్తుంది. ఈ టోర్నీలో టాప్-3లో నిలిచిన జట్లు పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధిస్తాయి. మొత్తం ఎనిమిది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో చిలీ, చెక్ రిపబ్లిక్, జర్మనీ, జపాన్... గ్రూప్ 'బి'లో భారత్, ఇటలీ, న్యూజిలాండ్, అమెరికా జట్లున్నాయి. భారత్ తమ తొలి లీగ్ మ్యాచ్‌ను 13న అమెరికాతో ఆడుతుంది. ఆ తర్వాత 14న న్యూజిలాండ్‌తో, 16న ఇటలీతో టీమిండియా తలపడుతుంది.

భారత హాకీ జట్టు: సవిత పూనియా (కెప్టెన్, గోల్‌కీపర్), బిచ్చూ దేవి ఖరీబమ్ (గోల్‌కీపర్), నిక్కీ ప్రధాన్, ఉదిత, ఇషికా చౌధరీ, మోనిక, నిషా, వైష్ణవి విఠల్ ఫాల్కే, నేహా, నవ్‌నీత్ కౌర్, సలీమా టెటె, సోనిక, జ్యోతి, బ్యూటీ డుంగ్‌డుంగ్, లాల్‌రెమ్‌సియామి, సంగీత కుమారి, దీపిక, వందన కటారియా.

టైటాన్స్‌కు ఏడో ఓటమి

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. యు ముంబాతో శనివారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 32-54తో ఓడిపోయింది. ఈ లీగ్‌లో టైటాన్స్ జట్టుకిది ఏడో పరాజయం కావడం గమనార్హం. యు ముంబా తరఫున గుమన్ సింగ్ 10 పాయింట్లు, రింకూ 8 పాయింట్లు, సోంబీర్ 8 పాయింట్లు స్కోరు చేశారు. టైటాన్స్ తరఫున రజనీశ్ 8 పాయింట్లు, రాబిన్ చౌధరీ 7 పాయింట్లు, ప్రఫుల్ 7 పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 35-25తో యూపీ యోధాస్‌ను ఓడించింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో గుజరాత్ జెయింట్స్‌తో బెంగాల్ వారియర్స్; తమిళ్ తలైవాస్‌తో బెంగళూరు బుల్స్ తలపడతాయి.

రిచా పోరాటం వృథా

రెండో వన్డేలోనూ ఓడిన భారత మహిళల జట్టు • సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకున్న ఆస్ట్రేలియా

ముంబై: గెలవాల్సిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు పోరాడి ఓడింది. సిరీస్ పరాజయంతో ఈ ఏడాదిని ముగించింది. 259 లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ 47 ఓవర్లలో 237/6 వద్ద పటిష్టంగానే కనిపించింది. 18 బంతుల్లో 22 పరుగుల విజయ సమీకరణం భారత మహిళలకే అనుకూలంగా ఉంది. కానీ తర్వాతి వరుస ఓవర్లలో పూజ (8), హర్లీన్ (1) అవుట్ కావడంతో ఓటమి ఖాయమైంది. 6 బంతుల్లో 16 పరుగులు చేయలేకపోయింది. తుదకు ఆసీస్ మహిళల జట్టు 3 పరుగుల తేడాతో భారత్‌పై గెలిచింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. గాయం పంటిబిగువన భరించిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రిచా ఘోష్ (117 బంతుల్లో 96; 13 ఫోర్లు)... జెమీమా రోడ్రిగ్స్ (55 బంతుల్లో 44; 3 ఫోర్లు) అండతో అద్వితీయ పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. సిరీస్‌లోని చివరిదైన మూడో వన్డే జనవరి 2న జరుగుతుంది.

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. ఓపెనర్ లిచ్‌ఫీల్డ్ (98 బంతుల్లో 63; 6 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాటర్ ఎలీస్ పెరీ (47 బంతుల్లో 50; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు సాధించారు. ఇద్దరు మూడో వికెట్‌కు 77 పరుగులు జోడించారు.



రిచా



దీప్తి

తర్వాత వచ్చిన వారిలో తాలియా (24; 2 ఫోర్లు), అనాబెల్ సదర్లాండ్ (23; 1 ఫోర్), జార్జియా (22; 1 ఫోర్, 1 సిక్స్) కాస్త మెరుగ్గా ఆడారు. అయితే టెయిలెండర్ అలానా కింగ్ (17 బంతుల్లో 28 నాటౌట్; 3 సిక్స్‌లు) కొట్టిన భారీ సిక్సర్లతో ఆసీస్ 250 పైచిలుకు స్కోరు చేయగలిగింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ (5/38) వరుస విరామాల్లో వికెట్లను పడగొట్టింది. తర్వాత భారత్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 255 పరుగులకే పరిమితమైంది. అనాబెల్ సదర్లాండ్ (3/47) కీలక సమయంలో విలువైన వికెట్లను తీసి భారత్ గెలుపు రాతను మార్చింది. ఫీల్డింగ్‌లో గాయపడిన స్నేహ్ రాణా స్థానంలో హర్లీన్ డియోల్ కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగింది. బెత్ మూనీ కొట్టిన షాట్‌ను బంతిని అందుకునే క్రమంలో చెరోవైపు నుంచి వచ్చిన స్నేహ్ రాణా, పూజ ఇద్దరి తలలు పరస్పరం ఢీకొని విలవిలలాడారు. తలనొప్పితో స్నేహ్‌రాణా మైదానం వీడింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: లిచ్‌ఫీల్డ్ (సి) రిచా (బి) శ్రేయాంక 63; అలీసా హీలీ (బి) పూజ 13; ఎలీస్ పెరీ (సి) శ్రేయాంక (బి) దీప్తి శర్మ 50; బెత్ మూనీ (ఎల్బీడబ్ల్యూ) (బి) దీప్తి శర్మ 10; తాలియా (బి) దీప్తి శర్మ 24; గార్డ్‌నెర్ (సి) అమన్‌జీత్ (బి) స్నేహ్ రాణా 2; అనాబెల్ (సి అండ్ బి) దీప్తి 23; జార్జియా (సి) స్మృతి (బి) దీప్తి శర్మ 22; అలానా కింగ్ (నాటౌట్) 28; కిమ్ గార్త్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 258. వికెట్ల పతనం:** 1-40, 2-117, 3-133, 4-160, 5-170, 6-180, 7-216, 8-219. **బౌలింగ్:** రేణుక 7-0-36-0, పూజ 10-0-59-1, అమన్‌జోత్ 3-0-21-0, శ్రేయాంక 10-0-43-1, స్నేహ్ రాణా 10-0-59-1, దీప్తి శర్మ 10-0-38-5.

భారత్ ఇన్నింగ్స్: యస్తిక (ఎల్బీడబ్ల్యూ) (బి) కిమ్ గార్త్ 14; స్మృతి (సి) తాలియా (బి) అలానా 34; రిచా ఘోష్ (సి) లిచ్‌ఫీల్డ్ (బి) అనాబెల్ 96; జెమీమా (సి) లిచ్‌ఫీల్డ్ (బి) వేర్‌హమ్ 44; హర్మన్‌ప్రీత్ (సి) హీలీ (బి) వేర్‌హమ్ 5; దీప్తి శర్మ (నాటౌట్) 24; అమన్‌జోత్ (బి) అనాబెల్ 4; పూజ (సి) గార్డ్‌నెర్ (బి) అనాబెల్ 8; హర్లీన్ (బి) గార్డ్‌నెర్ 1; శ్రేయాంక (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 255. వికెట్ల పతనం:** 1-37, 2-71, 3-159, 4-171, 5-218, 6-224, 7-240, 8-243. **బౌలింగ్:** గార్డ్‌నెర్ 10-0-46-1, బ్రౌన్ 7-0-37-0, కిమ్ గార్త్ 6-0-24-1, అనాబెల్ సదర్లాండ్ 9-0-47-3, అలానా కింగ్ 7-0-43-1, తాలియా 4-0-15-0, జార్జియా వేర్‌హమ్ 7-0-39-2.

నెట్స్‌లో గాయపడ్డ శార్దూల్

సెంచూరియన్: తొలి టెస్టులో ఓడిన భారత్‌కు మరో దెబ్బ! బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా సెంచూరియన్ టెస్టు ఆడిన శార్దుల్ ఠాకూర్ గాయపడ్డాడు. అయితే ఇది మ్యాచ్ సమయంలో కాదు! నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా అతని ఎడమ భుజానికి గాయమైంది. వెంటనే జట్టు ఫిజియో ఐస్ ప్యాక్‌తో ఉపశమన సపర్యలు చేశాడు. అనంతరం మళ్లీ ప్రాక్టీస్‌కు దిగలేదు. దీంతో అతను కేప్‌టౌన్‌లో జనవరి 3 నుంచి జరిగే ఆఖరి టెస్టుకు దూరమయ్యే అవకాశముంది. గాయం తీవ్రతను తెలుసుకునేందుకు శార్దుల్ భుజానికి స్కానింగ్ తీయాల్సి ఉంది. దీన్నిబట్టే అతను అందుబాటులో ఉంటాడ లేదా అనే విషయంపై స్పష్టత వస్తుంది.

సఫారీ బౌలర్ కొయెట్జీ అవుట్

దక్షిణాఫ్రికా పేసర్ గెరాల్డ్ కొయెట్జీ రెండో టెస్టుకు దూరమయ్యాడు. 23 ఏళ్ల బౌలర్ పొత్తికడుపు నొప్పితో సతమతమవుతున్నాడు. ఈ నొప్పితోనే తొలిటెస్టు ఆడటంతో వాపు మొదలైందని జట్టు వర్గాలు తెలిపాయి. దీంతో కొయెట్జీ కేప్‌టౌన్ టెస్టుకు అందుబాటులో లేడని దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు సోషల్ మీడియా 'ఎక్స్' ద్వారా వెల్లడించింది. ఇదివరకే రెగ్యులర్ కెప్టెన్ బవుమా కూడా గాయంతో రెండో టెస్టుకు గైర్హాజరు కానున్నాడు. కొయెట్జీ స్థానాన్ని ఎన్‌గిడి, ముల్డర్‌లలో ఒకరితో భర్తీ చేసే అవకాశముంది.



వినేశ్ కూడా వెనక్కిచ్చేసింది!

కర్తవ్య పథ్ వద్ద 'ఖేల్‌రత్న'... 'అర్జున' పురస్కారాలను వదిలి వెళ్లిన భారత మహిళా స్టార్ రెజ్లర్


న్యూఢిల్లీ: భారత స్టార్ మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ కూడా కేంద్ర క్రీడా అవార్డులను వెనక్కి ఇచ్చేసింది. శనివారం కర్తవ్యపథ్ వద్ద ఆమె 'ఖేల్‌రత్న', అర్జున అవార్డులను వదిలేసి వెళ్లింది. కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడలు, ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో పతకాలతో ఆమె దేశానికి కీర్తిప్రతిష్టలు తెచ్చిపెట్టింది. ఫొగాట్ ఘనతలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న', అర్జున అవార్డులను ఇచ్చింది. అయితే భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ)లో మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన వివాదాస్పద మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ వర్గమే కొత్తగా ఎన్నికైంది. ఆయన విధేయుడైన సంజయ్ సింగ్ అధ్యక్షుడు అయ్యారు. దీన్ని ఏమాత్రం జీర్ణించుకోలేని స్టార్ రెజ్లర్ సాక్షి మలిక్ నిమిషాల వ్యవధిలోనే రిటైర్మెంట్ ప్రకటించింది. బజరంగ్ 'పద్మశ్రీ'ని వెనక్కిచ్చాడు. బధిర రెజ్లర్ వీరేందర్ సింగ్ కూడా తన పురస్కారాన్ని వెనక్కిస్తున్నట్లు ప్రకటించాడు. తాజాగా ఫొగాట్ కూడా ముందు ప్రకటించినట్లే ఖేల్‌రత్న, అర్జున అవార్డుల్ని వెనక్కి ఇచ్చేందుకు ప్రధానమంత్రి నివాసానికి బయల్దేరింది. కర్తవ్యపథ్ వద్ద ఢిల్లీ పోలీసులు ఆమెను అడ్డుకోవడంతో అవార్డుల్ని రోడ్డుపైనే వదిలేసింది. ఆ పురస్కారాలు ఇప్పుడు పోలీసుల ఆధీనంలో ఉన్నాయి.



అర్జున్ ఆరో స్థానంలో... హారిక ఏడో స్థానంలో

సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు విశేషంగా రాణించినా పతకాలు మాత్రం సాధించలేకపోయారు. శనివారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో ఓపెన్ విభాగంలో భారత్ నుంచి తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ అత్యుత్తమంగా ఆరో స్థానాన్ని సాధించాడు. నిర్ణీత 21 రౌండ్ల తర్వాత అర్జున్ 14 పాయింట్లతో మరో ముగ్గురితో (నెపోమ్‌నిషి, లెవాన్ అరోనియన్, డెనిస్ లాజావిక్) కలిసి ఉమ్మడిగా ఐదో స్థానంలో నిలిచాడు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా నెపోమ్‌నిషికి ఐదో ర్యాంక్, అర్జున్‌కు ఆరో ర్యాంక్, అరోనియన్‌కు ఏడో ర్యాంక్, డెనిస్‌కు ఎనిమిదో ర్యాంక్‌లు ఖరారయ్యాయి. భారత్‌కే చెందిన ఇతర గ్రాండ్‌మాస్టర్లు అరవింద్ చిదంబరం 14వ ర్యాంక్‌లో, ప్రజ్ఞానంద 28వ ర్యాంక్‌లో, నారాయణన్ 35వ ర్యాంక్‌లో, గుకేశ్ 38వ ర్యాంక్‌లో నిహాల్ సరీన్ 43వ ర్యాంక్‌లో నిలిచారు.

మహిళల విభాగంలో భారత్ నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక అత్యుత్తమ ప్రదర్శన చేసింది. నిర్ణీత 17 రౌండ్ల తర్వాత హారిక 11 పాయింట్లతో ఏడో ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. హారికతోపాటు మరో ఎనిమిది మంది క్రీడాకారిణులు కూడా 11 పాయింట్లు స్కోరు చేశారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా హారికకు ఏడో ర్యాంక్ దక్కింది. భారత్‌కే చెందిన దివ్య దేశ్‌ముఖ్ 13వ ర్యాంక్‌లో, కోనేరు హంపి 17వ ర్యాంక్‌లో, సాహితి వర్షిణి 27వ ర్యాంక్‌లో, వైశాలి 36వ ర్యాంక్‌లో, ప్రియాంక నూతక్కి 46వ ర్యాంక్‌లో నిలిచారు.





కార్ల్‌సన్‌కే మళ్లీ కిరీటం

ఓపెన్ బ్లిట్జ్ విభాగంలో నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ మళ్లీ ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు. కార్ల్‌సన్ 16 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఓవరాల్‌గా కార్ల్‌సన్‌కిది 17వ ప్రపంచ టైటిల్ కావడం విశేషం. మహిళల బ్లిట్జ్ విభాగంలో రష్యా గ్రాండ్‌మాస్టర్ వాలెంటీనా గునీనా 14 పాయింట్లతో రెండోసారి ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. 2012లోనూ గునీనా ఈ టైటిల్ సాధించింది.




2023 రౌండప్ సినిమా



'వాల్తేరు వీరయ్య'లో చిరంజీవి



'సలార్'లో ప్రభాస్



'దసరా'లో నాని



'ఖుషి'లో సమంత, విజయ్ దేవరకొండ

స్ట్రయిట్ చిత్రాలు 236... డబ్బింగ్ సినిమాలు 70... మొత్తం 306 చిత్రాలను 2023 ఇచ్చింది. మరి జయాపజయాల శాతం ఎంత? అంటే... ఎప్పటిలానే విజయాలను వేళ్ల మీద లెక్క పెట్టొచ్చు... అపజయాలు లెక్కలేనన్ని. అయితే విజయం సాధించినవాటిలో ఎమోషనల్‌గా సాగేవి ఎక్కువగా ఉన్నాయి. ఆ విధంగా ఈ ఏడాది భావోద్వేగాలకు ప్రేక్షకులు ప్రాధాన్యం ఇచ్చారనుకోవచ్చు. ఇక ఈ ఏడాది 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు..' పాటకిగాను కీరవాణి, చంద్రబోస్‌లకు ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డు దక్కడం ఓ రికార్డ్. తెలుగు నుంచి జాతీయ తొలి ఉత్తమ నటుడి అవార్డు అల్లు అర్జున్‌కి దక్కడం మరో ఆనందం. ఇలా కొన్ని ఆనందాలను ఇచ్చింది 2023. కె. విశ్వనాథ్, జమున, కైకాల సత్యనారాయణ, చంద్రమోహన్ వంటి వారిని దూరం చేసి, విషాదాన్ని మిగిల్చింది. ఇక... ఈ ఏడాది లెస్ హిట్.. మోర్ ఫట్‌గా సాగింది తెలుగు సినిమా. ఆ విశేషాల్లోకి...

లెస్ హిట్... మోర్ ఫట్



'సార్'లో ధనుష్



'డెవిల్'లో కల్యాణ్ రామ్, సంయుక్తా మీనన్



'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'లో అనుష్క, నవీన్ పొలిశెట్టి

స్టార్ హీరోలు కొందరు 'హిట్ హిట్ హుర్రే' అంటూ మంచి విజయాలు అందుకున్నారు. వారితో పాటు కొందరు మీడియమ్ రేంజ్, చిన్న రేంజ్ హీరోలకూ 2023 విజయానందాన్నిచ్చింది. ఆ హిట్స్ గురించి తెలుసుకుందాం.

సంక్రాంతి అంటే సినిమాల పండగ. అలా ఈ ఏడాది పండగకి అన్నదమ్ముల సెంటిమెంట్ నేపథ్యంలో వచ్చిన చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', అన్నాచెల్లెళ్ల అనుబంధం నేపథ్యంలో వచ్చిన బాలకృష్ణ 'వీరసింహారెడ్డి' మంచి వసూళ్లు రాబట్టాయి. చిరంజీవి హీరోగా, రవితేజ ఓ కీలక పాత్రలో 'వాల్తేరు వీరయ్య'కు బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వం వహించగా, 'వీరసింహారెడ్డి' సినిమాకు గోపీచంద్ మలినేని దర్శకత్వం వహించారు. సంక్రాంతికి మంచి హిట్ అందుకున్న బాలకృష్ణ దసరా పండక్కి 'భగవంత్ కేసరి'తోనూ మరో హిట్ సాధించారు. తండ్రీకూతుళ్ల సెంటిమెంట్‌తో దర్శకుడు అనిల్ రావిపూడి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌కు ఈ ఏడాది ఓ హిట్.. ఓ ఫట్ పడ్డాయి. 'సలార్: సీజ్‌ఫైర్'తో ప్రభాస్‌కి సూపర్ డూపర్ హిట్ దక్కింది. స్నేహం ప్రధానాంశంగా ఈ సినిమాను దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కించారు. ఈ ఏడాది నానీకి బాగా కలిసొచ్చింది. శ్రీకాంత్ ఓదెలను దర్శకుడిగా పరిచయం చేస్తూ నాని హీరోగా నటించిన మాస్, ఎమోషనల్ మూవీ 'దసరా' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అలాగే శౌర్యువ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో నాని హీరోగా నటించిన ఎమోషనల్ మూవీ 'హాయ్ నాన్న' కూడా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. విజయ్ దేవరకొండ, సమంతల వెండితెర ప్రేమకథ 'ఖుషీ' కూడా ప్రేక్షకులను ఖుషీ చేసింది. శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందిన ఈ ఎమోషనల్ లవ్‌స్టోరీ మంచి వసూళ్లు రాబట్టుకుంది. తమిళ స్టార్ ధనుష్ తెలుగులో చేసిన స్ట్రయిట్ ఫిల్మ్ 'సార్'. తెలుగు, తమిళ భాషల్లో వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన ఈ పీరియాడికల్ యాక్షన్ అండ్ మెసేజ్ ఓరియంటెడ్ చిత్రం ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంది. నాలుగేళ్లగా హీరోయిన్‌గా తెలుగు వెండితెరపై కనిపించని అనుష్కా శెట్టి ఈ ఏడాది 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. 'జాతి రత్నాలు' ఫేమ్ నవీన్ పొలిశెట్టితో కలిసి ఈ సినిమాతో రొమాంటిక్ హిట్ అందుకున్నారు. ఈ చిత్రానికి పి. మహేశ్‌బాబు దర్శకుడు. అలాగే కుర్ర హీరోల్లో సాయిధరమ్ తేజ్ 'విరూపాక్ష' హిట్‌తో జోష్‌గా ఉన్నారు. హారర్ థ్రిల్లర్‌గా కార్తీక్ దండు దర్శకత్వంలో 'విరుపాక్ష' రూపొందింది. గత ఏడాది హిట్ అందుకోలేకపోయిన శ్రీవిష్ణు 'సామజవరగమన' అంటూ ప్రేక్షకులను నవ్వించి ఈ ఏడాది సూపర్ హిట్ సాధించారు. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ కామెడీ ఎంటర్‌టైనర్ ఆకట్టుకుంది. అలాగే కుర్ర హీరో ఆనంద్ దేవరకొండ 'బేబీ'తో పెద్ద హిట్ అందుకున్నారు. ఈ ట్రయాంగిల్ లవ్‌స్టోరీ మూవీకి సాయి రాజేశ్ దర్శకత్వం వహించారు. హాస్య నటుడు వేణు కెరీర్ డైరెక్షన్ ఈ ఏడాది మరో మలుపు తిరిగింది. వేణు తొలిసారి దర్శకత్వం వహించిన 'బలగం' సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. తెలంగాణలోని కాకిముట్టుడు సంప్రదాయం, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్, సుధాకర్ కీలక పాత్రలు పోషించారు. 'బలగం' విడుదలయ్యేటప్పుడు చిన్న చిత్రమైనా వసూళ్లతో పెద్ద సినిమాగా మారింది. రెండేళ్ల క్రితం 'మా ఊరి పొలిమేర'తో మంచి హిట్ అందుకున్నారు 'సత్యం' రాజేశ్. అయితే ఆ చిత్రం ఓటీటీలో విడుదలైంది. ఆ సినిమా సీక్వెల్ 'మా ఊరి పొలిమేర 2'తో ఈ ఏడాది థియేటర్స్‌లో సక్సెస్ అందుకున్నారు 'సత్యం' రాజేశ్. ఈ చిత్రానికి అనిల్ విశ్వనాథ్ దర్శకుడు. ఇక 2023కి ముగింపు పలుకుతూ శుక్రవారం (డిసెంబర్ 29) విడుదలైన చిత్రాల్లో కల్యాణ్‌రామ్ 'డెవిల్'కి ప్రేక్షకాదరణ లభిస్తోంది. స్వీయదర్శకత్వంలో అభిషేక్ నామా ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఇంకా స్ట్రయిట్ హిట్ చిత్రాల్లో కార్తికేయ 'బెదురులంక 2012', 'అల్లరి' నరేశ్ 'ఉగ్రం', పాయల్ రాజ్‌పుత్ 'మంగళవారం', నవీన్ చంద్ర 'మంత్ ఆఫ్ మధు', సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్‌ల 'మ్యాడ్', తరుణ్ భాస్కర్ 'కీడా కోలా' వంటివి ఉన్నాయి.

అనువాద చిత్రాల్లో రజనీకాంత్ 'జైలర్', విజయ్ 'వారసుడు', 'లియో', మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్ 2', విజయ్ ఆంటోని 'బిచ్చగాడు 2', టొవినో థామస్ '2018', షారుక్ ఖాన్ 'పఠాన్', 'జవాన్', రణ్‌బీర్ కపూర్ 'యానిమల్' వంటివి మంచి వసూళ్లు రాబట్టాయి.



'మా ఊరి పొలిమేర 2'లో 'సత్యం' రాజేశ్



'బలగం'లో ప్రియదర్శి, కావ్య, సుధాకర్



'బేబీ'లో ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య, విరాజ్



'విరూపాక్ష'లో సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్



'సామజ వరగమన'లో శ్రీవిష్ణు

ఈ ఏడాది భారీ అంచనాల నడుమ విడుదలైన కొన్ని చిత్రాలతో పాటు ఏ అంచనాలు లేకుండా విడుదలైన చిత్రాలు పరాజయాన్ని చవి చూశాయి. ఫట్ అయిన ఆ చిత్రాల గురించి..

'వాల్తేరు వీరయ్య'చిత్రంతో హిట్ సాధించిన చిరంజీవికి 'భోళా శంకర్' ఆశించిన ఫలితాన్నివ్వలేదు. తమిళ సూపర్ హిట్ 'వేదాళం' రీమేక్‌గా మెహర్ రమేశ్ దర్శకత్వంలో 'భోళా శంకర్' రూపొందింది. ఆల్రెడీ వేరే భాషలో హిట్టయిన సినిమా కాబట్టి ఇక్కడ కూడా ఆ ఫలితాన్ని ఆశించారు. కానీ అది నెరవేరలేదు. ఇక ప్రభాస్ శ్రీరాముడిగా నటించిన చిత్రం 'ఆది పురుష్'. ఓం రౌత్ దర్శకత్వంలో రూపొందిన ఈ పాన్ ఇండియా చిత్రంపై అంచనాలు ఓ రేంజ్‌లో నెలకొన్నాయి. రామాయణంలోని కొన్ని ముఖ్య ఘట్టాల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను మెప్పించలేకపోవడంతో పరాజయంగా నిలిచింది. రవితేజ సోలో హీరోగా నటించిన ('వాల్తేరు వీరయ్య' సినిమాలో కీలక పాత్ర చేశారు) 'రావణాసుర, టైగర్ నాగేశ్వరరావు' సినిమాలు బోల్తా కొట్టాయి. సుధీర్ వర్మ దర్శకత్వంలో 'రావణాసుర', వంశీ దర్శకత్వంలో 'టైగర్ నాగేశ్వరరావు' రూపొందాయి. 'కస్టడీ' చిత్రం రూపంలో ఈ ఏడాది నాగచైతన్యకు పరాజయం ఎదురైంది. వెంకట్ ప్రభు దర్శకత్వంలో ద్విభాషా చిత్రంగా ఈ యాక్షన్ థ్రిల్లర్ రూపొందింది. హీరో రామ్-దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'స్కంద అంచనాలను అందుకోలేకపోయింది. ఇక సురేందర్ రెడ్డి దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటించిన ఏజెంట్' కూడా నిరాశనే మిగిల్చింది. ఈ ఏడాది వరుణ్ తేజ్ వ్యక్తిగతంగా ఫుల్ హ్యాపీ. లావణ్యా త్రిపాఠీని పెళ్లి చేసుకుని, లైఫ్‌లో కొత్త చాప్టర్‌ని మొదలుపెట్టారు. అయితే కెరీర్ పరంగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'గాండీవధారి అర్జున' నిరాశపరిచింది. నితిన్ హీరోగా వక్కంతం వంశీ డైరెక్షన్‌లో రూపొందిన 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మేన్' ఆర్డినరీ సినిమా అనిపించుకుంది. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'రంగ మార్తాండ' ఎమోషనల్ మూవీ అనిపించుకుంది. టాక్ బాగున్నా వసూళ్లు ఆశించిన విధంగా రాలేదు. హీరోయిన్ సమంత, నటుడు దేవ్ మోహన్ కాంబినేషన్‌లో గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన పౌరాణిక చిత్రం 'శాకుంతలం' పరాజయాన్ని మూటకట్టుకుంది. ఇవే కాదు.. గోపీచంద్ 'రామబాణం', కల్యాణ్ రామ్ 'అమిగోస్', నిఖిల్ 'స్పై', వైష్ణవ్ తేజ్ 'ఆదికేశవ', సుధీర్ బాబు 'హంట్, మామా మశ్చీంద్ర' వంటి సినిమాలతో పాటు మరికొన్ని ప్రేక్షకులను మెప్పించలేకపోయాయి.

కొత్తవారితో విశ్వక్ సేన్ కల్ట్

సొంత నిర్మాణసంస్థలు వన్మయి క్రియేషన్స్, విశ్వక్ సేన్ సినిమాస్‌లపై నటుడు-దర్శకుడు-రచయిత-నిర్మాత విశ్వక్ సేన్ 'ఫలక్‌నుమాదాస్, దాస్ కా ధమ్కీ' వంటి సినిమాలు చేశారు. అయితే ఈసారి కొత్తవారిని ప్రోత్సహించాలని 'హ్యాష్‌ట్యాగ్ కల్ట్' అనే టైటిల్‌తో సినిమాను ప్రకటించారు. 'సే నో టు డ్రగ్స్' అనే స్లోగన్‌తో ఈ సినిమాకు 'లైక్ ఏ లీప్ ఇయర్ 2024' అనే క్యాప్షన్ పెట్టారు. విశ్వక్‌సేన్ కథ అందిస్తున్న ఈ సినిమాతో తాజుద్దీన్ దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో విశ్వక్ సేన్ మాట్లాడుతూ -''హ్యాష్‌ట్యాగ్ కల్ట్' సినిమా హిలేరియస్‌గా ఉంటుంది. ఓ మంచి సందేశం కూడా ఉంది. వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఈ సినిమా కథ రాశాను. ఇందులో ముగ్గురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు లీడ్ రోల్స్ చేస్తారు. ఈ చిత్రంతో 25మంది కొత్త నటీనటులను పరిచయం చేయనున్నాం. ఔత్సాహికులు ప్రయత్నించవచ్చు. నాకు నటనలో కాన్ఫిడెన్స్ ఇచ్చిన తాజుద్దీన్‌గారు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు'' అని అన్నారు. ''విశ్వక్‌గారు ఈ సినిమా కథ చెప్పినప్పుడు చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. ఇది నాకు మొదటి సినిమా'' అన్నారు తాజుద్దీన్.



తాజుద్దీన్, విశ్వక్ సేన్

యానిమల్ తరహాలో...

దేవ్ బల్లాని, ప్రియా చౌహాన్, సరిత ప్రధాన పాత్రల్లో మురళీ రామస్వామి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'దీనమ్మ జీవితం'. వై. మురళీకృష్ణ, వై. వెంకటలక్ష్మీ, డి. దివ్య సంతోషి, బి. సోనియా నిర్మించిన ఈ చిత్రం జనవరి 5న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దేవ్ మాట్లాడుతూ- ''మంచి కంటెంట్‌తో వస్తున్న చిత్రం ఇది. పెద్ద విజయాన్ని అందుకుంటామనే నమ్మకం ఉంది'' అన్నారు. '''యానిమల్' వంటి రా అండ్ ఫ్యామిలీ ఫిల్మ్ 'దీనమ్మ జీవితం'. తమిళ్, మలయాళంలోనే కాదు.. తెలుగులోనూ మంచి కంటెంట్‌తో సినిమా చేయగలరని నిరూపించే చిత్రమిది'' అన్నారు మురళీ రామస్వామి.



ప్రియా చౌహాన్, దేవ్ బల్లాని

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కుల పట్టింపు లేదు/రిటైర్డ్ Govt ఎంప్లాయ్/పెన్షనర్ సింగిల్ వెల్ సెటిల్డ్ గల సారికి ఏ బాదరబందీలేని జీవిత భాగస్వామి కావలెను. అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. అర్జెంట్. సంప్ర: 7286031653 [H-793639]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/50y/MBBS MD/Govt డాక్టర్/3 లక్షలు PM/ సొంత ఇండ్లు/రెంట్స్/తోటలు భూములు & 100 కోట్ల ఆస్తి గల పిల్లలు లేని వరుడికి వధువు కావలెను. వధువుతో /అస్తితో పని లేదు (పిల్లలున్నా OK) ఫోన్: 8341 458 70 [H-793639]

SC మాదిగ/ B.Tech / EEE /C.Govt. బ్యాంకు మేనేజర్/యూనియన్ బ్యాంక్/ 80,000/-PM/ 5'8"/ ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-13251]

కుల ప్రసక్తి లేని 37 సం॥ల వయస్సు గల వరుడుకు వధువు కావలెను. వధువుకు మొదటి/రెండవ, విడో పిల్లలు ఉన్న వారైనా సంప్రదించండి. జాతి ప్రసక్తి లేదు. Ph: 6301055248, 7396730091 [HA-13251]

దేవాంగ (Cast No Bar) /40yrs/5'5"/Fair / M.Tech/MCA/IRPM వరుడునకు చదువు కున్న, సాయి దైవభక్తి గల వధువు కావలెను. (డైరెక్ట్) సంప్ర : 7036361292 [HA-13251]

కాపు: కుల, కట్నప్రసక్తి లేదు / గుడ్ లుకింగ్/ 25/ 5'8"/ B.Tech/ గుడ్ జాబ్/ 60,000/- PM / 10 కోట్ల ఆస్తి వరుడికి వధువు కావలెను. Ph: 8367619529 [H-14944]

రెడ్డి: కట్నప్రసక్తి లేదు / గుడ్‌లుకింగ్/ 30/ 5'10" / PG / 3 Lakhs pm/40 కోట్ల ఆస్తి గల వరుడికి వధువు కావలెను. Ph: 8367619529 [H-14944]

కుల పట్టింపు లేదు: మొదటి/రెండవ పెళ్లి అయినా ఓకే/ గుడ్ లుకింగ్/ 48/5'9"/ PG/ 70000/- PM/ 5 కోట్ల ఆస్తి గల వరునికి వధువు కావలెను. Ph: 8367619529 [H-14944]

రజక: కట్నప్రసక్తి లేదు / M.E / C.Govt కస్టమ్స్ ఆఫీసర్/ GST Dept/ 80,000/- PM /5'11" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [H-14945]

గౌడ: B.Tech/ C.Govt. లోకోపైలెట్/ రైల్వే/ 85,000/- pm /6' ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618007652 [H-14945]

ముదిరాజ్: B.Tech/ C.Govt. Jr. ఇంజనీర్/ రైల్వే/ 68,000/- pm /5'10" ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9515942275 [H-14945]

SC మాల: కట్నప్రసక్తి లేదు/ B.Tech/ C.Govt. బ్యాంక్ మేనేజర్/ SBI/ 80,000/- PM/ 5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [H-14945]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: koreddy43@gmail.com, Facebook.com/koreddymarriagebureau

వధువు కావలెను

Reddy/ Rich Industrialist *B.Tech/ B.Tech/1990/6'/1000Cr *1989/5'11"/ 500Cr *1995/5'9"/500Cr * Cont: K.C. Reddy-Hyd-Ph:9347807015

Reddy/BIG Business *B.Tech/ MBA/ 1997/6'/150Cr *1995/6'/100Cr * 1994/ 5'11"/250Cr *1997/6'/400 Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Good Business/B.Tech / 1997/ 5'11"/100Cr *1996/6'/100Cr *1997/6'/200Cr *1994/5'10"/ 100Cr * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/V.Good Business/ 1990/ 5'10"/25Cr/30L/M income *1993/ 5'7"/ 50Cr *1991/6'/100Cr *1994/5'11"/150Cr. *Cont : K.C. Reddy -Ph: 9347807015

Reddy/MBBS PG-doc *1995/ 5'10"/ 400Cr *1996/6'/50Cr *1994/5'10"/50Cr *1993/5'10"/50Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015/9849321309

Reddy/MBBS/USA Doc *1995/5'8"/ 10Cr *1990/6'/50Cr *1991/5'10" *1989 / 5'9" *1998/5'8" *1992/5'11" * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1 USA *1991/5'11"/ 200Cr *1997/6'/400Cr *1993/6'/100Cr * 1997/5'9"/60Cr *1995/5'9"/50Cr * Cont : K.C. Reddy-Hyd- Ph:9849321309

Reddy/IIT/B.Tech/IIM(MBA)/1994/5'9"/ 1Cr/yr/30Cr *1994/5'11"/70L/yr/25Cr * 1990/85L/yr *1996/5'7"/50L/yr/20Cr * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/Divorcee/India *B.Tech/ MBA/ 1981/5'8"/50L/M/500Cr *1979/ 5'9"/ 300Cr *1986/5'5"/1000Cr. *Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015

Reddy/Divorcee/Abroad *1986/ 5'11" /350 K/40Cr *USA-Doc/1982/ 5'8"/ 20 Cr *1977/5'6"/USA-Citizen. * Cont: K.C.Reddy-Hyd- Ph:9347807015

వరుడు కావలెను

Reddy/B.Tech / 1993 / 5'3"/500Cr *1997/ 5'4"/ 150Cr *M.Sc/1994/5'3"/400Cr *MBBS /1997 /5'6" / 500Cr *1998 / 5'4" / 200Cr. * Cont: K.C. Reddy- Hyd Ph: 9347807015

Reddy/ MBBS / MD / Most Beautiful/ 1999/5'4"/200Cr *1994/5'6"/100Cr *1995 /5'3"/50Cr (The only Daughter). * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/(NIT) Most Beautiful /1998/5'3"/70L/yr/Rich Family/ * M.Sc/ 2000/5'5"/100Cr (The only Daughter) * Cont: K.C. Reddy- Ph: 9347807015

Reddy/Divorcee/MBBS/MD/1991/5'2"/ 40Cr *B.Tech/1993/10Cr *1988/5'6"/30Cr *1985/5'5"/400Cr *MD/1994/5'5"/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/1994/5'5"/15 Cr * 1994/ 5'6"/ 100Cr * 1995/5'8"/100Cr *MS/ 1994/ 5'3"/ 200Cr *1999/5'8"/15Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech/1996/5'7"/50Cr *1995/ 5'5"/120Cr *1995/5'5"/70Cr *1993/ 5'3"/ 500Cr *1997/5'4"/150Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/1996/5'4"/30Cr * 1998/ 5'5"/ 100Cr *1996/5'7"/40Cr *1995/ 5'7"/ 10Cr *1998/5'4"/30Cr. *Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/1993/5'6"/50Cr *1990/5'4"/ 50Cr *1992/5'4"/25Cr *1996/5'5"/100Cr/ 1993/5'7"/100Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/1992/5'3 1/2"/40Cr/ *BA/1988/5'3"/200Cr *B.Tech/1990/ 5'3"/ 50Cr *1987/5'5"/100Cr. * Cont: K.C. Reddy. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/H1/USA *1994/5'4"/10 Cr *1997/5'5"/10Cr *1997/5'8"/12Cr *1998/ 5'4"/30Cr *1996/5'5"/15Cr. *Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/ 9347807015 [D-834]

యాదవ: కట్నప్రసక్తి లేదు/B.Tech/ Govt. కస్టమ్స్ ఆఫీసర్/ 80,000/- pm /5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7075953400, 7842467951 [H-14945]

SC మాల 43 ఒంటరి రెండవ బిజినెస్ / మంచి ఆస్తి ఇల్లు గల వరునికి 1వ లేదా 2వ వధువు (కుల పట్టింపు లేదు) కావలెను. ఫోన్: 8919914094. (డైరెక్ట్). [H-788498]

మున్నూరు కాపు: 31Y/5.8/Qly: డిగ్రీ, జీతం: 50,000/-PM, 1 కోటి ఆస్తి కలిగిన వరుడికి తగిన వధువు కావలెను. కుల, కట్న ప్రసక్తి లేదు. నో బ్రోకర్స్. సెల్: 9440122861. [L-822283]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/34y/నెలకు లక్ష రూపాయల ఆదాయం. Hydలో సొంత ఇల్లు/కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఢిల్లీ తెలంగాణ వధువు కావలెను. డైవర్స్/విడో OK కుల ప్రసక్తి లేదు. డైరెక్ట్ Ph: 7989079290 [H-801458]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 30, 5' 7", 120 K, H1, 25 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIIT), 30, 5' 8", SWE, 40 L P/A, 10 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 32, 5' 10", USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, CFA, 49, 5' 6", Sr Consultant, 18 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE (IIIT), M Tech (IIIT), 26, 5' 3", SWE, 30 L P/A, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 4", SWE, 72 K, 3 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 25, 5' 1", PG Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 32, 5' 4", SWE, 11 L P/A, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 9", Apple, H1, 50 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 28, 5' 11", Data Engineer, 13 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 10", SWE, 140 K, H1, 35 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి LLB, 29, 5' 7", DY Manager, 20 L P/A, 25 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 24, 5' 10", Data Analyst, 25 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS (USA), 28, 5' 3", 20 Crores, Hyd, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 26, 5' 8", SWE, 120 K, H1, 7 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 7", Amazon, 129 K, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. LETTER

వైశ్య వరుడు RMP డాక్టర్ వరునికి వధువు కావలెను. కుల పట్టింపులేదు మరియు రెండో పెండ్లి వారు కూడ సంప్రదించవచ్చును. ఇది డైరెక్ట్‌గా ఇచ్చినాము. సంప్ర॥ 8790197318 [Y-784403]

మాల/కట్న ప్రసక్తి లేదు/49/5'7/1st మ్యారేజ్/ ప్రైవేట్ టీచర్/1.10L PM/ సొంత ఇల్లు ఉన్న వరునికి డిగ్రీ/పీజీ చదివిన 45 సం॥ 1st మ్యారేజ్ వధువు కావలెను. నో బ్రోకర్స్ డైరెక్ట్. 9505094217, 9347086440 [H-788245]

మాల/48/5'2"/1st మ్యారేజ్ (తెల్ల మచ్చల పూత)/ TS Govt/ 70K PM/సొంత ఇల్లు ఉన్న వరునికి ఇంటర్ చదివిన, మధ్యతరగతి వధువు కావలెను. నో బ్రోకర్స్ డైరెక్ట్. 9505094217, 9347086440 [H-788246]

గూగుల్‌లో పనిచేయుచున్న 27 ఏండ్ల ఫెయిర్, 5 ఫీట్ 8 అంగుళాల క్రైస్తవునికి భక్తి కలిగిన వధువు కావలెను. సంప్రదించండి. సెల్ : 8332921163 [HA-95934]

2వ వివాహం : 62 సం॥ల రిటైర్డ్ ఎంప్లాయ్ కొరకు 45 సం॥లు దాటిన ఏ బాదరబందీ లేని వధువు కావలెను. కుల పట్టింపు లేదు. డైరెక్ట్ Contact – 90008 48099 [M-1221438]

★★

SC మాల వ: 28 (క్రిస్టియన్) రెండవ వివాహం వరుడికి వధువు కావలెను. కులంతో పట్టింపు లేదు. Native స్థలం : MVP కాలనీ, విశాఖపట్నం. జాబ్ : వైభవ్ జ్యూయలర్స్, ఫ్లోర్ మేనేజర్. జీ : 30K. ఫోన్: 97046 54580, 99598 28058 [V-11802]

Kapu 51Y/5'.8" American citizen, 120K, B.Tech (JANTU) & M.S(USA), Property 10Cr. With own house at USA. Bride age: 32 to 42, S.W.E, working in India/USA send Biodeta & Photo to WhatsApp. 8555961146. [HA-13250]

వరుడు కావలెను



2వ పెళ్లి/MBA / డైవర్స్ / 37yrs/Govt ఎంప్లాయ్ /2,00,000/- (PM) కుల పట్టింపు లేని వెల్ సెటిల్డ్ అందమైన వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్నా) సంప్ర : 8332006483 [H-793639]

కాపు/24y/ B.Tech / SWE / 80,000/- PM/కోట్ల ప్రాపర్టీ/4 ఎ॥ ఫాంల్యాండ్ గల ఏకైక వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9985748142 [H-787764]

రెండో పెళ్ళి/విడో/52y/Fair/వైజాగ్/ లెక్చరర్/వెల్ సెటిల్ పిల్లలులేని ఏ భాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-787764]

రెడ్డి/డైవర్స్/27y / BE / 1.2L PM/ Hydలో Own House/Plots కలిగిన అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9985746131 [H-787764]

రెడ్డి/డైవర్స్/29y / B.Tech MBA/1.2 L PM/కోట్ల ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309344166 [H-787764]

చౌదరి/60y/విడో/5'4"/Own Business /1L/PM/సొంత ఇల్లు/ఆంధ్రాలో పొలాలు /పిల్లలులేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు Ph: 7981958172 [H-801501]

తెలగ/ కాపు/ విడో / 58y/తెల్లనిచాయ/ ప్రభుత్వ ఉన్నత ఉద్యోగి/Own House గల ఒంటరి వధువుకు వరుడు కావలెను. కులప్రసక్తి లేదు. Ph: 9030993696 [H-801501]

రెడ్డి/53y/విడో/ఇంటర్/సొంత బిజినెస్ /90K/PM/8 ఎకరాల పొలం/ సొంత ఇల్లు గల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను Ph: 9703982351 [H-801501]

రెడ్డి/విడో/59y/5'4"/Very Fair/పెన్షనర్/ సొంత ఇల్లు & రెంట్స్/ పొలాలు/ఏబాదరబందీ లేని సాంప్రదాయ కుటుంబం గల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 9030711984 [H-801501]

రెడ్డి/విడో/54Y/5'2"/ప్రొఫెసర్ ఆంధ్ర, Hydలో సొంత బిజినెస్/రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (ఇల్లరికం) వారికే ప్రాధాన్యత (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-793639]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/38yrs/B.Sc, B.Ed/ Govt.టీచర్, 1 లక్ష (PM) సొంత ఇల్లు+కార్ పిల్లలు లేని 100 కోట్ల ఆస్తి గల V.ఫెయిర్ వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK): 8341454870 [H-793639]

కుల పట్టింపు లేదు 21y&23y&25y&26y&27y& 29y&30y&31y&33y&35y& 37y&39y& 40y& 41y& 43y&45y&47y&49y&50y&52y&54y&55y&57y&59y &"మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [HA-13251]

రెడ్డి/2nd మ్యారేజ్: కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/వయసు: 30, ఎత్తు:5'4"/ బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) Ph: 9515673252 [HA-13251]

Caste no bar/2nd match bride, 30Y/5'4", Widow, B.Tech, Central Govt Job, పిల్లలు లేని వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Ph: 9381358331, 9063037521. [HA-13251]

SC మాదిగ/25/5'5"/B.Tech(NIT),. Preventive Officer in Customs 65,000/- PM వెల్ సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 8978880072 [HA-13251]

కుల ప్రసక్తి లేదు/రెడ్డి 2వ సంబంధం/ H:5'4",కలర్ : ఎరుపు/ట్రావెల్స్ బిజినెస్ కలిగిన వధువుకి సంప్రదాయ కుటుంబపు వరుడు కావలెను. Ph: 9121300377 [HA-13251]

కులపట్టింపు లేదు: 2వ పెళ్లి/ పిల్లలు లేరు/ చాలా అందమైన/ 37/5'4"/B.Tech/ సాఫ్ట్ వేర్/వెల్ సెటిల్, కోట్ల ఆస్తి/ గల వధువుకి వరుడు కావలెను. US అయినా ఓకే. Ph: 8367619529 [H-14944]

కమ్మ: చాలా అందమైన/ 25/ 5'4"/B.Tech/ సాఫ్ట్ వేర్ /TCS/ కోట్ల ఆస్తి & గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. (US అయినా OK) Ph: 8367619529 [H-14944]

SC హిందు మాల: C.A/ చార్టెడ్ అకౌంటెంట్/10Lakhs. PA/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [H-14945]

ముదిరాజ్: B.Tech/ Govt. సబ్ ఇంజనీర్/ ఎలక్ట్రికల్ Dept/ 60,000/- pm/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [H-14945]

SC హిందు మాదిగ: B.Tech/Govt. Asst. Exq. ఇంజనీర్/ మిషన్ భగిరథ/1 Lakhs. PM/ 5'4" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [H-14945]

SC మాల & క్రిస్టియన్: M.Tech(EEE)/ C.Govt. డిప్యూటీ మేనేజర్/ SBI/ 65,000/- PM/5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [H-14945]


రజక: B.Sc/ Govt. A.E.O/అగ్రికల్చర్ Dept/ 40,000/- pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400, 7842467951 [H-14945]

SC మాల క్రిస్టియన్, వయస్సు 28, ఎత్తు 5.4, M.Com, Govt. Employee కి వరుడు కావలెను. ✆ 93984 50329 [G-1087]

2nd Marriage - మాల, క్రిస్టియన్స్, వయస్సు 32, 5.4H, Fair, B-Tech, సాఫ్ట్‌వేర్ నెలకు 1,50,000 జీతం వధువుకి, వరుడు సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి కావలెను. ✆ : 77949 11019 [R-1151844]

బ్రాహ్మణ/24/5'3"/B.SC *27/5'4"/MBA *30/ 5'3"/B.SC *32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/బిజినెస్/పురోహితులకు మ్యాచెస్ త్వరగా కుదుర్చబడును. PH: 7842635086 [HA-13251]

వేదికలు



సెకండ్ మ్యారేజీలకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర : Ph: 8555980066 [H-787764]

గౌడ, ఈడిగ, శెట్టిబలిజ, యాత, శ్రీసైన మ కస్టమర్లకు శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. "శుభమస్తు మ్యారేజ్ బ్యూరో" DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.నారాయణగౌడ్, S.వాసుబాల గౌడ్ Ph: 8790690309 [H-801501]

శ్రీశ్రీరస్తు శుభమస్తు. ఓన్లీ రెడ్డీస్ గత 15 సం.లుగా అనేక జంటలు కలిపిన సంస్థ. ఇండియా అబ్రాడ్ సంబంధాలు కలవు. మా బ్రాంచెస్ Hyd, విజయవాడ, బెంగళూరు Ph:9100454789 [HA-13251]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13252]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13252]

Kamma - Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13252]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13252]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/Blue Trend Matrimonial (P) Ltd. [HA-13252]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-793556]

పెళ్లి సంబంధాలు-కాపు, మున్నూరు కాపు, తెలగ, బలిజ, చౌదరి, రెడ్డి కులస్తులకు, సాఫ్ట్ వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్ వారికి Specialగా చూడబడును, పూర్ణ మ్యాట్రిమోనీ, తిరుపతి, 7093722724. [T-1983]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 26-1-2024వ తేదీ ఉ॥ 9 గం॥లకు 64వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయం వేదిక మరియు మ 2॥లకు 19వ పునర్వివాహ పరిచయ వేదిక, విజయవాడ, K.B.N. కాలేజీలో జరుగును. ✆ 99895 00130 [B-1234]

15వ॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriagelines.com ✆ 94920 33897, 94904 16355, 94407 85888 [B-610]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-950]

★★

Kalyani Matrimony: గౌడ, కాపు మరియు అన్ని కులాల వారి ఉన్నతమైన సాంప్రదాయబద్ధమైన పెండ్లి సంబంధాల కొరకు వెంటనే సంప్ర: 8500747535/ 9533133969. kalyanimatrimony.in [H-793389]

Reddys-Naidus Matrimony- రెడ్లు- నాయుడులకు మాత్రమే-ఫ్రీ రిజిస్ట్రేషన్ & క్విక్ రెస్పాన్స్. వాట్సప్: 7337355435, చిత్తూరు. [T-4793]

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి, కేంద్రమంత్రి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్, కేంద్రమంత్రి కృష్ణపాల్ గుర్జార్ శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు చేయగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్, రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు, సంగీత దర్శకుడు మణి, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కీర్తి ఐఏఎస్, శ్రీలక్ష్మి ఐఏఎస్, గిరీష ఐఏఎస్, గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఐఏఎస్, డీఐజీ ఆవుల రమేష్‌రెడ్డి, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, ఒంటినిండా రుద్రాక్ష మాలలతో ఢిల్లీకి చెందిన భక్తుడు ఉన్నారు.



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్

కాగా, తిరుమలలో శుక్రవారం అర్ధరాత్రి వరకు వైకుంఠ ద్వారం ద్వారా శ్రీవారిని 56,200 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీలో కానుకలుగా రూ.3.89 కోట్లు సమర్పించారు.

సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేయండి

- క్యాంపు కార్యాలయాలపై ధర్మాసనం ముందు రాష్ట్ర ప్రభుత్వం అప్పీళ్లు
- మంగళవారం విచారణ జరపనున్న సీజే ధర్మాసనం



సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర అభివృద్ధిని పర్యవేక్షించేందుకు, సమీక్షలు చేసేందుకు వీలుగా విశాఖపట్నంలో క్యాంపు కార్యాలయాలు ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయానికి బ్రేక్ వేస్తూ సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై ధర్మాసనం ముందు రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరుగా మూడు అప్పీళ్లు దాఖలు చేసింది. త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టేంత వరకు విశాఖపట్నంలో క్యాంపు కార్యాలయాల ఏర్పాటుకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని కోరింది. ఈ అప్పీళ్లపై మంగళవారం ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం విచారణ జరపనుంది. విశాఖపట్నంలో క్యాంపు కార్యాలయాలు ఏర్పాటు చేయవద్దంటూ సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నట్లయిందని ప్రభుత్వం తన అప్పీళ్లలో పేర్కొంది. సుప్రీంకోర్టు వివిధ తీర్పుల్లో నిర్దేశించిన న్యాయపరమైన పరిమితులకు అనుగుణంగా సింగిల్ జడ్జి ఆదేశాలు లేవని తెలిపింది. విశాఖలో క్యాంపు కార్యాలయాల ఏర్పాటు కోసం అనవసరంగా ఎలాంటి ఖర్చు చేయవద్దని సింగిల్ జడ్జి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారని, వాస్తవానికి ఈ అంశంపై ఎలాంటి విచారణ జరగలేదని విన్నవించింది. అంతేకాక వ్యయం వంటి అంశాలు ప్రభుత్వ పరిపాలన పరిధిలోనివని తెలిపింది. వివిధ శాఖాధిపతులకు కార్యాలయాల స్థలం కేటాయింపు ప్రక్రియ ఇంకా మొదలు కాలేదని, ఇందుకు మరింత సమయం పడుతుందని తాము లిఖితపూర్వకంగా చెప్పినా కూడా సింగిల్ జడ్జి పట్టించుకోకుండా, క్యాంపు కార్యాలయాల విషయంలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొంది. వాస్తవానికి ఈ వ్యాజ్యాలపై తగిన ధర్మాసనం విచారణ జరిపే విషయంలో పాలనాపరమైన నిర్ణయం తీసుకునేందుకు వీలుగా ఈ వ్యవహారాన్ని సీజే ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించిన సింగిల్ జడ్జి... మరోవైపు క్యాంపు కార్యాలయాల తరలింపు విషయంలో ఎలాంటి చర్యలు వద్దని చెప్పారని, ఇది సంబంధిత జీవో అమలును నిలిపివేయడమేనని వివరించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్లకుండానే న్యాయమూర్తి ఇలాంటి ఉత్తర్వులు ఇచ్చారని, ఇలా చేయడం ద్వారా సింగిల్ జడ్జి పొరపాటు చేశారని పేర్కొంది. త్రిసభ్య ధర్మాసనం తేల్చాల్సిన అంశాన్ని సింగిల్ జడ్జి పరోక్షంగా తేల్చేశారని ప్రభుత్వం తన అప్పీళ్లలో ఆక్షేపించింది. ఈ వ్యాజ్యాలను త్రిసభ్య ధర్మాసనం ముందుంచే విషయంలో సీజే నిర్ణయం తీసుకోవడానికి ముందే సింగిల్ జడ్జి ఇలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని పేర్కొంది. అందువల్ల తమ అప్పీళ్లను అనుమతించి, సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేయాలని ధర్మాసనాన్ని ప్రభుత్వం అభ్యర్థించింది.

మేనేజ్‌మెంట్ కోర్సులదే హవా

ఇండియా స్కిల్స్ రిపోర్టు 2024 వెల్లడి



- ఉద్యోగాల కల్పనలో మేటి
- ఎంబీఏ చేసినవారికి 71.16 శాతం జాబ్స్
- ఆ తర్వాత బీఈ/బీటెక్ కోర్సుల ఉత్తీర్ణులకు అవకాశాలు
- వీరికి 64.67 శాతం ఉద్యోగాలు
- ఇంజనీరింగ్ కోర్సుల్లో ఐటీ, కంప్యూటర్ సైన్స్‌కే ఎక్కువ డిమాండ్
- ఐటీ ఉద్యోగాలు దక్కించుకోవడంలో రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్
- మహిళా వర్క్‌ఫోర్స్‌లోనూ సెకండ్ ర్యాంక్ ఏపీకే
- పాలిటెక్నిక్ కంటే ఐటీఐకే ఎక్కువ జాబ్స్

దేశంలోనే ఏపీకి 2వ స్థానం

బీఈ/బీటెక్ విభాగంలో అత్యధికంగా ఉద్యోగాలు సాధిస్తున్న రాష్ట్రాల్లో మహారాష్ట్ర (80.56 శాతం) అగ్రస్థానంలో నిలుస్తోంది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ (73.23 శాతం) ఉంది. కేరళ (68.36 శాతం) మూడో స్థానం దక్కించుకుంది. కాగా దేశంలో గత పదేళ్లలో మహిళలకు ఉద్యోగావకాశాల్లో స్థిరమైన పెరుగుదల నమోదవుతోందని నివేదిక పేర్కొంది. హరియాణా (49.58 శాతం) మహిళా వర్క్‌ఫోర్స్‌తో అగ్రస్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ (39.96 శాతం) రెండో స్థానం దక్కించుకుంది. దేశవ్యాప్తంగా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బీఈ/బీటెక్, ఎంబీఏ, బీఎస్సీ, బీకాం, బీఏ కోర్సులకు సంబంధించి విద్యార్థుల అభ్యసనాల్లో గణనీయమైన వృద్ధి ఉందని నివేదిక పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ అకడమిక్ పనితీరు ఆకట్టుకునేలా ఉందని వెల్లడించింది.

దేశవ్యాప్తంగా ఉద్యోగాల కల్పనలో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), పోస్టుగాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం) కోర్సులే అగ్రస్థానంలో నిలుస్తున్నాయి. ఆ తర్వాత ఇంజనీరింగ్, ఎంసీఏ కోర్సులు చోటు దక్కించుకున్నాయి. ఈ మూడు కోర్సుల ఉత్తీర్ణులకే ఎక్కువ ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. ఈ మేరకు దేశవ్యాప్తంగా యువత నుంచి నిపుణులు సేకరించిన అభిప్రాయాలు, వాటిని విశ్లేషించి రూపొందించిన నివేదికను టాలెంట్ అసెస్‌మెంట్ ఏజెన్సీ.. వీబాక్స్ 'ఇండియా స్కిల్స్ రిపోర్టు-2024' పేరుతో వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. ఎంబీఏ, బీఈ/బీటెక్, ఎంసీఏ కోర్సులు చేసినవారితో పోలిస్తే బీఏ, బీకాం, బీఎస్సీ, పాలిటెక్నిక్ కోర్సులు చదివినవారికి ఉద్యోగాలు తక్కువగానే లభించాయి. పాలిటెక్నిక్ కంటే ఐటీఐ కోర్సుల వారు ఎక్కువ జాబ్స్ పొందడం గమనార్హం.

-సాక్షి, అమరావతి

కోర్సులవారీగా ఉద్యోగావకాశాలు (శాతాల్లో)..



ఈ ఏడాది పెరిగిన అవకాశాలు..

దీని ప్రకారం.. గతేడాది కంటే ఈ ఏడాది ఎంబీఏ, బీకాం, బీఫార్మసీ కోర్సులు చేసిన వారికి ఉపాధి అవకాశాలు పెరిగాయి. విభిన్న వయసుల కేటగిరీల్లో ఉద్యోగావకాశాలు కల్పించడంలో ఫార్మా రంగం గణనీయమైన వృద్ధిని సాధించింది. ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ పరిశ్రమలో వృద్ధి కనిపిస్తోంది. దీంతో బీఎస్సీ చేసిన వారికి బీఫార్మాతోపాటు దాదాపు సమాన అవకాశాలు దక్కుతున్నాయి. ఇక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగం జాతీయ జీడీపీకి 8 శాతం అందిస్తోంది. ఈ క్రమంలో దేశంలో ఐటీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు పూర్తి చేసినవారికి అత్యధిక ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. భవిష్యత్తులో భారత ఐటీ పరిశ్రమల డిమాండ్‌కు ఇది ఆశాజనకమని నివేదిక పేర్కొంది.

జనవరిలో 'తిరుమల' విశేష పర్వదినాలు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి నెలలో జరగనున్న విశేష పర్వదినాల వివరాలను టీటీడీ పీఆర్‌వో విభాగం శనివారం ప్రకటించింది. 1న పెద్దశాత్తు మొర, వైకుంఠ ద్వార దర్శనం ముగింపు, 5న అధ్యయనోత్సవాల ముగింపు, 6న తిరుమల శ్రీవారు తిరుమలనంబి సన్నిధికి వేంచేపు, 7న సర్వఏకాదశి, 9న తొండరడిప్పొడియాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 14న భోగిపండుగ, ధనుర్మాసం ముగింపు, 15న మకర సంక్రాంతి, సుప్రభాత సేవ పునఃప్రారంభం, 16న తిరుమల శ్రీవారు పార్వేట మండపానికి వేంచేపు, కనుమ పండుగ, 25న శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి, 28న తిరుమొళిశైయాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 31న కూరత్తాళ్వార్ వర్ష తిరునక్షత్రం జరగనున్నాయి.

శ్రీశైల దేవస్థానంలో 'ప్రాతఃకాలసేవ'

- జనవరి 3 నుంచి అమలు
- ఆన్‌లైన్‌లో రోజుకు 5 టికెట్లు మాత్రమే





శ్రీశైల ఆలయం. (ఇన్‌సెట్‌లో) దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానంలో జనవరి 3వ తేదీ నుంచి స్వామి అమ్మవార్లకు నూతనంగా ప్రాతఃకాల ఆర్జిత సేవ అందుబాటులోకి రానుంది. రోజుకు ఐదు టికెట్లు అందుబాటులో ఉండనుండగా, సేవా రుసుం రూ.25,116గా నిర్ణయించారు. టికెట్లు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే విక్రయిస్తారు. ఈ సేవలో దంపతులు లేదా ఒకరికి మాత్రమే అనుమతి. 10 సంవత్సరాల్లోపు పిల్లలుంటే మల్లికార్జున స్వామి వారి స్పర్శదర్శనం మాత్రమే కల్పిస్తారు. సేవలో భాగంగా మొత్తం ఆరు సేవలను నిర్వహించుకోవచ్చు. దీనిపై దేవస్థాన ఈఓ డీ పెద్దిరాజు మాట్లాడుతూ భక్తుల సూచనలు, సలహా మేరకు ఈ ఆర్జిత సేవను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

చీపురు పట్టారు.. ప్రజాసేవకులమనిపించారు!



11వ వార్డులో చెత్త ఊడుస్తున్న ఎంపీ ఎంవీవీ, గొలగాని శ్రీనివాస్

ఆరిలోవ: తెల్లవారకముందే లేచారు. రోడ్లపైకి వచ్చి పేరుకుపోయిన చెత్తను తొలగించారు. రోడ్లను అందంగా శుభ్రం చేశారు. ప్రజా ప్రతినిధులు అంటే ప్రజాసేవకులేనని నిరూపించారు. ప్రజల చేత శెభాష్ అనిపించుకున్నారు విశాఖ నగర ప్రజాప్రతినిధులు. వివరాల్లోకి వెళితే... రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులు కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఇళ్ల నుంచి చేరిన చెత్త వీధుల్లో కుప్పలుగా పేరుకుపోయింది. శనివారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపుతో కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు వీధుల్లోకి వచ్చి చెత్త ఊడ్చారు. ఈ చెత్త ఊడ్చే కార్యక్రమంలో నగర మేయర్‌తోపాటు విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పాల్గొని చేయి కలిపారు. పెదగదిలిలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి స్వయంగా చీపురు పట్టి చెత్త ఊడ్చారు. పదకొండో వార్డులో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వార్డు ఇన్‌చార్జి గొలగాని శ్రీనివాస్ బాలాజీనగర్, ముస్తఫాకాలనీ, డ్రైవర్స్‌కాలనీలలో చెత్త కుప్పలు ఊడ్చారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 52వ వార్డులో పేరుకుపోయిన చెత్తను స్వయంగా చీపురు పట్టి శుభ్రం చేశారు.

రేపు నింగిలోకి పీఎస్ఎల్‌వీ సీ58 రాకెట్

- నాలుగు దశల అనుసంధానం పనులు పూర్తి
- పీఎస్ఎల్‌వీ రాకెట్ సిరీస్‌లో ఈ ప్రయోగం 60వది



ప్రయోగ వేదికపై పీఎస్ఎల్‌వీ సీ58 రాకెట్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): నూతన సంవత్సరం 2024, జనవరి ఒకటో తేదీ ఉదయం 9.10 గంటలకు సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్‌వీ సీ58 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. నాలుగు దశల రాకెట్ అనుసంధానం పనులు పూర్తి చేసి.. ఎంఎస్‌టీ నుంచి ప్రయోగ వేదికకు అనుసంధానం చేశారు. ఈ ప్రయోగానికి సంబంధించి శనివారం ఎంఆర్ఆర్ సమావేశం నిర్వహించి ప్రయోగ పనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డుకు అప్పగించారు. అనంతరం లాంచ్ ఆథరైజేషన్ సమావేశం నిర్వహించి రిహార్సల్స్ చేసి ప్రయోగసమయాన్ని, కౌంట్‌డౌన్ సమయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఆదివారం ఉదయం 8.10 గంటలకు.. అంటే ప్రయోగానికి 25 గంటల ముందు కౌంట్‌డౌన్ నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. పీఎస్ఎల్‌వీ రాకెట్ సిరీస్‌లో ఈ ప్రయోగం 60వది కావడం విశేషం.

260 టన్నుల బరువు..

పీఎస్ఎల్‌వీ సీ58 రాకెట్ 44.4 మీటర్లు పొడవు కలిగి ప్రయోగ సమయంలో 260 టన్నుల బరువుంటుంది. ఈ ప్రయోగాన్ని నాలుగు దశల్లో 21.55 నిమిషాల్లో పూర్తి చేస్తారు. రాకెట్ మొదటి దశలో రెండు స్ట్రాపాన్ బూస్టర్లలో నింపిన 24.4 టన్నుల ఘన ఇంధనం, కోర్ అలోన్ దశలో నింపిన 138 టన్నుల ఘన ఇంధనంతో 109.40 సెకెండ్లను పూర్తి చేస్తారు. రాకెట్ దూసుకెళుతున్న తరుణంలోనే 175 సెకెండ్లకు శాటిలైట్‌కు రక్షణ కవచంగా ఉన్న హీట్ షీల్డ్ విడిపోతుంది. అనంతరం 41.9 టన్నుల ద్రవ ఇంధనంతో 261.50 సెకెండ్లకు రెండో దశ, 7.66 టన్నుల ఘన ఇంధనంతో 586.26 సెకెండ్లకు మూడో దశ, 1.6 టన్నుల ద్రవ ఇంధనంతో 1258.92 సెకెండ్లకు నాలుగో దశను పూర్తిచేస్తారు. అనంతరం నాలుగో దశలో ద్రవ ఇంధన మోటార్ 1315.92 సెకెండ్లకు(21.55 నిమిషాల్లో) ఎక్స్‌పోశాట్ అనే ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టి ప్రయోగాన్ని పూర్తి చేస్తారు. ఈ ప్రయోగంలో 469 కిలోల బరువు గల ఎక్స్‌పోశాట్ అనే ఖగోళ పరిశోధనలకు ఉపయోగపడే ఉపగ్రహాన్ని భూమికి 350 నుంచి 450 కి.మీ. ఎత్తులోని లియో ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు.

సూపర్ 'పవర్' దిశగా ఏపీ

పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులతో విద్యుత్ రంగంలో గేమ్ ఛేంజర్‌గా ఆంధ్రప్రదేశ్

- రాష్ట్రంలో 42,120 మెగావాట్ల పీఎస్పీలకు ప్రణాళిక
- 34 వేల మెగావాట్ల ప్రాజెక్టుల నిర్మాణం కోసం 29 ప్రదేశాలను గుర్తించిన నెడ్ క్యాప్
- 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని సాధించాలన్న భారత్ లక్ష్యానికి ఏపీ తోడ్పాటు



సాక్షి, అమరావతి: విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను సూపర్ పవర్‌గా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, నీటిని అందించాలంటే వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవాలన్న లక్ష్యంతో పారిస్ ఒప్పందం పేరిట ప్రపంచ దేశాలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఆ లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా 2030 నాటికి దేశంలో 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని సాధించాలని భారత్ నిర్ణయించింది. ఈ లక్ష్య సాధనలో ఏపీ ప్రభుత్వం ముందంజలో ఉంది. ఇందుకోసం పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యమిస్తోంది. ఆ క్రమంలోనే పంప్డ్ స్టోరేజ్ పవర్ (పీఎస్పీ) ప్రాజెక్టులను నిర్మిస్తోంది. హామీలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా ఆచరణలో పెడుతోంది. ఇందుకు నిదర్శనంగా పీఎస్పీల నిర్మాణ ప్రయత్నాల్లో వేగం పెంచింది.

ప్రజల అంగీకారంతోనే:

రాష్ట్రంలో మొత్తం 42,120 మెగావాట్ల సామర్థ్యం గల 37 పంప్డ్ స్టోరేజి పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక వేసింది. ఇందులో 34 వేల మెగావాట్ల ప్రాజెక్టుల నిర్మాణం కోసం నెడ్ క్యాప్ 29 ప్రదేశాలను గుర్తించింది. తొలిదశలో ప్రతిపాదించిన వాటికి పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణను ఇప్పటికే నెడ్ క్యాప్ చేపట్టింది. చిత్రావతిలో 500 మెగావాట్ల ప్రాజెక్టుకు మే నెలలో, గండికోటలో 1000 మెగావాట్లకు ఆగస్టులో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. ఈ నెలలో పైడిపాలెం ఈస్ట్‌లో 1,200 మెగావాట్లు, పైడిపాలెం నార్త్‌లో 1,000 మెగావాట్లు, సోమశిలలో 900 మెగావాట్లు, శింగనమలలో 800 మెగావాట్ల ప్రాజెక్టుల కోసం ప్రజాభిప్రాయాన్ని నెడ్ క్యాప్ తీసుకుంటోంది. డిసెంబర్‌లో కమలపాడులో 950 మెగావాట్లు, అవుకులో 800 మెగావాట్ల ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజాభిప్రాయం సేకరించనుంది. ఫిబ్రవరి నాటికి ఈ 8 ప్రాజెక్టులకు సంబంధించిన పర్యావరణ అనుమతుల సాధన ప్రక్రియ పూర్తి చేసి.. జూన్ నాటికి వాటి డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయాలని భావిస్తోంది. అనుమతులు వచ్చిన తర్వాత నాలుగేళ్లలోనే ప్రాజెక్టుల నిర్మాణం పూర్తవుతుంది.

పీఎస్పీలతో ప్రయోజనాలెన్నో

గ్రిడ్‌ను స్థిరీకరించే చర్యలో గేమ్ ఛేంజర్‌గా చెప్పుకునే పీఎస్పీలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. పవన, సౌర విద్యుత్ ఉత్పత్తి వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తి బొగ్గు లభ్యతతో ముడిపడి నడుస్తుంది. కేవలం వాటిపైనే ఆధారపడటం వల్ల ప్రతికూల పరిస్థితుల్లో పవర్ గ్రిడ్ అస్థిరంగా మారే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రతికూలతలను అధిగమించడానికి గాలి, నీరు, కాంతితో విద్యుత్‌ను ఉత్పత్తి చేయగల హైబ్రీడ్ పీఎస్పీలు కీలక పాత్ర పోషించనున్నాయి. ఇవి సాధారణ పరిస్థితుల్లో సంప్రదాయ జల విద్యుత్ కేంద్రాలుగా పనిచేస్తాయి. కానీ.. అవి విద్యుత్‌ను ఉత్పత్తి చేయనప్పుడు, తక్కువ స్థాయి రిజర్వాయర్ నుండి అధిక స్థాయి రిజర్వాయర్‌కు నీటిని పంప్ చేసే పంపింగ్ స్టేషన్లుగా ఉపయోగపడతాయి. ఇవి పర్యావరణానికి హాని కలిగించవు. గాలి, నీటి కాలుష్యాన్ని అరికడతాయి. రిమోట్‌తోనే వీటిని నియంత్రించగలగడం వల్ల ఆపరేషన్ కార్యకలాపాలు సులభంగా జరుగుతాయి. పంపింగ్‌కు అవసరమైన విద్యుత్ తక్కువ ధరకు (పీక్ అవర్స్ రేటు) అందుబాటులో ఉంటుంది. ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను ప్రైమ్ రేట్ (పీక్ అవర్స్ రేటు)కి విక్రయించవచ్చు. 2027 నాటికి 275 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని మన దేశం ఐదేళ్ల క్రితం ఏర్పరచుకుంది. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి పునరుత్పాదక ఇంధన ఎగుమతి విధానం (రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పోర్ట్ పాలసీ-2020)ను దేశంలోనే మొట్టమొదటిసారి ప్రకటించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. పునరుత్పాదక ఇంధన రంగంలోకి పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.కోట్ల విలువైన పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకుంది. వీటివల్ల రాష్ట్రానికి పన్ను రాబడితో పాటు స్థానిక ప్రజలకు ఉపాధి లభించనుంది.

ఫేజ్-2 ప్రాజెక్టుల కోసం నివేదికలు

మొదటి దశలో టెక్నో కమర్షియల్ సాధ్యాసాధ్యాల నివేదికల ప్రకారం 34 వేల మెగావాట్ల పీఎస్పీల కోసం న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) ద్వారా నీటిలోనూ, నేలమీద 29 ప్రదేశాలను గుర్తించాం. నేలపై 30,800 మెగావాట్లు, నీటిపై 3,200 మెగావాట్ల ప్రాజెక్టులను స్థాపించనున్నారు. మరో 3,650 మెగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టుల కోసం 4 స్థానాలను గుర్తించాం. రెండో దశ (ఫేజ్-2) ప్రాజెక్టుల కోసం సాధ్యాసాధ్యాల నివేదికలు సిద్ధమవుతున్నాయి.

– ఎస్.రమణారెడ్డి, వీసీ అండ్ ఎండీ, నెడ్‌క్యాప్

తుంగభద్రలో నీటి లభ్యత సగంలోపే!

- టీబీ డ్యామ్ వద్ద 230 టీఎంసీల లభ్యత ఉంటుందని బచావత్ ట్రిబ్యునల్ అంచనా
- అదే ప్రాతిపదికన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు నీటి కేటాయింపులు
- వాటినే కొనసాగించిన బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్
- కానీ.. ఈ ఏడాది టీబీ డ్యామ్‌లోకి వచ్చింది 114.58 టీఎంసీలే

సాక్షి, అమరావతి: వాతావరణ మార్పుల కారణంగా తుంగభద్ర బేసిన్‌లో అత్యల్ప వర్షపాతం నమోదు కావడం వల్ల తుంగభద్ర (టీబీ) డ్యామ్‌లో నీటి లభ్యత ఈ ఏడాది సగానికి పడిపోయింది. జూన్ 1 నుంచి ఇప్పటివరకు డ్యామ్‌లోకి 114.58 టీఎంసీల ప్రవాహం మాత్రమే వచ్చింది. తుంగభద్ర నదిలో వందేళ్ల ప్రవాహాలను పరిగణనలోకి తీసుకుని.. టీబీ డ్యామ్ వద్ద 75 శాతం లభ్యత ఆధారంగా 230 టీఎంసీల లభ్యత ఉంటుందని బచావత్ ట్రిబ్యునల్ అంచనా 1976లో వేసింది. దీన్ని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 2010లో ఖరారు చేసింది. కానీ.. రెండు ట్రిబ్యునళ్లు అంచనా వేసిన దాంట్లో సగం నీళ్లు కూడా ఈ ఏడాది టీబీ డ్యామ్‌లోకి చేరకపోవడం గమనార్హం. టీబీ డ్యామ్ చరిత్రలో 2016–17లో వచ్చిన 85.71 టీఎంసీలే కనిష్ఠ ప్రవాహం. ఈ ఏడాది వచ్చింది రెండో కనిష్ఠ ప్రవాహం. శనివారం నాటికి టీబీ డ్యామ్‌లో 10.29 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. గతేడాది ఇదే సమయానికి 76.91 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. టీబీ డ్యామ్‌లో ఇదే సమయానికి గత పదేళ్లలో సగటున 50.60 టీఎంసీలు నిల్వ ఉండేవి. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే గత పదేళ్లలో కనిష్ఠ నీటి నిల్వ ఉండడం కూడా ఇదే తొలిసారి. టీబీ డ్యామ్ నుంచి కర్ణాటకకు 151.49, ఏపీకి 72 (హెచ్చెల్సీ 32.50, ఎల్లెల్సీ 29.50, కేసీ 10.00), తెలంగాణకు 6.51 (రాజోలిబండ డైవర్షన్ స్కీం) టీఎంసీల చొప్పున బచావత్ ట్రిబ్యునల్ కేటాయించింది. ఏటా పూడిక పేరుకుపోతుండడంతో డ్యామ్ నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తున్నది. 2016లో నిర్వహించిన సర్వేలో డ్యామ్ సామర్థ్యం 105.78 టీఎంసీలని తేలింది. దాన్ని పరిగణనలోకి తీసుకుని.. నీటిలభ్యత ఆధారంగా దామాషా పద్ధతిలో 3 రాష్ట్రాలకు తుంగభద్ర బోర్డు పంపిణీ చేస్తూ వస్తున్నది. ఈ ఏడాది నీటి లభ్యత తగ్గిన నేపథ్యంలో ఆయకట్టులో ఆరు తడి పంటలకు నీటిని సరఫరా చేశారు. 2019–20 నుంచి 2022–23 వరకుటీబీ డ్యామ్‌లోకి భారీగా వరద చేరడంతో ఆయకట్టుకు సమృద్ధిగా నీళ్లందించారు. టీబీ డ్యామ్ చరిత్రలో గతేడాది అంటే 2022–23లో వచ్చిన 606.64 టీఎంసీలే గరిష్ఠ వరద ప్రవాహం కావడం గమనార్హం.

దక్షిణాదిలో నీటికి కటకట

- ప్రస్తుతం కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఏపీ రిజర్వాయర్లలో ఉన్నది 23.194 బీసీఎంలే..
- గత పదేళ్లలో ఈ ఏడాదే అతి తక్కువ నీటి నిల్వలు
- ఇదే సమయానికి గత ఏడాది 45.167 బీసీఎంల నిల్వ
- దేశవ్యాప్తంగా 150 రిజర్వాయర్లలోనూ ఈ ఏడాదే అతి తక్కువ నీటి నిల్వలు
- రబీలో సాగు, వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తప్పవని సీడబ్ల్యూసీ వెల్లడి
- దేశంలోని రిజర్వాయర్లలో తాజా నీటి నిల్వలపై కేంద్రానికి నివేదిక



సాక్షి, అమరావతి: వేసవి సమీపించకముందే దేశవ్యాప్తంగా రిజర్వాయర్లలో నీటి నిల్వలు కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. గత పదేళ్లతో పోల్చితే ఈ ఏడాది రిజర్వాయర్లలో అతి తక్కువ నీటి నిల్వలు ఉన్నాయి. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే దక్షిణాది రాష్ట్రాల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. గత పదేళ్లలో ఇదే సమయానికి (నవంబర్ 24వ తేదీ) తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని రిజర్వాయర్లలో సగటున 36.389 బిలియన్ క్యూబిక్ మీటర్లు (ఒక బీసీఎం 35.32 టీఎంసీలతో సమానం) నీరు నిల్వ ఉండగా... ఈ ఏడాది 23.194 బీసీఎంలు నిల్వ ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి ఈ రిజర్వాయర్లలో 45.167 బీసీఎంలు నిల్వ ఉండటం గమనార్హం. రిజర్వాయర్లలో నీటి నిల్వలు అడుగంటిన నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల్లో రబీలో సాగునీటికి, వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తప్పవని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) పేర్కొంది. దేశవ్యాప్తంగా 150 జలాశయాలు, 20 జలవిద్యుదుత్పత్తి కోసం నిర్మించిన రిజర్వాయర్లలో నీటి నిల్వలను సీడబ్ల్యూసీ పర్యవేక్షిస్తుంది. ఈ రిజర్వాయర్లలో నీటి నిల్వల తాజా పరిస్థితిని వివరిస్తూ కేంద్రానికి సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చింది.

సీడబ్ల్యూసీ నివేదికలోని ప్రధానాంశాలు

- జల విద్యుత్ ఉత్పత్తి కోసం నిర్మించిన 20 రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం(లైవ్) 35.229 బీసీఎంలు. మిగతా 150 రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం 257.812 బీసీఎంలు. ఇందులో వినియోగించుకోదగిన స్థాయిలో నీటి నిల్వ సామర్థ్యం 178.784 బీసీఎంలు. ఈ 150 రిజర్వాయర్లలో శుక్రవారం నాటికి 120.272 బీసీఎంలు నిల్వ ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి ఈ రిజర్వాయర్లలో 150.778 బీసీఎంలు నిల్వ ఉండేవి. గత పదేళ్లలో ఇదే సమయానికి ఈ రిజర్వాయర్లలో సగటున 129.416 బీసీఎంలు నిల్వ ఉండేవి. అంటే.. గత పదేళ్ల కంటే ఈ ఏడాది తక్కువ స్థాయిలో నీటి నిల్వలు ఉన్నట్లు స్పష్టమవుతోంది.
- ఉత్తరాది రాష్ట్రాల్లో (హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్) రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం 19.663 బీసీఎంలు. ప్రస్తుతం వాటిలో 14.119 బీసీఎంలు నిల్వ ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి ఆ రిజర్వాయర్లలో 15.978 బీసీఎంలు నిల్వ ఉన్నాయి.
- తూర్పు ప్రాంత రాష్ట్రాల్లో (అసోం, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బంగా, త్రిపుర, నాగాలాండ్, బిహార్) రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం 20.430 బీసీఎంలు. ప్రస్తుతం ఆ రిజర్వాయర్లలో 14.625 బీసీఎంలు నిల్వ ఉండగా... గత ఏడాది ఇదే సమయానికి 14.383 బీసీఎంలు నిల్వ ఉన్నాయి.
- పశ్చిమ ప్రాంత రాష్ట్రాల్లో(గుజరాత్, మహారాష్ట్ర) రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం 37.130 బీసీఎంలు. ప్రస్తుతం వాటిలో 30.335 బీసీఎంలు నిల్వ ఉండగా.. గత ఏడాది ఇదే సమయానికి వాటిలో 33.969 బీసీఎంలు నిల్వ ఉన్నాయి.
- మధ్య ప్రాంత రాష్ట్రాల్లో (ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్) రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం 48.227 బీసీఎంలు. ప్రస్తుతం వాటిలో 38.009 బీసీఎంలు నిల్వ ఉండగా.. గత ఏడాది ఇదే సమయానికి 41.281 బీసీఎంలు నిల్వ ఉన్నాయి.

దేశవ్యాప్తంగా వివిధ నదీ పరీవాహక ప్రాంతాల(బేసిన్)లోని రిజర్వాయర్ల సామర్థ్యం, శుక్రవారం నాటికి వాటిలో నీటి నిల్వల పరిస్థితి ఇదీ (బీసీఎంలలో)...

బేసిన్	రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	గత ఏడాది నిల్వ	పదేళ్లలో సగటు నిల్వ
గంగా	33.252	24.007	26.849	24.165
సింధూ	14.819	10.360	11.473	10.106
బ్రహ్మపుత్రా	0.874	0.460	0.335	0.494
పెన్నా	1.994	0.829	1.958	1.557
నర్మదా	22.334	20.992	20.083	16.332
కృష్ణా	32.943	15.087	29.227	23.412
గోదావరి	16.956	11.704	13.963	11.906
కావేరి	6.193	2.257	5.690	4.212

3న విచారణకు రండి


- టీడీపీ నాయకుడు కొలికపూడికి సీఐడీ నోటీసు
- సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తల నరికి తెస్తే రూ.కోటి ఇస్తానన్న కొలికపూడి
- వర్మను ఇంటికెళ్లి తగలబెడతానంటూ టీవీ5 లైవ్‌లో హెచ్చరికలు
- తనను చంపేందుకు బహిరంగంగా సుపారీ ఆఫర్ చేయడంపై వర్మ ఫిర్యాదు
- కొలికపూడి, సాంబశివరావు, బీఆర్ నాయుడుపై కేసు నమోదు చేసిన ఏపీ సీఐడీ



సాక్షి, అమరావతి: సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మను చంపి, ఆయన తల నరికి తెచ్చిన వారికి రూ.కోటి ఇస్తానంటూ టీవీ5 లైవ్ షోలో బహిరంగంగా సుపారీ ప్రకటించిన టీడీపీ నాయకుడు, అమరావతి జేఏసీ కన్వీనర్ కొలికపూడి శ్రీనివాసరావును జనవరి 3వ తేదీన విచారణకు రావాలని ఏపీ సీఐడీ అధికారులు నోటీసు జారీ చేశారు. హైదరాబాద్‌లోని కొలికపూడి నివాసానికి శనివారం ఏపీ సీఐడీ అధికారులు వెళ్లారు. సీఐడీ అధికారులు వస్తున్నారని తెలుసుకున్న కొలికపూడి పరారైనట్టు సమాచారం. కొలికపూడి లేకపోవడంతో ఆయన భార్య మాధవికి నోటీసు అందించారు. ఆయన్ను జనవరి 3న ఏపీ సీఐడీ కార్యాలయానికి విచారణకు రావాలని నోటీసు జారీ చేశారు. దర్శకుడిగా తాను తీసిన 'వ్యూహం' సినిమా సెన్సార్ బోర్డు సర్టిఫికెట్‌తో రిలీజ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో తనను లక్ష్యంగా చేసుకుని టీడీపీ, దానికి అనుకూలంగా కొన్ని టీవీ చానల్స్, వార్త పత్రికలు విమర్శలు చేస్తున్నాయని, పథకం ప్రకారం కుట్రలు చేస్తున్నారని రామ్‌గోపాల్ వర్మ సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. వ్యూహం సినిమా రిలీజ్ అయితే ప్రజల్లో టీడీపీ చులకన అవుతుందని భావించి సినిమా రిలీజ్‌ను అడ్డుకునేందుకు అనేక కుట్రలు చేస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. టీవీల్లో చర్చలు, సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసి సమాజంలో అశాంతి, అలజడులు సృష్టించేందుకు ప్రయత్నాలు చేయడాన్ని వర్మ తన ఫిర్యాదులో ప్రస్తావించారు. టీడీపీ అనుయాయుడైన కొలికపూడి శ్రీనివాసరావు, టీవీ5 చానల్ యజమాని బీఆర్ నాయుడు, యాంకర్ సాంబశివరావు తదితరులు నేరపూరిత ఆలోచనలతో కుట్రపూరితంగా ఈ నెల 27న లైవ్‌లో చర్చ పేరుతో బహిరంగంగా సుపారీ ఆఫర్ ఇవ్వడంపై వర్మ ఫిర్యాదు చేశారు. వర్మను చంపి, ఆయన తల తెచ్చి ఇచ్చిన వారికి రూ.కోటి ఇస్తానని, తానే వర్మ ఇంటికి వెళ్లి తగలబెడతానని కొలికపూడి శ్రీనివాసరావు టీవీ5 డిబేట్‌లో పబ్లిక్‌గా చెప్పడాన్ని వర్మ ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. తనను చంపడానికి ముందుగానే ప్లాన్ చేసుకుని పబ్లిక్‌గా కాంట్రాక్ట్ ఇచ్చినట్టు దీని ద్వారా స్పష్టమవుతోందని వర్మ పేర్కొన్నారు. అదేవిధంగా 'వర్మ కను గుడ్లు తెస్తే రూ.10 లక్షలు, కాళ్లు నరికి తెస్తే రూ.5 లక్షలు... 9985340280 కాల్ చేసి క్యాష్ తీసుకోండి' అంటూ సోషల్ మీడియాలో సుపారీలు ప్రకటించడం గమనార్హం. 'గురువుగారు మీ ఆఫర్ స్వీకరిస్తున్నాను.. వర్మ తల నరికి తెస్తాను..' అని షేక్ ఫిరోజ్ అనే వ్యక్తి సోషల్ మీడియా ద్వారా దేవభక్తుని జవహర్‌లాల్ అనే వ్యక్తి పెట్టిన పోస్టుకు బదులిచ్చాడు. ఈ నేపథ్యంలోనే వర్మను హత్య చేసేందుకు టీవీ5 లైవ్‌లో సుపారీ ఆఫర్ చేసిన వ్యవహారంపై సీఐడీ కేసు నమోదు చేసింది. టీవీ డిబేట్‌లో సుపారీ ఆఫర్ ఇచ్చిన టీడీపీ నాయకుడు కొలికపూడి శ్రీనివాసరావు, అందుకు ప్రోత్సహించిన టీవీ5 చానల్ యాంకర్ సాంబశివరావు, మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎడిటర్ బీఆర్ నాయుడు, టీవీ5 మేనేజ్‌మెంట్, డైరెక్టర్లు, షేక్ ఫిరోజ్‌తోపాటు మరి కొందరిపై కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్‌లు 153(ఎ), 505(2), 506(2), రెడ్ విత్ 115, 109, 120(బి) కింద కేసు నమోదు చేసిన సీఐడీ అధికారులు విచారణ చేపట్టారు.

సాక్షి విలేకరి 'గురిజా' మృతిపై వాస్తవాలు నిగ్గుతేల్చాలి

- టీడీపీవి తప్పుడు ప్రచారాలు
- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, దామోదర్ కుటుంబ సభ్యులు

రణస్థలం: శ్రీకాకుళం జిల్లా లావేరు సాక్షి విలేకరి గురిజా దామోదరరావు మృతి బాధాకరమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. తన పెదనాన్న గొర్లె శ్రీరాములునాయుడుకు, దామోదరరావు తండ్రి తవిటయ్యతో మంచి అనుబంధం ఉందని, దామోదర్ కుటుంబ సభ్యులతో తనకు ఎలాంటి విభేదాల్లేవని చెప్పారు. విపక్షాలు దీనిపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు. వాస్తవాలు తెలీకుండా టీడీపీ నేతలు కళా వెంకటరావు, చంద్రబాబు స్పందించిన తీరు శవాలపై రాజకీయం చేసేలా ఉందని విమర్శించారు. దీనిపై పోలీసులు లోతైన విచారణ జరిపి నిజా నిజాలు నిగ్గుతేల్చాలని కోరారు. ఈ ఘటనపై ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశానని, దామోదర్ నాలుగు నెలలు ఎవరితో ఎక్కువ మాట్లాడారో కాల్స్ పరిశీలిస్తే వాస్తవాలు బయటపడతాయన్నారు. దామోదర్ కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి మాట్లాడుతూ కళా వెంకటరావు రాజకీయ లబ్ధి కోసమే దామోదర్ మృతిని రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఎనిమిదేళ్ల కిందట కళా వెంకటరావు తన తమ్ముడినే చంపేశాడని కుటుంబ సభ్యులే కేసు పెట్టారని, ఆయన మంత్రిగా ఉన్నప్పుడు వేధించారంటూ వంగర ఎస్ఐ, కళాతో పాటు ఆయన పీఏపైనా కేసు పెట్టారని గుర్తు చేశారు.

టీడీపీ నేతలు వాస్తవాలకు విరుద్ధంగా మాట్లాడుతున్నారు

లావేటిపాలెం వైఎస్సార్‌సీపీ నేతలు, మృతుడి బంధువులైన లావేరు ఎంపీటీసీ ఇనపకుర్తి సతీష్, ఇనపకుర్తి చంద్రశేఖర్, సగరం విశ్వనాథం మాట్లాడుతూ దామోదర్ ఎనిమిది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలిపారు. టీడీపీ నేత జగ్గన్న దొరకు దామోదర్ రూ.10 లక్షలు అప్పు ఇచ్చాడని, ఆ డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు దామోదర్ చెప్పాడని పేర్కొన్నారు. వాస్తవాలకు విరుద్ధంగా ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, లంకలపల్లి గోపిపై ఆరోపణలు చేస్తున్నారని, సూసైడ్ లెటర్ కూడా టీడీపీ వాళ్లు పెట్టించి ఉంటారని ఆరోపించారు.

• తెలంగాణ

మేడారం జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హన్మకొండ/ ఎస్ఎస్ తాడ్వాయి: లక్షలాది మంది భక్తులు వచ్చే దక్షిణ భారత కుంభమేళా అయిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలని ఎమ్మెల్సీ కవిత కేంద్రాన్ని డిమాండ్ చేశారు. శనివారం మేడారం వనదేవతల దర్శనానికి వెళ్తూ హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన వర్సిటీ మంజూరు చేసి సమ్మక్క–సారక్క పేరు పెట్టడం గర్వకారణమన్నారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలిచ్చిందని, రాష్ట్రంలో 45 లక్షల మందికి పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని చెప్పిన మేరకు జనవరి 1 నుంచి రూ.4 వేల చొప్పున చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. డిసెంబర్‌లో పెన్షన్, రైతుబంధు సకాలంలో అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం నివేదిక రాకముందే ఆగమాగం చేస్తున్నారని, దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇప్పటికే మాట్లాడారని గుర్తు చేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం | 31 | డిసెంబర్ | 2023



ఉద్యోగం ప్లీజ్

బెంగళూరులో ప్రభుత్వ కేపీ టీసీఎల్ ఆఫీసు ముందు విద్యార్థి సంఘాల ధర్నా. సంస్థలోని ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు

న్యూస్‌రీల్

హుస్కూరులో చిరుత ప్రత్యక్షం



సీసీ కెమెరాలో రికార్డయిన చిరుత సంచారం

బొమ్మనహళ్లి: రాష్ట్రంలో అనేక చోట్ల చిరుత సంచారం ఎక్కువవుతోంది. తాజాగా బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ తాలూకా పరిధి ఎలక్ట్రానిక్ సిటీకి సమీపంలో ఉన్న హుస్కురు, గట్టహళ్లి గ్రామాల మధ్య శుక్రవారం చిరుత కనిపించింది. హుస్కూరుకు చెందిన చంద్రు అనే వ్యక్తి బైక్‌పై వెళుతుండగా రోడ్డు మధ్యలో చిరుత వెళ్లడం కనిపించింది. దీంతో భయంతో కొద్ది దూరం వెనక్కు వెళ్లాడు. బైక్ వెలుతురు రావడంతో చిరుత వేగంగా పరుగులు పెట్టింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు చిరుత కోసం గాలిస్తున్నారు. సమీపంలోని ఇళ్లల్లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా చిరుత సంచారం బయటపడింది. దీంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

బెంగళూరు నుంచి అయోధ్యకు విమాన సేవలు

దొడ్డబళ్లాపురం: వచ్చే జనవరి 17 నుంచి ఎయిర్ ఇండియా సంస్థ బెంగళూరు నుంచి అయోధ్యకు విమాన సర్వీసులు అందించనుంది. జనవరి 17న ఉదయం 8.05కి బెంగళూరు నుండి అయోధ్యకు మొదటి విమానం ఎగరనుంది 10.35కి అయోధ్య చేరుకోనుంది. మళ్లీ అయోధ్య నుండి 3.40కి బయలుదేరి సాయంత్రం 6.10కి బెంగళూరు చేరుకోనుంది. అయోధ్యలో రామమందిరం ప్రారంభించబడ్డాక అయోధ్యకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని సంస్థ అధికారులు చెప్పారు.

అటవీ సిబ్బంది సస్పెండ్

దొడ్డబళ్లాపురం: హాసన్ తాలూకా నందగొండనహళ్లిలో 12 ఎకరాల అటవీ ప్రదేశంలో పెరిగిన చెట్లను నరికివేసిన సంఘటనలో మొత్తం 5 మంది అటవీశాఖ అధికారులను సస్పెండ్ చేశారు. ఈ నెల 16న కొందరు చెట్లను నరికివేసినట్లు బేలూరు తహసీల్దార్ మమతకు తెలిసింది. ఎంపీ ప్రతాప్ సింహ అండతో చెట్లు కొట్టేశారని ఆరోపణలు వచ్చాయి. ఎంపీ తమ్ముడు విక్రం సింహ అల్లం పంట సాగు కోసం నందగొండనహళ్లిలో జయమ్మ అనే మహిళకు చెందిన మూడు ఎకరాల పొలాన్ని గుత్తకు తీసుకున్నాడు. తరువాత పక్కనే 12 ఎకరాల గోమాళ భూమిలో ఉన్న చెట్లను నరికివేయించాడని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. దీంతో ప్రభుత్వం స్పందించిన ఇందులో నిర్లక్ష్యం వహించారని అసిస్టెంట్ ఫారెస్ట్ ఆఫీసర్ మోహన్ కుమార్‌తో సహా ఐదుమంది అటవీ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేసింది.

పైపులు పగిలి రోడ్లు అధ్వాన్నం



గుంతలు, రొచ్చుగా బాగేపల్లి రోడ్లు

బాగేపల్లి: బాగేపల్లి అటు ఆంధ్రప్రదేశ్, ఇటు కర్ణాటకలను కలిపే ప్రముఖ స్థలంలో ఉంటుంది, కానీ కనీస వసతుల కల్పనలో వెనుకబడిపోయింది. పట్టణంలోని గోళూరు రోడ్డులో పురసభ పరిధిలో తాగునీటి పైప్‌లైన్ పగిలి నీరు రోడ్లపై పారుతోంది. సుమారు 20 రోజుల నుంచి నీరు మొత్తం రోడ్లపైకి వస్తోంది. బురద, గుంతలు తేలి ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల మీద వెళ్లడానికి వీలు కావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు అనేక సార్లు ఫిర్యాదులు చేసినా పురసభ అధికారులు ఇటు వైపు వచ్చి చూసింది లేదని వాపోయారు. పైపులను, రోడ్లను ఎప్పటికి బాగుచేస్తారని ప్రశ్నించారు.

నకిలీ పోలీస్‌కు సంకెళ్లు

మైసూరు: క్రైం బ్రాంచ్ పోలీస్ అని చెప్పుకుంటూ డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని జిల్లాలోని పిరియాపట్టణ తాలూకా బైలుకొప్ప పోలీసులు అరెస్టు చేశారు. కేఆర్ నగర తాలూకాలోని మదువనహళ్లికి చెందిన దివ్యరాజ్ అనే వ్యక్తి పోలీసనని ప్రజలను భయపెడుతూ డబ్బులు గుంజుతున్నాడు. కొప్ప గ్రామంలో ఉన్న ఆయుర్వేదిక్ స్పా యజమానికి పుష్పకుమార్‌ను కూడా ఇలాగే చెప్పి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. అతడు అనుమానంతో బైలుకొప్ప పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దివ్యరాజ్‌ను అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

ఐటీ నగరిపై డ్రగ్స్ క్రీనీడ

- చాపకింద నీరులా విక్రయాలు, వాడకం
- విద్యావంతులే అధికం
- 2023లో రూ.102 కోట్ల డ్రగ్స్ స్వాధీనం
- కొత్త ఏడాదిలో అయినా కట్టడి అయ్యేనా?





బెంగళూరులో విచ్చలవిడిగా గంజాయి రవాణా జరుగుతోంది. సీజ్‌చేసిన గంజాయి ఇది

బనశంకరి: డ్రగ్స్ అనేది మత్తు అందించి జీవితాలను నిర్వీర్యం చేస్తుంది. అలాంటి విష వలయంలో యువత చిక్కుకుంది. భారత సిలికాన్ రాజధానిలో మాదక ద్రవ్యాలు విక్రయాలు, సేవనం ఏటేటా పెరుగుతోందే తప్ప తగ్గడం లేదనేది వెలుగులోకి వచ్చింది. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం ఎన్‌డీపీఎస్ చట్టం కింద 2023లో అత్యధిక డ్రగ్స్ కేసులు నమోదైన నగరంగా దేశంలో పేరుకెక్కింది.

క్వింటాళ్ల కొద్దీ పట్టుకున్నా

ఈ నేపథ్యంలో డ్రగ్స్ రహిత బెంగళూరు చేసే లక్ష్యంతో గంజాయి, సహా ఐదు టన్నులకు పైగా మొత్తంలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ విక్రేతలు, ఉపయోగించేవారితో కలిపి 4,383 మందిని అరెస్ట్ చేశారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ రూ.100 కోట్లుగా అంచనా. కానీ ఖాకీల కళ్లుగప్పి వందలాది కోట్ల విలువచేసే డ్రగ్స్ దందా చాపకింద నీరులా సాగిపోతోందన్నది సత్యం. ఆ డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో పెకలించడం సాధ్యం కాలేదు. ఈ కేసుల్లో పట్టుబడిన వారిపైకి 80 శాతం మంది డ్రగ్స్‌కు బానిసైనవారు ఉన్నారు. వీరంతా కాలేజీ విద్యార్థులు, ఐటీ, కార్పొరేట్ ఉద్యోగులు, వ్యాపారులు, సంపన్నులు ఉండడం



డ్రగ్స్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

గమనార్హం. క్షణకాలం మత్తు కోసం జీవితాన్ని గలీజు చేసుకుంటున్నారని పోలీస్ అధికారులు తెలిపారు.

విదేశీయుల హస్తం

రాజధానిలో గుడుంబా, గంజాయి విక్రయం నుంచి పంచతారా హోటల్స్‌లో నిర్వహించే హైఎండ్‌పార్టీల వరకు కొకైన్ వంటి సింథటిక్ డ్రగ్స్ విస్తరించాయి. పోలీసులు గుర్తించకుండా డార్క్‌వెబ్‌లో ఆర్డర్ ఇచ్చి కొరియర్ల ద్వారా తెప్పించుకోవడం పెరిగింది. ఐటీ నగరిలో ఎండీఎంఏ, ఎక్స్‌టసీ పిల్స్, ఎల్ఎస్‌డీ పట్టీలు, కొకైన్‌తో పాటు ఇతర శక్తిమంతమైన డ్రగ్స్ దందాలో విదేశీయులు నిమగ్నమయ్యారు. 98 మంది విదేశీయులను అరెస్టుచేశారు. వీరిలో నైజీరియా, ఆఫ్రికా ఖండవాసులు అధికం. టూర్, వ్యాపారం, చదువుల వీసాతో వచ్చి ధనార్జన కోసం డ్రగ్స్ దందాలోకి దిగడం పరిపాటిగా మారింది. ఢిల్లీ, ముంబై, గోవా ఇతర నగరాల్లోని డ్రగ్స్ ముఠాలతో కలిసిపోతున్నారు.

నిరంతర పోరాటం: సీపీ

డ్రగ్స్ గురించి తెలిస్తే కంట్రోల్‌రూమ్ 1908 నంబరుకు సమాచారం ఇచ్చి ప్రజలు సహకరించాలని పోలీసులు తెలిపారు. డ్రగ్స్‌పై నిరంతరం పోరాటం చేస్తున్నామని, న్యూ ఇయర్ పార్టీల్లో డ్రగ్స్ సరఫరా చేయడానికి సిద్ధమైన అనేకమంది పెడ్లర్లను ఇప్పటికే అరెస్ట్‌చేశామని పోలీస్ కమిషనర్ బీ.దయానంద్ తెలిపారు.

3,433 కేసులు నమోదు

- 2023లో నగరంలో డ్రగ్స్ కేసులు –3,433
- పట్టుబడిన వ్యక్తులు– 4,285, వీరిలో విదేశీయులు 98 మంది
- సీజ్ చేసిన డ్రగ్స్– 5,334 కిలోలు
- స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ రూ.102 కోట్లు

ముగ్గురు బీటెక్ విద్యార్థుల జలసమాధి



బరపోలె నదిలో మృతదేహాల కోసం గాలింపు.



మృతి చెందిన ముగ్గురు విద్యార్థులు (ఫైల్)

- ఈతకు వెళ్లి నదిలో మునక
- కొడగు జిల్లాలో దుర్ఘటన

మైసూరు: ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు జారి నీటిలో పడి మృతి చెందిన విషాద సంఘటన కొడగు జిల్లా పొన్నంపేటే దగ్గర బరపోలె వద్దనున్న బరపోలె నదిలో శనివారం చోటుచేసుకుంది. పొన్నంపేటేలోని సిఐటి కళాశాలకు చెందిన 2వ ఏడాది బీటెక్ విద్యార్థులు ఎంపి ఆకాశ్ బిద్దప్ప, య.సుధేష్ అయ్యప్ప, కే.జీ.రశిక్ కుశాలప్ప మృతులు. వీరందరి వయసు 20 నుంచి 21 ఏళ్లలోపు ఉంటుంది. అందరూ కొడగు జిల్లవాసులని సమాచారం.

నదిలో ఈతకు వెళ్లి..

వారాంతం సెలవు కావడంతో కాలేజీ నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలోనున్న బరపోలె నదిని చూడడానికి వెళ్లారు. హోటల్లో మధ్యాహ్నం భోజనం చేసుకుని నదిలో ఈతకు వెళ్లారు. అయితే వారికి ఈత రాకపోవడంతో పాటు నదిలో లోతైన చోటకు వెళ్లినప్పుడు నీటిలో మునిగిపోయారు. ఎవరూ కాపాడేవారు లేకపోవడంతో ప్రాణాలు కోల్పోయారు. వారితో పాటు వెళ్లిన మరో విద్యార్థి క్షేమంగా బయటపడినట్లు తెలిసింది. పొన్నంపేటే పోలీసులు, కాలేజీ సిబ్బంది వచ్చి మృతదేహాలను వెలికితీశారు. తల్లిదండ్రులు చేరుకుని కుమారుల మృతదేహాలను చూసి పెద్ద పెట్టున రోదించారు. నూతన ఏడాదికి ముందు జరిగిన ఘోర సంఘటనతో కాలేజీలో విషాద వాతావరణం నెలకొంది.

సముద్రంలో మునిగి ఇద్దరు మృతి

మంగళూరు సమీపంలోని ఉళ్లాల వద్ద సముద్రంలో ఈతకెళ్లి ఇద్దరు యువకులు మృతి చెందారు. ఒకరి మృతదేహం ఆచూకీ లభించగా, మరో మృతదేహం కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. చిక్కమగళూరుకు చెందిన ముగ్గురు బషీర్ (23), సల్మాన్ (19), సైఫ్ అలీ (27)లు కలిసి ఉళ్లాల దర్గాకు వెళ్లారు. దర్శించుకొని ప్రార్థనలు చేసి దగ్గర్లోని బీచ్‌లో ఈతకెళ్లారు. పెద్ద అలలు రావడంతో ముగ్గురు సముద్రంలో మునిగిపోయారు. అక్కడి ఈతగాళ్లు సైఫ్ అలీని రక్షించగా మరో ఇద్దరు సముద్రంలో మునిగిపోయారు. సల్మాన్ మృతదేహం ఒక్కటే దొరికింది.

నదిలోకి దూకి ఆత్మహత్య

ఉత్తర కన్నడ జిల్లా కారవారలో కాళి నది వంతెనపై నుంచి దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కరావళి సేఫ్‌గార్డు సిబ్బంది పడవలు వేసుకుని నదిలో గాలిరచగా, శుక్రవారం సాయంత్రం ఆశ్వేవాడ వద్ద మృతదేహం బయటపడింది. మృతుడు కారవారకు చెందిన ఆదిత్య నాయక్ (32)గా గుర్తించారు.





అందమైన కేక్‌లు

మండ్య: కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం పలకడానికి వినూత్నమైన కేక్‌లు మండ్య నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. ప్రతి ఏడాది మాదిరిగానే చాముండేశ్వరి నగరలో బేక్ పాయింట్‌లో కేక్ మేళా ప్రజలను ఆకర్షిస్తోంది. వివిధ రూపాల్లో నోరూరించే కేక్‌లను సిద్ధం చేశారు.





చీరల స్టాల్స్ వద్ద సందర్శకులు

అలరించే సిల్కు మేళా

బనశంకరి: న్యూ ఇయర్ సందర్భంగా సిల్క్ ఇండియా పేరుతో నిర్వహిస్తున్న పట్టుచీరల ప్రదర్శన వనితలను ఆకట్టుకుంటోంది. జేపీ నగర ఫస్ట్ ఫేజ్‌లో సింధూర్ కన్వెన్షన్ సెంటర్‌లో పట్టు మేళా జరుగుతోంది. ఒడిశా, సంబల్‌పురి ఇక్కత్‌చీరలు, బిహార్ ఆర్గానిక్ టస్సర్‌చీరలు, అసోం మూగా, ఇరి పట్టుచీరలు, కర్ణాటక క్రేప్ సిల్క్, అరణి, కాంచీపురం, ధర్మవరం, ఉప్పాడ, గద్వాల్, మంగళగిరి, పోచంపల్లి పట్టు, నూలు, ప్రింటెడ్ చీరలు ఇక్కడ లభ్యమవుతున్నాయి. ఉత్తరాదిన పేరుపొందిన చీరలు, వస్త్రాల స్టాళ్లు, గృహాలంకరణ సామగ్రి విక్రయాలు జరుగుతున్నాయి. ఈ ప్రదర్శన నేడు ఆదివారం సాయంత్రంతో ముగుస్తుంది.

ఉపాధ్యాయ ఓటర్ల ప్రకటన

శివాజీనగర: పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గాల తుది ఓటర్ల జాబితాను శనివారం ప్రకటించారు. ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 1,50,184 మంది ఓటర్లు ఉండగా, కర్ణాటక నైరుతీ పట్టభద్రుల స్థానంలో 74,218 మంది ఉన్నారు. బెంగళూరు పట్టభద్రుల నియోజకవర్గంలో 1,00,100 మంది ఓటర్లు ఉన్నారు. ఆగ్నేయ ఉపాధ్యాయుల నియోజకవర్గంలో 23,565 మంది ఓటర్లు ఉండగా, కర్ణాటక నైరుతీ ఉ. నియోజకవర్గంలో 19,837 ఓటర్లు ఉన్నారు. దక్షిణ ఉ. నియోజకవర్గంలో 18,475 మంది ఓటర్లు ఉన్నారు. బెంగళూరు ఉపాధ్యాయుల స్థానంలో 16,063 మంది ఓటర్లు ఉన్నారు. త్వరలో పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ పోస్టులకు ఎన్నికలు జరగనున్నాయి.

సంక్రాంతికల్లా పదవుల పంపిణీ


- కార్యకర్తలకు తగిన స్థానం: డీసీఎం

శివాజీనగర: బోర్డు, కార్పొరేషన్ పదవుల పంపిణీలో ఎమ్మెల్యేలతో సమానంగా కార్యకర్తలకూ స్థానం కల్పిస్తామని డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్ అన్నారు. శనివారం సదాశివనగరలో నివాసం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన, కార్యకర్తలకు తగిన చోటు ఇస్తాం, దీనిపై నాయకులు కూర్చొని చర్చిస్తాం. పదవుల నియామక జాబితా ఒక స్థాయికి వచ్చింది. సంక్రాంతి పండుగ నాటికి నియామకాలు చేసే అవకాశముందని తెలిపారు.

త్వరలో ప్రజల వద్దకు మనం

కాగా, ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు మనమే వారి వద్దకు వెళ్లాలని నేతలకు, అధికారులకు సూచించారు. అందుకోసం తలుపుల వద్దకు వచ్చింది ప్రభుత్వం, సేవకు ఉండాలి సహకారం అనే కార్యక్రమాన్ని చేపట్టాం. వచ్చే నెలలో బెంగళూరులోని 28 నియోజకవర్గాల్లో ప్రజల వద్దకు వెళ్లి విన్నపాలను స్వీకరిస్తామని డీకే చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు కసరత్తుపై జనవరి 10న పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఏఐసీసీ నాయకులతో భేటీ జరుపుతామని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును కలవడంపై స్పందిస్తూ నేనేమీ ఆంధ్రకు వెళ్లి ఆయనను కలవలేదు. బెంగళూరుకు వచ్చి వెళుతున్నప్పుడు విమానాశ్రయంలో కనిపిస్తే ఆయన ఆరోగ్యం ఎలా ఉందని అడిగాను అంతే అని తెలిపారు.

బీబీఎంపీలో ఉప విభాగాల పెంపు



బెంగళూరు నగరంలో పాత వలయాల మ్యాపు

- 30 నుంచి 75కు జంప్

వలయం	విభాగం	ఉప విభాగాలు
బొమ్మనహళ్లి	03	09
దాసరహళ్లి	02	04
తూర్పు వలయ	06	13
మహదేవపుర	02	09
ఆర్ఆర్ నగర	03	07
దక్షిణ వలయ	06	14
యలహంక	02	06
పశ్చిమ వలయ	06	13

విభజన తరువాత విభాగం, అందులోని ఉప విభాగాల సంఖ్య ఇలా ఉంటుంది

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె 30 ఉప విభాగాలను 75 ఉప విభాగాలుగా రాష్ట్ర ప్రభుత్వం విభజించింది. గత బీజేపీ ప్రభుత్వం 198 వార్డులు గల పాలికె ను 225 వార్డులుగా పునర్విభజన చేయాలని ఆదేశించింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉప విభాగాలను ఇబ్బడిముబ్బడిగా పెంచేసింది. ప్రతి ఉప విభాగంలో రెండు నుంచి నాలుగు వార్డులు ఉంటాయి. ఇకనుంచి 75 విభాగాలుగా పనిచేయాలని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ ఆదేశించారు. పరిపాలన సులువుగా ఉండేందుకు ఇలా చేసినట్లు అధికారులు తెలిపారు.

డొక్కు బస్సుల్ని నడపొద్దు

- ఆర్టీసీకి హైకోర్టు ఆదేశం

శివాజీనగర: నిర్ధారించిన కిలోమీటర్ల సంచారం పూర్తి చేసి షెడ్‌కు చేరే బస్సులను ఇక ఉపయోగించరాదని కేఎస్ ఆర్టీసీని హైకోర్టు ఆదేశించింది. ఆర్టీసీ మెకానికల్ విభాగం, ఆర్టీఓలు ఫిట్‌నెస్ ధృవపత్రం ఇచ్చిన బస్సులను మాత్రమే నడపాలని ఆదేశించింది. కండీషన్ లేని బస్సు ఢీకొని ఇద్దరు విద్యార్థులు మరణించిన కేసులో డ్రైవర్‌ను దోషిగా తీర్మానించి శిక్ష విధించిన స్థానిక కోర్టు తీర్పును హైకోర్టు జడ్జి జస్టిస్ రామచంద్ర డీ.హుద్దార్ ధర్మాసనం ఎత్తిచూపింది. ఆర్టీసీ డొక్కు బస్సుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వేసిన వ్యాజ్యాన్ని విచారించారు. అధీకృత ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందిన బస్సులు మాత్రమే రోడ్లపై తిరగడానికి అనుమతించాలి. ప్రతి బస్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి బాగా ఉంటేనే ఆర్‌టీఓ ఫిట్‌నెస్ ధృవపత్రం ఇవ్వాలని జడ్జి ఆదేశించారు.

మనది సార్వభౌమ భాష

యశవంతపుర: బహు భాషల మధ్య కన్నడ భాషను మరిచిపోవద్దని, కన్నడనే మన సార్వభౌమ భాషగా ఉండాలి. కన్నడిగులు ఇతరులను గౌరవించాలని విశ్రాంత లోకాయుక్త జస్టిస్ ఎస్.సంతోష్ హెగ్డే తెలిపారు. బెంగళూరు టౌన్‌హాల్‌లో జయకర్ణాటక ఆధ్వర్యంలో కువెంపు జయంతి, కర్ణాటక సువర్ణ మహోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. మొదట మనిషిగా ఉండాలని కవులు చెప్పారు. కన్నడిగునిగా మరణించాలన్నారు. కన్నడ శ్రీమంతుల భాషన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయంపై అందరూ పోరాటం చేయాలన్నారు. అవినీతి అనేది సమాజానికీ శాపంగా మారిందని, అవినీతిపరులను గొప్పగా చూపించే పరిస్థితి ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు.

మంగళూరు- గోవా వందేభారత్ రైలు షురూ

యశవంతపుర: మంగళూరు నుంచి గోవాకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం నుంచి సర్వీసులు మొదలయ్యాయి. మంగళూరు– మడగాంవ్‌ల మధ్య సంచరించే ఈ రైలుకు ప్రధాని నరేంద్రమోదీ అయోధ్యలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆ వెంటనే మంగళూరు నుంచి గోవాకు రైలు బయల్దేరింది. స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ రైల్లో ప్రయాణించారు. రెండు ఊళ్ల మధ్య 320 కిలోమీటర్లు దూరం ఉంది, మంగళూరు సెంట్రల్, ఉడుపి, కారవారలో స్టాప్‌లు ఉంటాయి. మడగాంవ్‌కు 4:35 గంటల్లో చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు. ఇందులో సాధారణ సీట్లు ఉంటాయి, స్లీపర్ కోచ్‌లు ఉండవు.

33వ అంతస్తు నుంచి పడి టెక్కీ మృతి



మృతుడు శర్మ (ఫైల్)

కృష్ణరాజపురం: స్నేహితులతో కలిసి విందు చేసుకుంటున్న సమయంలో టెక్కీ సిగరెట్ తాగడానికి బాల్కనీలోకి వచ్చి అదుపు తప్పి కింద పడి మరణించిన ఘటన నగరంలోని కృష్ణరాజపురంలోని కోడిగెనహళ్ళిలో చోటుచేసుకుంది. వివరాలు.. శుక్రవారం రాత్రి దీపాంశు శర్మ (32), ఓ యువకుడు, ఇద్దరు యువతులు కలిసి ఓ అపార్టుమెంటులో 33వ అంతస్తులో పార్టీ చేసుకుంటున్నారు. మద్యంతో పాటు గంజాయిని కూడా తాగి మజా చేసుకున్నారు. మధ్యలో దీపాంశు శర్మ సిగరెట్ తాగాలని ఫ్లాటులోని బాల్కనీలోకి వచ్చాడు. సిగరెట్ తాగుతూ మత్తులో అక్కడి నుంచి తూలి ఒక్కసారిగా కిందకు పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వాడు. ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ ఐటీ ఉద్యోగం చేసేవాడు. పార్టీ ఉందని స్నేహితుల ఫ్లాటుకు వచ్చి ప్రమాదం బారిన పడ్డారు. కృష్ణరాజపురం పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

రాచనగరిలో హనుమ ఘోష



శనివారం మైసూరులో హనుమోత్సవం ఊరేగింపు

మైసూరు: వారసత్వ నగరిలో శనివారం హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా హనుమోత్సవం ఘనంగా సాగింది. హనుమాన్ జయోత్సవం సమితి ఆధ్వర్యంలో కోటె ఆంజనేయ స్వామి ఆలయం ముందు ఊరేగింపును ప్రారంభించారు. తెల్లవారుజామునే హోమాలు, పూజల్ని నిర్వహించారు. హనుమాన్ విగ్రహానికి తులసి పత్రాలు, మైసూరు మల్లెలు, కజ్జాయలు, అలసంద వడలను దండలుగా వేసి నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యేలు జీటీ దేవేగౌడ, టిఎస్. శ్రీవత్స, కే.హరీష్‌గౌడ, మాజీ మేయర్ శివకుమార్‌లు హనుమోత్సవానికి నాంది పలికారు. వ్యాన్‌పై ఆంజనేయస్వామి, ఓం రూపాలను ప్రతిష్ఠించి మైసూరు నగరంలో ఊరేగింపు సాగించారు. డీజే, డోలు వాయిద్యాల ఘోష మధ్య భక్తులు చిందులేస్తూ సందడి చేశారు.

తైలాభిషేక పూజలు



పావగడ: గ్రహపీడలను పారదోలి, కోరిన కోర్కెలు ఈడేర్చే శాంత స్వరూపుడు శనీశ్వరస్వామిని దర్శనం కోసం భక్తులు శనివారం ఆలయానికి తండోపతండాలుగా వచ్చారు. నవగ్రహ పూజలు, శనీశ్వరుని తైలాభిషేక పూజలు చేశారు. ఆలయం ఎదుట ఉన్న అగ్ని గుండంలోకి భక్తులు తొమ్మిది నల్లవత్తులు, నల్ల వస్త్రాలు, నువ్వుల నూనె సమర్పించి మొక్కుకున్నారు.

క్లుప్తంగా

కేపీసీసీ లేబర్ సెల్‌కు ఎంపిక



ఆదేశ పత్రాన్ని అందుకుంటున్న ఎర్రిస్వామి

బళ్లారి టౌన్: కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(కేపీసీసీ) లేబర్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా కొళగల్లుకు చెందిన ఉప్పర ఎర్రిస్వామిని నియమించారు. శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో కేపీసీసీ లేబర్ సెల్ అధ్యక్షుడు కే.పుట్టేగౌడ ఈ ఆదేశ పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఎర్రిస్వామి మాట్లాడుతూ తన అధికారావధిలో జిల్లాతో పాటు రాష్ట్రంలోని కార్మికులందరికీ ప్రభుత్వం నుంచి లభించే పథకాల అందజేతకు కృషి చేస్తానన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు బలి

రాయచూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు బలైన ఘటన మాన్విలో చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి మాన్వి తాలూకా హిరేహళ్ల వంతెనపై ద్విచక్రవాహనం పైనుంచి కిందపడి యువకుడు గాయపడ్డాడు. అతనిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఆస్పత్రిలో మరణించినట్లు మాన్వి సీఐ హిరేమట్ తెలిపారు. కాగా మృతుడి పేరు, ఊరు వివరాలు తెలియరాలేదు.

పీఈటీకి వీడ్కోలు



ఖాదర్ రహమతుల్లాను అభినందిస్తున్న దృశ్యం

సిరుగుప్ప: నగరంలోని విజయమేరి పాఠశాల సభాంగణంలో శనివారం వ్యాయామ విద్యాధికారి ఖాదర్ రహంతుల్లా పదవీ విరమణ, అభినందన కార్యక్రమాన్ని తాలూకా విద్యాశాఖాధికారి గురప్ప చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణకు పేరుగాంచిన ఖాదర్ రహంతుల్లా క్రీడా రంగానికి ఎనలేని సేవలందించారన్నారు. వ్యాయామ విద్యలో జిల్లాకు మంచి కీర్తిని తెచ్చిన ఆయన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్షేత్ర సమన్వయ అధికారి తిమ్మనగౌడ పాటిల్, జిల్లా, తాలూకా స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాల లబ్ధి పొందాలి

రాయచూరు రూరల్: ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని యువ నేత నర్సింహులు పేర్కొన్నారు. ఆయన శనివారం రిమ్స్ ఆస్పత్రిలో మున్నూరు కాపు సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. వ్యాధుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించి వారికి ఉచితంగా పరీక్షలు, చికిత్సలు చేశారు. నగరసభ మాజీ ఉపాధ్యక్షుడు దొడ్డ మల్లేష్ వర్ధంతి సందర్భంగా రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

వేడుకగా పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: యాదగిరి జిల్లా మోతకపల్లిలో వెలసిన బలభీమసేన ఆంజనేయ ఆలయంలో ఘనంగా ఉత్సవాలు జరిగాయి. శనివారం ఆలయంలో విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. భక్తులు స్వామివారిని సేవించి రథోత్సవం జరిపారు. రాష్ట్ర వైద్య విద్యా శాఖ మంత్రి శరణ ప్రకాష్ పాటిల్, బీజేపీ నేత శివకుమార్ పాటిల్ తెల్కూరు బలభీమసేన ఆంజనేయ స్వామి దర్శనం పొందారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుక



ప్రతాప్‌రెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

బళ్లారి అర్బన్: బుడా మాజీ అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంలోని గాంధీనగర్‌లో ఆయన పుట్టిన రోజు వేడుకలను అభిమానులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న నిస్వార్థంతో తన వంతుగా సమాజ సేవ చేస్తున్న నారా ప్రతాప్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కే.సీ.కొండయ్య, న్యాయవాది హనుమంతరెడ్డి, ప్రముఖులు నిష్టిరుద్రప్ప, హలకుంది శివన్న, ఆప్ నాయకుడు మంజునాథ్ పాల్గొన్నారు.

ఐదుగురి మరణాల వెనుక..?



చుట్టుపక్కల ఇళ్లకు తాళం వేసిన దృశ్యం



ఐదుగురు ఒకేసారి ఎలా చనిపోయారు?

- చిత్రదుర్గలో రిటైర్డు అధికారి కుటుంబం మృతి కేసు
- మిస్టరీగా మారిన సంఘటన
- ఛేదించేందుకు పోలీసుల యత్నం
- ఇంటి చుట్టుపక్కల భయం భయం

సాక్షి, బళ్లారి: నెల కాదు, రెండు నెలలు కాదు ఏకంగా నాలుగేళ్లకుపైగా తమ ఇంటి పక్కనే ఉన్న ఇంట్లో, కాలనీలో ఐదుగురు మృతి చెంది అస్థిపంజరాలుగా మారిపోవడంతో చుట్టుపక్కల ఇళ్లు, కాలనీలవాసులు తమ ఇళ్లకు తాళాలు వేసుకుని పరుగులు తీశారు. చిత్రదుర్గ నగరంలో నాలుగేళ్ల క్రితం నుంచి ఇంటికి తాళం వేసి పాడుపడిన రిటైర్డ్ ఇంజనీర్ జగన్నాథ్‌రెడ్డి (80) కుటుంబం మొత్తం అస్థిపంజరాలుగా మారిన విషయం శుక్రవారం వెలుగు చూడటంతో చిత్రదుర్గ ఒక్కసారిగా ఉలిక్కిపడగా, చుట్టుపక్కల ఉన్నవారు భయభ్రాంతులకు లోనయ్యారు. నాలుగేళ్ల నుంచి తమ ఇళ్లపక్కనే ఉన్నవారు బయటకు వచ్చింది లేదు, వారి ఇంటికి కూడా ఎవరూ బంధుమిత్రులు రాలేదు. ఇల్లు అధ్వానంగా మారినా బాగోగులు పట్టించుకోలేదు. చివరకు అందులో మృతులు మాత్రమే జీవిస్తున్నారని తెలుసుకుని చుట్టుపక్కల ఇళ్లవారికి గుండెల్లో గుబులు ఏర్పడింది.

ఏం జరిగింది?

పాడుబడిన ఇంట్లో ఐదు అస్థిపంజరాల లభ్యతపై శనివారం పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. పీడబ్ల్యూడీ శాఖలో సహాయక కార్యనిర్వాహక ఇంజనీర్‌గా పని చేసి, పదవీ విరమణ పొందిన తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి జగన్నాథ్ రెడ్డి, ఆయన భార్య ప్రేమ, కుమార్తె త్రివేణి, కుమారులు కృష్ణారెడ్డి, నరేంద్రరెడ్డిలు అదే ఇంట్లో ఉండేవారు, వారు ఎప్పుడు చనిపోయారో కానీ అస్థిపంజరాలుగా మారిపోయారు. ఏం జరిగిందన్నది ఇప్పుడు మిస్టరీగా మారింది.



జగన్నాథ్‌రెడ్డి కుటుంబం నివసించిన ఇల్లు ఇదే

ఇంట్లో ఆక్సిజన్ సిలిండర్, కుక్క అస్థిపంజరం

- చిత్రదుర్గ జేఎంఐటీ మెడికల్ క్యాంపస్ మార్చురీలో అస్థిపంజరాలను ఉంచి పరీక్షలు చేస్తున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. స్థానిక బరంగి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి చుట్టుపక్కల వారిని విచారణ చేస్తూ, బంధువుల నుంచి విషయాలు రాబడుతున్నారు.
- జగన్నాథ్‌రెడ్డి ఇంట్లో చక్రాల కుర్చీ, ఆక్సిజన్ సిలిండర్ కూడా అందుబాటులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆక్సిజన్ సిలిండర్ ఎందుకు ఉన్నది అనేది కొత్త అనుమానాలకు తావిస్తోంది.
- ఆ ఇంట్లో ఒక కుక్క అస్థిపంజరం కూడా కనిపించింది.
- ఒక గదిలో నాలుగు అస్థిపంజరాలు, మరో గదిలో ఒక అస్థిపంజరం కనిపించాయి. ఏవైనా మూఢ నమ్మకాలను విశ్వసించి సామూహిక ఆత్మహత్యలు చేసుకుని ఉంటారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.
- లేక ఆస్తి, ఇతరత్రా గొడవల వల్ల విషప్రయోగం జరిపి హత్య చేసి ఉంటారా? అనే అనుమానాలు ఉన్నాయి.
- వారి మరణాలపై చిత్రదుర్గలో పలు రకాలుగా వదంతులు వ్యాప్తి చెందాయి. జిల్లా ఎస్పీ ధర్మేంద్ర కుమార్ మీనా ఆధ్వర్యంలో ముమ్మరంగా దర్యాప్తుతో పాటు పోస్టుమార్టం నిర్వహించి, డీఎన్‌ఏ పరీక్షలు చేసే అవకాశం కనిపిస్తోంది.



మేయర్ ఎంపిక డీకేశి కోర్టులోకి.!



బెంగళూరులో డీకే శివకుమార్‌తో సమావేశమైన కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు

- పలువురు కార్పొరేటర్లపై డీసీఎం మండిపాటు
- అసమ్మతి కార్పొరేటర్లకు అండ ఎవరిదో ఆరా

సాక్షి బళ్లారి: నగర మేయర్ ఎంపిక రెండు సార్లు వాయిదా పడటంతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఎమ్మెల్యే, పలువురు పార్టీ పరిశీలకులు జరిపిన చర్చలు విఫలం కావడంతో నగర మేయర్ ఎంపిక ఉపముఖ్యమంత్రి డీకే.శివకుమార్ భుజస్కంధాలపై పడింది. రెండో అవధి కింద నగర మేయర్‌గా ఎంపికైన త్రివేణి మరో నాలుగు నెలల పాటు మేయర్ అధికారావధి ఉన్నా తన పదవికి రాజీనామా చేయడంతో పదవి కోసం ఎన్నిక జరపాల్సి వచ్చింది. ఇప్పటికే కార్పొరేటర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోగా కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి సెగలు భగ్గుమనడంతో పాటు మేయర్ పదవి కోసం అధికార పార్టీలోని కార్పొరేటర్లు రెండు వర్గాలుగా చీలిపోవడంతో ఎంపిక వాయిదా పడుతూ వచ్చింది. మేయర్ పదవి కోసం కాంగ్రెస్ పార్టీ తరఫున కుబేర, శ్వేత, స్వతంత్రంగా గెలుపొందిన మించు శ్రీనివాస్, బీజేపీ తరఫున హనుమంతు నామినేషన్ వేసిన సంగతి తెలిసిందే. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు 21 మంది, బీజేపీ తరఫున 13 మంది, స్వతంత్రులు ఐదుగురు ఉన్నారు.

డీసీఎంతో కీలక సమావేశం

కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థిపై తిరుగుబాటు చేసి 11 మంది కార్పొరేటర్ల మద్దతుతో స్వతంత్ర కార్పొరేటర్ మించు శ్రీనివాస్ మేయర్ పదవిని దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు.ఈనేపథ్యంలో రెండు సార్లు మేయర్ ఎంపిక చివరి క్షణాల్లో వాయిదా పడిన సంగతి విదితమే. ఈనేపథ్యంలో శుక్రవారం రాత్రి బెంగళూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి డీకే.శివకుమార్ నేతృత్వంలో పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులతో కూడిన సమావేశంలో బళ్లారి నగర కార్పొరేటర్లను పిలిపించి చర్చించారు. సమావేశానికి 25 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సమావేశంలో డీకే. శివకుమార్ బళ్లారి నగర మేయర్ ఎంపిక పదే పదే వాయిదా పడుతున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా, ప్రతిపక్ష బీజేపీ ఎమ్మెల్యేలే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు సుముఖత చూపుతున్న పరిస్థితుల్లో పార్టీని విభేదించి బీజేపీ కార్పొరేటర్ల సహకారంతో వేరొకరు మేయర్‌గా ఎంపికవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.

పార్టీ అభ్యర్థినే బలపరచండి

11 మంది కార్పొరేటర్లు అసమ్మతితో టూర్‌కు వెళ్లడంపై కూడా డీసీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ గుర్తుపైన గెలిచిన వ్యక్తిని కాదని స్వతంత్ర అభ్యర్థికి ఎలా మద్దతు ఇస్తారని ప్రశ్నించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసమ్మతి కార్పొరేటర్లకు ఏమైనా మంత్రి, ఎమ్మెల్యేల మద్దతు ఉందా? అని నిలదీశారు. ఏకాభిప్రాయంతో పార్టీ సూచించిన వ్యక్తిని మేయర్‌గా ఎన్నుకోవాలని సూచించారు. అనంతరం పలువురు కార్పొరేటర్లతో విడివిడిగా చర్చించారు. ఈనేపథ్యంలో బళ్లారి నగర మేయర్ ఎంపిక డీకేశి కోర్టులో పడటంతో త్వరలో ఏకాభిప్రాయంతో మేయర్ ఎంపిక జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కార్పొరేటర్లు విక్కీ, మోదుపల్లి రాజేశ్వరి, నందీష్, మించు శ్రీనివాస్, బీఆర్‌ఎల్ శీన తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీల అమలు పేదలకు వరం



అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం సిద్దరామయ్య



గృహలక్ష్మి పథకం చెక్ అందుకున్న మహిళ

- సింధనూరు సమావేశంలో సీఎం, డీసీఎం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేయడం బీజేపీకి మింగుడు పడని ముద్దగా, కరువు కాలంలో పేదలకు వరంలా మారిందని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. ఆయన శనివారం సింధనూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ సమావేశంలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. గ్యారెంటీ పథకాలతో రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీస్తుందని పెడబొబ్బలు పెట్టిన ప్రతిపక్షాలకు ఇప్పుడు నోట మాట రావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం నుంచి రూ.4 లక్షల కోట్ల పన్నులు వెళ్తున్నా రాష్ట్రానికి కేవలం రూ.52 వేల కోట్లు మాత్రమే వాపస్ ఇస్తోందని మోదీ సర్కారుపై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో గత బీజేపీ ప్రభుత్వ హయాంలో జరిగిన 40 శాతం కమీషన్, పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ నియామకాల్లో అవినీతి తదితర అంశాలపై విచారణకు కమిటీలను ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు.

ఏపీ సీఎంతో చర్చిస్తాం: డీకే శివకుమార్

ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రసంగిస్తూ మార్చి నెలలో బడ్జెట్ తర్వాత తుంగభద్ర డ్యాంలో పూడికతీతపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చలు జరిపి, నవలి వద్ద రిజర్వాయర్ పనులకు శ్రీకారం చుడతామన్నారు. ఈ సందర్భంగా మంత్రులు ఎన్.ఎస్.బోసురాజు, సుధాకర్, శరణ ప్రకాష్ పాటిల్, ఎమ్మెల్యేలు హంపనగౌడ బాదర్లి, బసనగౌడ, హంపయ్య నాయక్, బసనగౌడ దద్దల్, మానప్ప వజ్జల్, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారం పాండే, ఎస్పీ నిఖిల్‌లు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



అవార్డు అందుకుంటున్న బాబూరావ్

రాయచూరు రూరల్: రాయచూరు ఏపీఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు, రైల్వే బోర్డు సలహా సమితి సభ్యుడు బాబూరావ్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో చంద్రయాన్ డీఆర్‌డీఏ అధికారి, శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ప్రభాకర్, అంతర్జాతీయ మానవ హక్కుల సంచాలకుడు రాబర్ట్ డొనాల్డ్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి శివరాజ్ పాటిల్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

హుబ్లీ: వినియోగదారుడి వేషంలో వచ్చి బంగారు ఆభరణాల అంగడిలో రూ.లక్ష విలువ చేసే ఉంగరాన్ని చోరీ చేసిన అంతర్రాష్ట్ర దొంగను హుబ్లీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కోయిన్ రోడ్డులోని బంగారు అంగడికి వినియోగదారుడుగా వచ్చిన ఓ కేటుగాడు సేల్స్‌మాన్ దృష్టిని మళ్లించి 15 గ్రాముల బంగారు ఉంగరాన్ని చోరీ చేసి పారిపోయాడు. హుబ్లీ టౌన్ సీఐ తహసీల్దార్ నేతృత్వంలోని బృందం బెంగళూరుకు వెళ్లి అరెస్ట్ చేసింది. కాగా గంజాయి విక్రయిసున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక గూడ్స్ షెడ్ రోడ్డు బుద్ధవిహార వద్ద గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.26,500 విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు హుబ్లీ టౌన్ పోలీసులు తెలిపారు.

కువెంపు సేవలు అమోఘం



కువెంపు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన దృశ్యం

సిరుగుప్ప: నగరంలోని చాగి నరసమ్మ, నరసయ్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 50వ కన్నడ రాజోత్సవం సిరి సంభ్రమ ముగింపు, రాష్ట్ర కవి విశ్వమానవ కువెంపు జయంతి సందర్భంగా కువెంపు చిత్రపటానికి ఉపాధ్యాయులు అంజినప్ప పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కన్నడ భాషాభివృద్ధి కోసం కువెంపు చేసిన సేవలు అమోఘమన్నారు.

ట్రాక్టర్ ఢీకొని బైక్‌చోదకుడు మృతి

హుబ్లీ: నగరంలోని కుసుగల్ రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఫలితంగా బైక్ చోదకుడు అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చొన్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. మృతుడిని హుబ్లీ తాలూకా బ్యాహట్టికి చెందిన చేతన్(27)గా గుర్తించారు. గాయపడిన రవికుమార్‌ను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. హుబ్లీ తూర్పు ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యప్ప స్వాములకు వేధింపులు తగదు

సాక్షి,బళ్లారి: కేరళలో అయ్యప్ప మాల ధరించిన వారికి ముస్లిం, క్రైస్తవ మతస్థులతో వేధింపులు ఎదురవుతున్నాయని శ్రీరామ సేన చీఫ్ ప్రమోద్ ముతాలిక్ ఆరోపించారు. ఆయన శనివారం బెళగావి జిల్లా చిక్కోడిలోని ప్రభుత్వ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. దక్షిణ భారతదేశంలో తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం తరహాలో కీర్తిగడించిన అయ్యప్పస్వామి ఆలయానికి ఆరు రాష్ట్రాల నుంచి ఐదు కోట్ల మంది మొక్కులు తీర్చుకుంటున్నారని, రూ.3 వేల కోట్లకు మించి ఆదాయం గడిస్తోందన్నారు. పార్కింగ్ వద్ద కోటి వాహనాలు ఉంటాయన్నారు. ఒక్కో వాహనానికి రూ.40ల రుసుము స్వీకరిస్తారన్నారు. ఇలా అన్ని వనరుల ద్వారా వేల కోట్ల ఆదాయం వస్తుందని, కేరళలోని ప్రభుత్వం నాస్తికంగా కొనసాగుతోందన్నారు. అయినా దేవుడిని నమ్మని ప్రభుత్వం అని గుర్తు చేశారు. ఐదు కోట్ల మంది భక్తులకు అనుకూల సౌకర్యం కల్పించడం లేదన్నారు. ఇలా అన్ని రకాలైన వేధింపులకు గురవుతున్న అయ్యప్ప మాల ధరించిన వారికి కర్ణాటక ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. ఈ విషయంలో కేరళ ప్రభుత్వంతో చర్చించాలని సీఎం సిద్దరామయ్యను కోరారు. భక్తులకు కనీస సదుపాయాలు కల్పించేలా చూడాలని డిమాండ్ చేశారు. ఆలయానికి వచ్చే ఆదాయాన్నంతా భక్తులకు అనుకూలం కోసం అన్నప్రసాదానికి వినియోగించాలన్నారు.

నగర స్వచ్ఛతలో పౌర కార్మికుల పాత్ర కీలకం

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర



పౌరకార్మికులకు అదేశ పత్రాలను అందజేస్తున్న మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి

సాక్షి బళ్లారి: నగర స్వచ్ఛతను కాపాడుకోవడంలో పౌరకార్మికుల పాత్ర కీలకమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బి.నాగేంద్ర పేర్కొన్నారు. ఆయన శనివారం నగరంలోని మహానగర పాలికె సభాంగణంలో 132 మంది పౌరకార్మికులకు ఆదేశాల పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నగరాన్ని స్వచ్ఛత, సుందరీకరణ చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పౌరకార్మికుల సంఖ్యను పెంచడానికి రాజీ పడబోమన్నారు. పాలికెలో పని చేస్తున్న 341 మందిలో దశల వారిగా ప్రతి ఒక్కరినీ పర్మినెంట్ చేస్తామన్నారు. రెండో దశలో పౌరకార్మికులకు వాహనాలు కూడా పంపిణీ చేసి నగర స్వచ్ఛతకు మరింత దోహదం చేస్తామన్నారు. ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న పౌరకార్మికుల ఆశలను నెరవేరుస్తున్నామన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తేవాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణపై నిర్లక్ష్యం చూపకూడదన్నారు. నగరంలో రోడ్లలో చెత్తను వేయకుండా ప్రజలను కూడా చైతన్యవంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కమిషనర్ ఖలీల్‌సాబ్, పాలికె సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని విమ్స్‌లో ఆస్పత్రిని ఆయన పరిశీలించారు. అధికారులు, వైద్యులతో కూడా సమావేశమై ఆస్పత్రిలో రోగులకు ఇబ్బందులు లేకుండా చికిత్స అందించాలన్నారు. కరోనాపై అప్రమత్తంగా ఉండాలని, పరీక్షలను కూడా పెంచాలని సూచించారు.

అక్రమ బియ్యం నిల్వల పట్టివేత



దాడుల్లో పట్టుబడిన బియ్యం నిల్వలతో పోలీసులు

రాయచూరు రూరల్: యాదగిరి జిల్లాలో అక్రమంగా నల్ల బజారుకు తరలించేందుకు నిల్వ ఉంచిన చౌకడిపో బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిత్యావసర వస్తువుల దుకాణదారులు అన్న భాగ్య పథకం కింద పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని రెండు నెలల క్రితం శహపుర ఎఫ్‌సీఐ గోదాము నుంచి తీసుకుని పంపిణీ చేయకుండా నల్ల బజారుకు తరలించారు. ఈ బియ్యాన్ని సేడం తాలూకా గురుమఠకల్ లక్ష్మీ బియ్యం మిల్లులో నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు బియ్యం మిల్లుపై పోలీసులు దాడులు జరిపారు. సురపుర డీఎస్పీ జావేద్ ఇనాందార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి 700 క్వింటాళ్ల బియ్యం, పాలిష్ చేసిన 600 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదనంగా 70 క్వింటాళ్ల బియ్యాన్ని పాలిష్ చేయడానికి సిద్ధంగా ఉంచినట్లు డీఎస్పీ విలేకరులకు తెలిపారు. కాగా ఈ బియ్యం తరలింపులో చిత్తాపూర్ బీజేపీ నేత మణికంఠ రాథోడ్ సోదరుడు రాజు రాథోడ్ హస్తం ఉన్నట్లు తేలడంతో రాజు రాథోడ్‌ను అరెస్ట్ చేయడానికి ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు.

పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలని వినతి



మాట్లాడుతున్న చెన్నబసవరాజగౌడ

సాక్షి బళ్లారి: జిల్లా బీజేపీ అధ్యక్ష పదవిని సిరుగుప్ప తాలూకాకు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు కొంచిగేరి నాగరాజగౌడకు ఇవ్వాలని వీరశైవ సమాజ ప్రముఖులు చెన్నబసవరాజు(కేపీ), ప్రముఖులు అరుణ్‌కుమార్, రాజశేఖర్‌గౌడ తదితరులు పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. పార్టీ అభివృద్ధికి, రైతుల సంక్షేమం కోసం, వివిధ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ మంచి పేరు గడించిన నాగరాజగౌడకు జిల్లా బీజేపీ అధ్యక్ష పదవిని కట్టబెడితే పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈమేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై.విజయేంద్ర, మాజీ సీఎం యడియూరప్పలకు కూడా విన్నవించామన్నారు. జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఒక నియోజకవర్గం మాత్రమే జనరల్ కేటగిరీకి ఉందని, మిగిలిన నాలుగు నియోజకవర్గాలు రిజర్వ్‌డ్ అయినందున జిల్లాలో అధికంగా ఉన్న వీరశైవ లింగాయత్ సమాజాన్ని గుర్తించి ఖచ్చితంగా బీజేపీ అధ్యక్ష పదవి వీరశైవ సమాజానికి చెందిన నాగరాజగౌడకు కేటాయించాలని కోరారు. సమాజ ప్రముఖులు బసవరాజగౌడ, నీలకంఠగౌడ, నాగరాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు దివాకర్

బళ్లారిఅర్బన్: మనం ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని కేఆర్‌పీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.ఎస్ దివాకర్ పేర్కొన్నారు. ఆయన శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో జిల్లాధ్యక్షుడు దమ్మూరు శేఖర్, రాష్ట్ర పార్టీ నాయకులు గోనాల్ రాజశేఖరగౌడ, ధరప్ప నాయక్, సునీల్‌కుమార్‌రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్న సమావేశంలో మాట్లాడారు. పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న దానిపై చర్చించిన నాయకులు పార్టీ వ్యవస్థాపకుడు, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి పుట్టిన రోజును జనవరి 11వ తేదీన మనమంతా పండుగలా నిర్వహిద్దామన్నారు. బళ్లారి నగరాభివృద్ధికి ప్రధాన భూమిక పోషించిన గాలి సేవలను జనంలోకి మరింతగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కేఆర్‌పీపీ మహిళా మోర్చా పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లో హస్తం హవా

రాయచూరు రూరల్: జిల్లాలో రాయచూరు, సింధనూరు నగరసభల్లోని వార్డులకు ఈనెల 27న జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. శనివారం ఓట్ల లెక్కింపు జరగగా, రాయచూరు 12వ వార్డులో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి పవన్‌కుమార్ 2,627 ఓట్లతో గెలుపొందారు. మొత్తం 3,144 ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థికి 2,627 ఓట్లు, జేడీఎస్ అభ్యర్థి రహీంకు 359, బీజేపీ అభ్యర్థి నూర్‌పాషాకు 410 ఓట్లు పడ్డాయి. విజయం సాధించిన పవన్ కుమార్‌ను కార్యకర్తలు ఊరేగించారు. సింధనూరులో 22వ వార్డు నుంచి అబీదా బేగం ఏకగ్రీవంగా ఎన్నికైంది. దేవదుర్గలోని ఐదవ వార్డు నుంచి వెంకణ్ణ నాయక్ గెలుపొందారు.

విద్యతోనే బంగారు భవిష్యత్



వీఎస్కేయూ రిజిస్ట్రార్ రుద్రేష్‌ను సన్మానిస్తున్న కళాశాల చైర్మన్ పీహెచ్.నాయుడు

బళ్లారి టౌన్: విద్యతోనే బంగారు భవిష్యత్ సాధ్యమని, విద్యార్థి దశ నుంచే విద్యార్థులు ఉత్తమ భవిష్యత్తును రూపొందించుకునే మార్గాన్ని అలవర్చుకోవాలని విజయనగర శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఎస్ఎన్.రుద్రేష్ పేర్కొన్నారు. ఆయన శనివారం నగరంలోని ఇండోఅమెరికన్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చేపట్టిన ఫ్రెషర్స్ డేలో మాట్లాడారు. అనంతరం కళాశాల చైర్మన్ పీహెచ్.నాయుడు మాట్లాడుతూ తమ కళాశాల 11 ఏళ్లుగా ఉత్తమ సాధన చేస్తోందన్నారు. చాలా మంది ఉత్తమ ర్యాంకులు సాధించి కళాశాలకు కీర్తిప్రతిష్టలు తెచ్చారని గుర్తు చేశారు. కళాశాల జీవితం గోల్డెన్ లైఫ్ అన్నారు. గురువులను గౌరవిస్తూ తల్లిదండ్రులు తమపై పెట్టుకొన్న ఆశయాలను నెరవేర్చే దిశలో కష్టపడి చదువుకోవాలన్నారు. కళాశాలలో తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేయకుండా స్నేహంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో సంజయ్ గాంధీనగర్ మేనేజర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ షేక్ సలీం బాషా, వైస్ ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్, హెచ్‌ఓడీలు బీవీ.రాజేష్, వీ.రాజా, ఉదయ్‌భాస్కర్, గజేంద్రకుమార్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కేజీఎఫ్: కేజీఎఫ్ జిల్లాలోని ఉరిగాంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దోపిడీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. ఈనెల 23న జరిగిన ఇంటి దొంగతనం కేసు విచారణ జరిపిన సీఐ మార్కొండయ్య తమ సిబ్బందితో నిందితుడు ప్రభును అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.2.70 లక్షల విలువ చేసే 45 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.